www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 11-5-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 42 | వరంగల్

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: చవితి రా. 2.04 తదుపరి పంచమి; నక్షత్రం: మృగశిర ఉ. 10.15 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: రా.6.42-8.19; దుర్ముహూర్తం: ఉ.5.48-7.30; అమృతఘడియలు: రా.12.21-1.58; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 5.48; సూర్యాస్తమయం: 6.34

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కేజ్రీవాల్‌కు బెయిల్

- జూన్ 1 వరకూ మంజూరు చేసిన సర్వోన్నత న్యాయస్థానం
- సీఎంవో, సెక్రటేరియట్‌కు వెళ్లొద్దని, 2న లొంగిపోవాలని షరతు
- కేజ్రీపై నేరం ఇంకా రుజువు కాలేదని.. నేరనేపథ్యం లేదని వ్యాఖ్య
- సామాన్యుడికీ సీఎంకూ ఒకే న్యాయం వర్తింపజేయాలన్న ఈడీ
- ఏకీభవించని సుప్రీం.. పోలికలు వర్తింపజేయలేమని స్పష్టీకరణ
- చంద్రబాబుకూ ఎన్నికల సభల్లో పాల్గొనే అవకాశం ఇచ్చినట్టు వెల్లడి
- హనుమంతుడి ఆశీస్సులతోనే జైలు నుంచి బయటకొచ్చా: కేజ్రీవాల్


తిహాడ్ జైలు నుంచి బయటకొచ్చిన తర్వాత ఆప్ శ్రేణులతో మాట్లాడుతున్న కేజ్రీవాల్

13

కవిత బెయిల్ పిటిషన్ విచారణ 24కు వాయిదా

బీజేపీ.. క్యాన్సర్!

ఆ పార్టీతో తెలంగాణకు ప్రమాదం

- వేళ్లూనుకుంటే శాంతిని మర్చిపోవాల్సిందే
- దానికి అధికారమిస్తే మధ్యయుగాల పాలనే
- ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవకూడదు
- రాష్ట్రాన్ని బీజేపీకి అప్పగించేందుకు బీఆర్ఎస్ కుట్ర
- ఆరు సీట్లలో ఆ పార్టీ డిపాజిట్లు కోల్పోబోతోంది
- అక్కడ బీజేపీకి లాభం జరగబోతోంది
- కేసీఆర్ మర్యాదగా మాట్లాడతానంటే నేనూ సిద్ధం
- అవినీతిపరులను పక్కనబెట్టుకుని మోదీ ప్రవచనాలు
- 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

బీజేపీకి ఓటేస్తే రాష్ట్రం నాశనం

- వారి పాలనలో ఉన్న యూపీనే ఉదాహరణ
- అక్కడికి పెట్టుబడులు, కంపెనీలు వెళ్లడం లేదు
- మతకల్లోలాలు పెట్టి తెలంగాణ నుంచి
- పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించేందుకు కుట్రలు
- మక్తల్, షాద్‌నగర్, హైదరాబాద్‌లలో సీఎం రేవంత్

మీట్ ది ప్రెస్‌లో సీఎం రేవంత్, చిత్రంలో 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్



హైదరాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఒక రకమైన క్యాన్సర్‌లాంటిదని, ఆ పార్టీ తెలంగాణ సమాజానికి ప్రమాదకరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలో బీజేపీ వేలూనుకుంటే శాంతిని, భద్రతను మర్చిపోవాల్సిందేనన్నారు. బీజేపీ అడుగు పెడితే సమాజం నిట్టనిలువునా చీలిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా, రాష్ట్రానికి పెట్టుబడులు, ఆదాయమూ రావని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో బీజేపీ

మిగతా 14వ పేజీలో...

అబద్ధాలకు అధ్యక్షుడు.. మోదీ

- అదానీ, అంబానీ నుంచి మాకు డబ్బులొస్తున్నాయా?
- అదే నిజమైతే ఈడీ, సీబీఐ, ఐటీలు ఏం చేస్తున్నాయి?
- హైదరాబాద్ రెండో రాజధాని అయితే నాకూ హ్యాపీ: ఖర్గే

16



ఎల్బీ స్టేడియంలో జరిగిన సభలో నమస్కరిస్తున్న ప్రధాని మోదీ, బీజేపీ అభ్యర్థులు నర్సయ్యగౌడ్, ఈటల, కిషన్‌రెడ్డి, మాధవీలత, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

తెలంగాణలో..

ట్రిపుల్ ఆర్ ట్యాక్స్

- ఒకటి ఢిల్లీ ఆర్.. రెండు తెలంగాణ ఆర్.. మూడోది రజాకార్
- అందరికీ న్యాయం.. ఇదే మా ఐడియా ఆఫ్ ఇండియా
- 4న దేశం గెలవబోతోంది.. దేశ వ్యతిరేకులు ఓడిపోతున్నారు
- లూటీ.. వారసత్వ రాజకీయాలు.. ఇదే కాంగ్రెస్ ట్రాక్ రికార్డు
- రాముణ్ని పూజిస్తే దేశద్రోహమా?.. ఇండీ కూటమితో భద్రం
- బీఆర్ఎస్ నకలు కాంగ్రెస్.. కారుకు ఓటేస్తే కాంగ్రెస్‌కు వేసినట్టే
- బీఆర్ఎస్ అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం పెన్ను కదల్చడం లేదు
- కాంగ్రెస్ హిందూ వ్యతిరేకి.. అందుకే ముస్లిం రిజర్వేషన్లకు ఆ పార్టీ మద్దతు
- ఎల్బీస్టేడియం, నారాయణపేట జనసభల్లో ప్రధాని మోదీ

హైదరాబాద్, మహబూబ్‌నగర్, హైదరాబాద్ సిటీ, మే 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఒకవైపు ఆర్ఆర్ ట్యాక్స్ పేరిట వసూళ్లు జరుగుతుండగా.. హైదరాబాద్‌లో మరో ఆర్(రజాకార్) ట్యాక్స్ కూడా వసూలవుతోందని ప్రధాని నరేంద్రమోదీ ఆరోపించారు. "రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆర్ఆర్ ట్యాక్స్‌పై చర్చ బాగా జరుగుతోంది. ఒక ఆర్.. తెలంగాణాకు సంబంధించినది కాగా, మరో ఆర్.. ఢిల్లీది. ఈ రెండు 'ఆర్'లూ హైదరాబాద్‌ను, తెలంగాణను ఏటీఎంగా మార్చుకున్నాయి. నేను ఎవరి పేరూ ఎత్తలేదుగానీ.. డబుల్ ఆర్ ట్యాక్స్‌పై ఇక్కడి సీఎం స్వయంగా వివరణ ఇచ్చుకున్నారు. హైదరాబాద్‌లో మరో ఆర్ ట్యాక్స్ ఉంది. ఆర్.. అంటే రజాకార్ ట్యాక్స్. ఇది హైదరాబాద్ పాత నగరంలో కనిపిస్తుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతుతో మజ్లిస్ ఈ పన్ను వసూలు చేస్తోంది" అని ఆయన ధ్వజమెత్తారు. "అందరికీ న్యాయం.. ఎవరినీ బుజ్జగించకపోవడం.. ఇదే ఐడియా ఆఫ్ ఇండియా" అని తేల్చిచెప్పారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన నారాయణపేట జిల్లా కేంద్రంలో, సాయంత్రం హైదరాబాద్

మిగతా 12వ పేజీలో...

ప్రభాకర్‌రావుపై అరెస్టు వారెంట్

- అజ్ఞాతంలో ఉన్న శ్రవణ్‌కుమార్‌పైనా
- ఫోన్ ట్యాపింగ్ కేసులో ఉత్తర్వులు జారీ చేసిన నాంపల్లి కోర్టు
- విదేశాల్లో తలదాచుకున్న ప్రభాకర్‌రావు
- ఇంటర్‌పోల్ ద్వారా రెడ్ కార్నర్ నోటీసు జారీకి అధికారుల యత్నం
- ప్రణీత్‌రావు, టీంపై మరిన్ని కేసులు



5

బాబు కోసం కాంగ్రెస్ కుట్రలు

- రేవంత్‌రెడ్డి.. చంద్రబాబు మనిషి
- ఆ పార్టీకి ఓటు వేస్తే మన కళ్లు మనమే పొడుచుకున్నట్టు: జగన్

జగన్.. చెల్లికి, తల్లికి జవాబివ్వు

- చంద్రబాబుపై గౌరవం ఉంది.. సంబంధాల్లేవ్: సీఎం రేవంత్

11

మూర్ఖ ముఖ్యమంత్రి

- గ్యారెంటీల పేరిట రేవంత్ మోసం
- కాంగ్రెస్ అలవికాని హామీలిచ్చి నెరవేర్చలేదు
- బీజేపీ పేదలపార్టీ కాదు.. పెట్టుబడిదారుల పార్టీ
- జిల్లాలను రద్దు చేస్తే ఊర్కుందామా?: కేసీఆర్

12


సిద్దిపేట కార్నర్ మీటింగ్‌లో కేసీఆర్, మెదక్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి



ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

12 మంది మావోయిస్టుల మృతి

- పిడియా గుట్టపై 100 మంది మావోయిస్టుల సమావేశం!
- చుట్టుముట్టిన 1200 మంది జవాన్లు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- 12 గంటలపాటు ఎన్‌కౌంటర్
- మృతదేహాలు స్వాధీనం: సీఎం విష్ణుదేవ్
- గత 60 రోజుల్లో ఇది 8వ ఎన్‌కౌంటర్
- మొత్తం 98 మంది మావోయిస్టుల మృతి

3


ఏపీకి వెళ్లేందుకు హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీలో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

చలో ఏపీ!

15

- హైదరాబాద్ నుంచి తరలిన లక్షలాది ఓటర్లు
- ఈ నెల 13న ఎన్నికల్లో ఓటేసేందుకు పయనం
- వరుసగా 3 రోజులు సెలవులతో స్వగ్రామాలకు
- విజయవాడ హైవేపై పెరిగిన వాహనాల రద్దీ
- బస్టాండ్లతో పాటు రైల్వే స్టేషన్లలోనూ సందడి
- చార్జీలు అమాంతం పెంచేసిన ఆర్టీసీ, ట్రావెల్స్
- రవాణా కోసం ఏర్పాట్లు చేసిన ప్రధాన పార్టీలు

'ఆఖరి' రోజు

- నేటి సాయంత్రం 5 గంటలతో ముగియనున్న ఎన్నికల ప్రచారం
- ఇవాళ రాష్ట్రానికి షా, ప్రియాంక
- వికారాబాద్, వనపర్తి సభలకు షా
- తాండూరు, కామారెడ్డి సభల్లో ప్రియాంక గాంధీ ప్రసంగం
- ప్రెస్‌మీట్‌కే కేసీఆర్ పరిమితం

16


మీడియా సమావేశంలో షర్మిల కంటతడి

నీకోసం త్యాగం చేశానని బైబిల్‌పై

ప్రమాణం చేస్తా

- నేను డబ్బు, పదవి అడిగానని ప్రమాణం చేయగలరా?
- నాకు రాజకీయ కాంక్ష ఉంటే వైసీపీని హైజాక్ చేయలేనా?
- జగన్‌ను నిలదీసిన షర్మిల
- పెయిడ్ ఆర్టిస్టులకు కుక్క బిస్కెట్లు వేసి మరీ నాపై నిందలు.. షర్మిల కన్నీరు

భారతి నన్ను నరికేస్తారో.. షర్మిలను నరికేస్తారో?

- మాకు ప్రాణహాని ఉంది.. నా పిల్లలకు వీలునామా రాసి వచ్చా: సునీత

వడగాడ్పులు ముగిసినట్టే!

- దేశంలోని అనేక రాష్ట్రాల్లో వర్షాలు
- తూర్పు, ఉత్తర భారతంలో పిడుగులు: ఐఎండీ

13

వారం పాటు వానలు

- నేడు 9 జిల్లాలకు వర్ష సూచన
- తగ్గిన ఎండలు, గరిష్ఠంగా ఆదిలాబాద్ జిల్లా అర్లీలో 42.2

3

మార్కెట్ మళ్లీ లాభాల బాట

ముంబై: స్టాక్‌మార్కెట్ ఐదు రోజుల తర్వాత శుక్రవారం మళ్లీ లాభాల బాట పట్టింది. సెన్సెక్స్ 260.30 పాయింట్ల లాభంతో 72,664.47 వద్ద, నిఫ్టీ 97.70 పాయింట్ల లాభంతో 22,055.20 వద్ద ముగిశాయి. ఇంట్రా డేలో సెన్సెక్స్ 542.37 పాయింట్ల లాభంతో 72,946.54 గరిష్ఠ స్థాయిని తాకింది. సెన్సెక్స్ హెవీ వెయిట్స్ రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీసీ, ఎయిర్‌టెల్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడం, ప్రధాన అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లో ట్రేడవడం శుక్రవారం దేశీయ స్టాక్ మార్కెట్‌కు కలిసొచ్చింది.

ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓ అదుర్స్: శుక్రవారం ముగిసిన ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ ఐపీఓకు మదుపరుల నుంచి మంచి ఆదరణ లభించింది. బిడ్డింగ్ ప్రాసెస్ ముగిసే సరికి ఇష్యూ 25.49 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది.

- ఈ నెల 15న ఐపీఓకి వస్తున్న గో డిజిట్ ఇన్సూరెన్స్ కంపెనీ షేరు ధర శ్రేణిని రూ.258-272గా ప్రకటించింది.

నగల దుకాణాలకు అక్షయ తృతీయ కళ



జనంతో కిటకిట

ముంబై: పసిడి ధర కొండెక్కినా అక్షయ తృతీయ రోజు బంగారు నగల అమ్మకాలు ఏ మాత్రం తగ్గలేదు. శుక్రవారం ఉదయం నుంచి నగల దుకాణాలకు జనం పోటెత్తారు. గత ఏడాది అక్షయ తృతీయ రోజు 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) బంగారం రూ.60,000గా ఉంది. ఈ అక్షయ తృతీయకు అది 15 నుంచి 17 శాతం పెరిగి రూ.71,000కు చేరింది. ఈ ప్రభావం ఈ ఏడాది అక్షయ తృతీయ నగల అమ్మకాలపై ఉంటుందని మార్కెట్ వర్గాలు భయపడ్డాయి. అయితే ఆ భయాలను పటాపంచలు చేస్తూ కొనుగోలుదారులు శుక్రవారం ఉదయం నుంచే నగల దుకాణాల ముందు క్యూ కట్టారు.

'దేశవ్యాప్తంగా నగల దుకాణాలు అక్షయ తృతీయ రోజు కిటకిట లాడాయి. దక్షిణ భారత దేశంలో ఇది మరింత స్పష్టంగా కనిపించింది' అని ఆలిండియా జెమ్ అండ్ జువెలరీ డొమిస్టిక్ కౌన్సిల్ (ఏఐజేజేడీసీ) ఛైర్మన్ సయాం మెహ్రా చెప్పారు.

తగ్గే అవకాశం

గత ఏడాతో పోలిస్తే ఈ సంవత్సరం అక్షయ తృతీయ రోజు కొనుగోలుదారులు ఆచితూచి ఖర్చు చేశారు. మరీ అవసరమైతే తప్ప పెద్ద పెద్ద ఆభరణాల జోలికి పోలేదు. ఎక్కువ మంది చిన్న చిన్న ఆభరణాలతోనే సరిపెట్టుకున్నారు. అధిక ధరలు ఇందుకు ప్రధాన కారణంగా కనిపించింది. దీంతో గత ఏడాదితో పోలిస్తే విలువపరంగా అమ్మకాలు పెరిగినా, పరిమాణ పరంగా ఐదు నుంచి ఏడు శాతం తగ్గాయని మార్కెట్ వర్గాలు చెప్పాయి. దక్షిణ భారత్‌లో పెళ్లిళ్లకు అవసరమయ్యే పెద్ద పెద్ద ఆభరణాలు ఎక్కువగా అమ్మడైతే, మిగతా ప్రాంతాల్లోని కొనుగోలుదారులు ఎక్కువగా చిన్న చిన్న ఆభరణాలతోనే సరిపెట్టుకున్నారు. పసిడి ధర మరింత పెరుగుతుందనే భయంతో కొంత మంది, అక్షయ తృతీయ రోజు పెద్ద పెద్ద ఆభరణాలు కొనుగోలు చేశారు. అక్షయ తృతీయ శనివారం మధ్యాహ్నం వరకు ఉన్నందున అమ్మకాలు శనివారం వరకు కొనసాగుతాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

రూ.3.80 లక్షల కోట్ల పసిడి దిగుమతులు

మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో మన దేశం 4,554 కోట్ల డాలర్ల (సుమారు రూ.3.80 లక్షల కోట్లు) విలువైన బంగారాన్ని దిగుమతి చేసుకుంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో దిగుమతి అయిన 3,500 కోట్ల డాలర్ల విలువైన బంగారంతో పోలిస్తే ఇది 30 శాతం ఎక్కువ. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఇందుకు సంబంధించిన వివరాలు విడుదల చేసింది. గత ఆర్థిక సంవత్సరం మన దేశం దిగుమతి చేసుకున్న బంగారంలో స్విట్జర్లాండ్ నుంచి 40 శాతం, యూఏఈ నుంచి 16 శాతం, దక్షిణాఫ్రికా నుంచి పది శాతం దిగుమతి అయింది.

టాటా మోటార్స్ లాభం మూడింతలు



- క్యూ4లో రూ.17,528 కోట్లు
- ఒక్కో షేరుకు మొత్తం డివిడెండ్ రూ.6

న్యూఢిల్లీ: మార్చి 31తో ముగిసిన 2024 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికానికి టాటా మోటార్స్ ఏకీకృత నికర లాభం మూడింతలకు పైగా వృద్ధితో రూ.17,528.59 కోట్లకు చేరుకుంది. జాగ్వార్ ల్యాండ్‌రోవర్ (జేఎల్ఆర్) సహా కంపెనీకి చెందిన మూడు వాహన విభాగాలు బలమైన పనితీరును కనబరచడం ఇందుకు దోహదపడింది. 2022-23లో ఇదే కాలానికి కంపెనీ లాభం రూ.5,496.04 కోట్లుగా నమోదైంది. కాగా, ఈ క్యూ4లో టాటా మోటార్స్ ఏకీకృత నిర్వహణ ఆదాయం రూ.1,19,986.31 కోట్లకు పెరిగింది. క్రితం ఏడాది ఇదే కాలానికి దాదాపు రూ.1.06 లక్షల కోట్ల రాబడి నమోదైంది. ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ రూ.4,37,927.77 కోట్ల ఆదాయంపై రూ.31,806.75 కోట్ల నికర లాభాన్ని గడించింది. గత ఆర్థిక సంవత్సరానికి గాను ఒక్కో సాధారణ షేరుకు రూ.3 తుది డివిడెండ్‌తో పాటు రూ.3 ప్రత్యేక డివిడెండ్ కలిపి మొత్తం రూ.6 డివిడెండ్ చెల్లించాలని టాటా మోటార్స్ బోర్డు సిఫారసు చేసింది. కాగా, ఒక్కో ఏ క్లాస్ ఆర్డినరీ షేరుకు కంపెనీ రూ.3.10 తుది డివిడెండ్, రూ.3.10 ప్రత్యేక డివిడెండ్ కలిపి మొత్తం రూ.6.20 చెల్లించనుంది.

మరిన్ని ముఖ్యాంశాలు..

- జనవరి-మార్చి కాలానికి జేఎల్ఆర్ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 11 శాతం వృద్ధితో 790 కోట్ల పౌండ్లకు చేరుకోగా.. నికర లాభం 140 కోట్ల పౌండ్లకు పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఈ విభాగం ఆదాయం 27 శాతం వృద్ధితో 2900 కోట్ల పౌండ్లకు, లాభం 260 కోట్ల పౌండ్లకు పెరిగింది. ఈ విభాగానికిదే అత్యధిక వార్షికాదాయం. ల్యాండ్‌రోవర్, డిఫెండర్ మోడళ్లకు బలమైన డిమాండ్ ఇందుకు దోహదపడింది.
- టాటా వాణిజ్య వాహనాల విభాగం ఆదాయం క్యూ4లో రూ.21,600 కోట్లకు చేరుకోగా.. పూర్తి ఆర్థిక సంవత్సరానికి రూ.78,800 కోట్లుగా నమోదైంది. జనవరి-మార్చి కాలానికి దేశీయంగా 1,04,600 యూనిట్ల వాణిజ్య వాహన విక్రయాలను విక్రయించినట్లు సంస్థ తెలిపింది.
- టాటా ప్రయాణికుల కార్ల విభాగం ఆదాయం క్యూ4లో రూ.14,400 కోట్లు, పూర్తి ఆర్థిక సంవత్సరానికి రూ.52,400 కోట్లుగా నమోదైంది. మార్చి త్రైమాసికంలో వాహన విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 14.8 శాతం పెరిగి 1,55,600 యూనిట్లుగా నమోదయ్యాయి.

> గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆల్‌టైం రికార్డు ఆదాయం, లాభాలను నమోదు చేసింది. కంపెనీ దేశీయ వ్యాపారం ఇప్పుడు రుణరహితంగా మారింది. ఈ ఆర్థిక సంవత్సరంలో అన్ని విభాగాలూ రుణరహితంగా మారనున్నాయి. భిన్న వ్యూహాలతో కంపెనీ వ్యాపారాలు బలమైన పనితీరును కనబరుస్తున్నాయి. ముందు సంవత్సరాల్లోనూ ఈ జోరు కొనసాగుతుందని ధీమాగా ఉన్నాం.
>
> – పీబీ బాలాజీ, టాటా మోటార్స్ సీఎఫ్ఓ

బీఓబీ లాభం రూ.4,886 కోట్లు

ఒక్కో షేరుకు రూ.7.60 డివిడెండ్

న్యూఢిల్లీ: నాలుగో త్రైమాసికంలో బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) స్టాండ్ అలోన్ లాభం 2.3 శాతం పెరిగి రూ.4,886 కోట్లకు చేరుకుంది. కాగా, మొత్తం ఆదాయం రూ.33,775 కోట్లకు ఎగబాకింది. సమీక్షా కాలానికి బ్యాంక్ వడ్డీ ఆదాయం రూ.29,583 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ మార్జిన్ 3.18 శాతంగా నమోదైంది. మార్చి చివరి నాటికి బ్యాంక్ మొండి బకాయిలు (గ్రాస్ ఎన్‌పీఏ) 2.92 శాతానికి తగ్గగా.. నికర ఎన్‌పీఏలు 0.68 శాతానికి దిగివచ్చాయి. దాంతో, మార్చి త్రైమాసికంలో మొండిబాకీలు, తక్షణావసరాల కోసం కేటాయింపులు రూ.1,302 కోట్లకు తగ్గాయి. కాగా ప్రొవిజన్ కవరేజీ రేషియో 93.30 శాతానికి పుంజుకోగా.. మూలధన సమర్థత నిష్పత్తి 16.31 శాతానికి మెరుగుపడింది. వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.7.60 డివిడెండ్ చెల్లించాలని బీఓబీ బోర్డు సిఫారసు చేసింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి (2023-24) బీఓబీ రూ.1,27,101 కోట్ల ఆదాయంపై రూ.17,789 కోట్ల లాభం గడించింది.

బీఓఐ లాభంలో 7% వృద్ధి

ఒక్కో షేరుకు రూ.2.80 డివిడెండ్

న్యూఢిల్లీ: బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) మార్చి త్రైమాసిక లాభం 7 శాతం పెరిగి రూ.1,439 కోట్లుగా నమోదైంది. మొత్తం ఆదాయం రూ.17,913 కోట్లకు పుంజుకుంది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) రూ.5,937 కోట్లుగా, నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 3.30 శాతంగా నమోదైంది. మార్చి 31 నాటికి బీఓఐ మొండి బకాయిలు (గ్రాస్ ఎన్‌పీఏ) 4.98 శాతానికి దిగిరాగా.. నికర ఎన్‌పీఏలు 1.22 శాతానికి తగ్గాయి. కానీ, మార్చి త్రైమాసికంలో మొండిబాకీల కోసం కేటాయింపులు మాత్రం రూ.2,043 కోట్లకు పెరిగాయి. పూర్తి ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్ నికర లాభం 57 శాతం వృద్ధితో రూ.6,318 కోట్లకు పెరగగా.. మొత్తం ఆదాయం రూ.66,804 కోట్లకు ఎగబాకింది. 2023-24కు గాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.2.80 డివిడెండ్ చెల్లించాలని బ్యాంక్ బోర్డు సిఫారసు చేసింది.



వందేళ్ల లిమిటెడ్ ఎడిషన్

ఎంజీ కార్లు

బ్రిటిష్ ఆటోమొబైల్ బ్రాండ్ మోరిస్ గ్యారెజెస్ (ఎంజీ).. ఐకానిక్ ఎవర్‌గ్రీన్ రంగులో 100 ఏళ్ల లిమిటెడ్ ఎడిషన్లను భారత మార్కెట్లోకి శుక్రవారం ప్రవేశపెట్టింది. కోమెట్ ఈవీ, ఆస్టర్, హెక్టర్, జెడ్ఎస్ ఈవీ మోడళ్లలో ఈ ఎడిషన్ కార్లను అందుబాటులోకి తెచ్చింది. కారును బట్టి వీటి ధరల శ్రేణి రూ.9.48 లక్షల నుంచి రూ.24.18 లక్షల స్థాయిలో ఉంది.

రిజర్వ్ బ్యాంక్ ఈడీగా లక్ష్మీకాంతరావు

ముంబై: ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఆర్.లక్ష్మీకాంత రావు నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం నియంత్రణల విభాగం చీఫ్ జనరల్ మేనేజర్ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆర్‌బీఐలో ఆయనకు మూడు దశాబ్దాల అనుభవం ఉంది.

మిర్యాలగూడలో మలబార్ షోరూం

హైదరాబాద్: ప్రముఖ ఆభరణాల రిటైల్ విక్రయ సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తన సరికొత్త షోరూమ్‌ను తెలంగాణలోని మిర్యాలగూడలో ఏర్పాటు చేసింది. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి శుక్రవారం ఈ షోరూంను ప్రారంభించారు. నగరానికి చెందిన ప్రముఖులు, వినియోగదారులు, మలబార్ యాజమాన్య బృందం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మిర్యాలగూడ ప్రజలకు మా అత్యద్భుతమైన ఆభరణాల సేకరణలు, ప్రపంచస్థాయి షాపింగ్ అనుభూతిని అందించడానికి మేమెంతో సంతోషిస్తున్నామని మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎంపీ అహమ్మద్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. మిర్యాలగూడ షోరూం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని కంపెనీ కస్టమర్లకు ప్రత్యేక ప్రారంభ ఆఫర్లను ప్రకటించింది. బంగారు ఆభరణాల తరుగు చార్జీలపై 25 శాతం వరకు తగ్గింపు, స్టడెడ్ ఆభరణాల తరుగు చార్జీలపై ఫ్లాట్ 25 శాతం తగ్గింపు, వజ్రాభరణాల్లోని వజ్రాల విలువపై 25 శాతం వరకు తగ్గింపు పొందవచ్చని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తెలిపింది. ఈనెల 12 వరకే ఈ ఆఫర్లు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేసింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,090 ▲	67,000 ▲	90,000 ▲
ముంబై	73,010 ▲	66,880 ▲	84,215 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

11వ తేదీ

హైదరాబాద్	525	విజయవాడ	540
వరంగల్	527	గోదావరి	540
చిత్తూరు	598	విశాఖపట్నం	550

డజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	140	గోదావరి	150
వరంగల్	140	విజయవాడ	150
కరీంనగర్	140	గుంటూరు	150
మహబూబ్‌నగర్	140	ఒంగోలు	150
కర్నూలు	140	చిత్తూరు	147
విశాఖపట్నం	142		

స్పోర్ట్స్

నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం. వేదిక: కోల్‌కతా

కోల్‌కతా X ముంబై

టైటాన్స్ రేసులోనే

- చెన్నైపై ఘనవిజయం
- గిల్, సుదర్శన్ సెంచరీలు
- పోరాడిన మిచెల్, అలీ
- మోహిత్‌కు 3 వికెట్లు



శుభ్‌మన్ గిల్ (55 బంతుల్లో 104)

స్కోరుబోర్డు

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) దూబే (బి) దేశ్‌పాండే 103, గిల్ (సి) జడేజా (బి) దేశ్‌పాండే 104, మిల్లర్ (నాటౌట్) 16, షారుక్ (రనౌట్) 2, ఎక్స్‌ట్రాలు: 6; **మొత్తం: 20 ఓవర్లలో 231/3; వికెట్ల పతనం:** 1-210, 2-213, 3-231; **బౌలింగ్:** శాంట్నర్ 2-0-31-0, తుషార్ దేశ్‌పాండే 4-0-33-2, శార్దూల్ 4-0-25-0, సిమర్‌జీత్ 4-0-60-0, జడేజా 2-0-29-0, మిచెల్ 4-0-52-0.

చెన్నై: రహానె (సి) తెవాటియా (బి) సందీప్ 1, రచిన్ (రనౌట్) 1, రుతురాజ్ (సి) రషీద్ (బి) ఉమేశ్ 0, మిచెల్ (సి) షారుక్ (బి) మోహిత్ 63, మొయిన్ అలీ (సి) నూర్ (బి) మోహిత్ 56, దూబే (సి) నూర్ (బి) మోహిత్ 21, జడేజా (సి) మిల్లర్ (బి) రషీద్ 18, ధోనీ (నాటౌట్) 26, శాంట్నర్ (బి) రషీద్ 0, శార్దూల్ (నాటౌట్) 3, ఎక్స్‌ట్రాలు: **7; మొత్తం: 20 ఓవర్లలో 196/8; వికెట్ల పతనం:** 1-2, 2-2, 3-10, 4-119, 5-135, 6-165, 7-169, 8-169; **బౌలింగ్:** ఉమేశ్ 3-0-20-1, సందీప్ 3-0-28-1, త్యాగి 4-0-51-0, నూర్ అహ్మద్ 2-0-25-0, రషీద్ 4-0-38-2, మోహిత్ 4-0-31-3.

1 గుజరాత్ తరఫున ఏ వికెట్‌కైనా అత్యధిక పరుగుల (209) భాగస్వామ్యం నమోదు చేసిన సాయి సుదర్శన్-గిల్.

1 ఐపీఎల్‌లో ఎక్కువ శతకాలు (13) నమోదవడం ఇదే తొలిసారి.

3 ఒకే ఇన్నింగ్స్‌లో రెండు శతకాలు రావడం ఇది మూడో సారి. గతంలో బెంగళూరు, సన్‌రైజర్స్ జట్ల నుంచి నమోదయ్యాయి.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	11	8	3	0	16	1.453
రాజస్థాన్	11	8	3	0	16	0.476
హైదరాబాద్	12	7	5	0	14	0.406
చెన్నై	12	6	6	0	12	0.491
ఢిల్లీ	12	6	6	0	12	-0.316
లఖ్‌నవూ	12	6	6	0	12	-0.769
బెంగళూరు	12	5	7	0	10	0.217
గుజరాత్	12	5	7	0	10	-1.063
ముంబై	12	4	8	0	8	-0.212
పంజాబ్	12	4	8	0	8	-0.423

అహ్మదాబాద్: ఆల్‌రౌండ్‌షోతో అదరగొట్టిన గుజరాత్ టైటాన్స్ ప్లేఆఫ్ ఆశలను సజీవంగానే నిలుపుకొంది. అలాగే ఇతర జట్లకు కూడా తమ విజయంతో ఊపిరిలూదింది. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్ (55 బంతుల్లో 9 ఫోర్లు, 6 సిక్స్‌లతో 104), సాయి సుదర్శన్ (51 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్స్‌లతో 103) శతకాల మోతెక్కించడంతో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌పై 35 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. అలాగే 10 పాయింట్లతో ఆఖరి నుంచి ఎనిమిదో స్థానానికి చేరింది. ఇక చివరి రెండు మ్యాచ్‌ల్లో గెలిచి, ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. అటు డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ మాత్రం చెత్త ఆటతో చిత్తయ్యింది. ఆరు విజయాలు, ఆరు ఓటములతో సీఎస్‌కే 12 పాయింట్లతోనే ఉంది. ఈ జట్టు కూడా మిగిలిన రెండు మ్యాచ్‌లను కచ్చితంగా నెగ్గాల్సిందే. ముందుగా గుజరాత్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 231 పరుగులు చేసింది. తుషార్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో చెన్నై 20 ఓవర్లలో 8 వికెట్లకు 196 పరుగులు చేసి ఓడింది. మిచెల్ (34 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 63), మొయిన్ అలీ (36 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 56) అర్ధసెంచరీలు సాధించారు. మోహిత్‌కు మూడు, రషీద్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా గిల్ నిలిచాడు.

మిచెల్, అలీ పోరాడినా..: భారీ ఛేదనలో చెన్నై ఇన్నింగ్స్ దారుణంగా ఆరంభమైంది. తొలి మూడు ఓవర్లలోనే టాపార్డర్ బ్యాటర్లు రచిన్ (1), రహానె (1), రుతురాజ్ (0) పెవిలియన్‌కు చేరారు. ఈ స్థితిలో డారిల్ మిచెల్, మొయిన్ అలీ నాలుగో వికెట్‌కు 109 పరుగుల భాగస్వామ్యంతో ఆశలు రేపారు. కానీ వీరి నిష్క్రమణతో జట్టు కూడా తడబడింది. ఇద్దరి బౌండరీల ధాటికి పవర్‌ప్లేలో జట్టు 43/3తో కోలుకుంది. ఆ తర్వాత మిచెల్ మరింత వేగం చూపుతూ ఎనిమిదో ఓవర్‌లో మూడు ఫోర్లు బాదాడు. 27 బంతుల్లోనే తను ఫిఫ్టీ సాధించగా.. అలీ కూడా 11వ ఓవర్‌లో 6,6,6తో స్కోరును వంద దాటించాడు. స్పిన్నర్ రషీద్ ఓవర్‌లోనూ మిచెల్ 4,6తో జోరు చూపాడు. ఈ జోడీ క్రీజులో ఉన్నంత సేపు చెన్నై సరైన దారిలోనే వెళ్లింది. కానీ కెప్టెన్ గిల్ పేసర్ మోహిత్‌కు బంతినివ్వడంతో పరిస్థితి తారుమారైంది. అతడు తన వరుస ఓవర్లలో మిచెల్, అలీ, దూబే (21) వికెట్లు తీయడంతో చెన్నై ఇక కోలుకోలేకపోయింది. 18వ ఓవర్‌లో జడేజా (18), శాంట్నర్ (0)లను స్పిన్నర్ రషీద్ దెబ్బతీశాడు. చివరి ఓవర్‌లో ధోనీ (26 నాటౌట్) 6,6,4తో మురిపించినా.. ఫలితం లేకపోయింది.



సాయి సుదర్శన్ (51 బంతుల్లో 103)

ఓపెనర్ల సెంచరీలు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు సాయి సుదర్శన్, గిల్ సెంచరీలతో కదం తొక్కారు. పిచ్ పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలించడంతో చెన్నై బౌలర్లు బంతులు వేయడం తప్ప చేసేదేమీ లేకపోయింది. దీంతో 17 ఓవర్లపాటు ఇద్దరు బ్యాటర్లదే ఆధిపత్యం సాగింది. ఆరంభం నుంచే బాల్ చక్కగా బ్యాట్ మీదికి రావడంతో సాయి, గిల్ పోటాపోటీగా ఆడేస్తూ ఓవర్‌కు 12 పరుగుల రన్‌రేట్‌తో దూసుకెళ్లారు. దీంతో 250 స్కోరు పక్కా అనిపించినా ఆఖర్లో బౌలర్లు కాస్త కట్టడి చేశారు. పవర్‌ప్లేలో జట్టు 58 పరుగులు చేశాక సుదర్శన్ మరింత జోరు చూపాడు. తొమ్మిదో ఓవర్‌లో అతడు 4,6తో 32 బంతుల్లో ఫిఫ్టీ చేరుకున్నాడు. ఇక 11వ ఓవర్‌లో గిల్ 6,4తో 25 బంతుల్లోనే ఈ ఫీట్ సాధించగా.. అటు సాయి మరో రెండు సిక్సర్లతో 23 పరుగులు వచ్చాయి. ఆ తర్వాత కూడా 13వ ఓవర్‌లో సాయి 4,6 బాదగా.. మిచెల్ ఓవర్‌లో గిల్ మూడు సిక్సర్లతో 19 రన్స్ అందించాడు. ఇదే ఓవర్‌లో అతనిచ్చిన క్యాచ్‌ను తుషార్ వదిలేశాడు. దీన్ని చక్కగా సద్వినియోగం చేసుకున్న గిల్ ఓ ఫోర్‌తో.. ఆ వెంటనే సుదర్శన్ 6తో 17వ ఓవర్‌లో 50 బంతుల్లోనే తమ శతకాలను పూర్తి చేసుకున్నారు. అయితే 16వ ఓవర్‌లో ఆరు పరుగులే ఇచ్చిన తుషార్.. 18వ ఓవర్‌లో నాలుగు రన్స్ ఇచ్చి సుదర్శన్, గిల్ వికెట్లతో చెన్నైకి రిలీఫ్‌నిచ్చాడు. ఆ తర్వాత స్కోరులో వేగం తగ్గింది. ఓవరాల్‌గా గుజరాత్ చివరి మూడు ఓవర్లలో 22 పరుగులకు 3 వికెట్లు కోల్పోయి.. కేవలం ఒక్క ఫోర్ మాత్రమే సాధించింది.

నీరజ్.. స్వర్ణం మిస్

దోహా డైమండ్ లీగ్‌లో రెండో స్థానం



దోహా: ఒలింపిక్, వరల్డ్ చాంపియన్ నీరజ్ చోప్రా దోహా డైమండ్ లీగ్‌లో త్రుటిలో స్వర్ణ పతకాన్ని మిస్సయ్యాడు. శుక్రవారం రాత్రి జరిగిన జావెలిన్ త్రో ఈవెంట్ చివరి ప్రయత్నంలో నీరజ్ 88.36 మీ. దూరం ఈటెను విసిరి రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. చెక్ రిపబ్లిక్‌కు చెందిన జాకబ్ వాడ్లేచ్ 88.38 మీ. దూరం విసిరి స్వర్ణం చేజిక్కించుకున్నాడు. కేవలం రెండు సెంటీమీటర్ల దూరంతో నీరజ్ టైటిల్ కోల్పోయాడు. గత ఏడాది ఇక్కడ నీరజ్ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. అండర్సన్ పీటర్స్ (గ్రెనడా) 86.62 మీ. దూరంతో మూడో స్థానం సాధించాడు. ఇక తొలిసారి డైమండ్ లీగ్ బరిలో దిగిన భారత మరో జావెలిన్ త్రోయర్ శ్రీకాంత్ జెనా (76.31 మీ.) పది మందిలో తొమ్మిదో స్థానంలో నిలిచాడు.

బ్రిజ్‌భూషణ్‌పై అభియోగాల నమోదుకు కోర్టు ఆదేశం

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు సాక్ష్యాలున్నాయని వెల్లడి



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌కు ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల కేసులో అతడిపై నేరాభియోగాలు నమోదు చేయాలని ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు పోలీసులను శుక్రవారం ఆదేశించింది. అందుకు తగినన్ని సాక్ష్యాలున్నాయని స్పష్టంజేసింది. సెక్షన్ 354 (మహిళల నిరాడంబరతకు భంగం కలిగించడం), 354 ఎ (లైంగిక వేధింపులు), 506 (నేరపూరిత బెదిరింపు) కింద అభియోగాలను నమోదు చేయాలని కోర్టు సూచించింది. అలాగే డబ్ల్యూఎఫ్ఐ మాజీ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్‌పైనా అభియోగాలు నమోదు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 21కి వాయిదా వేసింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో బీజేపీ మాజీ ఎంపీ అయిన బ్రిజ్‌భూషణ్‌పై త్వరలో విచారణ ప్రారంభం కానుంది. బ్రిజ్‌భూషణ్ వేధింపులకు వ్యతిరేకంగా స్టార్ రెజ్లర్లు సాక్షి మాలిక్, వినేశ్ ఫొగట్, బజ్‌రంగ్ పూనియా సహా పలువురు ఏడాదిపాటు ఢిల్లీలో ఆందోళనలు నిర్వహించిన సంగతి తెలిసిందే. కాగా, విచారణను ఎదుర్కొంటానని బ్రిజ్‌భూషణ్ చెప్పాడు.

మహిళా రెజ్లర్ల విజయం: కోర్టు ఆదేశం మహిళా రెజ్లర్ల విజయంగా బజ్‌రంగ్, సాక్షి మాలిక్ అభివర్ణించారు. 'ఈ దేశ కుమార్తెలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కోర్టు నిర్ణయం వారికి ఊరటనిస్తుంది. మహిళా రెజ్లర్లను ట్రోల్ చేసిన సిగ్గుపడాలి. సత్యమేవ జయతే' అనిఅని సాక్షి మాలిక్ పేర్కొంది.

వహ్వా.. నిషా



భారత్‌కు ఐదో ఒలింపిక్ బెర్త్ అందించిన రెజ్లర్

ఇస్తాంబుల్: వరల్డ్, ఒలింపిక్ గేమ్స్ క్వాలిఫయర్స్ టోర్నమెంట్‌లో భారత యువ రెజ్లర్ నిషా దహియా (68 కిలోలు) సత్తాచాటింది. తన విభాగంలో ఫైనల్స్‌కు దూసుకెళ్లి భారత్‌కు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ అందించింది. మహిళల రెజ్లింగ్‌లో భారత్‌కు ఇది ఐదో ఒలింపిక్ కోటా కావడం విశేషం. ఇప్పటికే వినేశ్ ఫొగట్ (50 కి), అంతిమ్ పంఘల్ (53 కి), అన్షు మాలిక్ (57 కి), రితికా హుడా (76 కి) పారిస్ విశ్వ క్రీడలకు బెర్త్ సాధించిన సంగతి తెలిసిందే. శుక్రవారం ఇక్కడ జరిగిన సెమీఫైనల్లో నిషా 8-4తో అలెగ్జాండ్రా ఏంజెల్ (రొమేనియా)ను చిత్తుచేసింది. అంతకుముందు క్వార్టర్స్‌లో నిషా 7-4తో అడెలా హన్‌జికోవా (చెక్)పై గెలిచింది.

అగార్కర్ వద్దంటేనే..

శ్రేయాస్, ఇషాన్‌కు కాంట్రాక్టు నిరాకరణపై జై షా

ముంబై: చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ నిర్ణయం మేరకే శ్రేయాస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌ను సెంట్రల్ కాంట్రాక్టు ఆటగాళ్ల జాబితానుంచి తొలగించామని బీసీసీఐ కార్యదర్శి జై షా వెల్లడించాడు. బీసీసీఐ సూచించినా..దేశవాళీ పోటీల్లో ఆడేందుకు నిరాకరించడంతో కాంట్రాక్టు జాబితా నుంచి శ్రేయాస్, ఇషాన్‌లను పక్కనబెట్టిన సంగతి తెలిసిందే. గత ఏడాది వన్డే వరల్డ్ కప్ తర్వాత సుదీర్ఘ విరామం తీసుకున్న కిషన్..ఐపీఎల్ వరకూ ఆటకు అందుబాటులో లేని విషయం విదితమే. మరోవైపు గాయం నుంచి కోలుకున్న అయ్యర్ ముంబై తరఫున కొన్ని రంజీ మ్యాచ్‌ల్లో పాల్గొన్నాడు. 'శ్రేయాస్, ఇషాన్ దేశవాళీ పోటీల్లో ఆడలేదు. దాంతో వారిని సెంట్రల్ కాంట్రాక్టు జాబితా నుంచి తొలగించాలని అగార్కర్ నిర్ణయించాడు. నా పాత్ర సెలెక్షన్ కమిటీ నిర్ణయాలను అమలు పరచడమే' అని జైషా పేర్కొన్నాడు.

ప్రజ్ఞానందకు మూడో స్థానం

వార్సా (పోలెండ్): సూపర్ బెట్ టోర్నీ ర్యాపిడ్ రౌండ్ ముగిసే సరికి ప్రజ్ఞానంద (10) మూడో స్థానంలో నిలిచాడు. చైనాకు చెందిన వీ ఈ (13) అగ్ర స్థానంలో నిలవగా, కార్ల్‌సన్ (12) రెండో స్థానం సాధించాడు. గుకేష్ (7) తొమ్మిదో స్థానంలో నిలిచాడు. తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి (8) ఆరో స్థానం సాధించాడు. ఆఖరిదైన 9వ రౌండ్‌లో వీ యీతో ప్రజ్ఞానంద, అనీష్ గిరితో కార్ల్‌సన్ గేమ్‌లను డ్రా చేసుకున్నారు. విన్సెంట్ చేతిలో అర్జున్, దుడా చేతిలో గుకేష్ ఓడారు. 8వ రౌండ్‌లో ప్రజ్ఞానందతో అర్జున్ గేమ్ డ్రాగా ముగియగా, గుకేష్‌పై వీ ఈ గెలిచాడు. ఏడో రౌండ్‌లో ప్రజ్ఞానంద-కార్ల్‌సన్, అర్జున్-గుకేష్ గేమ్‌లు డ్రా అయ్యాయి. 18 రౌండ్ల బ్లిట్జ్ గేమ్‌లు శనివారం మొదలవుతాయి.

నాలుగో టీ20లోనూ బంగ్లా గెలుపు

ఢాకా: జింబాబ్వేతో ఐదు టీ20ల సిరీస్‌లో బంగ్లాదేశ్ తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. శుక్రవారం జరిగిన నాలుగో మ్యాచ్‌లోనూ ఆతిథ్య జట్టు 5 పరుగులతో నెగ్గింది. మొదట బంగ్లా 19.5 ఓవర్లలో 143 పరుగులకు ఆలౌటైంది. తన్జిద్ హసన్ (52), సౌమ్య సర్కార్ (41) సత్తా చాటారు. లూక్ జోంగ్వే 4, బెన్నెట్, ఎన్‌గరావా చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం జింబాబ్వే 19.4 ఓవర్లలో 138 పరుగులకు ఆలౌటైంది. క్యాంప్‌బెల్ (31) రాణించాడు. షకీబ్ 4, ముస్తాఫిజుర్ 3 వికెట్లు తీశారు.

వారం పాటు వానలు

నేడు 9 జిల్లాలకు వర్ష సూచన.. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో గాలివాన బీభత్సం

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్: రాష్ట్రంలో మరో వారం రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నెల 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు, మిగతాచోట్ల మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. సోమవారం కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని, గంటకు 40-50 కి.మీ. వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. మంగళ, బుధవారాల్లో కూడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. శనివారం వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. వర్షాలకు సంబంధించి మే 12న ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. భారీ ఈదురుగాలులకు ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ప్రధాన రహదారిపై రెండు చెట్లు రోడ్డుపై పడిపోయాయి. మండలంలోని షాంపూర్ పంచాయతీ పరిధిలో ఉన్న గోదారిగూడ సమీపంలో ఆదిలాబాద్-ఉట్నూర్ ప్రధాన రహదారిపై చెట్టు కూలిపోయింది. దండు తండాలో ఈదురు గాలులకు ఇళ్లపై కప్పుల రేకులు ఎగిరిపోయాయి. నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్, కడెం, దస్తూరాబాద్ తదితర ప్రాంతాల్లో జోరువాన కురిసింది. చాలా గ్రామాల్లో మామిడి కాయలు రాలిపోయాయి. ధాన్యం తడిసిపోయింది. మున్యాల్ గ్రామంలో ప్రధాన రహదారిపై చెట్లు విరిగి పడ్డాయి. ఈదురు గాలులతో దస్తూరాబాద్ మండల కేంద్రంలో కరెంట్ స్తంభం విరిగిపోయి.. గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలంటూ ఖానాపూర్ ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో చేశారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి, బీబీపేట మండలాల రైతులు శుక్రవారం ఆయా ప్రాంతాల్లో రాస్తారోకో చేశారు. ఖమ్మం జిల్లా వైరా మండలంలో శుక్రవారం అకాల వర్షానికి రోడ్లు, కల్లాలపై ఆరబోసిన వందలాది బస్తాల వరి ధాన్యం తడిసిముద్ధయింది. నారపనేనిపల్లి, సిరిపురం తదితర చోట్ల రోడ్లపక్కనున్న చెట్లు నేలకొరిగాయి. సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లి పంచాయతీలోని కొమ్ముగూడెం, బాసారం గ్రామాల్లోని 10 రేకుల ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. కాగా, ఆదిలాబాద్ జిల్లా అర్లీలో శుక్రవారం 42.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యింది. నల్లగొండ జిల్లా బుగ్గబావిలో 41.9 ఉష్ణోగ్రత నమోదయ్యింది.


నిర్మల్ జిల్లా దస్తూరాబాద్‌లో తడిసిన వరి ధాన్యం

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- 12 మంది మావోయిస్టుల మృతి
- గుట్టపై 100 మంది మావోయిస్టుల సమావేశం!
- ఉదయం నుంచి సాయంత్రం దాకా కాల్పులు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం

చర్ల, చింతూరు, మే 10: లోక్‌సభ ఎన్నికల వేళ మావోయిస్టులకు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దండకారణ్యంలో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పడియా గుట్టల్లో కేంద్ర బలగాలు-మావోయిస్టులకు జరిగిన ఎదురుకాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మృతి చెందారు. సుదీర్ఘంగా కాల్పులు జరగడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. మృతుల్లో మావోయిస్టు పార్టీ అగ్రనాయకులు ఉన్నట్లు సమాచారం. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ డివిజన్‌లోని ఏడు జిల్లాల్లో 'ఆపరేషన్ కగార్' పేరుతో యాంటీ నక్సల్ ఆపరేషన్ కొనసాగుతోంది. ఇందులో భాగంగా గత 60 రోజుల్లో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దు అడవుల్లో 8 భారీ ఎన్‌కౌంటర్లు జరగా 98 మంది మావోయిస్టులు మృతిచెందారు. తాజాగా బీజాపూర్ జిల్లా గంగలూరు అడవుల్లోని పిడియా గుట్టల్లో బస్తర్ డివిజన్ మావోయిస్టు కమిటీ ముఖ్యనాయకుడు పాపారావు నేతృత్వంలో ధర్నా డివిజన్, పీఎల్‌జీఏ (పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) బృందాలు గంగులూర్ ఏరియా కమిటీ సభ్యులు మొత్తంగా సుమారు 100 మంది సమావేశమైనట్లు బలగాలకు సమాచారం అందింది. దంతెవాడ, సుకుమా, బీజాపూర్ జిల్లా చెందిన డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా, సీఆర్‌పీఎఫ్ చెందిన సుమారు 1200 మంది బలగాలు శుక్రవారం పిడియా గుట్టల్లో కూంబింగ్ ప్రారంభించాయి. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఘటనాస్థలి నుంచి మావోయిస్టులకు చెందిన అధునాతన తుపాకులను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మృతదేహాలను గుర్తించే పనిలో ఉన్నట్లు బస్తర్ ఐజీ కమలోచన్ కశ్యప్ మీడియాకు చెప్పారు. ఎదురుకాల్పుల ఘటనలో ఇద్దరు జవాన్లకు గాయాలైనట్లు.. వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. వారిని చికిత్స నిమిత్తం ప్రత్యేక హెలికాప్టర్‌లో బీజాపూర్ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. కాగా ఈ ఎన్‌కౌంటర్ 12 గంటల పాటు జరిగిందని.. ఘటనాస్థలి నుంచి మావోయిస్టుల మృతదేహాలను, పేలుడు పదార్థాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ తెలిపారు. కాగా బస్తర్ డివిజన్‌లోని దంతెవాడ, సుకుమా, బీజాపూర్ జిల్లాల్లో గత 60 రోజుల్లో ఇప్పటిదాకా 95 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఇప్పటిదాకా మావోయిస్టు పార్టీ వరుస ఎన్‌కౌంటర్లలో పార్టీ ముఖ్య నాయకులను, కమాండర్లను పార్టీ కోల్పోయింది. రూ.25 లక్షల నుంచి లక్ష రివార్డు ఉన్న పలువురు నాయకులు చనిపోయారు. వీరిలో రూ.25 లక్షల రివార్డు ఉన్న సాగర్, జోగన్న, రూ.10 లక్షల రివార్డు ఉన్న శంకర్‌రావు ఉన్నారు. ముఖ్య నాయకులు చనిపోవడంతో మావోయిస్టు పార్టీ కలవరపాటుకు గురైనట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో ఐదు రాష్ట్రాల నాయకులు సేఫ్‌జోన్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. వర్షాలు పడ్డాకే అడవుల్లో కార్యకలాపాలు కొనసాగించాలని ముఖ్య నాయకులు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం అందుతోంది.

మొసళ్ల అభయారణ్యానికి ఆదరణ కరువు

మంచిర్యాల జిల్లా జైపూర్ నుంచి చెన్నూరు దాకా 15 కి.మీ మేర విస్తరించిన గోదావరి


- ఇక్కడ 50కి పైగా ఉప్పు, మంచినీటి మొసళ్లు
- పక్షిజాతులు, వన్యప్రాణులకూ ఆవాసం
- పర్యాటకంగా అభివృద్ధిపై గత సర్కారు హామీ
- ఇప్పటికీ కార్యరూపం దాల్చని వైనం

మంచిర్యాల, మే 10 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం శివ్వారం గ్రామంలోని మొసళ్ల అభయారణ్యం అభివృద్ధికి నోచుకోవడం లేదు. టూరిజం సర్క్యూట్‌లో అభివృద్ధికి గత ప్రభుత్వ హయాంలో హామీలు ఇచ్చినప్పటికీ అవి కార్యరూపం దాల్చలేదు. జైపూర్ మండలం కుందారం నుంచి చెన్నూరు మండలంలోని బీరెల్లి వరకు 15 కి.మీ మేర విస్తరించి ఉన్న గోదావరి నది మడుగు (ఎల్ మడుగు) మొసళ్లకు ఆవాసంగా ఉంది. నదితోపాటు దాని చుట్టూ ఉన్న అటవీ ప్రాంతాన్ని అటవీశాఖ మొసళ్ల అభయారణ్యంగా గుర్తించింది. ఎల్ మడుగులో 50కి పైగా ఉప్పు, మంచినీటి మొసళ్లు ఉండగా, అటవీశాఖ ఆధ్వర్యంలో సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. ఎల్ మడుగు ఒడ్డున ఉన్న ఓ గుహ దాదాపు 250 అడుగుల ఎత్తులో ఉంటుంది. ఇక్కడి మానవ నిర్మితమైన గుహల్లో ఒకదాంట్లో ఇసుక రాతితో చెక్కిన ఎత్తయిన పానవట్టంతో శివలింగం ఉంది. ఇక్కడ కనిపించే నాలుగు గుహాలయాలు బయటకు ద్వార స్తంభాలుగా, లోపల రాతి గద్దెలతో నిర్మించిన దేవాలయాలను తలపిస్తుండగా, దీపాల గూడులతో, మలుపు తిరిగిన రాతి గోడలతో చదునైన రాతి నేతలతో బౌద్ధుల 'వస్సావాసా' (వర్షాకాలంలో బౌద్ధ భిక్షువులు నివసించే తాత్కాలిక ఆవాసాలు)ను తలపిస్తాయి. గుహలున్న ప్రదేశంలోనే లభించిన ముతక ఇటుకలు శాతవాహన కాలానికి చెందినవని చరిత్రకారులు చెబుతున్నారు. ఒక ద్వారం పక్కన గుర్రం మీద స్వారీ చేస్తున్న జంట శిల్పం కనువిందు చేస్తుంది. ద్వార స్తంభాల మీద పెట్టిన బ్రాకెట్లు, స్తంభాల శిల్పం పురాతన శైలిని ప్రతిబింబిస్తోంది. గుహల బయట కనిపిస్తున్న ప్రదేశం చక్కగా చెక్కిన రాతి స్తంభాలు, రాతి ఇటుకలు, రాతి గడీలు పరిచి ఉన్నాయి. గుహలు, గుహల బయట చక్కని ప్రణాళికతో నిర్మించిన నివాసాలు, ఆరామాలు కనిపిస్తున్నాయి. ఈ నాలుగు గుహలు క్రీ.పూ. 1, 2 శతాబ్దాల వాటివని చరిత్రకారుల అభిప్రాయం.


రెండు కొండల నడుమ గోదావరి

అటవీ సంపదకు నిలయం

మొసళ్ల అభయారణ్యం ఎన్నో రకాల అటవీ సంపదకు నిలయం. ఇక్కడ ఎన్నో వృక్ష, పక్షి, జంతు జాతులు ఉన్నాయి. చుక్కల దుప్పులు, నీలుగాయిలు, అడవిపందులు, ముళ్ల పందులు, జింకలు, కొండగొర్రెలు, నీటి కుక్కలు వంటి జంతుజాతులు ఇక్కడ నివసిస్తున్నాయి. నెమళ్లు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వృక్ష సంపదలో నల్లమద్ది, చెన్నంగ, బూరుగు, అందుగు, కొడిశ, పాలవంటి అరుదైన వృక్షజాతులు ఉన్నాయి. పర్యాటకులు నదిలో షికారు చేసేందుకు బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేసినప్పటికీ పనిచేయడం లేదు. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో కనుల విందు చేసే పర్యాటక ప్రాంతం ప్రస్తుతం ఆలనా పాలనలేక కళావిహీనంగా దర్శనమిస్తోంది. టూరిజం సర్క్యూట్‌లో భాగంగా అభివృద్ధి చేస్తామన్న సర్కారు హామీ అమలు కాకపోవడంతో పర్యాటకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


అభయారణ్యంలోని పురాతన గుహలు

సచివాలయ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మృతి

- స్పెషల్ సీఎస్ మందలించడంతో గుండె పోటు?
- రాణి కుముదినిని తొలగించాలని డిమాండ్

హైదరాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో పని చేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి చెందడంతో మిగతా ఉద్యోగులు శుక్రవారం ఆందోళనకు దిగారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలిసి న్యాయం చేయాలని కోరారు. కార్మిక ఉపాధి కల్పనా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని పేషీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న రాహుల్(33) ఈ నెల 7న అకస్మాత్తుగా కింద పడిపోయారు. వెంటనే తోటి సిబ్బంది ఆయనను యశోద ఆస్పత్రికి తరలించారు. డబ్బులు ఎక్కువగా ఖర్చవుతాయనే కారణంతో మళ్లీ అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించి శస్త్ర చికిత్స చేశారు. కానీ... ఆయన గురువారం రాత్రి 9 గంటలకు మృతి చెందారు. అయితే.. రాణి కుముదిని మందలించినందునే... ఒత్తిడికి లోనై గుండె పోటు వచ్చిందంటూ సచివాలయ ఉద్యోగులు ఆరోపించారు. ఈ మేరకు సీఎస్‌ను కలిసి రాహుల్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ ఘటనపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకుంటామని సీఎస్ హామీ ఇచ్చారు. కాగా... స్పెషల్ సీఎస్ రాణి కుముదినిని బాధ్యతల నుంచి తొలగించాలని సీపీఎం ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది.

డబ్బుల్లేక వృద్ధులు దవాఖానాలకు పోవట్లే

- పట్టణాల్లో 48.6%, గ్రామాల్లో 62% మందికి సమస్య

హైదరాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): చేతిలో డబ్బుల్లేక, కన్నపిల్లల నుంచి ఆదరణ కరువై పట్టణ ప్రాంతాల్లో 48.6% మంది, పల్లెల్లో 62% మంది వృద్ధులు అనారోగ్యంగా ఉన్నప్పటికీ ఆసుపత్రులకు వెళ్లడం లేదని ఏజ్‌వెల్ అనే ఎన్జీవో సంస్థ అధ్యయనంలో వెల్లడైంది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 10 వేల మందికి పైగా వృద్ధులపై ఈ సంస్థ ఏప్రిల్‌లో సర్వే చేసి ఈ విషయాన్ని వెల్లడించింది. పట్టణ ప్రాంతాల్లో 5,259 మంది, గ్రామీణ ప్రాంతాల నుంచి 4,741 మంది ఈసర్వేలో పాలు పంచుకున్నారు. సర్వేలో వెల్లడైన వివరాల ప్రకారం.. 24 శాతం మంది వృద్ధులు ఒంటరిగా జీవిస్తున్నారు. పిల్లలు, జీవిత భాగస్వాములు దూరంగా ఉండటంతో వృద్ధుల్లో అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని ఈ నివేదిక అభిప్రాయపడింది. సర్వేలో పాల్గొన్న వృద్ధుల్లో 38.5 శాతం మంది తమ ఆరోగ్యం బాగా లేదని, అనేక సమస్యలున్నాయని చెప్పారు. అనారోగ్యం కారణంగా ఆర్థికంగా ఇబ్బందులు మరింత పెరుగుతున్నాయని 54.6శాతం మంది ఆందోళన వ్యక్తం చేశారు.

రేపు ఇంజనీరింగ్ స్ట్రీమ్ ప్రాథమిక 'కీ' విడుదల

- 14 వరకు అభ్యంతరాల స్వీకరణ
- టీఎస్‌ఎప్‌సెట్ కన్వీనర్ వెల్లడి

హైదరాబాద్ సిటీ, మే 10(ఆంధ్రజ్యోతి): టీఎస్‌ఎప్‌సెట్ ఇంజనీరింగ్ పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక 'కీ'ని ఈ నెల 12న విడుదల చేయనున్నట్లు సెట్ కన్వీనర్ డీన్ కుమార్ తెలిపారు. ఈ 'కీ'పై అభ్యంతరాలుంటే 14న ఉదయం 10 గంటలవరకు స్వీకరిస్తామన్నారు. అభ్యర్థులు తాము రాసిన ప్రధాన ప్రశ్నపత్రం (మాస్టర్ క్వశ్చన్ పేపర్), రెస్పాన్స్‌షీట్‌ను కూడా వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఇప్పటికే ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు నాలుగు సెషన్లు పూర్తి కాగా, శనివారం ఉదయం సెషన్‌తో ఎప్‌సెట్ పరీక్షలు ముగియనున్నాయి. గురు, శుక్రవారాల్లో తెలుగు రాష్ట్రాల్లో 95శాతానికిపైగా అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. శుక్రవారం జరిగిన పరీక్షలకు 1,01,977మంది అభ్యర్థులకుగాను 96,415మంది హాజరయ్యారు. అత్యధికంగా నల్గొండ, నిజామాబాద్ కేంద్రాల్లో 99 శాతం, అత్యల్పంగా తిరుపతి కేంద్రంలో 85శాతం అభ్యర్థుల హాజరు నమోదైంది.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగికి జడ్జి పోస్టు దరఖాస్తుకు చాన్స్

- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్, మే 10(ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగిగా పనిచేస్తున్న ఓ వ్యక్తికి తెలంగాణ జూనియర్ సివిల్ జడ్జి పోస్టుకు దరఖాస్తు చేసుకునేందుకు హైకోర్టు అవకాశం కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. అతడి ఎంపిక ఫలితాన్ని సీల్డ్ కవర్‌లో ఉంచాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీచేసింది. ఇవి మధ్యంతర ఉత్తర్వులు మాత్రమేనని.. వీటివల్ల పిటిషనర్‌కు ఎలాంటి హక్కులు దఖలు పడవని స్పష్టం చేసింది. రైల్వేలో పనిచేస్తున్న చిల్కా అజయ్ అనే వ్యక్తి జూనియర్ సివిల్ జడ్జి పోస్టుకు చేసిన దరఖాస్తు తిరస్కరణకు గురైంది. తెలంగాణ స్టేట్ జ్యుడీషియల్ సర్వీసెస్ రూల్స్-2023 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు ఈ పోస్టులకు అర్హులు కారని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ రూల్స్‌ను సవాల్ చేస్తూ అజయ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ వాదనతో ప్రాథమికంగా ఏకీభవించిన ధర్మాసనం.. పిటిషనర్ దరఖాస్తును స్వీకరించాలని ఆదేశాలు జారీచేసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కేజ్రీవాల్‌కు ఊరట!

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు మద్యం కేసులో మధ్యంతర బెయిల్ ఇచ్చింది. ఎన్నికల ప్రచారానికి వీలుకల్పించాలన్నది పరమోద్దేశం కనుక, సార్వత్రిక ఎన్నికల తుదిదశ జూన్ 1న ఇలా ముగియగానే, మర్నాడే తిరిగి తిహాడ్ జైల్లోకి వచ్చేయాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. మధ్యంతర బెయిల్ దక్కిన ఈ 21రోజుల్లో పార్టీ అధినేతగా ఆయన విస్తృతంగా ప్రచారం చేసుకోవచ్చును కానీ, సీఎంగా విధులు నిర్వర్తించకూడదని ఆదేశం. సీఎంవోకూ, సెక్రటేరియట్‌కూ వెళ్ళవద్దనీ, ఫైళ్ళమీద సంతకాలు చేయకూడదనీ, ఈ కేసు గురించి వ్యాఖ్యానించడం, సాక్షులను కలుసుకోవడం ఇత్యాదివి ససేమిరా కుదరవంటూ కోర్టు ఈ బెయిల్ ఇచ్చింది. ఆయన తరఫు న్యాయవాది కోరినట్టుగా జూన్ 5వరకూ బెయిల్ దక్కివుంటే మిగతావారితో కలిసి ఎన్నికల ఫలితాలను వీక్షించడమూ, మర్నాడు సంబరాలో సమీక్షలో చేసుకోవడమూ సాధ్యపడేది. ప్రచారాన్ని ముగించి తిరిగి జైలుకు మళ్ళిపోవడమే ఇప్పుడు ఆయన చేయగలిగినపని. ఇప్పటికే మూడుదశల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో, కనీసం మిగిలినదానిమీద తన ప్రభావాన్ని చూపేందుకు ఆయనకు ఈ బెయిల్ ఉపకరిస్తుంది.

ఒక సిట్టింగ్ ముఖ్యమంత్రి జైలుకెళ్ళడం దేశచరిత్రలో ఇదే తొలిసారి. సామాన్యుడికైనా, సీఎంకైనా న్యాయం ఏకరీతిన వర్తించాలన్న వాదనతో, రైతుతో, వ్యాపారితో ముఖ్యమంత్రిని సమం చేస్తూ బెయిల్‌ను అడ్డుకోవడానికి సొలిసిటర్ జనరల్ విశేషమైన ప్రయత్నమే చేశారు. సరిగ్గా పంటకోతకు వచ్చే సమయంలోనే రైతును అరెస్టు చేస్తే, అది కుట్రపూరితంగా జరిగిందని అనిపిస్తే రైతుకూడా బెయిల్‌కు అర్హుడేనని ఆయనకు తెలియనిదేమీ కాదు. ఈ వాదనలనూ, పోలికలనూ తిరస్కరిస్తూ ఒక ముఖ్యమంత్రిగా, జాతీయపార్టీ అధినేతగా ఐదేళ్ళకోమారు వచ్చే ఎన్నికల్లో ప్రచారం చేసుకోవడానికి కేజ్రీవాల్‌కు గల హక్కును సుప్రీంకోర్టు గుర్తుచేసింది. ఏడాదిన్నరనుంచి ఈ కేసులో దర్యాప్తు చేస్తున్నారు, కానీ మార్చిలో ఆయనను అరెస్టుచేశారు, ఇప్పుడు ఈ 21రోజులూ ఆయన బెయిల్‌మీద వెళ్ళినంతమాత్రాన నష్టమేమీ లేదు అన్న వ్యాఖ్యల్లో కేజ్రీవాల్ అరెస్టు నేపథ్యంమీద అవగాహన ఉన్నట్టుగా కనిపిస్తున్నది. ఎన్నికల ప్రచారం కోసం ఇచ్చే తాత్కాలిక బెయిల్ కనుక న్యాయస్థానం దీనికి అభ్యంతరపెట్టదని కేంద్ర పాలకులు కూడా భావించి ఉండవచ్చు. మేశివ తేదీన న్యాయస్థానం నుంచి బెయిల్ విషయంలో సానుకూలమైన వ్యాఖ్యలు రావడంతో, మే 7వతేదీ విచారణ సందర్భంలోనే ఆయనకు బెయిల్ ఖాయమని అంతా అనుకున్నారు. కానీ, సోమవారం హఠాత్తుగా అరవింద్ కేజ్రీవాల్ మీద మరో అభియోగాన్ని విచారించడానికి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతించారు. శిక్ష అనుభవిస్తున్న ఒక సిక్కుమిలిటెంట్‌ను వదిలిపెట్టడానికి హవాలా మార్గంలో ఆమ్ ఆద్మీపార్టీ నాయకుడు నిధులు తీసుకున్నాడన్నది ఈ కొత్త వ్యవహారంలో ఆరోపణ. మరుసటిరోజు సుప్రీంకోర్టు విచారణను ప్రభావితం చేసి, బెయిల్ రాకుండా అడ్డుపడటానికే ఎల్‌జీ ఈ అకృత్యానికి ఒడిగట్టారని ఆప్ విరుచుకుపడింది. బెయిల్ విషయంలో ఎంతో సానుకూలత చూపిన సుప్రీంకోర్టు మర్నాడు ఆ ఊసెత్తకపోవడం, విచారణ వాయిదావేయడంతో ఎవరికి తోచిన వ్యాఖ్యలు వారు చేశారు.

ఇప్పుడు, చక్కని మాటలతో తన నిర్ణయాన్ని విశ్లేషిస్తూ, కేసు లోతుల్లోకీ, దాని మంచిచెడ్డల్లోకీ పోకుండా ఒక రాజకీయపార్టీ అధినేతగా కేజ్రీవాల్‌కు ఎన్నికల ప్రచారంలో పాల్గొనే హక్కును కోర్టు గుర్తించింది, అవకాశం ఇచ్చింది. మామిడిపళ్ళు తిని శరీరంలో చక్కెర శాతాన్ని పెంచుకొని మెడికల్ బెయిల్ పొందడానికి కేజ్రీవాల్ చూస్తున్నారన్నట్టు వంటి వాదనలను కూడా గతంలో మనం విన్నాం. సరిగ్గా యాభైరోజుల తరువాత ఆయన తాత్కాలికంగానైనా కీలకమైన సమయంలో బయటకు రావడం పార్టీకి కచ్చితంగా సమధికోత్సాహాన్ని ఇస్తుంది. నిర్బంధంతో ఇప్పటికే కొంతమేరకు నష్టం జరిగినప్పటికీ, మిగిలిన ఈ సమయంలో మహారాష్ట్ర, జార్ఖండ్, హర్యానా, పంజాబ్ రాష్ట్రాలను ఆయన విస్తృతంగా చుట్టేయబోతున్నారట. ఢిల్లీలో ఆయనతోపాటు భార్య కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొనబోతూండటం భవిష్యత్ సంసిద్ధత కావచ్చు. ఇండియా కూటమిలోని పక్షాలన్నీ కోర్టు నిర్ణయాన్ని స్వాగతించాయి, కేజ్రీవాల్ రాకతో తమ పోరాటం మరింత బలోపేతం అవుతుందని ప్రకటించాయి. తన పార్టీ పాలనలో ఉన్న పంజాబ్‌లో పోలింగ్ ముగిసినరోజునే కేజ్రీవాల్ తిరిగి తిహాడ్ జైలుకు తరలిపోవాల్సి ఉన్నప్పటికీ, ఇప్పటికే ప్రజల్లో ఉన్న సానుభూతిని ఓట్లుగా మార్చుకోవడానికి ఆయన రాక ఉపకరిస్తుందని ఆప్ విశ్వాసం.

పచ్చని తెలంగాణలో ఓట్ల కోసం మత చిచ్చు!

ఉత్తర భారతంలో కలగలసి పోయిన హిందూ – ముస్లిం సంస్కృతులను చెప్పేందుకు గంగా – జమునా తెహజీబ్/ హిందూస్తానీ తెహజీబ్ అన్నారు. అదే తెహజీబ్ (సంస్కృతీ) తెలంగాణలోనూ కనబడుతుంది. ఇవాళ ఏ హైదరాబాద్‌నైతే తెలంగాణకు తలమానికం అనుకుంటున్నామో అది ఇబ్రహీం కుతుబ్ షా, బాగీరథిల ప్రేమతో ఉన్నది. కొందరు ఫెయిరీ టేల్ అని కొట్టిపడేసిన కులీ కుతుబ్ షా, భాగ్‌మతిల ప్రేమ చిహ్నంగా ఉన్నది. తమను తాము నిజాంకి స్వచ్ఛంద సేవకులుగా ప్రకటించుకున్న రజాకార్లు చేసిన అకృత్యాలను మొత్తం ముస్లిం సమాజానికి అంటగట్టే ప్రయత్నం కొందరు చేస్తున్నారు. అలా చేస్తున్నవారికెవరికీ నిజాం వ్యతిరేక లేదా స్థానిక భూస్వామ్య వ్యతిరేక పోరాటంతో సంబంధం లేదు. రజాకార్ల ఆగడాలను హిందూ ముస్లింల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే కుట్ర నాటి నుండి జరుగుతూనే ఉన్నది.

తెలంగాణ సాయుధ పోరాటం అనగానే అందరికీ గుర్తొచ్చే పేర్లు దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగీ. ఈ ముగ్గురూ పోరాడింది నిజాం మీద కాదు. తనను తాను గొప్పగా రామచంద్రారెడ్డి రజకార్‌గా పిలుచుకున్న విసునూరు దొర మీద. ఇదే విసునూరు రామచంద్రారెడ్డి ఖాసిం రజ్వీ స్థాపించిన రజాకర్ అనే వ్యవస్థకు ఉపాధ్యక్షుడిగా ఉన్నాడు. ఇవాళ ఏ రజ్వీనైతే దుర్మార్గుడిగా, ఖూనీకోరుగా మాట్లాడుతున్నామో అందులో విసునూరు రామచంద్రారెడ్డికీ భాగం ఉన్నది. అతని తల్లి జానకమ్మా, అతని కొడుకు బాబుదొర చేసిన అన్యాయాలు అకృత్యాల గురించి ఇప్పటికీ జనం చెప్పుకుంటున్నారు. ఎంత అకృత్యాలకు తెగబడకపోతే మొండ్రాయి గ్రామానికి చెందినా లంబాడాలు తిరగబడి బాబు దొర (జగన్మోహన్)ను జనగామ రైల్వే స్టేషన్‌లో కొట్టి చంపుతారు? ఈ విస్నూరు దొర నలభై వేల ఎకరాల ఆసామి. "బండెనుక బండిగట్టి పదహారు బండ్లు గట్టి/ ఏ బండ్లో పోతావు కొడుకో నా కొడకా ప్రతాపరెడ్డి" అని ప్రజలు పాటలు అల్లిన జెన్నారెడ్డి ప్రతాపరెడ్డికి లక్ష ఎకరాలు ఉండేవి. కల్లూరు దేశముఖ్, సూర్యాపేట దేశముఖ్ వీళ్ళంతా పీడిత ప్రజలను (మతం కోణం నుండి చూస్తే మెజారిటీ హిందువులను) వేధించుకు తిన్నవాళ్ళే. నిజాం పది రూపాయలు శిస్తు వేస్తే ప్రజల నుండి వంద రూపాయల శిస్తు వసూలు చేసి పీడించిన వాళ్ళే వీళ్ళ అకృత్యాలకు వ్యతిరేకంగానే గుత్పల సంఘం మొదలయింది. ఆ తరువాత సాయుధ పోరాటంగా మారింది.

ఒక్కసారి చరిత్రపుటల్లోకి తరచి చూస్తే త్రివర్ణ పతాకం పట్టుకుని ర్యాలీ చేసినందుకు 23 మందిని పొట్టనబెట్టుకున్న తెలంగాణ జలియన్ వాలా బాగ్‌గా పేరుగాంచిన పరకాలలో కాల్పులకు ఆదేశం ఇచ్చిందీ అక్కడి తహసీల్దార్ విష్ణువేశ్వర్ రావు. బైరాన్‌పల్లిలో 118 మందిని నిలబెట్టి కాల్చి చంపిన ఘటనలో వాళ్లని ఒక్కదగ్గరకు చేర్చి సైనికులకు పట్టించింది స్థానిక భూస్వామే. నిజాం ఏలుబడిలో ఉప ప్రధానిగా ఉన్నది పింగళి వెంకటరామారెడ్డి. ఏ రాజ్యమైనా దుర్మార్గమైనదే. కానీ, రాజు ఫలానా మతంవాడు కనుక వాడిమీదే అన్నీ నెట్టేస్తాం అంటే చరిత్ర ఒప్పుకోదు.



ఏ రాజ్యమైనా దుర్మార్గమైనదే. కానీ, రాజు ఫలానా మతంవాడు కనుక వాడిమీదే అన్నీ నెట్టేస్తాం అంటే చరిత్ర ఒప్పుకోదు. ఈ సందర్భంగా మఖ్దూమ్ మొహియుద్దీన్ మాటను గుర్తు చేసుకోవాలి. "నిజాం వ్యతిరేక పోరాటమంటే ఇస్లాం వ్యతిరేక పోరాటమే" అని ఖాసీం రజ్వీ అంటే "మాది నిజాం వ్యతిరేక పోరాటమే కాని ఇస్లాం వ్యతిరేక పోరాటం కాదు. నిజాం ఇస్లాం ప్రతినిధి కాదు" అన్నాడు మఖ్దూమ్.

ఈ సందర్భంగా మఖ్దూమ్ మొహియుద్దీన్ మాటను గుర్తు చేసుకోవాలి. "నిజాం వ్యతిరేక పోరాటమంటే ఇస్లాం వ్యతిరేక పోరాటమే" అని ఖాసీం రజ్వీ అంటే "మాది నిజాం వ్యతిరేక పోరాటమే కాని ఇస్లాం వ్యతిరేక పోరాటం కాదు. నిజాం ఇస్లాం ప్రతినిధి కాదు" అన్నాడు మఖ్దూమ్. తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన ముగ్గురిలో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూమ్ మొహియుద్దీన్ ఉన్నారు. ఇవాళ మోదీని విమర్శిస్తే "ఇది హిందూ మతంపై దాడి" అని ఎలా అంటున్నారో, ఆనాడు ఖాసీం రజ్వీ కూడా అలానే అన్నాడు. ఇద్దరి మోడస్ ఆపరెండి ఒకటే. ఒక కల్ట్ ఫిగర్‌ని పెట్టుకుని అతడ్ని సమర్థించడం. అది మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ కావొచ్చు, నరేంద్ర దామోదర్ దాస్ మోదీ కావొచ్చు.

దాశరథి రంగాచార్య నవల 'జనపదం' మొదటి పేజీలోనే ఇలా ఉంటుంది: "బండి ఒక రాతిని ఎక్కింది పడింది కుదిపింది. బలరామయ్య చాలా బాధపడ్డాడు. తాను రెండు జతల ఎడ్లను ఎప్పుడూ మేపుతుండేవాడు తన కచ్చాదానికి, బండికి కడితే వాటిని ఆపడం ఎవరితరమూ అయ్యేది కాదు. తాను బయలు దేరేడంటే ఊరంతా హడలిపోయి తప్పుకునేది. బండి ముందు ఒక చాకలి పరుగెత్తాలి. వెనుక సామాను నెత్తిన పెట్టుకొని మరొకడు పరుగెత్తాలి. పరిగెత్తలేకుంటే చచ్చాడన్నమాటే. ఒకసారి అమీనూ తానూ కచ్చాడంలో పోతున్నారు. ముందు నడిచే చాకలికి ఏమైందో తెలియదు ఎందుకు మెల్లగా నడిచాడో తెలియదు. ఎడ్లు పరిగెత్తాయి. వాణ్ణి తొక్కేశాయి. బండి ఆపొద్దన్నాడు తాను. వాడి శవం అక్కడే పడిపోయింది. అలా ప్రభుత్వం చేశాడు తాను. అయినా ఒక్కసారి ఇగిరిపోయింది ప్రభుత్వం. తాను ఊరే వదలిపోవాల్సి వచ్చింది. ఇప్పుడైనా పోలీసు చర్య జరిగింది కాబట్టి పోలీసులు తనవెంట ఉన్నారు కాబట్టి రాగలుగుతున్నాడు. నిజాం నవాబు వట్టి బలహీనుడు. తనకు రక్షణ కల్పించలేకపోయాడు. భారత ప్రభుత్వం మంచిది. అందుకే తనకు పోలీసులనిచ్చి పంపుతుంది".

ఏ నిజాంనైతే వ్యతిరేకిస్తూ, ఏ సర్దార్ పటేల్‌ని అయితే ఆకాశానికి ఎత్తుతున్నారో అదే పటేల్ నిజాంని రాజ్ ప్రముఖ్‌గా గవర్నర్ హోదాలో గవర్నర్ భవన్‌లో కూర్చోబెట్టాడు. ఏ బలరామయ్యలను ఐతే కమ్యూనిస్టు ఉద్యమాలు ఊరి నుండి తరిమి భూమిని పేదలకు పంచాయో, ఆ పేదల నుండి మళ్ళీ భూములు లాక్కొని రాజ్యం చేసేందుకు బలరామయ్యలకు పటేల్ బలగాలను ఇచ్చాడు. సరిహద్దు గ్రామాల్లో మిలటరీ కనుసన్నల్లో ముస్లింలపై దాడులు చేశారని, లూటీ చేశారనీ, హత్యలు, అత్యాచారాలు చేశారనీ సుందర్‌లాల్ కమిషన్ పేర్కొన్నది. తన ప్రాంతంలో తనను ఎదిరించిన వారిపై రాచరికపు రాజు దాడిచేస్తే మతం కోణంలో ఆ మతంలోని వారందరికీ ఆ నేరాల్లో భాగాన్ని అంటగట్టేవారు, ఒక రాజ్యం మీద దాడి చేసేందుకు ఒక మత సమూహంపై మరో మత సమూహాన్ని ఎగదోసాడంటూ పటేల్‌ని, అతని మతాన్ని ఇదే మాట అంటే సహిస్తారా?

రెండు మతాల మధ్య గొడవపెట్టి కేవలం ఎన్నికల్లో ఓట్లో, సీట్లో పొందడంలో ఏమైనా అర్థముందా? ఎక్కడైనా రాజకీయాలు విద్వేషాలను రూపుమాపడానికి పాటుపడాలి కాని విద్వేషాలు రెచ్చగొట్టడమే ఎజెండాగా పెట్టుకుంటే ఎట్లా? విద్వేషాలు రేపిన, రేపుతున్న పార్టీ రేపు ఎన్నికల్లో ఓడిపోవచ్చు గాక. కాని అది మలినం చేసిన మెదళ్ల మాటేమిటి? కనీస చరిత్ర తెలియక కళ్ళముందు రోజూ తిరిగే మనిషిని శత్రువనుకుని కత్తులు నూరాలా? అయినా పీల్చేగాలికి, పోయిన ప్రాణానికి మతం ఉంటుందా!? చరిత్రలో రజ్వీలు, రామచంద్రారెడ్లు కలిసే ఉన్నారు. వర్తమానంలో కలిసే ఉన్నారు. భవిష్యత్తులోనూ ఉంటారు. అచ్చంగా ముస్లిం దేశాలతో వ్యాపారాలు చేస్తూ సంపద కూడబెట్టుకుంటారు కూడా. కాని పోయే ప్రాణాలు కొమురయ్య, షోయబుల్లా ఖాన్లవే.

• అరుణాంక్ లత

కులీనుల కోటపైకి నరేంద్రుడి జైత్రయాత్ర!

పది సంవత్సరాల క్రితం, 16వ లోక్‌సభ ఎన్నికలలో నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా ఓటింగ్‌ను ప్రభావితం చేసేందుకు రచయిత సల్మాన్ రష్దీ, హార్వర్డ్ ప్రొఫెసర్ హోమీ భాభా, చిత్రకారుడు అనీష్ కపూర్ మొదలైన ప్రముఖులు ఒక బ్రిటిష్ దినపత్రికలో ఒక సంయుక్త లేఖను ప్రచురించారు. వారు నరేంద్ర మోదీ 'నైతిక వ్యక్తిత్వమూ, రాజకీయ నైతికత లేని వ్యక్తి' అని వారు ఆరోపించారు. 'ఆయన ప్రధానమంత్రి అయిన పక్షంలో, సమ్మిళిత సమాజ నిర్మాణ ఆదర్శాన్ని ఔదల దాల్చిన భారత్ భవిష్యత్తుకు ఎనలేని హాని వాటిల్లుతుంది' అని వారు ఆ లేఖలో వాదించారు. 'ది ఎకనామిస్ట్' వారి వాదనను సమర్థించింది. నరేంద్ర మోదీ పది సంవత్సరాల ప్రధానమంత్రిత్వంలో భారతీయ ఓటర్లు మూడోసారి కూడా ఆయనకు దేశ పాలనాధికారాలను అప్పగించే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయన్న సూచనలు సైతం, మోదీ నాయకత్వం పట్ల ఆ మేధావుల ఆందోళనను తగ్గించినట్లు కనిపించడం లేదు.

రాహుల్‌గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్‌ను బీజేపీ మరోసారి చిత్తుగా ఓడించినట్లు జూన్ 4 ఫలితాలు స్పష్టం చేస్తే, విదేశాలలోని మోదీ విమర్శకులు, భారత దేశ ప్రతిపక్షంతో జట్టు కట్టి, మోదీ నేతృత్వంలోని బీజేపీ సాధించిన హ్యాట్రిక్ న్యాయబద్ధతను తప్పక ప్రశ్నిస్తారు. వారి విశాల లక్ష్యం భారతదేశ విజయగాథ గురించి వాణిజ్య ప్రపంచ దిగ్గజాలు, రాజకీయ నిర్ణయాల రూపకర్తల మనస్సులలో అనుమానాలను రేకెత్తించడమే. నిరంకుశ పాలకుడు అనే ముద్ర వేయడం ద్వారా మోదీని మరో మురికి వివాదంలోకి లాగడం కూడా వారి అసలు లక్ష్యం. పాశ్చాత్య భావజాలాల ప్రేరితులు, విశాల దృక్పథం గల వ్యక్తులు, ప్రగతిశీల, లౌకిక వాద భావ స్రవంతులతో ప్రభావితమైన విద్యాధికులతో కూడిన సుసంఘటిత బృందాలను కొందరు తరచు 'కాంగ్రెస్ వ్యవస్థ'గా అభివర్ణించడం కద్దు. అయితే ఈ వ్యవస్థ ప్రాభవం గతించిపోయింది. ఒకనాడు సర్వ శక్తిమంతులైన ఈ రాజకీయ, సామాజిక కులీనుల గురించి ఇటీవల జర్నలిస్ట్ తవ్లీన్‌సింగ్ పరిహాసపూర్వకంగా ఇలా రాశారు: 'నిజమేమిటంటే మనం ఏ భారతీయ భాషా మాట్లాడం. మన ఆంగ్ల భాషా ప్రావీణ్యానికి ఎంతగానో గర్విస్తాం. మనం నెహ్రూ – గాంధీ వంశానికి, దాని వారసులకు విధేయులం. ఎందుకంటే వారు పూర్తిగా మన లాంటివారే. పార్లమెంటు ఒక ప్రైవేట్ సభ్యుల క్లబ్‌గా మారిపోయింది. దీని గురించి మనమేమీ కలత చెందం. ఎందుకంటే అది మన క్లబ్. అవును, అది వారి క్లబ్. ఇతరులు ఆ క్లబ్‌లోకి రావడాన్ని వారు సహించరు. సహించక పోగా ద్వేషిస్తారు. నరేంద్ర మోదీ తమ ప్రధానమంత్రి అభ్యర్థి అని బీజేపీ ప్రకటించినప్పుడు మాజీ దౌత్యవేత్త, కాంగ్రెస్ ప్రముఖుడు మణి శంకర్ అయ్యర్ ఆయన్ని ఎలా ఎగతాళి చేశాడో గుర్తున్నదా? గుజరాత్‌కు వెళ్లి చాయ్ అమ్ముకోమని మోదీకి అయ్యర్ సూచించాడు. మోదీ సామాన్య మూలాలను అయ్యర్ అలా అపహసించాడు. కాంగ్రెస్ కులీనుల అభిజాత్యమది.

బీజేపీ ప్రభుత్వాలు గతంలో ఈ కులీన శ్రేణులను తమలో కలుపుకునేందుకు, వారి సుహృద్భావాన్ని పొందేందుకు ప్రయత్నించాయి. అయితే పెద్దగా సఫలం కాలేదు. మోదీ పూర్తిగా ఆ కులీన శ్రేణులకు చెందని, ప్రాంతీయ మూలాలు ఉన్న, భారతీయ భాషలు, స్థానిక సంస్కృతులతో మమేకమైన వారిపై పూర్తిగా ఆధారపడ్డారు. తన రాజకీయోన్నతికి వారినే ప్రధాన ఆలంబన చేసుకున్నారు. బీజేపీ ప్రోత్సహించిన ఈ జన శ్రేణులు తమ హిందూ అస్తిత్వానికి పరిపూర్ణంగా గర్వించే వ్యక్తులు తమ మత విశ్వాసాలు, తమ సాంస్కృతిక సంప్రదాయాలు కలగలసి పోవడంపై ఎలాంటి సంకోచాలు లేనివారు. హిందువులమని చెప్పుకోవడానికి కించిత్ కూడా భయపడనివారు. సుదీర్ఘకాలంగా తాము రాజకీయంగా అస్వతంత్రుల మయినందుకు కలవరపడుతున్నవారు. తొలుత విదేశీయులు, ఆ తరువాత ఆంగ్ల మానసపుత్రులైన కాంగ్రెస్ పాలనలో మగ్గిపోయినందుకు చింతిస్తూ ఆ బానిసత్వాన్ని పూర్తిగా వదిలించుకుని స్వతంత్ర వ్యక్తిత్వం, అస్తిత్వంతో వర్ధిల్లేందుకు చాలా కాలంగా వారు ఆరాటపడుతున్నారు. ఎట్టకేలకు వారి ఆరాటం నెరవేరింది. తమ హిందూ అస్తిత్వాన్ని వారు ఇప్పుడు సగర్వంగా ప్రకటించుకుంటున్నారు. దేశాన్ని అధికారికంగా 'ఇండియా' అని పిలిచే ఆనవాయితీకి స్వస్తి చెప్పి, మరింత ప్రామాణికమైన 'భారత్' అనే పేరును సకల సందర్భాలలోను వాడాలని ప్రభుత్వం నిర్ణయించడమే దేశ చరిత్రలో కాంగ్రెస్ కులీనేతర జనశ్రేణుల యుగం ఆరంభమయిందనడానికి ఒక తిరుగులేని నిదర్శనం. మోదీ నాయకత్వంలో భారత్ తన పాత (బానిసత్వ) చరిత్రకు చెల్లుచీటీ రాసి ఒక కొత్త చరిత్ర సృష్టికి పూనుకున్నది. తన కొత్త సంకల్పాన్ని అవిఘ్నంగా నెరవేర్చుకుంటున్నది. ఇండియా ఇప్పుడు భారత్, సర్వ శక్తిమంతమైన దేశం.



తొలుత విదేశీయులు, ఆ తరువాత ఆంగ్ల మానసపుత్రులైన కాంగ్రెస్ పాలనలో మగ్గిపోయినందుకు చింతిస్తూ ఆ బానిసత్వాన్ని పూర్తిగా వదిలించుకుని స్వతంత్ర వ్యక్తిత్వం, అస్తిత్వంతో వర్ధిల్లేందుకు చాలా కాలంగా ఆరాటపడిన ప్రజలు ఇప్పుడు తమ హిందూ అస్తిత్వాన్ని సగర్వంగా ప్రకటించుకుంటున్నారు. మోదీ నాయకత్వంలో భారత్ తన పాత (బానిసత్వ) చరిత్రకు చెల్లుచీటీ రాసి ఒక కొత్త చరిత్ర సృష్టికి పూనుకున్నది. ఇండియా ఇప్పుడు భారత్, సర్వ శక్తిమంతమైన దేశం.

మోదీ ప్రత్యర్థులలో కొంతమంది ఆయన్ని ఒక సంధికాల నేతగా మాత్రమే పరిగణించారు. కాంగ్రెస్ ప్రభుత్వాల స్వయంకృతాపరాధాల నుంచి లబ్ధి పొందిన వ్యక్తి అని భావించారు. అయితే వారు పూర్తిగా పొరపడ్డారు. 2014లో గుజరాత్ నుంచి జాతీయ రాజకీయాలకి ప్రవేశించి మధ్యాహ్న మార్తాండుడులా వెలుగొందుతున్న నరేంద్ర మోదీని ప్రజలు రెండు విధాలుగా చూశారు. దృఢ సంకల్పుడు, హిందువుల ప్రయోజనాలను పరిరక్షించడానికే ప్రథమ ప్రాధాన్యమిచ్చేనాయకుడుగాను; తన సొంత రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ నవీకరణ కార్యక్రమాన్ని పటిష్ఠంగా అమలుపరిచిన సమర్థ పరిపాలకుడుగా ఆయన్ని చూశారు. అప్పటికి ఆయన అఖిల భారత ప్రఖ్యాతి పొందిన నేత కాదు. ఆయనకు తొలుత మద్దతునిచ్చినవారు నిబద్ధులైన హిందూ జాతీయ వాదులు, వాణిజ్య వర్గాలు, ఉత్తర భారతావని, పశ్చిమ భారత రాష్ట్రాలలోని మధ్యతరగతి ప్రజలు. 2019 నాటికి మోదీ అద్వితీయుడైన జాతీయ నాయకుడుగా ప్రభవించారు తీవ్ర జాతీయవాదిగా పేరు పొందారు. ఆయన అమలుపరిచిన పేదల సంక్షేమ పథకాలు, పాలనా వ్యవస్థలో అవినీతిని రూపుమాపేందుకు చేపట్టిన చర్యలు రాజీపడని జాతీయవాది అనే ప్రతిష్ఠను మరింతగా ఇనుమడింపచేశాయి. 2019–24 సంవత్సరాల మధ్య మోదీ సంపూర్ణ జనప్రియ నేత స్థాయి నుంచి దేశ ప్రజలు పరిపూర్ణంగా ఆరాధించే నాయకుడుగా పరిణమించారు. ఇందుకు రెండు అంశాలు విశేషంగా తోడ్పడ్డాయి. అవి ఆయన రాజకీయ దక్షతకు అద్దం పట్టాయి. వాటిలో మొదటిది జమ్మూ–కశ్మీర్‌ను పూర్తిగా భారత్‌లో అంతర్భాగం చేస్తామని బీజేపీ దశాబ్దాలుగా చేస్తోన్న వాగ్దానాన్ని అమలుపరచడం. రెండోది అయోధ్యలో 16వ శతాబ్ది మసీదును కూల్చివేసిన స్థలంలో హిందూ ఆలయ నిర్మాణం. అయోధ్య శుభ పరిణామంతో మోదీ కీర్తి ప్రతిష్ఠలు పెరిగిపోయాయి. కేవలం ఒక రాజకీయ నాయకుడుగా కంటే అంతకుమించి మరెంతో సమున్నతమైన గౌరవ భావంతో దేశ ప్రజలు ఆయన్ని చూడసాగారు. జాతి ప్రశస్తికి ఒక ప్రతీకగా మోదీ వెలుగొందసాగారు.

మోదీ ప్రభవించకముందు భారతీయులు వైయక్తికంగా విజయ శిఖరాలను అధిరోహించినప్పటికీ భారత్ అనేక విధాల వెనుకబడిన దేశంగా ఉండిపోయింది. భారతీయులు భారత్ ఉన్నతికి, భారత్ తన ప్రజల సమున్నతికి పరస్పరం దోహదం చేసుకునే సానుకూల పరిస్థితులను మోదీ సృష్టించారు. 2047లో స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల శుభతరుణం నాటికి భారత్‌ను ప్రపంచ అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధిపరచాలనే దృఢసంకల్పం యావత్ భారతీయులలోను నెలకొల్పడంతో మోదీ పూర్తిగా సఫలమయ్యారు. ఈ అచంచల ఆశాభావంతోనే వర్తమాన భారత్ ప్రస్థానం సాగుతోంది. దేశీయంగా సకల రంగాలలో సాధిస్తున్న అభివృద్ధి అంతర్జాతీయ సమాజంలో భారత్‌కు ఒక సమున్నత స్థానాన్ని సమకూర్చింది. న్యూఢిల్లీలో ప్రతిష్ఠాత్మక జి–20 శిఖరాగ్ర సదస్సు సంపూర్ణంగా విజయవంతం కావడమే అందుకు నిదర్శనం. రాబోయే దశాబ్దాలు ఆసియావే అని, తద్వారా భవిష్యత్తు భారత్‌దే అన్న సందేశాన్ని ఆ శిఖరాగ్ర సదస్సు ద్వారా యావత్ప్రపంచానికి మోదీ పంపించారు. నెహ్రూ హయాంలో భారత్ ఆర్థికంగా చాలా బలహీనంగా ఉండేది. అయితే అంతర్జాతీయ వ్యవహారాలలో భారత్ ఒక ఉత్కృష్ట పాత్రను నిర్వర్తించడం వల్ల ఆ ఆర్థిక దుర్బలత్వం కనిపించకుండా పోయింది. అలీన విధానం నెహ్రూ రాజనీతి మంత్రం. అయితే జాతీయ ప్రయోజనాల పరిరక్షకుడుగా, విదేశాలలోని భారతీయ పౌరుల సంరక్షకుడుగా వ్యవహరించడం ద్వారా మోదీ తన దేశానికి, తనకు ఎనలేని పేరు ప్రతిష్ఠలు సమకూర్చారు. వివిధ దేశాలలో ఆపత్కర సంఘటనలు సంభవించినప్పుడు అక్కడి భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడంలో మోదీ చూపిన శ్రద్ధాసక్తులు ఆయనకు ప్రజాదరాన్ని అపారంగా పెంచాయి. భారతీయ పాస్‌పోర్ట్‌కు మున్నెన్నడూ లేని ప్రతిష్ఠను మోదీ సమకూర్చారనడంలో అతిశయోక్తి ఏ మాత్రం లేదు.

స్వాతంత్ర్యోద్యమ కాలంలో గాంధీని దేశ ప్రజలు మహాత్ముడుగా గౌరవించారు. ఆధునికతావాదులు గుర్తించకపోయినప్పటికీ గాంధీలో వలే మోదీలో కూడా రుషిత్వం ఉన్నది. మహిళలకు సాధికారత కల్పించడం, గిరిజనులకు దేశ రాజకీయాలు, పాలనా రంగంలో సమున్నత స్థానం కల్పించడం, అవినీతి రహిత భారత్ కోసం రాజీలేని పోరాటం చేయడం ద్వారా మోదీ తనకు సొంత అభిమానుల సంఘాన్ని సృష్టించుకున్నారు. ఇంతవరకు సంఘటిత రాజకీయాలకు వెలుపలే ఉండిపోయిన సామాజిక సముదాయాలవారందరూ మోదీకి ప్రగాఢ అభిమానులు అయ్యారనడంలో సందేహం లేదు. 2024 సార్వత్రిక ఎన్నికలు నరేంద్రమోదీ నాయకత్వానికి సంబంధించినవే. ఒక మోదీ వీచిక, ఒక మోదీ హవా, ఒక మోదీ సునామీ ఈ ఎన్నికలను ప్రభావితం చేసిందా లేదా అన్న విషయాన్ని జూన్ 4న వెలువడే ఫలితాలు నిర్ధారిస్తాయి.

▪ స్వపన్‌దాస్ గుప్తా
జర్నలిస్ట్, రచయిత, మాజీ ఎంపీ

('న్యూయార్క్ టైమ్స్' స్వయంగా కోరి రాయించుకుని, ఆ తరువాత ప్రచురణకు తిరస్కరించిన వ్యాసానికి సంక్షిప్త అనువాదం ఇది. 'ఫస్ట్ పోస్ట్' సౌజన్యం)

ఎన్నికల చాటువులు



మేనిఫెస్టో జూసి మేలు కలుగు నంచు
పసిడి కలలు కన్నఫలిత మేమి?
తంబ నైలు గాంచి తాపత్రయపడితే
దిమ్మ దిరిగి పోవు బొమ్మగనిన!

పోటు గాడనుకొనినమ్మి ఓటు వేస్తె
పచ్చి శృంగార కీలగా ప్రజ్వలించి
కామ తృష్ణ పరమహింస కాండ జరిపి
పార్లమెంటు శీలమ్మును భంగపరిచె.

తనిఖీతనిఖీ యందు దర్శనంబిచ్చును
వేల కోట్ల నగదు విస్తు పోగ
పేద దేశమన్న బేవర్సుయెవ్వడు?
ఎన్నికల సమయమునెంతొ 'రిచ్చి'.

మైకు లదిరిపోయె మాటల బాంబులు
కొసరి కొసరి నేత విసురు చుండు
గెలుపు పొందు వరకు 'పలుకుల్లో కేసరి'
పిదప చేత లందు పిల్లి యగును.

చట్ట బద్ధమైన చందాల మేతకు
రాసు కున్నకుటిల శాసనమ్ము
ఖచ్చితముగఎన్నికల బాండ్ల పథకమ్ము
క్విడ్ప్రోకు నడుచు దొడ్డి దారి.

పెను ప్రమాదమైన మనువాద సర్పాలు
కసిగ ఏలు బడిలొ బుసలు కొట్టు
రాజకీయ వలలొ రాజ్యాంగవిలువలు
దిక్కు మొక్కు లేక చిక్కు కొనియె.

మంది ఓట్ల కొరకు మలిన ప్రసంగాల
మనుషుల విభజించు, మతము పేర
కాల కూట విషము కాలువై ప్రవహించి
చేరి యుండె నేత నోరు నిండ.

ఎన్నికలప్రచార మింకముగిసినంత
తాయి లాల దండ, రేయి పగలు,
నిక్కువముగ పరమ నిశ్శబ్ద కుట్రలు
సలుపు చుండు విధిగ గెలుపు కొరకు.

కుహన నాయకులను గుడ్డిగా నమ్ముచు
ఓటు వేసినంత చేటు కలుగు
వేప విత్తనమ్ము వేసిన మట్టిలో
మామిడితరువెట్లు మనకు దక్కు.

తల్లితండ్రి గురువు తత్త్వమ్ములొకటిగా
పోత పోసుకున్న నేత నెంచి
ఓటు వేయు నట్టి ఓటరే నిజముగా
యుక్తి యున్నదేశ భక్తుడిపుడు.

– కోయి కోటేశ్వరరావు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

ప్రజల కంటే వారికి తమపైనే ఎక్కువ ప్రేమ!

నార్సిసెస్... గ్రీకు పురాణాల్లో ఒక పాత్ర. తనను తాను ప్రేమించుకోవడమే అతని పని. ఎంతలా ప్రేమించుకునేవాడంటే ఇతర వ్యక్తులు ఎదురైనప్పుడు వారి కళ్లలో తన ముఖాన్ని చూసి మురిసిపోతుండేవాడు. ఒకరోజు ఒక నీటి గుంటలో తన ప్రతిబింబాన్ని చూస్తూ మైమరచిపోతూ ఆ బింబాన్ని ముద్దాడాలనుకునే క్రమంలో అదే గుంటలో పడి ప్రాణాలు కోల్పోయాడు. తమను తాము అతిగా ప్రేమించుకోవడం నార్సిజం అనే మానసిక వ్యాధిగా ఆ తర్వాత ప్రసిద్ధిలోకి వచ్చింది. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల వేళ ప్రచార ధోరణి చూస్తే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నార్సిజంతో బాధపడుతున్నారనేది స్పష్టంగా అర్థమవుతోంది.

పదేళ్ల పాటు ప్రధానమంత్రిగా ఉన్న మోదీ ఇప్పుడు తన పార్టీని, పదేళ్ల తన ప్రభుత్వాన్ని పక్కన పెట్టి తనను చూడాలని, భవిష్యత్‌కు తాను గ్యారెంటీ ఇస్తున్నానని ప్రచారం చేసుకోవడం ఎబ్బెట్టుగా ఉంది. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండగా పంటలకు కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ) కల్పించాలని నాటి కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాశారు. తాను ప్రధానమంత్రి అయిన తర్వాత ఆ ఊసే మర్చిపోయారు. మద్దతు ధర కోసం ఉద్యమించిన రైతులను దేశ రాజధాని ఢిల్లీలోకి రానివ్వకుండా ఇనుప కంచెలు, వాటర్ క్యానన్లతో అడ్డుకున్నారు. గిట్టుబాటు ధర కల్పించమని అడిగిన పాపానికి రైతులపై ఖలిస్థాన్ ఉగ్రవాదులనే ముద్ర వేసి వేధించారు. రైతుల తర్వాత ఈ దేశంలో అత్యధికులు కార్మికులు. ఈ కార్మిక హక్కులను కాలరాసే చట్టాలను మోదీ ప్రభుత్వం చేసింది. కరోనా కాలంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న వలస కార్మికులు వెళ్లేందుకు కనీసం వాహనాలను ఏర్పాటు చేయని క్రూరత్వం మోదీది. పదేళ్లలో ఒక బహుళార్థ సాధక ప్రాజెక్టును గానీ, ఒక ఉన్నత విద్యా సంస్థను గానీ, ఒక ప్రభుత్వ రంగ సంస్థను గానీ మోదీ హయాంలో ఏర్పాటు చేయలేదు. గత ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వ రంగ సంస్థలను తన దగ్గరి వ్యక్తులైన బడా పెట్టుబడిదారులకు కట్టబెట్టడం, బ్యాంకుల నుంచి వేల కోట్ల రూపాయల రుణాలు తీసుకొని దేశం విడిచి వెళ్లిన బడా బాబులకు రక్షణగా నిలవడం, వాళ్ల అప్పులు మాఫీ చేయడం, ఎన్నికల బాండ్ల రూపంలో వేల కోట్ల రూపాయలను తన పార్టీకి సమకూర్చుకోవడం, కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ ఈడీ ఐటీ వంటి వాటిని వేట కుక్కల్లా మార్చి ప్రతిపక్ష పార్టీల నేతలను వేటాడడం, వారిలో బలమైన నేతలను బీజేపీలో చేర్చుకొని వారి కేసులు మూసి వేయడమో దర్యాప్తు నిలిపివేయడమో చేయడం, ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను కూలదోయడం కోసం ఆయా పార్టీల ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం, రాష్ట్రాల్లో కుల మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవడమే ఈ పదేళ్లలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సాధించిన విజయాలు.

మోదీ తనను తాను ఎంతగా ప్రేమించుకుంటూ ప్రచారం చేయించుకుంటారంటే ఏకంగా ఆయన రష్యా– ఉక్రెయిన్ యుద్ధాన్ని కొంతసేపు ఆపించి మన దేశస్థులను తరలించుకువచ్చారని బీజేపీ నేతలు నిత్యం చెప్పేంతలా! రష్యా ఉక్రెయిన్ల మధ్య యుద్ధాన్ని ఆపించిన వ్యక్తి మణిపూర్‌లో వందలాది మంది హత్యలకు గురవుతుంటే, వేలాది మంది మహిళల మానభంగాలకు గురవుతుంటే ఎందుకు పట్టించుకోరంటే సమాధానం ఉండదు. మంత్రి పదవుల కేటాయింపు మొదలు నిధుల విడుదల వరకు ప్రతి విషయంలో వివిధ రాష్ట్రాల మధ్య వివక్ష చూపిన ప్రధానమంత్రి బహుశా మోదీ ఒక్కరే కావచ్చు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణకు రావల్సిన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, వెనుకబడిన జిల్లాలకు నిధుల విడుదల, ఉన్నత విద్యా సంస్థల ఏర్పాటు ఇలా ప్రతి అంశంలోనూ మోదీ తెలంగాణపై వివక్ష చూపారు. పదే పదే తల్లిని చంపి బిడ్డను బతికించారంటూ తెలంగాణపై తన అక్కసు వెళ్లగక్కారు. పదేళ్ల పాటు ఏం పని చేయని మోదీ తనను చూసి ఈసారి 400 సీట్లు ఇవ్వాలని ప్రజలను కోరుతున్నారు. కేవలం రాజ్యాంగాన్ని మార్చివేసేందుకు, రాజ్యాంగ ఫలాలు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు దక్కకుండా చూసేందుకే 400 సీట్లను ఆయన కోరుకుంటున్నారు. జనాభా లెక్కలు చేపడితే కుల గణన చేయాల్సి వస్తుందని, కుల గణన చేస్తే ఆయా వర్గాలు తమ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కోరతాయనే ఆలోచనతో జనాభా లెక్కల సేకరణనే నిలిపి వేశారు.

భావోద్వేగాలు, భజనను నమ్ముకొని నార్సిజంతో బాధపడుతున్న మోదీ, కేసీఆర్ ఒకవైపు: ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో వైపు ఇప్పుడు నిలిచి ఉన్నారు. దేశ భవిష్యత్‌ను మార్చివేసే కీలకమైన లోక్‌సభ ఎన్నికల వేళ విజ్ఞులైన తెలంగాణ ప్రజలు సరైన నిర్ణయం తీసుకోవాలి.



ఆయనను మించిన ఘనుడు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్. మితిమీరిన నియంతృత్వం, అహంకారంతో ఒక చక్రవర్తిలా పాలన సాగించారు. రాజప్రసాదం లాంటి ఇల్లు కట్టుకొని అందులో విలాస జీవనం సాగిస్తూ పోలీసు రాజ్యాన్ని నడిపించారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు అవినీతి వ్యవహారాల్లో మునిగితేలారు. కేసీఆర్ తీరును సహించని తెలంగాణ ప్రజలు ఆయన పార్టీని ఓడించి కేసీఆర్‌ను ఇంటికి పరిమితం చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన మరుక్షణం నుంచే కేసీఆర్ విషం చిమ్మడం ప్రారంభించారు. కేసీఆర్ అవినీతితోనే మేడిగడ్డ బ్యారేజీ కూలిపోయింది. అధికారంలో ఉన్నప్పుడు తానే ఆ ప్రాజెక్టు డిజైన్ చేశానని, అందుకోసం తన మేధస్సును కరిగించానని డబ్బా కొట్టుకున్న కేసీఆర్ అది కూలిన తర్వాత, తన పదవీ పోయిన తర్వాత తనకు ఇంజినీరింగ్‌లో ఏం తెలియదని చెప్పుకొచ్చారు. ఫోన్ ట్యాపింగ్‌లు, పోలీసు వేధింపులతో పాలన సాగించిన కేసీఆర్ ఇప్పుడు తన హయాం స్వర్ణ యుగమని చెప్పుకుంటున్నారు. తాను తప్ప ఎవరూ పరిపాలించలేరని, తానొక్కడినే సమర్థుడినని, తన హయాంలో కరెంటు క్షణం పాటు పోలేదని గప్పాలు కొడుతున్నారు. కేసీఆర్ స్వీయ పొగడ్తలు ఎంతవరకు వెళ్లాయంటే తానే తెలంగాణ జాతిపితనని, తానే తెలంగాణ.. తెలంగాణే తాను అని ప్రచారం చేయించుకుంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అవినీతితో సంపాదించిన రూ.వేల కోట్లను ఇప్పుడు యూట్యూబ్ ఛానెళ్లకు, వెబ్‌సైట్లకు, సొంత మనుషుల ఆధ్వర్యంలో నడుస్తున్న ఛానెళ్లకు వెచ్చించి భజనను పతాక స్థాయికి తీసుకెళుతున్నారు.

మరోవైపు రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే వేలాది ఉద్యోగ నియామకాలు చేపట్టడంతో పాటు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సరఫరా, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.పది లక్షలకు పెంపు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి కార్యక్రమాలు ప్రారంభించింది. రైతుబంధు దాదాపు రైతులందరికీ అందించింది. ఆగస్టు 15లోపు రూ2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢంకాపథంగా చెబుతున్నారు.

భావోద్వేగాలు, భజనను నమ్ముకొని నార్సిజంతో బాధపడుతున్న మోదీ, కేసీఆర్ ఒకవైపు; ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో వైపు ఇప్పుడు నిలిచి ఉన్నారు. దేశ భవిష్యత్‌ను మార్చివేసే కీలకమైన లోక్‌సభ ఎన్నికల వేళ విజ్ఞులైన తెలంగాణ ప్రజలు సరైన నిర్ణయం తీసుకోవాలి.

◆ సత్తు మల్లేశ్
టీపీసీసీ జనరల్ సెక్రటరీ

www.andhrajyothy.com


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru












క్యాన్సర్ బాధితుడికి ఆపన్నహస్తాలు

- సాయిచరణ్‌కు సీఎంవో, ఆరోగ్యశ్రీ ట్రస్ట్, దాతల అండ
- తెలుగు రాష్ట్రాల ప్రజల నుంచి అందిన ఆర్థిక చేయూత
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి విశేష స్పందన

సిద్దిపేట టౌన్, మే10: ప్రాణాంతక అక్యూట్ మైలాయిడ్ లుకేమియా (బ్లడ్ క్యాన్సర్)తో బాధపడుతున్న సిద్దిపేటకు చెందిన సాయిచరణ్(35)కు అండగా నిలిచేందుకు పలువురు దాతలతోపాటు ప్రభుత్వం కూడా ముందుకొచ్చింది. 'మా నాన్నను బతికించండి' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. శుక్రవారం సాయంత్రం వరకు దాతల ద్వారా తమకు రూ.2.75 లక్షలు అందాయని సాయిచరణ్ కుటుంబసభ్యులు తెలిపారు. ఆర్థిక సాయం చేసిన వారిలో ఏపీలోని వైజాగ్‌కు చెందిన ఓ వృద్ధురాలు(75) కూడా ఉన్నారని చెప్పారు. అలాగే, 'ఆంధ్రజ్యోతి'లో కథనాన్ని చూసి తెలంగాణ సీఎంవో, ఆరోగ్య శ్రీ ట్రస్ట్ కూడా స్పందించాయి. చికిత్స విషయం మాట్లాడేందుకు ఈ నెల 14న సాయిచరణ్‌తో వచ్చి కలవాలని సీఎంవో కార్యాలయ ఓఎస్డీ తమతో ఫోన్‌లో చెప్పారని సాయిచరణ్ కుటుంబ సభ్యులు తెలిపారు. సాయమందించిన దాతలకు, ఆంధ్రజ్యోతికి సాయిచరణ్ కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. కాగా, బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న సాయిచరణ్‌కు స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ నిర్వహించాల్సి ఉంది. ఇందుకు రూ.25 లక్షలు అవసరం. చికిత్సలో భాగంగా తన తండ్రి రక్తమూల కణాలను సాయిచరణ్‌కు ఎక్కిస్తారు. ఇది విజయవంతమైతే ఏడాదిన్నరలోగా 90 శాతం క్యాన్సర్ నయమవుతుందని వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో సాయిచరణ్‌కు వీలైనంత త్వరగా సాయం అందాల్సి ఉంది.



చార్‌ధామ్ యాత్ర ప్రారంభం

డెహ్రాడూన్, మే 10: హిందువులు అత్యంత పవిత్రంగా భావించే చార్‌ధామ్ యాత్ర శుక్రవారం ప్రారంభమైంది. శీతాకాలం కావడంతో ఆరు నెలలుగా మూతపడిన గంగోత్రి,యమునోత్రి, కేదార్‌నాథ్ క్షేత్రాలు ఆనవాయితి ప్రకారం అక్షయ తృతీయ నాడు తెరుచుకున్నాయి. కేదార్‌నాథ్ క్షేత్రంలో అట్టహాసంగా పూజలు ప్రారంభమయ్యాయి. 20క్వింటాళ్ల పూలతో ఆలయాన్ని అలంకరించడంతోపాటు వేలాది మంది భక్తులపై హెలికాప్టర్ నుంచి పూల వర్షం కురిపించారు. కాగా, ప్రారంభ పూజలో ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామీ పాల్గొన్నారు. అసోం సీఎం హిమంతబిశ్వశర్మ భార్య రినికి భుయాన్ శర్మ అతిథిగా విచ్చేశారు.

యాదాద్రి థర్మల్ ప్లాంట్‌కు పర్యావరణ అనుమతి

హైదరాబాద్, మే10 (ఆంధ్రజ్యోతి): నాలుగువేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపీఎస్)కు పర్యావరణ అనుమతిస్తూ కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ నిర్ణయం తీసుకుంది. గత ఏప్రిల్ 5న నిపుణుల మదింపు కమిటీ (ఈఏసీ) సమావేశమై పర్యావరణ అనుమతి ఇవ్వాలని కేంద్రానికి సిఫారసు చేసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 7న పర్యావరణ అనుమతిస్తూ జెన్‌కోకు కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ సమాచారమిచ్చింది. దీంతో శుక్రవారం జెన్‌కో పబ్లిక్ నోటీసు ఇచ్చింది. నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో 2800 ఎకరాల్లో 4 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్ ప్లాంట్ నిర్మాణాన్ని 2017 అక్టోబరు 17న తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించింది. అయితే దీనికిచ్చిన పర్యావరణ అనుమతిని సస్పెండ్ చేస్తూ.. తాజా అనుమతి కోసం టర్మ్స్ అండ్ రిఫరెన్స్(టీవోఆర్)ను జారీ చేయాలని ఎన్జీటీ నిర్దేశించింది. దీంతో టీవోఆర్ ప్రకారం బహిరంగ విచారణ చేపట్టి, ఎన్జీటీ నిర్దేశించిన లాంఛనాలను పూర్తి చేసి పర్యావరణ అనుమతి కోసం జెన్‌కో దరఖాస్తు చేసింది. దీంతో నిపుణుల మదింపు కమిటీ పర్యావరణ అనుమతివ్వాలని కేంద్రానికి సిఫారసు చేసింది. తాజాగా పర్యావరణ అనుమతి లభించడంతో నిర్మాణ ప్రక్రియ ఊపందుకోనుంది. 4 వేల మెగావాట్ల సామర్థ్యం ఉన్న ప్లాంట్‌లో తొలి, రెండో యూనిట్ల (ఒక్కోటి 800 మెగావాట్లు)లో ఈ ఏడాది అక్టోబరులో ఉత్పత్తిని ప్రారంభించాలని జెన్‌కో లక్ష్యంగా పెట్టుకుంది. మూడో యూనిట్‌ను 2025 మార్చిలో, నాలుగో యూనిట్‌ను అదే ఏడాది డిసెంబరులో, ఐదో యూనిట్‌ను 2026 ఫిబ్రవరిలో అందుబాటులోకి తేవాలనుకుంటున్నారు. ఇక ఎన్జీటీ తీర్పుతో తాజాగా జెన్‌కోలో ప్రత్యేకంగా పర్యావరణ పర్యవేక్షణ సెల్‌ను ఏర్పాటు చేశారు. తాజాగా ఈసీ సిఫారసు కోసం ఈఏసీ విధించిన షరతుల అమలును ఈ సెల్ పర్యవేక్షించనుంది.

తగ్గుతున్న జింకలు.. దుప్పుల సంఖ్య!


- ఐదేళ్ల కిందట 10 వేలకు పైగానే
- ఇప్పుడు సగం కంటే తక్కువే..
- చిరుతలకు ఇవే ప్రధాన ఆహారం
- అవి దొరక్క జనావాసాల్లోకి వచ్చి పెంపుడు జంతువులపై దాడులు



హైదరాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అడవులు పలుచబడుతుండటంతో జింకలు, దుప్పుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. ఐదేళ్ల కిందట 10 వేలకు పైగా ఉన్న వీటి సంఖ్య.. ప్రస్తుతం సగానికి పైగా తగ్గిందని అటవీ శాఖ ఆందోళన చెందుతోంది. 'చెట్ల నరికివేత, పోడు వ్యవసాయం, ఆక్రమణలతో అడవులు అంతరించిపోతున్నాయి. దీంతో జింకలు, దుప్పులు, ఇతర వన్యప్రాణులకు రక్షణ లేకుండా పోతోంది. వాటికి ఆవాసం, ఆహారమూ కరువవుతోంది. తాగునీటి కొరత తీవ్రంగా ఉంది. చెట్ల నరికివేతతో అడవుల్లో ఏర్పడుతున్న అలజడితో ఇతర ప్రాంతాలకు వెళ్తూ జింకలు, దుప్పులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నాయి. రోడ్లు దాటుతూ ప్రమాదాల బారిన పడి కొన్ని.. తాగునీటి కోసం గ్రామాల వైపు వచ్చి వీధి కుక్కల బారిన పడి మరికొన్ని మృతి చెందుతున్నాయి. ఇక అక్కడక్కడ వేటగాళ్ల చేతిలో బలవుతున్నాయి' అని అటవీ అధికారులు చెబుతున్నారు. వికారాబాద్, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, మెదక్, నిజామాబాద్, నల్లగొండ, కరీంనగర్ తదితర జిల్లాల్లో జింకలు, దుప్పుల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతోందని వాపోతున్నారు.

జనావాసాల్లోకి చిరుతలు..

ఇటు చిరుతలకు ప్రధాన ఆహారం జింకలు, దుప్పులే కావడంతో.. అడవుల్లో అవి కనిపించక జనావాసాల్లోకి చొరబడి పెంపుడు జంతువులపై దాడులు చేస్తున్న ఘటనలు పెరిగిపోతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో నారాయణపేట, వనపర్తి జిల్లాల్లో ఓ చిరుత సంచారంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అదే నెలలో వికారాబాద్ జిల్లాలోని తాండూరు, యాలాల్, అనంతగిరి ప్రాంతాల్లో చిరుత పులి సంచరించడంతో అక్కడి రైతులు బెంబెలెత్తిపోయారు. చివరకు పూడూరు మండలం దామగుండం అడవిలోకి వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. నల్లగొండ జిల్లాలోనూ ఓ చిరుత సంచారంతో వారం పాటు అక్కడి రైతులు, కూలీలు వ్యవసాయ పనులకు వెళ్లేందుకు భయపడిపోయారు. జగిత్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో చిరుతల సంచారం ఎక్కువగానే ఉంది. ఇటీవల ఓ చిరుత ఏకంగా రంగారెడ్డి జిల్లా శంషాబాద్ విమానాశ్రయంలోకి వచ్చింది. నాలుగు రోజుల పాటు అక్కడక్కడే సంచరించి అటవీ అధికారులు, స్థానికులకు కంటిపై కునుకు లేకుండా చేసింది. అటవీ అధికారులు, ఎయిర్‌పోర్టు భద్రతా సిబ్బంది సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టి చివరకు పట్టుకున్నారు. మెదక్ జిల్లా చేగుంట మండలంలో మరో చిరుత సంచరించి అక్కడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. తాజాగా నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలో ఓ చిరుత బోనుకు చిక్కగా.. దాన్ని అమ్రాబాద్ అడవులకు తరలించారు. అడవి దాటుతున్న చిరుతల్లో పంటల చుట్టూ వేసిన విద్యుత్తు కంచెలకు తగిలి కొన్ని.. వేటగాళ్ల ఉచ్చులకు మరికొన్ని బలవుతున్న సందర్భాలూ ఉన్నాయి.



ఇంజన్‌కు నిర్వహిస్తున్న హాట్ టెస్ట్; ఇస్రో రూపొందించిన కొత్త ఇంజన్

లిక్విడ్ రాకెట్ ఇంజన్ తుది పరీక్ష విజయవంతం

సూళ్లూరుపేట, మే 10: పీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగాల కోసం కొత్త టెక్నాలజీతో అభివృద్ధి చేసిన లిక్విడ్ రాకెట్ ఇంజన్‌కు తుది పరీక్షను ఇస్రో విజయవంతంగా నిర్వహించింది. తమిళనాడులోని మహేంద్రగిరిలో ఉన్న ఇస్రో ప్రొపల్షన్ సెంటర్‌లో ఈ లిక్విడ్ రాకెట్ ఇంజన్‌కు ఈ నెల 9న హాట్ టెస్ట్ నిర్వహించినట్టు ఇస్రో శుక్రవారం వెల్లడించింది. పీఎస్ఎల్వీ రాకెట్ నాలుగో దశలో ఈ లిక్విడ్ ఇంజన్‌ను ఉపయోగిస్తారు. దీన్ని అడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్ (ఏఎం) టెక్నాలజీ సాయంతో రూపొందించారు. హాట్ టెస్ట్ సందర్భంగా ఈ ఇంజన్‌లోని లిక్విడ్‌ను 665 సెకన్ల పాటు మండించారు. ఆ క్రమంలో ఇంజన్ పనితీరు అద్భుతంగా ఉందని గుర్తించారు. ఈ పరీక్ష విజయవంతం కావడంతో లిక్విడ్ ఇంజన్ తయారీలో ఇస్రో మరో కీలక ముందడుగు వేసినట్టయింది. ఈ విధానం వల్ల ఇంజన్ బరువు తగ్గడమే కాకుండా రూపకల్పన కూడా సులువుగా ఉంటుందని ఇస్రో శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కొత్త ఇంజన్‌ను తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ నుంచి ప్రయోగించే పీఎస్ఎల్వీ రాకెట్‌లో వినియోగించేందుకు శాస్త్రవేత్తలు సన్నద్ధమవుతున్నారు.



జైలు నుంచి విడుదలైన మన్నె క్రిశాంక్‌తో బీఆర్ఎస్ లీగల్ టీం

బెయిల్‌పై క్రిశాంక్ విడుదల

హైదరాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని హాస్టళ్లు, మెస్ మూసివేతపై నకిలీ సర్క్యులర్ వైరల్ చేసిన కేసులో అరెస్టు అయిన బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ బెయిల్‌పై విడుదలయ్యారు. చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో విచారణ ఖైదీగా ఉన్న క్రిశాంక్ కు న్యాయస్థానం షరతులో కూడిన బెయిర్ మంజూరు చేసింది. దీంతో క్రిశాంక్ శుక్రవారం సాయంత్రం జైలు నుంచి విడుదలయ్యారు. ఓయూ పోలీసులు క్రిశాంక్‌ను మే1న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టు అనుమతితో క్రిశాంక్‌ను ఆదివారం ఒక్క రోజు కస్టడీకి తీసుకుని విచారించారు. పోలీస్ కస్టడీ ముగియడంతో క్రిశాంక్ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. కాగా, పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో తాను పాల్గొనకూడదనే రాష్ట్ర ప్రభుత్వం తన అరెస్టు చేయించిందని జైలు నుంచి విడుదలైన తర్వాత క్రిశాంక్ ఆరోపించారు.

ప్రభాకర్‌రావుపై అరెస్టు వారెంట్

- అజ్ఞాతంలో ఉన్న శ్రవణ్ కుమార్‌పై కూడా
- ఫోన్ ట్యాపింగ్ కేసులో ఉత్తర్వులు జారీ చేసిన నాంపల్లి కోర్టు
- విదేశాల్లో తలదాచుకుంటున్న ప్రభాకర్‌రావు
- రప్పించేందుకు ఇంటర్‌పోల్ ద్వారా రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయించడానికి అధికారుల యత్నం
- ప్రణీత్‌రావు అండ్ టీంపై మరిన్ని కేసులు



హైదరాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్, ఎస్ఐబీ ప్రధాన కార్యాలయంలో హార్డ్ డిస్క్‌ల విధ్వంసం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు అరెస్ట్‌కు వారెంట్ జారీ అయింది. ప్రభాకర్‌రావుతో పాటు మరో కీలక నిందితుడు శ్రవణ్‌కుమార్‌పై కూడా నాంపల్లి కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఈ ఇద్దరిపై సీఆర్‌పీసీ సెక్షన్-73 కింద అరెస్ట్ వారెంట్ జారీ చేయాలని కోరుతూ దర్యాప్తు అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన నాంపల్లి కోర్టు.. ప్రభాకర్‌రావు, శ్రవణ్‌పై అరెస్ట్ వారెంట్ జారీ చేస్తు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసు వెలుగులోకి వచ్చినప్పటి నుంచి ప్రభాకర్‌రావు అజ్ఞాతంలోకి వెళ్లారు. విదేశాల్లో తలదాచుకొంటున్నారు. మరోవైపు ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టైన నిందితులు ఇచ్చిన వాంగ్మూలాలు, దర్యాప్తులో లభించిన ఆధారాల మేరకు ట్యాపింగ్ వ్యవహారంలో ప్రభాకర్‌రావు కీలకంగా వ్యవహరించినట్లు అధికారులు గుర్తించారు. విదేశాల్లో ఉన్న ప్రభాకర్‌రావును భారత్‌కు రప్పించి అరెస్ట్ చేసి విచారిస్తేనే కేసు కొలిక్కి వస్తుందని భావిస్తున్నారు. ఈ కేసులో ప్రభాకర్‌రావుపై హైదరాబాద్ పోలీసులు ఇప్పటికే లుక్ ఔట్ నోటీసులు జారీ చేశారు. ఆయన్ను విదేశాల నుంచి రప్పించేందుకు దర్యాప్తు అధికారులు సీబీఐ ద్వారా ఇంటర్‌పోల్ సహకారంతో రెడ్‌కార్నర్ నోటీస్ జారీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉండగా, ఫోన్ ట్యాపింగ్‌కు సహకారం అందించిన ప్రైవేటు వ్యక్తి శ్రవణ్‌పై అరెస్ట్ వారెంట్ జారీ కావడంతో అతన్ని పట్టుకునేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం సమాయత్తమవుతోంది. ట్యాపింగ్ పరికరాలను ఇజ్రాయెల్ నుంచి కొనుగోలు చేయడంలో శ్రవణ్ కీలకంగా వ్యవహరించినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ట్యాపింగ్ కేసులో ఇప్పటికే నలుగురు పోలీస్ అధికారులను దర్యాప్తు బృందం అరెస్ట్ చేసింది. సుమారు 40 మందికి పైగా పోలీస్ అధికారులు, సిబ్బందిని విచారించి వారి వాంగ్మూలాలను రికార్డు చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదులు

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రభాకర్‌రావు నేతృత్వంలో పనిచేసిన ప్రణీత్‌రావు అండ్ టీంపై మరిన్ని కేసులు నమోదయ్యాయి. ఎస్ఐబీ అడిషనల్ ఎస్పీ రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంజగుట్ట పోలీసులు ఓ కేసు నమోదు చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ హోదాలో రాధాకిషన్‌రావు ఇబ్బందులకు గురిచేశారని పోలీసులకు మరో ఫిర్యాదు అందింది. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా పలువురు రాజకీయ నాయకులు, ఇతరులు ఫోన్ ట్యాపింగ్‌పై పోలీసులకు ఫిర్యాదులు చేశారు. ఇవి కాకుండా కేసు దర్యాప్తులో భాగంగా గత ప్రభుత్వ హయాంలో ప్రణీత్ రావు అండ్ టీం ట్యాపింగ్ చేసిన ఫోన్ నెంబర్ల వివరాలను సేకరించిన దర్యాప్తు అధికారులు వారిని విచారిస్తున్నారు. ఎవరైనా అప్పుడు ట్యాపింగ్ వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నామని చెబితే వారి నుంచి విడిగా ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసే పనిలో ఉన్నారు. ఒకే అంశానికి సంబంధించి ఎక్కువ సంఖ్యలో కేసులు నమోదు చేయడం వల్ల నిందితులపై మరింత బలంగా అభియోగాలు మోపి న్యాయస్థానంలో వారికి చట్టప్రకారం కఠిన శిక్షలు పడేలా దర్యాప్తు అధికారులు చర్యలు చేపట్టారు.


ఉన్నతాధికారుల్లో ఆందోళన

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ప్రస్తుత ప్రభుత్వంలో కీలక విభాగాలకు అధిపతులుగా వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులను భయపెడుతోంది. ఇంటెలిజెన్స్ చీఫ్, డీజీపీ, హైదరాబాద్ సీపీ, హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఇలా... వివిధ స్థాయిల్లో నిర్ణయాలు, అనుమతుల మేరకు ట్యాపింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో అంతా నిబంధనల మేరకే జరిగినా, ప్రభాకర్‌రావు నేతృత్వంలో పనిచేసిన ప్రణీత్ రావు బృందం గత ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు నిబంధనలకు విరుద్ధంగా పలువురు రాజకీయ నాయకులు, మీడియా ప్రతినిధులు, వ్యాపారుల ఫోన్ల ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. దీంతో అప్పుడు ఆయా విభాగాల్లో ఉండి ప్రస్తుతం కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఉన్నతాధికారులు.. ఈ కేసు ఎటు తిరిగి ఎటు వస్తుందోనని, ఎక్కడ తమ మెడకు చుట్టుకుంటుందోనని ఆందోళన చెందుతున్నారు.

ఎలివేటెడ్ కారిడార్లకు 'భూసేకరణ' షురూ

- భూముల గుర్తింపునకు డిఫెన్స్, హెచ్ఎండీఏ సర్వే
- 'కోడ్' ముగిశాక టెండర్లు పిలిచేందుకు కసరత్తు

హైదరాబాద్ సిటీ, మే 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) నిర్మించ తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్లకు భూసేకరణ ప్రక్రియ షురూ అయ్యింది. ఓ వైపు సికింద్రాబాద్ నుంచి 44వ జాతీయ రహదారి మీదుగా కండ్లకోయ వరకు, మరోవైపు సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట వైపు వచ్చే ఈ ఎలివేటెడ్ కారిడార్లకు రక్షణ శాఖ భూములే కీలకంగా మారాయి. దాంతో తొలుత రక్షణ శాఖ భూములను గుర్తించేందుకు డిఫెన్స్, హెచ్ఎండీఏ అధికారులు సంయుక్తంగా సర్వే చేస్తున్నారు. రెండు విభాగాలుగా విడిపోయిన అధికారులు ప్రస్తుతమున్న రోడ్డుకు మధ్య భాగం నుంచి ఇరువైపులా 30 మీటర్ల చొప్పున మొత్తం 60 మీటర్లు కొలతలు వేస్తున్నారు. ఆరు లైన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కావడంతో పాటు సర్వీసు రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూములను గురిస్తున్నారు. తొలుత రక్షణశాఖ భూములు చేతికందగానే ప్రైవేటు వ్యక్తుల భూములను సేకరించనున్నారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగియగానే ఎలివేటెడ్ కారిడార్లకు టెండర్లను పిలిచేందుకు హెచ్ఎండీఏ అధికారులు కసరత్తు చేస్తున్నారు.



ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి భూసేకరణ సర్వే చేస్తున్న రక్షణ శాఖ, హెచ్ఎండీఏ అధికారులు

1000 కోట్ల అప్పు తీసుకోనున్న రాష్ట్రం

హైదరాబాద్, మే 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.1000 కోట్ల రుణం తీసుకోవడానికి సిద్ధమైంది. ఈమేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు శుక్రవారం ఇండెంటు పెట్టింది. 17 ఏళ్ల కాల పరిమితితో సెక్యూరిటీ బాండ్లను రిలీజ్ చేసింది. ఈ నెల 14న ఆర్‌బీఐ నిర్వహించే ఈ-వేలం ద్వారా ఈ అప్పు తీసుకోనుంది. రాష్ట్రంతో కలిపి నాలుగు రాష్ట్రాలు రూ.6,500 కోట్ల అప్పుల కోసం ఇండెంట్లు పెట్టాయి.



వాగ్వావాదం చేసుకుంటున్న రైతులు, అటవీ శాఖ సిబ్బంది

ఆసిఫాబాద్‌లో 'పోడు' రగడ

- అధికారులు, రైతుల మధ్య వాగ్వాదం, తోపులాట
- ఇరువర్గాల ఫిర్యాదు, కేసు నమోదు

రెబ్బెన, మే 10: కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం తుంగెడ శివారులో శుక్రవారం అటవీశాఖ అధికారులకు, పోడు రైతులకు మధ్య వివాదం చెలరేగింది. వివరాల్లోకి వెళితే.. ఇన్‌చార్జి రేంజ్ అధికారి శ్రీధరాచారికి తుంగెడ శివారులోని అటవీ భూమిని రైతులు కబ్జా చేస్తున్నారనే సమాచారం రావడంతో.. ఆయన వందమంది ఫారెస్టు సిబ్బందిని తీసుకొని సంఘటన స్థలానికి వెళ్లారు. ఈ క్రమంలో రైతులకు ఫారెస్టు అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఇది అటవీ భూమి అని ఇందులోకి మీరు వ్యవసాయం చేయకూడదంటూ రైతులకు ఫారెస్టు అధికారులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ పది సంవత్సరాలుగా ఈ భూములను తాము సాగుచేస్తున్నామని, ఇది అటవీ భూమి కాదంటూ అధికారులతో రైతులు వాదించారు. ఈ క్రమంలో ఇరువురు ఒకరినొకరు తోసుకోవటం, నెట్టుకోవటం జరిగింది. ఈ తోపులాటలో పలువురు రైతులు, ఫారెస్టు అధికారులు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న రెబ్బెన సీఐ ఇరువర్గాలకు సర్దిచెప్పి సంఘటన స్థలం నుంచి పంపించారు. ఈ ఘటనపై ఇరువర్గాలు రెబ్బెన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోగా.. కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. సంఘటన స్థలానికి ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

దక్షిణాదిలో నీటి సంక్షోభం..!

- రోజురోజుకూ అడుగంటుతున్న నీటి మట్టాలు

న్యూఢిల్లీ, మే 10: ఈ ఏడాది వేసవిలో ఎండలు తీవ్రంగా ఉన్నాయి. దానికి తోడు దేశవ్యాప్తంగా పొడి వాతావరణం నెలకొనడంతో జలాశయాల్లో నీటి నిల్వలు పడిపోతున్నాయి. ముఖ్యంగా దక్షిణ భారతదేశం తీవ్ర నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ ప్రాంతంలోని రిజర్వాయర్ల సామర్థ్యంలో 15% నీరు మాత్రమే ఉందని కేంద్రం జల సంఘం (సీడబ్ల్యూసీ) తాజా బులెటిన్‌లో పేర్కొంది. ఇది గత పదేళ్ల సగటు కంటే తక్కువని సీడబ్ల్యూసీ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వేసవి నేపథ్యంలో కేంద్ర జల సంఘం వారం వారం దేశంలోని ప్రధాన జలాశయాలను పర్యవేక్షించి బులెటిన్‌ను విడుదల చేస్తున్నది. ఈ క్రమంలో దక్షిణాదిలోనే కాకుండా దేశవ్యాప్తంగా ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోతున్నాయని సీడబ్ల్యూసీ ఆందోళన వ్యక్తం చేసింది. గతవారం దక్షిణాదిలోని జలాశయాల సామర్థ్యంలో 16% నీరు మాత్రమే ఉంటే.. అంతకుముందు వారం ఇది 17 శాతంగా నమోదైంది. అయితే ఈ వారం అది 15 శాతానికి పడిపోయిందని సీడబ్ల్యూసీ తాజా బులెటిన్‌లో తెలిపింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడుతో కూడిన దక్షిణాది ప్రాంతంలోని జలాశయాల నీటి నిల్వ సామర్థ్యం 53.334 బీఎంసీ (బిలియన్ క్యూబిక్ మీటర్లు). ఈ నెల 9న విడుదల చేసిన బులెటిన్ ప్రకారం ఈ రిజర్వాయర్ల ప్రస్తుత నీటి నిల్వ 7.92 బీఎంసీలుగా ఉంది. అంటే మొత్తం సామర్థ్యంలో 15 శాతం మాత్రమే. గతేడాది ఇదే సమయంలో ఇది 27 శాతంగా ఉంది. ఇక పదేళ్ల సగటు (21 శాతం)తో పోల్చినా కూడా ఇది చాలా తక్కువ. ఇక దేశవ్యాప్తంగా 150 రిజర్వాయర్లను సీడబ్ల్యూసీ పర్యవేక్షించగా.. వాటి మొత్తం నిల్వ సామర్థ్యంలో ప్రస్తుతం 27 శాతం నీరు మాత్రమే ఉంది.

'రాజహంసిని' పానీయం



నినీరం పాచితం క్షీరం మాహిషం తద్భవం దధి!
శుభ్రశర్కరయైలాఢ్యం గాలితం రాజహంసిని!

'పాలను, నీళ్లనూ వేరు చేసి పాలను మాత్రమే తాగగలదు హంస' అని లోకోక్తి. అలాగే పెరుగులోను, పాలలోనూ నీళ్లను తీసేసి, సుగంధ ద్రవ్యాలతో సహా పంచదార కలిపి, చిలికిన పానీయాన్ని క్షేమశర్మ 'హంసిని' అన్నాడు. ఇది కూడా ఒక రకం లస్సీయే.

మసాలా కూరల్ని, స్పైసీ వంటకాల్ని తిన్నప్పుడు ఆ ఘాటు తట్టుకోవటానికి లస్సీ తాగాలనుకుంటారు చాలామంది. వీరి దృష్టిలో లస్సీ ఒక సాంత్వన పానీయం అని. కొందరు దీన్ని వేడిని తగ్గించుకోవటానికి చలవనిచ్చే పానీయంగా భావించి తాగుతారు. ఇది ఆరోగ్యకరమైన పానీయం అనీ, అన్ని వయసులవారికీ సరైన రీఫ్రెషింగ్ డ్రింక్‌గా పని చేస్తుందనీ, జీర్ణక్రియకు సహాయ పడుతుందనీ, కాల్షియం, విటమిన్-డి... ఇంకా అనేక పోషకాలను అందిస్తుందనీ దీన్ని తాగేవాళ్లన్నారు. ఎండలో తిరిగే వాళ్లకి లస్సీకి మించిన రక్షణ కవచం ఇంకోటి లేదు. లస్సీని 'నురుగు పెరుగు' అని కూడా పిలుస్తుంటారు. బాగా నురుగు వచ్చేదాకా చిలికి, పైన క్రీము పరిచి, దాని మీద జీడిపప్పు, బాదం పప్పు ముక్కలు, కిస్మిస్ లాంటివి చల్లి తాగితే కమ్మగా ఉంటుంది.

గేదె పెరుగు తింటే నిద్ర వస్తుందని శాస్త్రం. ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లాన్ని పెరుగు సెరొటోనిన్‌గా మారుస్తుంది. సెరొటోనిన్ అనేది స్లీప్ న్యూరో ట్రాన్స్‌మిటర్ (నిద్రాజనకం).

> **ఆవు పాలతో తయారైన హంసినీ పానీయం వాతాన్ని, పిత్తాన్ని తగ్గిస్తుందనీ, జీర్ణశక్తిని పెంచుతుందనీ, తెల్లగా నిర్మలంగా ఉంటుందనీ, జఠరాగ్నిని ప్రజ్వలింప చేస్తుందనీ పేర్కొన్నాడు క్షేమశర్మ. గేదె పాలతో తయారైన రాజహంసిని ఆలస్యంగా అరుగుతుందనీ, కఫాన్ని, స్థూలకాయాన్ని పెంచుతుందనీ దీన్నిబట్టి అర్థం చేసుకోవాలి. అయితే రాజ హంసినివల్ల కలిగే గుణాలు ఎక్కువ శక్తిమంతంగా ఉంటాయి.**

నరాలకు శక్తినిచ్చే ద్రవ్యం. నిద్రను నియంత్రించే యంత్రాంగాన్ని ఇది ఉత్తేజితం చేస్తుంది.

కడుపు నిండా అన్నం తిన్న వెంటనే పొట్టలో పెద్ద రైస్ మిల్లు లాంటి యంత్రాంగం పని చేయటం మొదలవుతుంది. ఎక్కువ ఓల్టేజీ తీసుకునే యంత్రాన్ని ఆన్ చేయగానే ఇంట్లో కరెంటుని అది ఒక్కసారిగా తీసుకునేసరికి లైట్లన్నీ ఒక్క సెకను డిమ్మవటం మన చూస్తుంటాం. అలాగే, అన్నం తినగానే జీర్ణక్రియకు సంబంధించిన యంత్రాంగం జీర్ణవ్యవస్థకు రక్త ప్రవాహాన్ని అధికంగా మళ్లిస్తుంది. అందువల్ల మగత ఏర్పడి నిద్ర పట్టేస్తుంది. అధిక ఆహారం తిని, లస్సీ తాగితే మరింత వేగంగా నిద్ర ఆవహిస్తుంది.

లస్సీవల్ల శరీర ఉష్ణోగ్రత ఒక్కసారిగా తగ్గి, కాసేపు విశ్రాంతిని కోరే ప్రతిస్పందనలు ఉత్తేజితం అవుతాయి. ఫలితంగా రెస్టు తీసుకోవాలని మనసుకు అనిపిస్తుంది. దానర్థం లస్సీ తాగితే నిద్ర మాత్ర వేసుకున్నట్టు పక్క మీదకు వాలిపోతారని కాదు. శరీరానికి త్వరగా నిద్ర వచ్చేందుకు కావలసిన యంత్రాంగాలన్నీ లస్సీ వల్ల సహకరించుకోవడం మొదలు పెడతాయన్నమాట. ఖాళీ కడుపుతో లస్సీ తాగితే అలసట తగ్గి మనసు ప్రశాంతం అవుతుందేగానీ నిద్రలోకి జారిపోదు.

ఉత్తరాదివాళ్లు రోజ్ ఎస్సెన్స్ కలిపి సెంటు వాసన వచ్చేలా చేస్తారు. దాన్ని మన తెలుగువాళ్లు పెద్దగా ఆస్వాదించకపోవచ్చు. పనిగట్టుకుని రంగులు, కృత్రిమ రసాయనాలు, పరిమళాలూ కలిపిన లస్సీలకన్నా తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో క్షేమశర్మ చెప్పిన 'హంసిని, రాజహంసిని' లాంటి లస్సీలను తాగటం ఉత్తమం.

రాజహంసిని పానీయం ఇలా...

గేదె పెరుగును ఒక మందపాటి వస్త్రంలో వేసి మూటగట్టి నీటిని పిండేయండి. చిక్కటి గేదె పాలను నీరు తక్కువగా ఉండేలా బాగా మరిగించండి. ఇప్పుడు ఈ రెండింటినీ ఒక్కో కప్పు చొప్పున కలపండి. అందులో పంచదార, ఏలకుల పొడి కలిపి బాగా చిలికి, మళ్లీ ఒకసారి వడగట్టండి. ఇదీ... రాజహంసినీ అనే లస్సీ. సుమధురంగా ఉంటుంది. బలకరం, శక్తిదాయని. స్త్రీ, పురుషులకు అనుకూలంగా ఉంటుంది. వేడిని తక్షణం తగ్గిస్తుంది. మనసుకు ప్రశాంతతని ఇచ్చి, కమ్మగా నిద్ర పట్టేలా చేస్తుంది. దీన్ని తయారు చేయగానే తాగటం మంచిది.

హంసినీ అనే మరో లస్సీ: గేదె పాలకు బదులుగా ఆవు పాలతో ఈ లస్సీని తయారు చేసుకుంటే క్షేమశర్మ దాన్ని 'హంసినీ పానీయం'గా పేర్కొన్నాడు. హంసినీ, రాజహంసినీ పానీయాలు రెండింటి తయారీ విధానం ఒకటే.

• గంగరాజు అరుణాదేవి

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/TLP196Cలో చదవండి.

నవ్య 'స్మార్ట్ పేజీ'లో
ఆసక్తికర కథనాల కోసం...
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/6y4Z0PQ లో చదవండి.

వంటిల్లు

అమృత ఫలం... మామిడి.
పండును పండుగానే తిన్నా...
లేదా దాంతో ఏదైనా వండినా...
అద్భుతః అనిపిస్తుంది. ఈ మామిడి సీజన్‌లో
అలాంటి నోరూరే విభిన్న వంటలు మీ కోసం.
ఒకసారి ప్రయత్నించి...
మామిడి మజాను ఆస్వాదించండి.



మామిడి మజా



క్రీరీ పనీర్ టిక్కా



కావల్సిన పదార్థాలు:
పనీర్-800 గ్రాములు; పచ్చి మామిడికాయ-100గ్రాములు; ఉప్పు- రుచికి సరిపడా; ఆవ నూనె-50 ఎంఎల్; కశ్మీరీ చిల్లీ పౌడర్-20 గ్రాములు; వడగట్టిన పెరుగు (హంగ్ కర్డ్)- 400 గ్రాములు; అల్లం, వెల్లుల్లి పేస్ట్-50 గ్రాములు; ఛాట్ మసాలా- 10 గ్రాములు; గరమ్ మసాలా-10 గ్రాములు; మెంతి పొడి-20 గ్రాములు; ఉల్లిపాయలు-400 గ్రాములు; గ్రీన్ క్యాప్సికమ్- 400 గ్రాములు; నూనె-100 ఎంఎల్.

తయారీ ఇలా:
పనీర్, ఉల్లిపాయలు, క్యాప్సికమ్‌ను కాస్త పెద్ద ముక్కలుగా కట్ చేసుకోవాలి. మామిడికాయను తురిమి పెట్టుకోవాలి. ఒక బౌల్ తీసుకొని అందులో వడగట్టిన పెరుగు, మామిడి తురుము, ఆవ నూనె, కశ్మీరీ చిల్లీ పౌడర్, చాట్ మసాలా, గరమ్ మసాలా, మెంతి పొడి, ఉప్పు వేసి బాగా కలియతిప్పాలి. దీనికి పనీర్, ఉల్లిపాయ, క్యాప్సికమ్ ముక్కలు జత చేసి, మళ్లీ కలపాలి. ఇప్పుడు సీఖ్ (సన్నని చువ్వ) తీసుకొని, దానికి పనీర్, ఉల్లిపాయ, క్యాప్సికమ్ ముక్కలు గుచ్చండి. తందూరీ పాట్‌లో మూడు నిమిషాలు ఉడకబెట్టాలి. తందూరీ పాట్ లేకపోతే టూత్‌పికర్‌కు పనీర్, ఉల్లిపాయ, క్యాప్సికమ్ గుచ్చాలి. వాటిని మైక్రోవేవ్ ఓవెన్‌లో పెట్టి, గ్రిల్‌మోడ్‌లో ఎనిమిది నిమిషాలు ఉంచాలి.



కొడాలి వెంకటేశ్వరరావు
ఎగ్జిక్యూటివ్ చెఫ్,
గోల్కొండ హోటల్,
హైదరాబాద్.

ఫిష్ ఫింగర్ విత్ మ్యాంగో సల్సా

కావల్సిన పదార్థాలు:
పచ్చి మామిడికాయ- 1; కొరమీను చేపలు- 250 గ్రాములు; నిమ్మ రసం- 5 ఎంఎల్; మస్టర్డ్ సాస్-5 గ్రాములు; ఉప్పు- చిటికెడు; నల్ల మిరియాల పొడి- చిటికెడు; కోడిగుడ్డు-1; మైదా- 150 గ్రాములు; టమాటో కెచెప్- 150 గ్రాములు; ఉల్లిపాయ-1; టమాటా-1; బ్రెడ్ క్రంబ్స్-500 గ్రాములు; నూనె-500 గ్రాములు.

తయారీ ఇలా:
చేపను ఫింగర్ సైజులో ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఒక బౌల్‌లోకి మస్టర్డ్ సాస్, ఉప్పు, మిరియాల పొడి, కొద్దిగా నిమ్మ రసం తీసుకొని బాగా కలిపాలి. అందులో చేప ముక్కలు వేసి, వాటికి ఈ మిశ్రమాన్ని బాగా పట్టించాలి. దీనికి కోటింగ్ కోసం కొద్దిగా ఎగ్ వైట్, కొంత మైదా జత చేసి, ఆపైన బ్రెడ్ క్రంబ్స్‌లో దొర్లించాలి. ఒక ప్యాన్‌లో నూనె పోసి, సన్నని సెగన ఈ ఫిష్ ఫింగర్స్‌ను డీప్ ఫ్రై చేయాలి.

మ్యాంగో సల్సా సాస్: ఉల్లిపాయ, టమాటా, మామిడి కాయలను సన్నని ముక్కలుగా తరిగి, ఒక బౌల్‌లో పెట్టుకోవాలి. అందులో టమాటో కెచెప్, తగినంత ఉప్పు, కొద్దిగా నిమ్మ రసం వేసి, అన్నిటినీ కలపాలి. దీంతో ఫిష్ ఫింగర్స్ తింటే... వహ్వా అనాల్సిందే.

'భాష మార్చినా... మాట మార్చను'

సప్త భాషా సంగమ భూమి... ఇది కేరళలోని కాసరగోడ్ ముద్దుపేరు. మూడున్నర దశాబ్దాలు తమకు కంచుకోటగా నిలిచిన ఈ స్థానాన్ని కిందటి ఎన్నికల్లో వామపక్షాలు చేజార్చుకున్నాయి. ఈసారి దాన్ని తమ ఖాతాలో వేసుకోవాలనే బిజెపి వ్యూహంలో భాగంగా... ఆరు భాషల్లో అనర్గళంగా మాట్లాడే ఎం.ఎల్.అశ్విని బరిలోకి దిగారు. రాజకీయాల్లో తల పండిన ప్రత్యర్థులతో ఈ ముప్పై ఎనిమిదేళ్ల మాజీ టీచరమ్మ తలపడిన తీరు ఆమెను వార్తల్లో వ్యక్తిగా నిలిపింది.



పగలు పయ్యనూర్‌లో మళయాళంలో ఆమె సాగించిన అనర్గళ ప్రసంగం... సాయంత్రం ఖానాగడ్ చేరేసరికి కన్నడ, తుళు బాషల్లోకి మారిపోయింది. "భాష మార్చుతూ ఉంటాను కానీ, జనానికి ఇచ్చిన మాట మార్చను. నా అంతరంగంలో ప్రజా శ్రేయస్సుపై ఉన్న నిబద్ధత మారదు" అంటారు ఎం.ఎల్.అశ్విని. తాజా ఎన్నికల్లో... ఆమె అభ్యర్థిత్వం, ప్రచార శైలి, ప్రజలతో మమేకమైన తీరు... ప్రతిదీ చర్చనీయాంశం అయ్యాయి. కాసరగోడ్ లోక్‌సభ స్థానం అభ్యర్థిగా తనను ఎంపిక చేస్తారని ఏమాత్రం అనుకోలేదంటారు అశ్విని. గత చరిత్రను పరిశీలిస్తే... ఆ నియోజకవర్గం వామపక్షాలకు కంచుకోట. 1957 నుంచి జరిగిన పదహారు ఎన్నికల్లో పన్నెండుసార్లు ఎల్‌డిఎఫ్ కూటమి తరఫున సీపీఎందే అక్కడ విజయం. అలాంటి స్థానంలో... సీపీఎం రాష్ట్ర సమితి సభ్యుడు కె.పి. సతీష్ చంద్రన్ మీద 2019 ఎన్నికల్లో నలభై వేల ఓట్లతో కాంగ్రెస్ తరఫున సినీ నటుడు రాజమోహన్ ఉన్నితాన్ గెలవడం ఒక సంచలనం. ఈసారి కూడా కాంగ్రెస్ అభ్యర్థి ఆయనే. ఇక, మూడున్నర దశాబ్దాల తరువాత ఈ సీటులో ఓటమి మూటగట్టుకున్న వామపక్షాలు పూర్వ వైభవం కోసం తహతహలాడుతున్నాయి. అధ్యాపక వృత్తి నుంచి క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చి, ప్రస్తుతం సిపిఎం జిల్లా కార్యదర్శిగా ఉన్న ఎం.వి.బాలకృష్ణన్‌ను పోటీకి దించాయి. కిందటిసారి మూడో స్థానంలో నిలిచిన బిజెపి తమ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీష్ తంత్రి, పార్టీ జాతీయ ప్రతినిధి పి.కె.కృష్ణదాస్‌లలో ఒకర్ని ఎంపిక చేస్తుందని సీనియర్ నాయకుల నుంచి కార్యకర్తల వరకూ బలంగా నమ్మారు. అయితే అనూహ్యంగా అశ్విని పేరును పార్టీ నాయకత్వం ప్రకటించింది. ఆమెకు ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్న అనుభవం... కేవలం బ్లాక్ పంచాయతీ సభ్యురాలిగానే. కానీ... పార్టీ ఆమెలో చూసిన సానుకూల అంశాలు వేరే ఉన్నాయి.

అదే సానుకూలత...

అశ్విని పుట్టింది, పెరిగింది బెంగళూరులో. "కన్నడ నా మాతృభాష. కొత్త భాషలు నేర్చుకోవడం అంటే నాకు ఇష్టం. స్కూల్‌లో హిందీ, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో పట్టు సాధించాను. బెంగళూరులో మాకు పొరుగున తుళు కుటుంబాలు ఉండేవి. వాళ్ళతో మాట్లాడుతూంటే ఆ భాష వచ్చేసింది. కొందరు మిత్రుల దగ్గర తమిళం నేర్చుకున్నాను. నా భర్త స్వస్థలం కాసరగోడ్. ఇక్కడికి వచ్చాక మళయాళం... అయితే భాషలు నేర్చుకున్నంతమాత్రాన సరిపోదు. ప్రాక్టీస్ చేస్తూ ఉండాలి. మా ఇంట్లో ఒక్కొక్కరితో ఒక్కో భాష మాట్లాడుతూ ఉంటా" అని చెప్పారామె. కేరళలోని మంజేశ్వర్‌లో స్కూల్ టీచర్‌గా ఆమె కొన్నాళ్ళు పని చేశారు. ఆ ఉద్యోగం మానేసి బిజెపిలో చేరారు. బిజెపి మహిళామోర్చా జాతీయ ఎగ్జిక్యూటివ్ సభ్యురాలయ్యారు. అశ్విని వాగ్ధాటి, భాషా నైపుణ్యం అందరినీ ఆకట్టుకోవడంతో... పది రాష్ట్రాల్లో మహిళా మోర్చాకు పర్యవేక్షకురాలుగా పార్టీ నియమించింది. "నేను హిందీ, ఇంగ్లీష్, కన్నడం, మలయాళం, తమిళం, తుళు భాషలు ధారాళంగా మాట్లాడగలను. అదే నాకున్న సానుకూలత. దేశలోనిఇ పలు ప్రాంతాల్లో మహిళామోర్చా తరఫున నేను పర్యటించినప్పుడు... నా భాషా జ్ఞానం ఎంతో ఉపయోగపడింది. ఇది పార్టీ జాతీయ నాయకుల దృష్టిలో పడింది" అని అంటారు అశ్విని. కాసరగోడ్ లోక్‌సభ స్థానం అభ్యర్థిత్వం గురించి చర్చ జరిగినప్పుడు... సీనియర్ నాయకులు టిక్కెట్ ఆశించినా... అశ్విని భాషా నైపుణ్యాన్ని పార్టీ నాయకత్వం పరిగణనలోకి తీసుకుంది. కారణం... భాషల పరంగా కాసర్‌గోడ్‌కు ఉన్న ప్రత్యేకత. దాన్ని 'సప్త భాషా సంగమ భూమి' అని పిలుస్తారు. కర్ణాటకతో సరిహద్దును పంచుకుంటున్న ఈ ప్రాంతం భాషా వైవిధ్యానికి ప్రసిద్ధి చెందింది. ఆ భాషలు: మలయాళం, తుళు, కన్నడ, మరాఠీ, కొంకణి, బేరీ, ఉర్దూ. 2011 జనాభా లెక్కల ప్రకారం ఈ పరిధిలో ఉన్న ప్రజల్లో... 82 శాతం మంది మళయాళం, 4 శాతానికి పైగా కన్నడ, 8 శాతానికి పైగా తుళు, దాదాపు 3 శాతం మంది మరాఠీ మాట్లాడతారు. అలాగే ఉర్దూ మాట్లాడేవాళ్ళు ముప్పై వేల మంది, కొంకణీ మాట్లాడేవాళ్ళు పాతికవేల మంది ఉన్నారు. తమిళుల సంఖ్య కూడా చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఉంది. అలాంటి ప్రాతంలో... బహుభాషా నిపుణురాలైన అశ్వినిని పోటీకి దింపడం ప్రయోజనకరమనేది పార్టీ వ్యూహం.

వాళ్ళ భాషలో పలకరిస్తే సంబరపడతారు...

"కదంబర్‌లో బ్లాక్ పంచాయతీ సభ్యురాలుగా ఎన్నికయ్యాక... స్థానిక ప్రజలతో మమేకం అయ్యాను. మరోవైపు దేశంలోని వివిధ ప్రాంతాలు పర్యటించడంతో... అక్కడి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని సమస్యలు కూడా తెలిశాయి. అక్కడ ప్రజా సంక్షేమం కోసం చేపడుతున్న చర్యలను కూడా అధ్యయనం చేశాను. ఎంపి అభ్యర్థిగా ఏ ప్రాంతానికి వెళ్ళినా... అక్కడ ప్రజలు నన్ను ఆదరించారు. ప్రధానంగా వయోధికులను, మహిళలను వాళ్ళ మాతృభాషలో పలకరించినప్పుడు... ఎంతో సంబరపడతారు. ఆప్యాయంగా మాట్లాడతారు. తమ ఇబ్బందులేమిటో దాపరికం లేకుండా చెబుతారు. "ఇన్ని భాషల్లో ఎలా మాట్లాడగలుగుతున్నారు?" అని చాలామంది అడుగుతూ ఉంటారు. "నేర్చుకోవాలనే ఆసక్తి, ఏకాగ్రత ఉంటే ఏదీ అసాధ్యం కాదు. ప్రపంచం మారుతోంది. పిల్లలు వీలైనన్ని భాషలు నేర్చుకుంటే మంచిది" అని చెబుతూ ఉంటాను" అంటారు అశ్విని. స్థానిక సమస్యలను స్థానిక భాషలోనే వివరించడం, వాటి పరిష్కారానికి హామీ ఇవ్వడం... ఈ తరహాలోనే ఆమె తన ప్రచారాన్ని సాగించారు. గత నెలాఖర్లో పోలింగ్ ముగిసింది. "నా భర్త, నా ఇద్దరు పిల్లలు నాకు ఎంతో అండగా నిలుస్తున్నారు. జీవితంలో ఏదీ నేను ముందుగా ప్లాన్ చేసుకోలేదు. వచ్చిన అవకాశాలను స్వీకరించాను. ఈ ఎంపీ సీటు కూడా అంతే... నేను గెలుస్తాననీ, ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటాననీ నమ్మకం ఉంది" అని చెబుతున్న అశ్వినికి ఆ ఆత్మవిశ్వాసమే కొండంత బలం అంటారు ఆమె సన్నిహితులు.

నవ్య | చిత్రజ్యోతి



రాజకీయ నేపథ్యంలో

'యువత రాజకీయాల్లోకి రావాలి' అనే కాన్సెప్ట్‌తో రూపుదిద్దుకున్న చిత్రం 'రామజన్మభూమి'. జై సిద్దార్థను హీరోగా పరిచయం చేస్తూ స్వీయ దర్శకత్వంలో వి.సముద్రారావు నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ను సీనియర్ ఆర్టిస్ట్ మురళీమోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'దేశంలో ఇప్పుడు ఎక్కడ విన్నా జై శ్రీరామ్ నినాదం మారుమోగుతోంది, 'రామ జన్మభూమి' పేరుతో సముద్ర ఈ సినిమా తీయడం ఆనందంగా ఉంది. చిత్రం పెద్ద హిట్ అవుతుంది' అన్నారు. దర్శకనిర్మాత సముద్రారావు మాట్లాడుతూ ' ఆ దేవుడే రాముడిగా వచ్చి మానవ రూపంలో ధర్మబద్ధంగా బతికాడు. ప్రతి పౌరుడు రాముడిలా బతకాలి. రాజకీయాల్లోకి యువత కచ్చితంగా రావాలనే సందేశంతో ఈ సినిమా తీశాం. విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తాం' అన్నారు. ఈ సినిమాతో హీరోగా పరిచయమవుతున్నందుకు ఆనందంగా ఉందని జై సిద్దార్థ చెప్పారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు బి.గోపాల్, దామోదర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జూన్‌లో రాయన్ రాక



ధనుష్ కథానాయకుడిగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'రాయన్'. సందీప్ కిషన్, ఎస్‌జే సూర్య, సెల్వ రాఘవన్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. సన్ పిక్చర్స్ నిర్మిస్తోన్న ఈ చిత్రం తెలుగు రిలీజ్ హక్కులను ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్‌ఎల్‌పి దక్కించుకొంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని జూన్ 13న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ శుక్రవారం ప్రకటించారు. అలాగే ఈ చిత్రం నుంచి 'తలవంచి ఎరగడే' అంటూ సాగే గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్. సినిమాటోగ్రఫీ: ఓం ప్రకాశ్.

కాండ్రకోట మిస్టరీ




యథార్థ సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకుంటున్న 'నింద' చిత్రంలో వరుణ్ సందేశ్ హీరోగా నటిస్తున్నారు. స్వీయ దర్శకత్వంలో రాజేశ్ జగన్నాథం ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'కాండ్రకోట మిస్టరీ' అనే క్యాప్షన్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో వరుణ్ సందేశ్ లుక్ పోస్టర్‌ను తాజాగా విడుదల చేశారు. ఇందులో వరుణ్ అమాయకంగా కనిపిస్తుంటే, బ్యాక్‌గ్రౌండ్‌లో ఓ ముసుగు వ్యక్తి రూపం ఉంది. ఈ పోస్టర్‌ను రివర్స్ చేస్తే న్యాయ దేవత విగ్రహం, ముసుగు వ్యక్తి రూపం కూడా కనిపిస్తున్నాయి. ఆ ముసుగు వ్యక్తి ఎవరు, న్యాయదేవతను ఎందుకు చూపిస్తున్నారు.. సినిమాలో వరుణ్ పాత్ర ఏమిటి.. అనే ఆసక్తికర అంశాలకు సినిమాలో సమాధానం లభిస్తుందని రాజేశ్ జగన్నాథం చెబుతున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందనీ, ఈ నెల 15న టీజర్‌ను విడుదల చేస్తామనీ ఆయన తెలిపారు.

హైదరాబాద్‌లో అజిత్



తమిళ హీరో అజిత్ కుమార్, టాలీవుడ్ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ కలయికలో వస్తున్న ద్విభాషా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. భారీ ఎత్తున నిర్మించిన సెట్‌లో అజిత్‌తో పాటు కీలకపాత్రధారులు పాల్గొంటున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం విడుదలవనుంది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: అభినందన్ రామానుజం.

యేవం.. మహిళా సాధికారాణాం




'కంటెంట్‌ను నమ్మి చేసే సినిమాలకు తెలుగు ప్రేక్షకుల ఆదరణ ఎప్పుడూ ఉంటుంది. అందుకే మా సినిమా మీద పూర్తి నమ్మకంతో ఉన్నాం' అన్నారు దర్శకుడు ప్రకాశ్ దంతలూరి. ఆయన రూపొందించిన 'యేవం' సినిమాలో చాందినీ చౌదరి, వశిష్ట సింహా, భరత్‌రాజ్, ఆషు రెడ్డి ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. నవదీప్, పవన్ గోపరాజు నిర్మాతలు. ఈ సినిమాలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్న భరత్‌రాజ్ లుక్‌ని శుక్రవారం విడుదల చేశారు. 'ఇటీవల చాందినీ చౌదరి, ఆషురెడ్డి పాత్రలకు సంబంధించిన లుక్స్ రిలీజ్ చేశాం. మంచి స్పందన వచ్చింది. మహిళా సాధికారతను చాటి చెప్పే సినిమా ఇది. చిత్రంలో ప్రతి పాత్రకూ ఓ మార్క్ ఉంటుంది. కొత్త కంటెంట్‌తో డిఫరెంట్ నేరేషన్‌తో సినిమా రూపుదిద్దుకుంటోంది' అన్నారు దర్శకుడు.

వై దిస్ కొలవెరి?




ప్రియదర్శి హీరోగా నటిస్తున్న 'డార్లింగ్' చిత్రం షూటింగ్ పూర్తయింది. నభా నటేశ్ హీరోయిన్‌గా నటించిన ఈ ఎంటర్‌టైనర్‌కు అశ్విన్‌రామ్ దర్శకుడు. 'హను-మాన్' చిత్రాన్ని అందించిన కె.నిరంజన్‌రెడ్డి ఈ సినిమాకు నిర్మాత. 'వై దిస్ కొలవెరి' అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో రూపొందుతున్న ఈ సినిమాలో అనన్య నాగళ్ల కీలక పాత్ర పోషిస్తున్నారు. హేమంత్ సంభాషణలు అందించిన ఈ చిత్రానికి నరేశ్ ఛాయాగ్రాహకుడు, వివేక్ సాగర్ సంగీత దర్శకుడు.

ఇడియట్ ప్రేమకథ



రవితేజ కుటుంబం నుంచి మరో కథానాయకుడు వస్తున్నాడు. 'మిస్టర్ ఇడియట్' చిత్రంతో రవితేజ సోదరుడు రఘు తనయుడు మాధవ్ హీరోగా పరిచయం అవుతున్నాడు. సిమ్రాన్ శర్మ కథానాయిక. గౌరీ రోణంకి దర్శకత్వంలో జేజేఆర్ రవిచంద్ నిర్మిస్తున్నారు. రవితేజ ఈ చిత్రం టీజర్‌ను సోషల్ మీడియాలో విడుదల చేశారు. ఇద్దరు కళాశాల విద్యార్థుల స్నేహం ప్రేమగా ఎలా మారింది అనేది ఆసక్తికరంగా ఆవిష్కరించారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్. సినిమాటోగ్రఫీ: రామ్.

ప్రేమకు ఆకర్షణకు మధ్య



శిరిన్ శ్రీరామ్ దర్శక నిర్మాతగా తెరకెక్కుతోన్న యూత్‌ఫుల్ లవ్ స్టోరీ 'ప్రేమించొద్దు'. అనురూప్ రెడ్డి, దేవా మలిశెట్టి, సారిక, మానస ప్రధాన తారాగణం. ఐదు భాషల్లో రూపొందిన ఈ చిత్రం తెలుగు వెర్షన్‌ను జూన్ 7న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. శిరిన్ శ్రీరామ్ మాట్లాడుతూ 'యువతలో చాలా మంది నిజమైన ప్రేమకూ, ఆకర్షణకూ మధ్య తేడా తెలియక తప్పటడుగులు వేస్తున్నారు. దీనివల్ల వారు ఎలా నష్టపోతున్నారనే కోణంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం' అన్నారు. సంగీతం: జునైద్ కుమార్. సినిమాటోగ్రఫీ: హర్ష కొడాలి.

మెప్పించే థ్రిల్లర్



సుగి విజయ్, రూపాలీ భూషణ్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సైంటిఫిక్ థ్రిల్లర్ 'మాత్రు'. శ్రీరామ్, అలీ, ఆమని కీలకపాత్రలు పోషిస్తున్నారు. జాన్ జిక్కీ దర్శకత్వంలో బి. శివప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను రచయిత విజయేంద్ర ప్రసాద్ విడుదల చేసి, ఈ యాక్షన్ థ్రిల్లర్ ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రాహుల్ శ్రీ వాస్తవ్.

గారడీ మాటలు నమ్మొద్దు..

- అభివృద్ధి చేసే వారికే పట్టం కట్టాలి
- రాష్ట్రంలో 12 లోక్‌సభ స్థానాలు సాధించడం ఖాయం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్


మాట్లాడుతున్న కేటీఆర్

నేటితో ఎన్నికల ప్రచారానికి తెర




- మూగబోనున్న మైకులు
- సభలు, సమావేశాలకు బ్రేక్
- ఇక తెరుచుకోనున్న మూటలు!

హనుమకొండ,-మే 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ లోక్‌సభ నియోజకవర్గంలో శనివారంతో ఎన్నికల ప్రచారానికి తెరబపడనున్నది. నెల రోజులుగా మోతెక్కిన మైకులు మూగబోనున్నాయి. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో భూపాలపల్లి మినహా మిగతా వాటిల్లో సాయంత్రం ఆరుగంటలకు ప్రచారం ముగుస్తుంది. నక్సల్ ప్రభావిత ప్రాంతమైన భూపాలపల్లిలో మాత్రం భద్రతా కారణాల దృష్ట్యా సాయంత్రం 4 గంటలకే నిలిచిపోతుంది. ఇంటింటి ప్రచారానికి, సభలు, సమావేశాలకు బ్రేక్ పడనున్నది. మాటలు బంద్ అయి మూటలు తెరుచుకోనున్నాయి. వాస్తవానికి ఎన్నికల షెడ్యూల్ వెలువడిన రోజు నుంచే ఎన్నికల ప్రచారం మొదలైంది. ఆశావహులు ఎన్నికల ప్రచారాన్ని పరోక్షంగా మొదలు పెట్టారు. అభ్యర్థుల ఖరారు తర్వాత అసలు ఎన్నికల ప్రచారం మొదలైంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ నుంచి కడియం కావ్య, బీజేపీ నుంచి అరూరి రమేష్, బీఆర్ఎస్ నుంచి సుధీర్‌కుమార్ బరిలో నిలిచారు. ఇతర చిన్నా చితకా పార్టీల నుంచి, అలాగే స్వతంత్ర అభ్యర్థులుగా మొత్తం 42 మంది పోటీలో ఉన్నారు. ప్రధాన పోటీ మధ్య ఈ ముగ్గురి మధ్యే కొనసాగుతోంది. ఈ త్రిముఖ పోటీలో గెలుపెవరిదనే విషయంలో ప్రజల్లో ఉత్కంఠ నెలకొన్నది.

గెలుపే లక్ష్యంగా..

గెలుపే లక్ష్యంగా ఈ మూడు పార్టీల అభ్యర్థులు పక్షం రోజులుగా హోరా హోరీగా నిర్వహించారు. ప్రచార సభలు, సమావేశాలు, కార్నర్ మీటింగ్‌లు, రోడ్ షోలు, ర్యాలీలతో నియోజకవర్గం యావత్తు హోరెత్తింది. అభ్యర్థులు, పార్టీ నేతల ప్రసంగాలతో మైకులు దద్దరిల్లాయి. అగ్రనేతల రాకతో ప్రచారం మరింత జోరందుకున్నది. విమర్శలు, ప్రతివిమర్శలు,

మిగతా 10వ పేజీలో..



ఎర్రబెల్లి తప్పు చేయడు

ఏదో ఒక కేసులో ఇరికియ్యాలని చూశారు



- ఫోన్ ట్యాపింగ్, ల్యాండ్ కేసులంటూ గెలికారు
- ఏ తప్పూ దొరకలేదు.. ప్రజల కోసమే నా పోరాటం
- గ్యారంటీల అమల్లో కాంగ్రెస్ ఫెయిలైంది
- మోసపూరిత హామీలను నమ్మి జనం మోసపోయారు
- రేవంత్‌రెడ్డి.. దేవుళ్ల మీద కాదు నీ బిడ్డ మీద ప్రమాణం చేయ్
- జిల్లాలను తొలిగించాలని ప్రయత్నిస్తే.. మరో మహా ఉద్యమమే
- బీజేపీతోనే మాకు పోటీ.. కాంగ్రెస్‌కు ఓటెయ్యరు
- బీఆర్ఎస్ ఎంపీలు ప్రశ్నించే గొంతుకలవుతారు
- మాజీ మంత్రి, వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఇంటర్వ్యూ

9

పోలింగ్ నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

- మద్యం, డబ్బు పంపిణీపై ప్రత్యేక నిఘా పెట్టాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్
- పోలింగ్ కేంద్ర పరిసరాల్లో 144 సెక్షన్ అమలు

1


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

శుక్రవారం ఉష్ణోగ్రత | గరిష్ఠం : 37.0°C | కనిష్ఠం : 25.5°C

ప్రైవేటీకరణ కోసమే బీజేపీ కుట్రలు

- అందుకే రిజర్వేషన్లు ఎత్తేయాలని చూస్తోంది..
- కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం
- వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య

ఐనవోలు, మే 10: రిజర్వేషన్లను ఎత్తివేయడం కోసమే బీజేపీ ప్రైవేటీకరణకు శ్రీకారం చుట్టిందని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య ఆరోపించారు. ఐనవోలులో శుక్రవారం రాత్రి డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ సమావేశం నిర్వహించారు. అంతకు ముందు తెలంగాణ తల్లి సెంటర్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు పెద్దఎత్తున రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ.. పేదలు ఉద్యోగులుగా, రాజకీయ నేతలుగా ఎదిగారంటే రిజర్వేషన్లే కారణమన్నారు. రిజర్వేషన్లను తొలగించేందుకు ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ ప్రైవేటీకరణ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేటీకరణపేరుతో దేశంలో బీజేపీ ప్రభుత్వం కోట్లాది మందిని నిరుద్యోగులుగా మార్చారన్నారు. పదేళ్లపాటు కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలకు గూడు, నీడ, విద్య, ఉపాధి, ఆరోగ్య భద్రతను కల్పించడంలో నిర్లక్ష్యం వహించాయన్నారు. దేశాన్ని అమ్మకానికి పెట్టిన బీజేపీకి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. భూకబ్జాకోరు అరూరి రమేష్‌కు ఐనవోలు ప్రజలు గతంలోనే గూబ గుయ్యిమనిపించారన్నారు.

మళ్లీ ఇప్పుడు కొత్త వాగ్దానాలతో మోసం చేయడానికి వస్తున్న బీజేపీ, బీఆర్ఎస్‌లకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళలకు పెద్దపీట వేసిందని, కేంద్రంలో అధికారంలోకి రాగానే ప్రతీ కుటుంబం నుంచి ఒక మహిళను ఎంపికచేసి ఏడాదికి రూ. లక్ష వేయనున్నట్లు వివరించారు. త్వరలోనే అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామన్నారు. ఆగస్టు 15 వరకు రైతుల రెండు లక్షల రుణమాఫీ జరిగి తీరుతుందన్నారు.

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ద్వారానే అభివృద్ధి, సంక్షేమం లభిస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు మాట్లాడుతూ.. కడియం శ్రీహరి గతంలో ఎంపీగా గెలిచిన సమయంలో ఐనవోలును దత్తత తీసుకొని అభివృద్ధికి బాటలు వేశారన్నారు. ఆయన కూతురు కావ్యను భారీ మెజారిటీతో గెలిపించుకుని మరింతగా అభివృద్ధి చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మార్నేని మధుమతి, కాంగ్రెస్ పార్టీ, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఐనవోలులో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య, ఎమ్మెల్యే నాగరాజు, డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు


వర్ధన్నపేటలో మాట్లాడుతున్న అరూరి రమేష్

దేశం కోసం.. ధర్మం కోసం బీజేపీని గెలిపించాలి

- రాహుల్ ప్రధాని అయ్యేది లేదు..
- రేవంత్‌రెడ్డి హామీలు నెరవేర్చేది లేదు..
- వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్
- హసన్‌పర్తి, వర్ధన్నపేటలో కార్నర్ మీటింగ్

9

రాహుల్‌గాంధీతోనే బతుకుల్లో వెలుగులు

- హసన్‌పర్తి కార్నర్ మీటింగ్‌లో కడియం కావ్య

హసన్‌పర్తి, మే 10: మన బతుకుల్లో వెలుగులు రావాలంటే రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి హసన్‌పర్తిలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్‌ల పదేళ్లపాలనలో ఎలాంటి అభివృద్ధి జరుగలేదన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో పదేళ్లలో అరూరి రమేశ్‌కు తన సొంత అభివృద్ధియే జరిగింది తప్ప.. నియోజకవర్గ అభివృద్ధి జరగలేదన్నారు. తన అభివృద్ధినే నియోజకవర్గ అభివృద్ధిగా చూపిస్తున్నాడని ఎద్దేవా చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని ఎత్తివేస్తారని, ముస్లిం రిజర్వేషన్లను రద్దుచేస్తారని అన్నారు. బీజేపీకి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఇష్టం లేదన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల అమలుకు కృషి చేస్తున్నాడని, ఎన్నికల కోడ్ అనంతరం పూర్తి స్థాయిలో అమలు జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో దేశంలో ఇందిరమ్మ రాజ్యం రాబోతుందని, మహిళల సమస్యలు తప్పక తీరుస్తానని, అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. పేదల పక్షాన నిలబడే తనకు ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, మండలపార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, 66వ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, కాంగ్రెస్ నాయకులు పింగిళి వెంకట్రాం నర్సింహారెడ్డి, తంగెళ్ళపెల్లి తిరుపతి, ఆరెల్లి వెంకటస్వామి, వీసం సురేందర్‌రెడ్డి, వింజమూరి రమణ, సాంబయ్య, చంటిరెడ్డి, జోరుక పూల, బండెల భద్రయ్య, బల్బుకూరి శ్రీనివాస్, గొర్రె కిరణ్, పుల్ల రవి, జన్ను రవి తదితరులు పాల్గొన్నారు.


హసన్‌పర్తి కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య

48గంటల పాటు మద్యం షాపులు బంద్

వరంగల్ క్రైం, మే 10: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 48 గంటలపాటు మద్యం దుకాణాలు మూసివేయాల్సిందిగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే మద్యం షాపులను మూసివేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 11వ తేదీన సాయంత్రం 6 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు 48 గంటలపాటు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎవరైనా ఉత్తర్వులు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.

వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, మే10: నిబంధనలను ఉల్లంఘించిన 9మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు. పట్టుబడ్డ 9మందిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ నలుగురికి రూ.5200, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ 5గురికి రూ.5500 జరిమానా న్యాయమూర్తి రమేష్ విధించారన్నారు.

గారడీ మాటలు నమ్మొద్దు..

అభివృద్ధి చేసే వారికే పట్టం కట్టాలి : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్


కమలాపూర్‌లో రోడ్డు షో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

కమలాపూర్, మే 10: గారడీ మాటలు నమ్మి అసమర్థులను ఎన్నుకోవద్దని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సూచించారు. శుక్రవారం కమలాపూర్ మండల కేంద్రంలో కరీంనగర్ లోక్‌సభ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి బోయినపెల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా నిర్వహించిన రోడ్డుషోలో మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్రమోదీవి గారడి మాటలు.. రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి మాటలు నీటి మూటలుగా మారాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఆర్టీసీలో ఉచిత ప్రయాణం తప్ప మరే గ్యారెంటీని అమలు చేయలేదన్నారు. అదనంగా బస్సులు నడిపించకపోవడంతో మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ఆడబిడ్డ పెళ్లికి కల్యాణలక్ష్మీ పథకాన్ని కేసీఆర్ ప్రవేశపెట్టారన్నారు. కల్యాణలక్ష్మీ పథకానికి మరో తులం వెండి కలిపి ఇస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఎందుకు అమలు చేయలేదని కేటీఆర్ ప్రశ్నించారు.

దేశంలో రాముడి పేరు చెప్పి ప్రజలను నరేంద్రమోదీ తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. బీజేపీ ఉత్తర భారతదేశంలో పూర్తిగా ఉనికి కోల్పోయిందన్నారు. భారత దేశాన్ని రామరాజ్యంగా చూడాల్సిన ప్రధాని.. కేవలం గుజరాత్ రాష్ట్రానికి మాత్రమే పరిమితమయ్యారని ఆరోపించారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదన్నారు. గుడులు, గోపురాల పేరు చెప్పకుని రాజకీయ పబ్బం గడుపుతున్నాడని మండిపడ్డారు. ఉప్పల్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని బీఆర్‌ఎస్ హయాంలో నిర్మాణం చేపట్టితే కనీసం ఎంపీగా బండి సంజయ్ ఆ బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయించని అసమర్థుడని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తి మళ్లీ అధికారంలోకి వస్తే కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గం పూర్తిగా వెనుకబడిపోతుందన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పాడి కౌశిక్‌రెడ్డి, కరీంనగర్ ఎంపీగా బోయినపల్లి వినోద్‌కుమార్‌లు జోడెద్దుల్లా పని చేసి ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. మోదీ అధికారంలోకి రాగానే నల్లధనాన్ని వెలికితీసి ప్రతీ కుటుంబానికి రూ.15లక్షలు జమచేస్తానన్న మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు.

ఆదరించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా..

కరీంనగర్ ఎంపీగా తాను చేసిన అభివృద్ధి మాత్రమే కనబడుతోందని, ఎంపీగా బండి సంజయ్ చేసిన అభివృద్ధి శూన్యమని బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపెల్లి వినోద్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లు వేసి తమ ఓటును నిరుపయోగం చేసుకోవద్దని కోరారు. ఆదరించి పార్లమెంట్‌కు పంపించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, రాష్ట్ర నాయకుడు పరిపాటి రవిందర్‌రెడ్డి, నాయకులు తక్కళ్లపెల్లి సత్యనారాయణ రావు, మారెపల్లి నవీన్‌కుమార్, లాండిగే లక్ష్మణ్ రావు, ఇంద్రసేనారెడ్డి, మౌటం శైలజా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణయ్యపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు కోల జనార్దన్‌గౌడ్


మాట్లాడుతున్న కోల జనార్ధన్‌గౌడ్

హనుమకొండ చౌరస్తా, మే 10: రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యపై దాడి చేసిన దుండగలను కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు కోల జనార్ధన్ డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ 8వ డివిజన్ గుడిబండల్‌లోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జనార్ధన్‌గౌడ్ మాట్లాడారు. ఏపీలోని శ్రీకాళహస్తిలో వైసీపీ అభ్యర్థి తరపున లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కృష్ణయ్యపై కొందరు గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లతో దాడిచేసి గాయపర్చడం దుర్మార్గమన్నారు. ఎన్నికల ప్రచారంలో కృష్ణయ్యకు ఉన్న ప్రజాదరణను చూసిన కొందరు పిరికిపందలు దాడి చేయడం యావత్తు బీసీ సమాజంపై చేసిన దాడిగా పరిగణిస్తున్నామన్నారు. బీసీల కోసం పోరాడే కృష్ణయ్యపై చేసిన దాడిని బహుజనవాదులంతా గుర్తుపెట్టుకొని బీసీ వ్యతిరేకులకు ఓటుతో సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. కృష్ణయ్యపై దాడుల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ స్పందించి మరింత భద్రత పెంచాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యామ్, జిల్లా నాయకులు పాక శ్రీనివాస్, మహిళ నాయకురాలు సరస్వతి, ఆకుల విజయ తదతరులు పాల్గొన్నారు.

13న పండ్ల మార్కెట్ బంద్

వరంగల్ వ్యవసాయం, మే 10: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని మే 13న లక్ష్మీపురంలోని పండ్ల మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు ఏనుమాముల మార్కెట్ ఉన్నత‌శ్రేణి కార్యదర్శి గుగులోతు రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పండ్ల మార్కెట్లో పనిచేసే కార్మికులు, గుమస్తాలు గ్రామాలు వెళ్లి ఓటేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో మార్కెట్లో పనిచేసేందుకు ఎవరు అందుబాటులో ఉండకపోవడం మార్కెట్‌కు సెలవు ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. 13న రైతులు మామిడికాయలు మార్కెట్‌కు తీసుకుని రావద్దని కోరారు.

రసాయన శాస్త్రంలో మాధురికి డాక్టరేట్

వరంగల్ ఎడ్యుకేషన్, మే 10: రసాయన శాస్త్రంలో పందిరి మాధురికి చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రవీందర్ డాక్టరేట్‌ను ప్రకటించారు. చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ రసాయన శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ డాక్టర్ బి.శ్రీనివాస్ పర్యవేక్షణలో 'సింథసిస్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ నావెల్ బెంజిమిడాజోల్స్ అండ్ క్వినాక్సిలిన్ మొయిటీస్ అండ్ థెయిర్ బయోలాజికల్ యాక్టివిటీ' అనే అంశంపై మాధురి సమర్పించిన పరిశోధన గ్రంథానికి డాక్టరేట్‌ను ప్రకటించారు. కాగా, మాధురి భీమారంలోని సోషల్ వెల్ఫేర్ వరంగల్ వెస్ట్ బాలికల జూనియర్ కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.

అధ్వానంగా గిరిజన హాస్టళ్లు

- ఒక్కో వార్డెన్‌కు రెండు, మూడు హాస్టళ్ల బాధ్యతలు
- పర్యవేక్షణ లేక విద్యార్థుల ఇబ్బందులు
- వార్డెన్ల నియామకాల్లో అక్రమాలు


హనుమకొండ జులైవాడలోని పోస్టుమెట్రిక్ గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహం

హనుమకొండ, మే 10 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లాలో గిరిజన సంక్షేమ హాస్టళ్లపై పర్యవేక్షణ కొరవడింది. హాస్టళ్లలో ఉండే విద్యార్థిని, విద్యార్థులపై వార్డెన్లకు పూర్తిస్థాయి అజమాయిషీ కరువవుతోంది. ఒకే వార్డెన్‌కు ఒకటికన్నా ఎక్కువ హాస్టళ్ల నిర్వహణ బాధ్యతలను అప్పగించడంతో అస్తవ్యస్థంగా మారిపోతోంది. వార్డెన్ల నియామకంలో చోటు చేసుకుంటున్న అక్రమాలతో గిరిజన సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి అధ్వాన్నంగా మారిపోతోంది. ఒక్కో వార్డెన్‌కు ఒకటికన్నా ఎక్కువ హాస్టళ్లను అప్పగించడంతో వారు ఏ హాస్టళ్లను సరిగా చూసుకోవడం లేదు. దేనిపై పూర్తిస్థాయి దృష్టి పెట్టడం లేదు. ఒక హాస్టల్‌లో ఒక రోజు, మరో హాస్టల్‌కు ఇంకో రోజు కేటాయిస్తున్నారు. హాస్టళ్ల నిర్వహణను కింది స్థాయి సిబ్బందికి వదిలేస్తున్నారు. సరైన నిఘా, పర్యవేక్షణ లేకపోవడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యహరిస్తున్నారు. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

పేద విద్యార్థులకు ఉత్తమ విద్యతో పాటు నాణ్యమైన భోజనం, వసతి కల్పించేందుకు ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేసింది. హనుమకొండ జిల్లాలో పన్నెండుకుపైగా గిరిజన సంక్షేమ బాలురు, బాలికల హాస్టళ్లు ఉన్నాయి. ఒక్కో హాస్టల్‌లో 100 నుంచి 150 మంది వరకు విద్యార్థులు, విద్యార్థినులు ఉంటారు. వారికి హాస్టల్‌లో భోజనం, వసతి సౌకర్యాలను వార్డెన్లు పర్యవేక్షించాల్సి ఉంటుంది. విద్యార్థులకు సౌకర్యాల కల్పనతో పాటు వారి సంరక్షణ, సంక్షేమం, చదువు తదితర అంశాలపై కూడా ప్రధానంగా దృష్టి పెట్టాల్సి ఉంటుంది. విద్యార్థుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాల్సి ఉంటుంది. సదుద్దేశంతో ఏర్పాటుచేసిన హాస్టళ్లలో అధికారుల నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో వార్డెన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి ఒక్కో హాస్టల్‌కు ఒక వార్డెన్ ఉండాలి. కానీ జిల్లాలో ఇందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. వీటిలో కొన్నిటికీ వారెన్లు లేరు. ఉన్నవారికే అదనపు బాధ్యతలుగా అప్పగిస్తున్నారు. ఇలా ఒకే వార్డెన్‌కు రెండు, అంతకన్నా ఎక్కువ హాస్టళ్లను అప్పగించారు.

ఒకరికి రెండు మూడు హాస్టళ్లు

ఒకే వార్డెన్‌నకు ఒకటికన్నా ఎక్కువ హాస్టళ్ల బాధ్యతలను అప్పగించడం వెనుక అవినీతి బాగోతం ఉన్నట్టు ఆరోపణలు వినవస్తున్నాయి. వార్డెన్లకు అదనంగా హాస్టల్ ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వడానికి భారీగా ముడుపులు చేతులు మారుతున్నట్టు తెలుస్తోంది. ఒక హాస్టల్ వార్డెన్ పోస్టు ఖాళీ అయితే నిబంధనల ప్రకారం అక్కడ మరో వార్డెన్‌ను వెంటనే నియమించాలి. కానీ అలా చేయడకుండా ఒక్కరికే అదనపు బాధ్యతలు ఇవ్వడం పరిపాటిగా మారింది. ఇన్‌చార్జి వార్డెన్ కావాలనుకునేవారు మధ్యవర్తిత్వం నెరుపుతున్న ఒక సీనియర్ వార్డెన్‌ను పట్టుకొని రూ.2నుంచి రూ.3లక్షలు ముడుపులు చెల్లిస్తే పని అయిపోయినట్టేనని తెలుస్తోంది.

ఉత్తర్వులు బేఖాతరు

వార్డెన్ల పోస్టింగ్‌లో ఉన్నతాధికారుల ఉత్తర్వులు బుట్టదాఖలు అవుతున్నాయి. అవి అమలుకు నోచుకోవడం లేదు. సస్పెండ్ అయి పునర్నియామకమైన ఒక సీనియర్ వార్డెన్‌కు పోస్టింగ్ ఇస్తూ ఇటీవల జారీ అయిన ఉత్తర్వులు అమలు కాకపోవడమే ఇందుకు ఉదాహరణ. ఒక సంఘటనలో సస్పెండ్ అయిన హెచ్‌డబ్ల్యువోను కొద్ది నెలల కిందట ఉద్యోగంలోకి తిరిగి తీసుకుంటూ ఆమెను హనుమకొండ జులైవాడలోని పోస్టుమెట్రిక్ గిరిజన బాలికల వసతి గృహంలో పోస్టింగ్ ఇస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కానీ జిల్లా అధికారి ఆమెకు ఆ హాస్టల్‌లో పోస్టింగ్‌కు అనుమతివ్వకుండా జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి (డీటీడీవో) కార్యాలయానికి పరిమితం చేశారు. పోస్టు మెట్రిక్ గిరిజన బాలికల వసతి గృహం వార్డెన్ పోస్టు ఖాళీగా ఉన్నా ఇవ్వకపోగా మరో వార్డెన్‌ను ఇన్‌చార్జిగా కొనసాగిస్తున్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల పోస్టింగ్‌లలో కూడా పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినవస్తున్నాయి. జనగామ జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న పలువురు టీచర్లను హనుమకొండ జిల్లాలో, ముఖ్యంగా నగరంలో ఉన్న పాఠశాలలకు డిప్యూటేషన్ వేయడం వల్ల జనగామ జిల్లాలోని గిరిజన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఐటీడీఏ పీవో ఈ విషయంలో జోక్యం చేసుకొని తగిన చర్యలు తీసుకోవాలని, గిరిజన వసతి గృహాల నిర్వహణను గాడిలో పెట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అదనపు బాధ్యతలు

- పన్నేండేళ్లుగా ఒక వార్డెన్ మూడు హాస్టళ్లకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తుండడం గమనార్హం. హనుమకొండలోని ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహం హెచ్‌డబ్ల్యువోగా ఉంటున్న ఈయన.. వడ్డెపెల్లిలోని పోస్టుమెట్రిక్ బాలుర వసతి గృహం ఇన్‌చార్జిగా కూడా అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నాడు. అంతేకాదు.. హనుమకొండ గొల్లపల్లి యాదవ్‌నగర్‌లోని ప్రభుత్వ గిరిజన బాలుర ప్రత్యేక వసతి గృహానికి కూడా ఆయన ఇన్‌చార్జి వార్డెన్.
- వరంగల్ రంగంపేటలోని ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహం వార్డెన్ రెండేళ్లుగా హనుమకొండ జులైవాడలోని పోస్టుమెట్రిక్ గిరిజన బాలిక వసతి గృహానికి కూడా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.
- హనుమకొండ జులైవాడలోని ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహం వార్డెన్ అదనంగా వరంగల్‌లోని ప్రభుత్వ గిరిజన పోస్టు మెట్రిక్ బాలిక వసతి గృహం ఇన్‌చార్జిగా కూడా విధులను నిర్వహిస్తున్నారు.
- జనగామలోని ప్రభుత్వ బాలుర వసతి గృహం వార్డెన్.. ఇక్కడే ఉన్న ప్రభుత్వ పోస్టు మెట్రిక్ బాలుర హాస్టల్ ఇన్‌చార్జి వార్డెన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. మహబూబాబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

కాంగ్రెస్ పార్టీతోనే దళితులకు న్యాయం

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



చర్చి పాస్టర్స్ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ సిటీ, మే 10: ప్రజాస్వామ్యం, లౌకికవాదం పదిలంగా ఉండాలంటే భారతీయ జనతా పార్టీని అడ్డుకోవాల్సిన అవసరం ఉందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం హనుమకొండలో చర్చి పాస్టర్స్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆత్మీయ సమావేశంలో వరంగల్ పశ్చిమ, వర్ధన్న పేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్. నాగరాజు, రాష్ట్ర నాయకుడు ఆనంద్ మోజెస్‌తో కలిసి కడియం శ్రీహరి పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా చర్చిలు ప్రమాదాలకు గురవుతున్నాయని, ప్రార్థనలు చేసుకునే అవకాశం కూడా లేకుండా చేసే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మనందరం ఒక్కటి కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దేశంలో దళితులు, ముస్లింలు, క్రిష్టియన్లపై దాడులు పెరిగాయని, ప్రధాని నరేంద్రమోదీ గాని, బీజేపీగాని ఇప్పటివరకు దళితులపై జరుగుతున్న దాడులపై స్పందించిన దాఖలాలు లేవన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే దళితులకు న్యాయం జరుగుతుందని, దళితులకు అండగా నిలబడేది కూడా కాంగ్రెస్ పార్టీనే అన్నారు. నేను అన్ని మతాలకు సమ ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎర్రబెల్లి తప్పు చేయడు

గ్యారంటీల అమల్లో కాంగ్రెస్ పార్టీ ఫెయిలైంది.. ఆ పార్టీకి ఓటెయ్యరు.. ● బీజేపీతోనే మాకు పోటీ..

బీఆర్ఎస్ ఎంపీలు ప్రశ్నించే గొంతుకలవుతారు : మాజీ మంత్రి, వరంగల్ లోకసభ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఎర్రబెల్లి దయాకర్‌రావు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)



'ఫోన్ ట్యాపింగ్, ల్యాండ్ కేసు అంటూ ఏవేవో కేసుల్లో ఇరికియ్యాలని చూశారు. కానీ, ఏం దొరకలే.. ఎర్రబెల్లి ఎప్పుడూ తప్పు చేయడు. ఓరుగల్లు రాజకీయాల్లో అంచలంచెలుగా ఎదిగిన. ప్రజల్లో ఉండి.. పోరాటాలు చేసి ఎదిగిన. కాంగ్రెస్ గ్యారంటీలను నమ్మి ప్రజలు మోసపోయిల్లు. ఐదు నెలల్లోనే కాంగ్రెస్ మోసాలు ప్రజలకు అర్థమైనయి' అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎంపీలను గెలిపిస్తేనే ప్రశ్నించే గొంతుకలై అధికార పార్టీలను నిలదీస్తారని, కాంగ్రెస్ పాంచ్ న్యాయ్‌లను నమ్మి ప్రజలు మరోసారి మోసపోయేందుకు సిద్ధంగా లేరని ఆయన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి ప్రతినిధి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి: ఎన్నికల ప్రచారం ఏలా జరుగుతోంది. ప్రజల స్పందన ఎలా ఉంది?

ఎర్రబెల్లి దయాకర్‌రావు: ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను నమ్మి ఓటేసి మోసపోయామని ప్రజలు బాధ పడుతున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మినహా ఆరు గ్యారంటీల్లో ఒకటి కూడా అమలు కావటం లేదని ప్రజలు వాపోతున్నారు. కరెంట్ లేక పంటలు ఎండిపోతున్నాయి. రైతులకు ధాన్యం పైన కనీసం రూ.500 సబ్సిడీ కూడా ఇవ్వటం లేదు. రూ.2లక్షల రుణమాఫీ డిసెంబరు 9 నుంచి పంద్రాగస్టుకు వాయిదా వేశారు. దేవుళ్లను నమ్మని రేవంత్‌రెడ్డి వేసే ఒట్లను ఎట్లా నమ్ముతారు. అందుకే రేవంత్‌రెడ్డి తన భార్య, బిడ్డలపై ఒట్టేసి పంద్రాగస్టుకు రుణమాఫీ చేస్తామని చెప్పాలి. కేసీఆర్ విజన్ ఉన్న నాయకుడు. హామీలు ఇవ్వకుండానే 24గంటల కరెంట్, రైతు బంధు, మిషన్ భగీరథ లాంటి పథకాలు అమలు చేసిండు. ఈ తేడాను ప్రజలు గుర్తిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎందుకు ఓటెయ్యాలంటే ఏం చెప్పుతారు?

ఎర్రబెల్లి: బీఆర్ఎస్ తెలంగాణ ఇంటి పార్టీ. తెలంగాణ ప్రజల తరుపున ప్రశ్నించే గొంతుకగా బీఆర్ఎస్ ఎంపీలు ఉంటారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేలు ఎట్లైతే అసెంబ్లీలో కొట్లాడుతున్నారో.. లోక్‌సభలో కూడా ప్రజా సమస్యలపై పోరాడటానికి బీఆర్ఎస్‌కు ఎంపీలు ఉండాలి. ఆరు గ్యారంటీలని ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్, మాయ మాటలతో ప్రజలను దగా చేస్తున్న బీజేపీలను నిలదీసి, తెలంగాణ ప్రజల హక్కులను సాధించే శక్తి బీఆర్ఎస్‌కు ప్రజలు ఇవ్వాలి. బీఆర్ఎస్ గత పదేళ్లలో వరంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసింది. వెయ్యి పడకల సూపర్ స్పెషాలిటీ అస్పత్రి, మెగా టెక్స్ టైల్ పార్కుతో పాటు రామప్పకు అంతర్జాతీయ గుర్తింపు వచ్చేలా చేశాం. అసెంబ్లీ ఎన్నికల్లో తప్పుడు హమీలకు మోసపోయమని బాధపడుతున్న ప్రజలు మరోసారి మోస పోవటానికి సిద్ధంగా లేరు.

ఆంధ్రజ్యోతి: బీఆర్ఎస్ నేతలు అభ్యర్థి కోసం ప్రచారం చేయటం లేదనే ఆరోపణలపై మీ సమాధానం ఏమిటీ?

ఎర్రబెల్లి: ఇది తప్పుడు ప్రచారం. నాతో పాటు మా పార్టీ నేతలందరు ప్రజాక్షేత్రంలో తిరుగుతున్నారు. ఉదయం ఆరు గంటల నుంచి అన్ని ప్రాంతాల్లో మా పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కీలక నేతలు అభ్యర్థి సుధీర్‌కుమార్‌తో కలిసి పర్యటిస్తున్నారు. పాలకుర్తి, వర్ధన్నపేటలో నాతో పాటు మాజీ స్పీకర్ మధుసూదనాచారి, పరకాలలో ధర్మారెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్‌లో రాజయ్య, భూపాలపల్లి, వరంగల్ నగరంలో మా మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ అధ్యక్షులు ఎన్నికల్లో గెలిచేందుకు కష్టపడుతున్నారు. ప్రజల దృష్టి మరలిచేందుకు కాంగ్రెస్ నేతలు చేస్తున్న దుష్ప్రచారం ఇది.

ఆంధ్రజ్యోతి: ఫోన్‌ట్యాపింగ్‌లో మీ ప్రయేయం ఉందనే ప్రచారం జరిగింది కదా?

ఎర్రబెల్లి: ఇదంతా ఒట్టిదే. నన్ను ఏదో ఒక కేసులో ఇరికియ్యాలని చూస్తున్నారు. ఎల్ల దొరుకత లేను.. ఫోన్ ట్యాపింగ్ అన్నరు.. అందులో ఏం లేదు. ఏదో ల్యాండ్ కేసు అని ఎవరితోనో కేసు పెట్టించారు. అందులో కూడా దొరకలే. నాకేందుకు ఉంటుంది.. నాకేం సంబంధం అది.. అన్ని బద్నాం చేసే పనులు. దయాకర్‌రావు తప్పు చేయడు. ఇలాంటి వాటికి భయపడే రకం కూడా కాదు. నా జీవితంలో తప్పు చేయలే. నా నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజల కోసం పని చేస్తున్న.. వారి సమస్యల పరిష్కారానికే పోరాడుతున్నాను. ప్రజల కోసమే జీవిస్తా.

ఆంధ్రజ్యోతి: బీజేపీకి పరోక్షంగా బీఆర్ఎస్ సహకరిస్తుందనే ఆరోపణలపై ఏమంటారు?

ఎర్రబెల్లి: ఇది కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ప్రచారం. ఎక్కడైనా బీజేపీకి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించామా..? వారితో కలిసి ప్రచారం చేశామా...? మరి ఎందుకు కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తున్నది.. అసలు గెలిచేదే మా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి. కాంగ్రెస్, బీజేపీలతో సమానంగా పోరాడుతున్నాం. బీజేపీనే మాకు ప్రధాన ప్రత్యర్థి. కాంగ్రెస్‌కు మూడోస్థానమే. ఆ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయటం లేదు. ఇప్పుడు కొత్తగా పంచ్ న్యాయ్ పేరుతో మరోసారి మోసం చేయాలని చూస్తుంది. రాసి పెట్టుకొండి వరంగల్‌లో గెలిచేది బీఆర్ఎస్‌నే.

ఆంధ్రజ్యోతి: ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రధాన ప్రచార అస్త్రాలు ఏంటి?

ఎర్రబెల్లి: పార్లమెంట్ ఎన్నికలు చాలా కీలకమైనవి. ప్రశ్నించే గొంతులను ప్రజలు పార్లమెంట్‌కు పంపించాలి. బీఆర్ఎస్‌కు లోకసభలో బలమిస్తే మామునూరు ఎయిర్‌పోర్టును తీసుక వస్తాం. పెండింగ్‌లో ఉన్న మెగా టెక్స్‌టైల్ పార్కుతో పాటు సైనిక్ స్కూల్‌ను వరంగల్‌లో ఏర్పాటయ్యేలా చేస్తాం. కేంద్రం ప్రభుత్వంతో కొట్లాడైనా సరే బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని సాధిస్తాం. గిరిజన యూనివర్సిటీ పూర్తయ్యేలా కృషి చేస్తాం. తెలంగాణ ప్రజలకు అండగా నిలుస్తాం. కాంగ్రెస్ పార్టీ జిల్లాలను రద్దు చేస్తామంటోంది. కడియం శ్రీహరి కూడా జనగామ జిల్లాను తొలిగించాలని అంటున్నారు. ములుగు, మహబూబాబాద్, జనగామ, భూపాలపల్లి జిల్లాలను తొలిగిస్తే పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే కలెక్టరేట్లు, ఎస్పీ కార్యాలయాలు కట్టిన తరువాత జిల్లాలను ఎలా తొలిగిస్తారు? ఇవే మా ప్రచారాస్త్రాలుగా ప్రజల్లోకి వెళుతున్నాం.

కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మడంలేదు..

50వేల మెజారిటీతో బీఆర్ఎస్ గెలుపు ఖాయం : ఐనవోలులో బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి



ఐనవోలు, మే10: కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మడం లేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బీజేపీ బీఆర్ఎస్‌కు పోటీనే కాదన్నారు. 50 వేల మెజారిటీతో వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ గెలుస్తాడని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హనుమకొండ జిల్లా ఐనవోలులోని మల్లికార్జునగార్డెన్‌లో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో అభ్యర్థి సుధీర్‌కుమార్‌తో కలిసి మాజీ మంత్రి ఎర్రబెల్లి హాజరయ్యారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. అందుకే ప్రజలు ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పడానికి సిద్ధమయ్యారన్నారు. బీజేపీ పాలపొంగులాంటిదని, ఆ పార్టీ తమకు పోటీనే కాదన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, పేదలకు లభించిన సంక్షేమ పథకాలను ప్రజలు ఇప్పటికీ కీర్తిస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో వరంగల్ స్థానం నుంచి బీఆర్ఎస్ నాలుగోసారి విజయం సాధించి చరిత్ర సృష్టిస్తుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల గ్రాఫ్‌లు రోజు రోజుకూ పడిపోతుండడంతో ఆ పార్టీల నేతలు మతితప్పి మాట్లాడుతున్నారని విమర్శించారు.

కడియం శ్రీహరి దళితుడు కాదని ఆయనది ఏ కులమో విచారణ జరిపించాలని రేవంత్‌రెడ్డి గతంలో మాట్లాడిన వీడియోను ఎర్రబెల్లి చూపించారు. కడియం పచ్చి మోసకారి అని, బీఆర్ఎస్ పార్టీతో లబ్ధిపొంది ప్రజలను వంచించాడన్నారు. అసలు సిసలైన దళితబిడ్డ సుధీర్‌కుమార్‌ను ఆదరించి ఆశీర్వదించాని కోరారు. అరూరి రమేష్‌కు రెండు సార్లు ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ అవకాశం కల్పిస్తే వందల కోట్ల రూపాయలు సంపాదించుకొని పార్టీ ఫిరాయించాడని ధ్వజమెత్తారు కడియం, అరూరిలకు ప్రజలు బుద్ధి చెప్పుదానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఏదీ అమలు కావడం లేదని, ఒక ఆర్టీసీ బస్సులను మాత్రమే తిప్పుతున్నారని అన్నారు. వర్ధన్నపేట తన అడ్డా అని, మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఒక సారి ఎంపీగా ఇక్కడి ప్రజలు గెలిపించారని అన్నారు. ఈ ఎన్నికల్లో మంచి ఫలితాన్ని ఇస్తే రానున్న రోజుల్లో వర్ధన్నపేటనే తన అడ్డా అన్నారు. పోలింగ్ తేదీ సమీపిస్తున్నందున కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని ఎర్రబెల్లి సూచించారు.

ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంనుంచి పార్టీకి, ప్రజలకు సేవలు అందించానన్నారు. తనను గెలిపిస్తే వరంగల్ జిల్లాలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వరంగల్ ప్రజలు ఎప్పుడు ఉద్యమస్ఫూర్తికే ప్రాధాన్యత ఇస్తారని ఆదే స్ఫూర్తితో బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా ఉడుతగూడెం తదితర గ్రామాల నుంచి పలువురు బీఆర్ఎస్‌పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సమావేశాల్లో మండల ఇన్‌చార్జి గుజ్జ గోపాల్‌రావు, జడ్పీ కోఆప్షన్ ఉస్మాన్‌అలీ, వైఎస్ ఎంపీపీ తంపుల మోహన్, సొసైటీ వైస్ చైర్మన్ టి. చందర్‌రావు, ఎంపీటీసీ కడుదూరి రాజు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సోమేశ్వర్‌రావు, మండల కోఆప్షన్ గుంశావలి, నాయకులు ప్రతాప్‌రావు, సురేష్, పట్టాపురం ఎల్ల గౌడ్, సతీష్, మరుపట్ల దేవదాసు, భూపాల్‌రెడ్డి, కట్కూరి రాజు, మాజీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, పార్టీ బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశం కోసం.. ధర్మం కోసం బీజేపీని గెలిపించాలి

హసన్‌పర్తి, వర్ధన్నపేటలో కార్నర్ మీటింగ్‌లో బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్



హసన్‌పర్తి కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న అరూరి రమేశ్

హసన్‌పర్తి, మే 10 : దేశప్రజల రక్షణ కోసం, ధర్మం కోసం, అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించి నరేంద్రమోదీని ప్రధానిని చేయాలని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం హసన్‌పర్తిలో కార్నర్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం అభివృద్ధి జరగాలంటే అది ఒక్క బీజేపీతోనే సాధ్యమన్నారు. పదేళ్ల మోదీ పాలనలో దేశంలో శాంతి నెలకొందని, దేశం, ధర్మం, అభివృద్ధి, రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రధాని నరేంద్రమోదీ నిరంతరం శ్రమిస్తున్నట్లు తెలిపారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యేదిలేదు.. రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చేది లేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ఇక్కడి ప్రజలకు పెద్దగా తెలియదని.. వారు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారని.. తాను పక్కా లోకల్ అన్నారు. పార్టీకి వెన్నుపోటు పొడిచి వచ్చిన కడియం శ్రీహరిని, అతడి కూతురు కావ్యని ప్రజలు, కాంగ్రెస్ పార్టీ వాళ్ళు నమ్మే స్థితిలో లేరన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలన అస్తవ్యస్తంగా తయారైందన్నారు. హామీలను నెరవేర్చక కాలయాపన చేస్తున్నాడని దుయ్యబట్టారు. ఎన్నికల్లో బీజేపీకి ఓటేసి కేంద్రంలో నరేంద్రమోదీని, వరంగల్‌లో తనను ఆశీర్వదించి, చరిత్ర తిరగరాయాలని ప్రజలను కోరారు.

అనంతరం వివిధ పార్టీల నుంచి వచ్చిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణా సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, జడ్పీటీసీ రేణుకుంట్ల సునీత, పీఏసీఎస్ చైర్మన్ జక్కు రమేశ్‌గౌడ్, నాయకులు మారెపెల్లి రాంచంద్రారెడ్డి, పిట్టల కుమారస్వామి, చకిలం రాజేశ్వర్ రావు, మారం తిరుపతి, ఎం.హరిశంకర్, పెద్దమ్మ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మొండి చెయ్యే..

బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్

వర్ధన్నపేట రూరల్, మే 10: కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ప్రజలకు మొండి చెయ్యే చూపుతారని, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. శుక్రవారం రాత్రి వర్ధన్నపేట నియోజకవర్గం కేంద్రంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. భారతదేశమంతా కమలం పువ్వు వికసించబోతోందన్నారు. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసిన గెలిచే చాన్స్ లేదని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి మళ్లీ దేశాన్ని అప్పగిస్తే మరో వందేళ్లపాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరిట మొండిచేయి చూపిందని, మళ్లీ లోక్‌సభ ఎన్నికల్లో ఆదమరచి ఓటు వేస్తే ప్రజలు అధోగతి పాలవుతారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ దళితులను అవమానపరిస్తే ప్రధాని మోదీ అక్కున చేర్చుకున్నారని తెలిపారు. అందుకు సాక్ష్యంగా ప్రధాని మోదీనే మాదిగల సభకు స్వయంగా రావడమని గుర్తుచేశారు. మాదిగ బిడ్డను అయిన తనకు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వడం గర్వకారణమని తెలిపారు. దేశంలోని దళితులకు పెద్ద పీట వేస్తూ వారి సమగ్రాభివృద్ధి కోసం కృషి చేస్తున్న బీజేపీని విమర్శించడం సరికాదని అరూరి పేర్కొన్నారు. దళితుడైన రామ్‌నాథ్ కోవిండ్‌ను రాష్ట్రపతిని చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. దక్షిణ భారతదేశం నుంచి ఇద్దరు మాదిగలను కేంద్ర మంత్రులను చేసిన చరిత్ర అందరికీ తెలుసన్నారు. నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారని స్పష్టం చేశారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చేస్తుందని ముఖ్యమంత్రి హోదాలో ఉండి మాట్లాడటం సబబు కాదన్నారు. రాజ్యాంగంపై, రిజర్వేషన్లపై బీజేపీ ఎంతో నిబద్ధతతో ఉందని, కాంగ్రెస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

కడియం శ్రీహరి టీడీపీ, బీఆర్ఎస్ పార్టీలో ఉన్నంత కాలం ఉన్నత పదవులు అనుభవించి ఏ ఒక్క దళితుడిని రాజకీయంగా ఎదగనీయకుండా చేశాడని అరూరి ఆరోపించారు. 40 ఏండ్ల పాటు రిజర్వేషన్ ఫలాలు అనుభవించి, కాంగ్రెస్ పార్టీలో చేరి దళిత నాయకులకు టికెట్ దక్కకుండా చేసి సిగ్గులేకుండా కూతురితో పోటీ చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కడియం శ్రీహరి కుటుంబానికి ఈ ఎన్నికల్లో దళితులు కర్రు కాల్చి వాత పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కడియం శ్రీహరి దళితులను అణగదొక్కాలని చూస్తున్నారని, ఈ ఎన్నికల్లో గెలిస్తే దళితులు ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. రాజకీయ లబ్ధికోసం పార్టీలు మారి తన కూతురిని ఎంపీగా గెలిపించేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ వ్యతిరేకిగా ముద్ర పడిన కడియం కుటుంబానికి పోటీ చేసే హక్కు లేదని, ఆంధ్ర ప్రాంతానికి చెందిన కావ్యను ప్రజలు ఆశీర్వదించరని ఎద్దేవా చేశారు. లోక్‌సభ నియోజకవర్గ ప్రజలు నిండు మనసుతో దీవించి బీజేపీ కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, టి.రాజేశ్వర్‌రావు, కొండేటి శ్రీధర్, జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పోల్ మేనేజ్‌మెంట్‌పై ఫోకస్

డబ్బు సక్రమ పంపిణీపైనే అభ్యర్థుల దృష్టి

పోలింగ్ సమీపిస్తున్న వేళ ఉత్కంఠ



కాళోజీ జంక్షన్, మే 10: రాజకీయ పార్టీల లోక్‌సభ ఎన్నికల ప్రచారం దాదాపుగా ముగియవస్తుండగా ఇప్పటి నుంచే పోల్ మేనేజ్‌మెంట్‌పై కసరత్తు ప్రారంభించాయి. ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తూ ఓటర్ల నాడి ఎటువైపో పసికగట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఇక చివరి అస్త్రమైన ఓటర్లకు ఎరవేసే డబ్బుల పంపిణీ సక్రమంగా జరిగే ఏర్పాట్లకు శ్రీకారం చుడుతున్నాయి. ముక్కోణపు పోటీల్లో నువ్వా.. నేనా.. అంటూ తలపడుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కోట్లాది రూపాయలు ఖర్చు చేసే స్థోమత ఉన్న అభ్యర్థులనే ఎన్నికల బరిలో నిలిపాయి. దీంతో ఏ పార్టీకి చెందని తటస్థులైన ఓటర్లు తమకు మూడు పార్టీల నుంచి డబ్బులు వస్తాయని ఆశలు పెట్టుకున్నారు. ఏదేని ఒక పార్టీకి చెందిన వారని ముద్రపడిన కుటుంబాలకు ఆ పార్టీకి చెందిన ఒక పార్టీ నుంచే ఎలాగైనా డబ్బులు పంపిణీ అవుతాయని భావిస్తు న్నారు. దీంతో మిగతా రెండు పార్టీల వారు తమకు డబ్బులు వచ్చే పరిస్థితి ఉండదని భావిస్తున్నారు.

డబ్బుల పంపిణీ ఇలా..

డబ్బు సక్రమంగా పంపిణీ చేయడంపైనే తమ విజయం ఆధారపడి ఉంటుందని అభ్యర్థులు భావిస్తున్నారు. డబ్బులు పంపిణీ చేసే బాధ్యతను స్థానిక నాయకులకు అప్పగిస్తే వారు పంపిణీ చేస్తారనే నమ్మకం ఉండదు. అందుకని అభ్యర్థులు తమ బంధువులకు, నమ్మకస్తులైన స్నేహితులకు డబ్బులు అప్పగించి స్థానిక పార్టీ కార్యకర్తలు సూచించిన కుటుంబాలకు డబ్బులు వారి ముందే అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లోని ఓటర్ల సంఖ్యలో సుమారు 60 శాతం మేరకు మాత్రమే డబ్బులు పంపిణీ అయ్యేలా అందుకు అవసరమైన మొత్తాన్ని గ్రామాలకు కేటాయిస్తున్నారు. ఎదుటి పార్టీ అభ్యర్థి ఎంత మొత్తం పంపిణీ చేస్తున్నారో ఆ పార్టీలోని కోవర్టుల ద్వారా తెలుసుకొని అంతే మొత్తం లేదా అంతకంటే ఎక్కువ మొత్తం పంపిణీ చేసేందుకు సిద్ధపడుతున్నారు. ఓటర్లు మాత్రం తమకు కుటుంబ సభ్యులను బట్టి ఆయా పార్టీలు ఎంత మొత్తం డబ్బును పంపిణీ చేస్తారోనని లెక్కలు వేసుకుంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల కంటే ఈసారి తమకు అందించే డబ్బు వేలల్లో కాకుండా వందల్లోనే ఉంటుందని అంచనా వేసుకుంటున్నారు.



ఘనంగా పరశురామ జయంతి

హనుమకొండ కల్చరల్, మే 10: హనుమకొండ బ్రాహ్మణవాడలోని బ్రాహ్మణభవన్‌లో జిల్లా పరుశరామ్ దళ్ ఆధ్వర్యంలో అక్షయ తృతీయ పర్వదిన వేళ శుక్రవారం పరుశరామ జయంతి వేడుకలు నిర్వహించారు. భక్తికి, శౌర్యానికి ఆరాధ్యదైవం అయిన మహావిష్ణువు ధరించిన దశవతారాల్లో ఎంతో విశిష్టత కలి గినది పరుశరామ అవతారమని ఈ వేడుకల్లో పాల్గొన్న అర్చక ఉద్యోగ జాక్ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ అన్నారు. జమదగ్ని రేణుకాదేవి చివరి కుమారుడైన పరుశరాముడు పౌరుషపరక్రామాలకు మారుపేరుగా తల్లిదండ్రుల పట్ల ప్రేమా నురాగాలు కలిగి ఉండే పితృవాక్య పరిపాలకుడిగా చరిత్రలో నిలిచిపోయిన క్రమంలో ఆయన ఆదర్శాలను అనుసరించేందుకు పరుశరామ్ దళ్ పని చేస్తుం డటం వి శేషమన్నారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడు మరింగంటి వెంకటరమణాచార్య, కార్యదర్శి శ్రీవర్ధనాచార్యులు, గంగు మణికంఠశర్మ, తోట పవన్, కనుకుంట్ల మేఘశ్యామ్, శ్రీను, చందర్, శ్రీమన్నారాయణ, సుధాకర్‌శర్మ పాల్గొన్నారు.

పోలింగ్ నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

• మద్యం, డబ్బు పంపిణీపై ప్రత్యేక నిఘా పెట్టాలి • రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

హనుమకొండ కలెక్టరేట్, మే10: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సమయం దగ్గర పడుతున్నందున పోలింగ్ నిర్వహణకు అధికారులు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. హైదరాబాద్‌లోని ఎన్నికల కార్యాలయం నుంచి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి శుక్రవారం రాత్రి జిల్లాల ఎన్నికల అధికారులు(కలెక్టర్లు), ఇతర ఎన్నికల అధికారులతో లోక్‌సభ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. పోలింగ్‌కు 78 గంటల ముందు, 48 గంటల ముందు చేయాల్సిన అంశాలపై కేంద్రం ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు, ఆదేశాలపై దృష్టి సారించాలన్నారు. ఎన్నికలకు రిపోర్టులను సకాలంలో పంపించాలన్నారు. పోలింగ్ సమయం దగ్గర పడుతున్నందున వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలన్నారు. ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు తీసుకున్న చర్యలపై సమాధానాలను రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపించాలన్నారు.

మద్యం పంపిణీపై ప్రత్యేక నిఘా పెట్టాలి

ఎన్నికలలో అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు, మద్యం పంపిణీచేసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రత్యేక నిఘా పెట్టాలని కలెక్టర్లకు వికాస్‌రాజ్ సూచించారు. చెక్‌పోస్టుల వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ వి ధింపు ఉంటుందని. 48 గంటల ముందు నుంచి ఎలాంటి లౌడ్ స్పీకర్లను అనుమతించవద్దన్నారు. ఎంసీఎంసీ ద్వారా మంజూరు చేసే రాజకీయ ప్రకటనల అనుమతులు తక్షణం జారీచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని, సిబ్బందికి భోజన ఏర్పాట్లు చేయాలన్నారు. పటిష్ఠ భద్రత మధ్య ఈవీఎంలను డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు, పోలింగ్ అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించాలన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశాలు జారీ చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్, అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారీ, డీఆర్వో వైవీ గణేష్, జడ్పీ సీఈఓ విద్యాలత, వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల ఏఆర్వోలు, తదితర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న వికాస్ రాజ్

శ్వేతార్కలో ప్రారంభమైన కల్యాణ వేడుకలు

కాజీపేట, మే 10: కాజీపేట శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో శుక్రవారం 26వ వసంత, కల్యాణోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐనవోలు రాధాకృష్ణ శర్మ సిద్ధాంతి, ఐనవోలు సాయికృష్ణ శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో మొదటిరోజు స్వామివారికి సుప్రభాతసేవ, గణపతి పూజ, గోపూజ, అంకురార్పణ, యాగశాల ప్రవేశంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అనంతరం స్వామి వారికి వివిధ నదుల నుంచి సేకరించిన గంగా జలాలతో అభిషేకం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ జక్కుల రమారవీందర్ యాదవ్ దంపతులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి చండీ హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మనోజ్ త్రిపాఠి, రోహిత్ ఉపాధ్యాయ, టంటం వేణు స్వామి, టంటం హరిస్వాములు ఆలయానికి విచ్చేసి భక్తులకు అర్చన చేసి తీర్థప్రసాదాలు వితరణ చేస్తూ సేవలు అందించారు. ఆలయ చుట్టూ ప్రదిక్షణలు చేసి పూజలు చేశారు. కార్యక్రమంలో రజిత సేనమ్మ, కవిత ఉమాదేవి, రాధా సునంద, కృష్ణవేణితో పాటు భక్తులు పాల్గొన్నారు.

మడికొండలో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ

హాజరైన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు


మడికొండ అంబేద్కర్ సెంటర్ వద్ద కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

మడికొండ, మే 10: మడికొండలో అంబేద్కర్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎడబోయిన ప్రభాకర్, జవ్వాజి కిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి చౌరస్తా వరకు నిర్వహించిన ర్యాలీలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం ప్రచురించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌కు రాజ్యాంగం ఇష్టం లేదన్నారు. మనుధర్మమే వారి రాజ్యాంగం అని ఆర్‌ఎస్‌ఎస్ ప్రకటించుకుందని స్పష్టం చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు మరింత అణగదొక్కబడతారన్నారు. బీజేపీని ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కట్ల బాబు, మూల ప్రశాంత్, బండారి మహేందర్, దాసరి ప్రణీత్, మూల వీరస్వామి, వంగాల శరత్, మూల నవీన్, నెలికంటి వెంకటేష్, జానపట్ల వినోద్, భూపాల్, పద్మారావు, రడ్డ దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

మోదీకి పట్టం కట్టండి..

వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్


ఆలయంలో పూజలు చేస్తున్న అరూరి రమేష్

హనుమకొండ టౌన్, మే10: దేశ భవిష్యత్ కోసం మోదీకి మరొకసారి అధికారం ఇవ్వాలని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ ప్రజలను కోరారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం హనుమకొండ భవానీనగర్‌లో కాలనీ వాసులు కమలం పువ్వుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో అల్లర్లు కావొద్దంటే మోదీని ప్రధానిగా నియమించుకుని దేశరక్షకుడిగా ఉంచుకుందామన్నారు. మోదీని కాదని కాంగ్రెస్ వైపు చూస్తే మత కల్లోలాలు, కర్ఫ్యూలను నిరంతరం చూడాల్సి వస్తుందన్నారు. భారత్‌లో భాగమైన కశ్మీర్‌ను కాపాడి అక్కడి ప్రజలకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించారన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అయోధ్య రామమందిరాన్ని నెత్తుటి చుక్క కారకుండా ప్రశాంతమైన వాతావరణలో నిర్మింపచేశారన్నారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపించి నట్లయితే మోదీ ఆశీస్సులతో వరంగల్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళతానన్నారు. అనంతరం భవానీనగర్‌లోని దుర్గా భవానీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షురాలు రావు పద్మ, కార్పొరేటర్ వసంత మహేందర్, ఆలయ కమిటీ అధ్యక్షులు లక్ష్మారెడ్డి, రాజమౌళి, జనార్దన్ రావు, బిక్షపతి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి

టీపీ జాక్ రాష్ట్ర కో కన్వీనర్ రమాదేవి

వడ్డెపల్లి, మే 10: కేంద్రంలో పదేళ్లపాటు పాలించిన బీజేపీ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీ జాక్) రాష్ట్ర కో కన్వీనర్ బి.రమాదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమెతో పాటు చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జె.కళ, కోకన్వీనర్లు ఎస్.అనిత, ఎం.సదాలక్ష్మిలు మాట్లాడారు. బీజేపీ అవినీతిని అంతమొందించేందుకు ఆపార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. ప్రజల పక్షాన మాట్లాడుతున్న అనేక మంది మేధావులు, రచయితలు, జర్నలిస్టులు, కవులు, కళాకారులను జైలులో పెడుతూ విచారణ లేకుండా, బెయిల్ రాకుండా అడ్డుకుంటుందని అన్నారు. రాజ్యాంగస్ఫూర్తితో దేశంలో ప్రజల మధ్య ఐక్యతను కాపాడుకోవాలని పేర్కొన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు. ఈ నెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకొని బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు జి.ప్రవీణ్‌కుమార్, కుమారస్వామి, ఉదయ్‌సింగ్, ఇంద్రసేనా, గురిమిళ్ల రాజు, తంపుల మొగిలి తదితరులు పాల్గొన్నారు.


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న రమాదేవి

ఎన్నికల్లో బీజేపీని ఓడించండి

కాశీజీ జంక్షన్, మే 10: బీజేపీకి మరోసారి అధికారం ఇస్తే భారత రాజ్యాంగం స్థానంలో అమానవీయ మనుధర్మశాస్త్రాన్ని రాజ్యాంగంగా అమలు చేస్తుందని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ సభ్యులు రాచర్ల బాలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు విధానాలను అడ్డుకునేందుకు పార్టీని ఓడించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కేంద్రంలో దశాబ్దకాలంగా అధికారంలో ఉన్న మోదీ.. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమై, హింస, బలప్రయోగంతో పాలన సాగించిందని ఆయన విమర్శించారు. అనేక కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేయడమే కాకుండా ప్రధాన రంగాలైన నౌక, వైమానిక, జాతీయ రహదారులను బడా కార్పొరేట్ దోపిడీ దారులైన అంబానీ, అదానీలకు ధారాదత్తం చేసిందని బాలరాజు ఆరోపించారు.

బైక్ నడిపి చూస్తానని పరారీ

ములుగు రోడ్డు షోరూం వద్ద ఘటన

మట్టెవాడ, మే 10: బైక్ బాగుంది.. ఒకసారి నడిపి చూస్తా ప్లీజ్.. అంటూ నవిస్కంచి, బైక్‌తో పరారైన సంఘటన నగరంలోని ఓ ద్విచక్రవాహన షోరూమ్ వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే.. వరంగల్ ములుగు రోడ్‌లోని ఓ ద్విచక్ర వాహన షోరూంలో ఇటీవల హనుమకొండ గుడిబండల్‌కు చెందిన యువకుడు యమహా షోరూమ్‌లో రూ.1.50లక్షలు విలువైన బైక్ కొనుగోలు చేశాడు. బైక్ సర్వీసింగ్ కోసం గురువారం ఉదయం షోరూంకు తీసుకొచ్చాడు. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి కూడా షోరూంకు వచ్చాడు. ఈక్రమంలో సర్వీసింగ్‌కు వచ్చిన యువకుడితో బైక్ బాగుంది.. ఎంతకు తీసుకున్నావు... అంటూ మాటలు కలిపాడు.. అప్పటికే మధ్యాహ్నం అవడంతో బైక్‌ను సర్వీసింగ్‌కు తెచ్చిన యువకుడు.. భోజనానికి వెళ్లడానికి సిద్ధమవగా, గుర్తు తెలియని వ్యక్తి తన బైక్‌పై తీసుకెళ్తా.. అంటూ చెప్పడంతో సరే అన్నాడు. ఇద్దరు గుడిబండల్‌లోని బైక్ యజమాని ఇంటికి వెళ్లి భోజనం చేసిన తర్వాత అదే బైక్‌పై షోరూంకు వచ్చారు. సర్వీసింగ్ అయిపోయిన బైక్‌ను తీసుకొని బయటకు రాగానే సదరు గుర్తు తెలియని వ్యక్తి 'ఒకసారి వాహనం నడిపి చూస్తాను.. నన్ను ఫొటో తీయండి' అంటూ తన మొబైల్‌ను ఇచ్చాడు. బైక్ యజమాని వీడియో తీస్తుండగా బైక్ తీసుకున్న వ్యక్తి స్టార్ట్ చేసి వెళ్లిపోయాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో అతడిచ్చిన మొబైల్‌ను చెక్ చేయగా అందులో సిమ్ లేకపోవడంతో మోసపోయినట్టు గుర్తించి లబోదిబోమంటూ షోరూం నిర్వాహకులకు, సిబ్బందికి తెలిపాడు. చోరీ విషయమై శుక్రవారం బాధితుడు మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

నేటితో ఎన్నికల ప్రచారానికి తెర

(7వ పేజీ తరువాయి)

ఆరోపణలు, ప్రత్యారోపణలు, సవాళ్లు, ప్రతిసవాళ్లతో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. అభ్యర్థులు ఒక పక్క నియోజకవర్గం సమస్యలను ఎత్తిచూపడం ద్వారా వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఓటర్లకు హామీ ఇస్తూనే మరో పక్క ప్రత్యర్థులపై విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రత్యర్థులు పరస్పరం ఒకరి బలం, బలహీనతలను బేరీజు వేసుకుంటూ, లోటుపాట్లను తెలుసుకుంటూ ఓటర్లను ఆకట్టుకునే దిశగా ఎన్నికల ప్రచారాన్ని వ్యూహాత్మకంగా సాగిస్తూవచ్చారు. ఒకరిని మించి మరొకరు తమ ప్రచార రథాలను ముందుకు నడిపించారు.

అగ్రనేతలు

బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేష్ పక్షాన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్నికల సభలో పాల్గొనడం ద్వారా ప్రచారానికి ఊపునిచ్చారు. ఖిలా వరంగల్ మండలం లక్ష్మీపూర్‌లో నిర్వహించిన సభలో మోదీ పాల్గొని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేష్‌ను గెలిపించాలని కోరారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి భన్వర్‌లాల్ శర్మ, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్‌దామి కూడా ఎన్నికల ప్రచారానికి వచ్చారు. మరికొంతమంది రాష్ట్రస్థాయి సీనియర్ నేతలు సైతం బీజేపీ అభ్యర్థికి మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య పక్షాన ఎన్నికల ప్రచారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండుసార్లు వచ్చారు. మడికొండ వద్ద భారీ బహిరంగసభలో పాల్గొనడమే కాకుండా నగరంలో రోడ్డుషోలో సైతం పాలుపంచుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ తరఫున ప్రచారానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఒకసారి నియోజకవర్గానికి వచ్చారు. ప్రచారంలో భాగంగా హనుమకొండ చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి పక్షాన మంత్రి కొండా సురేఖ కూడా నియోజకవర్గంలో ప్రచారాన్ని సాగించారు. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు సైతం అభ్యర్థుల గెలుపు కోసం చెమటోడ్చారు. పార్టీ అగ్రనేతలు ప్రచారంలో పాల్గొనడం ద్వారా ఒక వైపు ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తూనే అభ్యర్థి గెలుపుకోసం పనిచేసే విషయంలో పార్టీ శ్రేణులకు దశ, దిశా నిర్దేశం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపే ప్రయత్నం చేశారు. ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నంలో భాగంగా విమర్శనాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ నేతలు ప్రధాని మోదీ, మాజీ సీఎం కేసీఆర్ లక్ష్యంగా విమర్శనాస్త్రాలు సంధించగా బీజేపీ అయితే సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌లపై విమర్శలు ఎక్కువ పెట్టింది. బీఆర్ఎస్ ప్రధానంగా కాంగ్రెస్‌ను లక్ష్యం చేసుకున్నది. బీజేపీపై విమర్శలు సంధించింది. ప్రధాన పార్టీల అగ్రనేతలు సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకోవడంతో వరంగల్ లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం రంజుగా సాగింది. రాజకీయం వేడెక్కింది.

ఇక మాటలు బంద్

ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగియడంతో మాటలు బంద్ అయి ఇక డబ్బుకట్టల మూటలు తెరుచుకోనున్నాయి. ప్రచారం బంద్ కావడంతో ఓటర్లను ఆకట్టుకునే చివరి అంకంగా తాయిలాల పంపిణీని నేతలు మొదలు పెట్టనున్నారు. నగదుతో పాటు మద్యం పంపిణీ కూడా జోరుగా సాగనున్నది. పోలింగ్ ఈనెల 13వ తేదీన జరగనున్నది. మిగిలిన 24గంటలే అభ్యర్థులకు కీలకం. ఈసమయంలోనే ఓటర్లను ఆకట్టుకునేందుకు రకరకాల ప్రలోభాలకు పార్టీలు తెరతీయనున్నాయి. కాగా, మరో పక్క పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లపై అధికార యంత్రాంగం తుది ఏర్పాట్లలో తలమునకలు కానున్నది.

మతోన్మాద బీజేపీని ఓడించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

న్యూశాయంపేట, మే 10: మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాయల చంద్రశేఖర్ ప్రజలను కోరారు. న్యూశాయంపేటలోని నందనార్ మాల కల్యాణ మండపంలో శుక్రవారం సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఉమ్మడి జిల్లా సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాయల చంద్రశేఖర్ మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం పదేళ్లుగా దేశ ప్రజలను నిలువు దోపిడీ చేసిందన్నారు. వివిధ ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు కారు చౌకగా అమ్మిందన్నారు. ఈసారైనా నరేంద్ర మోదీ చెప్పే మోసపూరిత మాటలు, వాగ్దానాలు నమ్మి ప్రజలు మోసపోవద్దని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ చంద్రన్న, గడ్డం సదానందం, చిర్ర సూరి, అర్షం అశోక్, అడ్డూరి రాజు, బి.నరసింహారావు, కత్తుల కొమురయ్య, ధార లింగన్న, భద్రాచారి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దూడల సాంబయ్య

● కాజీపేట : లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించి, ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని దళిత బహుజన పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ దూడల సాంబయ్య అన్నారు. కాజీపేట మీడియా పాయింట్‌లో శుక్రవారం సాంబయ్య మాట్లాడారు. వర్గీకరణ సాకుతో మతోన్మాద బీజేపీతో మందకృష్ణ మాదిగ చేతులు కలపడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అందుకు మంద కృష్ణ మాదిగను నిలదీద్దాం.. ఎండగడుతాం.. అన్నారు. ఎస్సీల వర్గీకరణ, సమానవాటా కోసం 30ఏళ్లక్రితం ఆవిర్భవించిన ఎమ్మార్పీఎస్‌ను మాదిగ మేధావులు ఎత్తుకుని ఈ స్థాయికి తీసుకువచ్చారన్నారు. అలాంటి ఉద్యమాన్ని మందకృష్ణ మాదిగ బీజేపీకి తాకట్టుపెట్టడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఓ వైపు మణిపూర్ ఘటనలు, మరో వైపు రాజ్యాంగాన్ని మారుస్తాననడం తదితర ఘటనలకు పాల్పడుతున్న బీజేపీని ఓడించి, ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన పోరాట సమితి నాయకులు కేంద్ర నర్సింగరావు, సీనియర్ జర్నలిస్ట్ గాడిపల్లి మధు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను గెలిపించండి

న్యూశాయంపేట, మే 10: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని 'కుడా' మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి ప్రజలను కోరారు. ఈ మేరకు శుక్రవారం మర్రి యాదవరెడ్డి 30, 31, 52 డివిజన్లలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రజిత, సౌరం రఘు, జూకంటి రాము, లక్ష్మణ్, మహ్మద్, ఫిరోజ్, స్వామి, బాబు, అశోక్, రాకేష్, సత్తెమ్మ, రేణుక, రాజు యాదవ్, సుజాత, రాజు, రవి, తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

31వ డివిజన్‌లో..

31వ డివిజన్‌లోని న్యూశాయంపేట, జీటీరెడ్డి నగర్, రుషినగర్, దుర్గాదేవి కాలనీ, ఓరుగల్లు పెట్రోల్‌బంక్ ప్రాంతాల్లో డివిజన్ మాజీ అధ్యక్షుడు వేల్పుల వేణుగోపాల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. సుధీర్‌కుమార్‌కు ప్రతీ ఒక్కరు ఓట్లు వేసి గెలిపించాలని సీనియర్ నాయకులు తాళ్లపల్లి జనార్దన్ గౌడ్, కారు ఉపేందర్ ప్రజలను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జానకీరాములు, ఫాతిమాచారి, వెనుకంటి రాజు, శ్రీధర్‌రావు, సాంబయ్య, హరిప్రసాద్‌తో పాటు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


30వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న మర్రి యాదవరెడ్డి

రోహిత్ బలవన్మరణానికి
కారకులను అరెస్టు చేయాలి

వడ్డెపల్లి, మే 10: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి వేముల రోహిత్ బలవన్మరణానికి కారకులైన వారిని వెంటనే అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గురిమిళ్ల రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేముల రోహిత్ బలవన్మరణానికి దారితీసిన కారణాలను శోధించి అందుకు కారకులైన నిందితులపై నేరం నిరూపించాల్సిన సైబరాబాద్ పోలీసు అధికారులు.. అందుకు విరుద్ధంగా నేరం నుంచి తప్పించారని ఆరోపించారు. నిందితులను రక్షించడానికి రోహిత్ వేముల దళితుడు కాదని నేర విచారణ నివేదికను తయారు చేసి మార్చి 21న రంగారెడ్డి జిల్లా ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టుకు సమర్పించారని అన్నారు. ఆ నివేదికను ఈ నెల 3న తెలంగాణ హైకోర్టుకు అందించడంతో సభ్యసమాజానికి బహిర్గతమైందని పేర్కొన్నారు. కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు తంపుల మొగిలి, ప్రజా సంఘాల నాయకులు పోరిక ఉదయ్‌సింగ్, దిలీప్, కందిక కోమల, బి. రమాదేవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం

న్యూశాయంపేట, మే 10: కాంగ్రెస్ పార్టీతోనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజుయాదవ్ అన్నారు. 31వ డివిజన్ న్యూశాయంపేటలోని 120వ బూతులో శుక్రవారం కార్పొరేటర్ రాజు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటికి వెళు తూ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్ శ్రేణుల ప్రచారం

వడ్డెపల్లి, మే 10: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యను గెలిపించాలని కోరుతూ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదేశం మేరకు శుక్రవారం హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంకా సంపత్ యాదవ్, జిల్లా నాయకులు మేరుగు శివ, బుస్స నవీన్ తదితరులు వడ్డెపల్లిలో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ముద్రించిన మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కావ్యను గెలిపించాలని ప్రజలను కోరారు.

గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేశా..

కార్నర్ మీటింగ్‌లో మాజీ ఎమ్మెల్యే రాజయ్య

ధర్మసాగర్, మే 10 : బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేశామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. శుక్రవారం ధర్మసాగర్ మండలంలోని మల్లక్‌పల్లి, ధర్మాపురం, కరుణాపురం, పెద్దపెండ్యాల, ధర్మసాగర్, దేవునూర్, సోమదేవరపల్లి, నారాయణగిరి, ముప్పారం, తాటికాయల గ్రామాలలో వరంగల్ బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి సుధీర్‌కుమార్‌కు సంఘీభావంగా ఎన్నికల ప్రచారం నిర్వహించి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. పెద్దపెండ్యాల గ్రామంలో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులు గతంలో తాను చేసిన అభివృద్ధి పనులు మాత్రమే అన్నారు. డబ్బులకు, పదవులకు, అమ్ముడు పోయిన దొంగ కడియం శ్రీహరి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కష్టార్జితంలో గెలిచిన కడియం శ్రీహరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వెన్నుపోటు రాజకీయాలకు పరాకాష్ట అయిన కడియం శ్రీహరి లాంటి వారికి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కార్యకర్తలకు సూచించారు. గుంటూరు కోడలు కావ్యకు ఓటుతో బుద్ధి చెప్పి తెలంగాణ ఉద్యమ బిడ్డ అయిన సుధీర్ కుమార్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని కార్యకర్తలకు రాజయ్య పిలుపు నిచ్చారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పెద్దపెండ్యాల గ్రామంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న రాజయ్య

అబ్బ ఛా!

అవినాశ్ ఎలాంటి వాడో అందరికీ తెలుసు..


ఏపీ సీఎం జగన్

అవినాశ్ నాకన్నా 13 ఏళ్ల చిన్నపిల్లోడు. మా అందరికన్నా చిన్నపిల్లోడు.. ఈ పిల్లాడి జీవితం నాశనం చేయడం కోసం చంద్రబాబు దగ్గర నుంచి అందరూ కుట్రలు పన్నుతున్నారు. అవినాశ్ ఎలాంటి వాడో మీ అందరికీ తెలుసు.

నీకోసం త్యాగం చేశానని బైబిల్‌పై ప్రమాణం చేస్తా

నేను డబ్బు, పోస్టు అడిగానని ప్రమాణం చేయగలరా?.. నన్ను రాజకీయాల్లోకి తీసుకొచ్చింది ఎవరు?

- రాజకీయ కాంక్ష ఉంటే వైసీపీని హైజాక్ చేయలేనా?
- అవినాశ్‌రెడ్డి చెప్పిన మాటలకు కన్విన్స్ అవడానికి నువ్వెవరు?
- నువ్వేమైనా రాజ్యాంగమా?
- జగన్‌ను నిలదీసిన షర్మిల
- పెయిడ్ ఆర్టిస్టులకు కుక్క బిస్కెట్లు వేసి మరీ నాపై నిందలు
- మీడియా సమావేశంలో కన్నీరు పెట్టిన షర్మిల



కడప, మే 10(ఆంధ్రజ్యోతి): 'నీకోసం నేను త్యాగం చేశానని బైబిల్ మీద ప్రమాణం చేస్తా.. నేను డబ్బు, పోస్టు అడిగానని మీరు ప్రమాణం చేయగలరా..?' అని పీసీసీ చీఫ్, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిలరెడ్డి తన సోదరుడు ఏపీ సీఎం వైఎస్ జగన్‌ను ప్రశ్నించారు. కడప డీసీసీ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. షర్మిలకు రాజకీయ కాంక్ష ఉన్నందుకే వైఎస్ కుటుంబంలో విభేదాలు వచ్చాయని ఇటీవల ఒక టీవీ చానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో జగన్ చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందించారు. షర్మిలను ప్రోత్సహిస్తే అది నెపోటిజం, కరప్షన్‌కు దారితీస్తుందనడంపై మండిపడ్డారు. 'నేను పాదయాత్ర చేసినపుడు మీరు జైల్లో ఉన్నారు. మొత్తం పార్టీ నా చుట్టూనే ఉంది.. నాకు రాజకీయ కాంక్ష ఉంటే వైసీపీని అప్పుడే హైజాక్ చేయలేనా? జగనన్న వస్తాడని కాలికి బలపం కట్టుకొని తిరిగింది నేను కాదా?' అని షర్మిల ప్రశ్నించారు. అసలు తనని రాజకీయాల్లోకి తీసుకొచ్చింది ఎవరని నిలదీశారు. సమైక్యాంధ్ర ఉద్యమం, తెలంగాణలో ఓదార్పు యాత్ర, బైబై బాబు క్యాంపెయిన్ వంటి కార్యక్రమాలు ఎవరు అడిగితే చేశానని అన్నారు. 'వీళ్ళమ్మల్ని ముఖ్యమంత్రి చేసే వరకు నేను చేసింది త్యాగమే. మీ కోసం జీవితాన్ని త్యాగం చేసిన నన్ను రాజకీయల కోసం నెపోటిజం అంటారా ?' అని గద్గద స్వరంతో ప్రశ్నించారు. రాజకీయంగా వ్యతిరేకించినందుకు తనపై తప్పుడు ప్రచారం చేయించిన జగన్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. పెయిడ్ ఆర్టిస్టులకు కుక్క బిస్కెట్లు వేసి మరీ నిందలు వేశారంటూ ఆమె కన్నీరు పెట్టుకున్నారు. ఒకే జనరేషన్‌కు చెందిన రాజారెడ్డి, జయమ్మ, సౌభాగ్యమ్మ, వివేకా రాజకీయాల్లో ఉన్నప్పుడు లేని నెపోటిజం.. ఇప్పుడు ఎందుకు వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను, తన భర్త ఇప్పటిదాకా పైసా సాయం అడగలేదని, దమ్ముంటే తాము అడినట్టు నిరూపించాలని సవాలు విసిరారు. ఇక, జగన్ మానసిక పరిస్థితి బాలేదని, ఆయనకు చంద్రబాబు పిచ్చి పట్టిందని షర్మిల అన్నారు. అందుకే తనతోపాటు సునీత, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అందరినీ చంద్రబాబు చేతిలో కీలుబొమ్మలని జగన్ అంటున్నారని తెలిపారు. అవసరానికి మాటలు మార్చే జగన్‌కు విలువలు, విశ్వసనీయత లేవని తేల్చిచెప్పారు. వైఎస్సార్ మరణంలో రిలయన్స్ హస్తం ఉందని ఆరోపించిన జగన్.. ముఖ్యమంత్రి అయ్యాక ఆ సంస్థకు చెందిన వారిని రాజ్యసభకు పంపారని గుర్తు చేశారు. అలాగే, వివేకానంద వ్యక్తిగత జీవితంపై దుష్ప్రచారాలు చేయిస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ పేరు చార్జీషీట్‌లో చేర్చేలా చేసిన వారికి పదవులు ఇచ్చింది జగన్ అని వివరించారు.

దొంగ మాటలు పిచ్చోళ్లు నమ్ముతారు

అవినాశ్ రెడ్డి ఇచ్చిన ఇంటర్వ్యూలు చూసి వివేకా హత్యకు ఆయనకు సంబంధం లేదని కన్విన్స్ అయ్యాయని జగన్ ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినాశ్ నిర్దోషి అని కన్విన్స్ అవడానికి నువ్వు ఎవరు? నువ్వు ఏమైనా రాజ్యాంగమా? చట్టమా? అని మండిపడ్డారు. నిర్దోషులు అయితే సీబీఐకి ఎందుకు తప్పించుకుని తిరుగుతున్నారు. దొంగ ఎప్పుడైనా దొంగ అని చెబుతాడా.. దొంగ మాటలు పిచ్చోళ్లు నమ్ముతారు.. అంటే ఇక్కడ జగన్ పిచ్చోడు కాదా?. అని షర్మిల పేర్కొన్నారు. ఇక, వైఎస్ జగన్ అవినీతి చక్రవర్తి అని, రాష్ట్రంలో అవినీతి క్యాన్సర్‌లా విస్తరిస్తూ ప్రజలను మింగేస్తోందని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు న్యాయ నవ సందేహాల పేరుతో రాష్ట్రంలో అవినీతిపై సీఎం జగన్‌కు ఆమె ఓ బహిరంగ లేఖ రాశారు. ఇసుక దందా, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వంటి అంశాలపై ఈ లేఖలో ప్రశ్నించారు.

భారతి నన్ను నరికేస్తారో.. షర్మిలను నరికేస్తారో?

- మాకు ప్రాణహాని ఉంది..
- అన్నిటికీ తెగించి పోరాడుతున్నాం
- నా పిల్లలకు వీలునామా రాసి వచ్చా
- వివేకా కుమార్తె సునీత వ్యాఖ్యలు



ప్రొద్దుటూరు, మే 10: 'భారతి నన్ను నరికేస్తారో... షర్మిలను నరికేస్తారో తెలియదు. సింగిల్ ప్లేయర్‌గా ఉండాలంటే అదొక్కటే వాళ్లకు అవకాశం. నేనైతే నా పిల్లలకు వీలునామా రాసి వచ్చాను. అన్నీ తెగించే మీ ముందుకొచ్చాను. పులివెందులలో సింగిల్ ప్లేయర్‌గా అవినాశ్ ఉండాలని వివేకాను దారుణంగా చంపేశారు' అని ఆయన కుమార్తె డాక్టర్ సునీత సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో ఆమె విలేకరులతో మాట్లాడారు. భారతి మళ్లీ అదే మాటలు అంటోందంటే మళ్లీ హత్యలు చేయడానికి వాళ్లకు ప్లానుందా అని ప్రశ్నించారు. అవినాశ్‌కు ఎప్పటికైనా సమస్య సృష్టిస్తారేమోనని, జగన్‌ను ఎదిరించగల సత్తా ఉందనే భయంతోనే వివేకాను హత్య చేశారని ఆరోపించారు. ఇప్పుడు మళ్లీ అదే మాట్లాడుతున్నారంటే.. వారికి ఇంకో ప్లాన్ ఉన్నట్లుందని ఆరోపించారు. తనకు, తన భర్తకు ఎప్పుడైనా ఏమైనా కావచ్చని సునీత ఆందోళన వ్యక్తం చేశారు.

బాబు కోసం కాంగ్రెస్ కుట్రలు

- కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి..చంద్రబాబు మనిషి
- ఆ పార్టీకి ఓటు మన కళ్లు మనమే పొడుచుకున్నట్టు
- అవినాశ్ చిన్నపిల్లాడు: మరోసారి జగన్ సమర్థన

పుత్తూరు, మే10(ఆంధ్రజ్యోతి)/కడప(ఎర్రముక్కపల్లె), మంగళగిరి : తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిని గెలిపించడం కోసం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తోందని సీఎం జగన్ అన్నారు. చిన్నాన్న వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు, ఎంపీ అవినాశ్‌రెడ్డిని చిన్నపిల్లాడు అంటూ మరోసారి వెనుకేసుకువచ్చారు. శుక్రవారం కడప, గుంటూరు జిల్లా మంగళగిరి, తిరుపతి జిల్లా పుత్తూరుల్లో జరిగిన ప్రచార సభల్లో జగన్ మాట్లాడారు. కడప సభలో కాంగ్రెస్ పార్టీపై జగన్ విరుచుకుపడ్డారు. "రాజకీయ స్వార్థం కోసం కాంగ్రెస్ బరితెగించింది. వైసీపీ ఓట్లు చీల్చడం ద్వారా చంద్రబాబుకు, ఎన్డీయే కూటమికి లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతో ఆ పార్టీ రాష్ట్రంలో రంగ ప్రవేశం చేసింది. ఎన్నికల వేళ కాంగ్రెస్ నేతలు రాష్ట్రానికి ఎందుకు వచ్చారో ఆలోచించాలి. చంద్రబాబు రాజకీయాల్లో ఇది భాగం. ఆయన మనిషి రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. చంద్రబాబు పగలు బీజేపీతో, రాత్రి కాంగ్రెస్‌తో కాపురం చేస్తారు. వైఎస్ రాజశేఖరరెడ్డి బతికి ఉన్నప్పుడు ఎవరితో అయితే యుద్ధం చేశారో, వారితోనే ప్రస్తుతం వైఎస్ వారసులమని చెప్పుకొంటున్నవారు చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నా"రంటూ షర్మిలను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. వైసీపీ ఓట్లు చీల్చి చంద్రబాబును గెలిపించడం కోసం కోసమే ఇదంతా చేస్తున్నారని జగన్ ఆరోపించారు. వైఎస్ మరణం తరువాత ఆయన పేరును చార్జిషీట్‌లో పెట్టిన పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. ఇప్పుడేమో చార్జిషీట్‌లో మన మంతట మనమే వైఎస్ పేరు చేర్చామని కొత్త కథలు చెబుతున్నారంటూ షర్మిలను ఉద్దేశించి మండిపడ్డారు.

ఇసుక అక్రమ తవ్వకాలు తక్షణం ఆగాలి

- జగన్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లో ఇసుక అక్రమ తవ్వకాలను తక్షణం నిలిపివేయాలని జగన్ సర్కార్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. మైనింగ్ జరిగే ప్రాంతాలకు వెంటనే వెళ్లి ఈ తవ్వకాలను ఆపేయించాలని అధికారులకు ఆదేశాలు జారీచేసింది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అధికారులు కూడా క్షేత్ర స్థాయిలో పర్యటించి తగిన చర్యలు తీసుకోవాలని, అక్రమ మైనింగ్‌ను నిలిపివేశారా లేదా అనేది తనిఖీలు చేయాలని ఆదేశించింది. అక్రమ మైనింగ్‌పై తాము తగిన చర్యలు తీసుకున్నామన్న రాష్ట్ర ప్రభుత్వం వాదనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. 'మీ చర్యలు అన్నీ కాగితాలపై కనిపిస్తున్నాయి. కాని ఆచరణలో కనిపించడం లేద'ని న్యాయమూర్తి జస్టిస్ అభయ్ ఎస్ ఓకా నేతృత్వంలోని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఏపీ ఎన్నికలపై.. తెలంగాణలో బెట్టింగ్..!

హైదరాబాద్, మే10 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ నెల 13న తెలుగు రాష్ట్రాల్లోనూ పోలింగ్ జరగనుంది. తెలంగాణలో పార్లమెంటు ఎన్నికలు జరుగుతున్నప్పటికీ ఇక్కడంతా ఏపీ ఎన్నికలపైనే చర్చ ఎక్కువగా జరుగుతోంది. ఓట్లు, ప్రాంతంతో సంబంధం లేకుండా ఈ సారి ఎన్నికల్లో ఏపీలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే అంశంపైనే చర్చ జరుగుతోంది. అంతేకాదు ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయనే అంశంపై ఏకంగా బెట్టింగ్‌లు వేస్తున్నట్టు సమాచారం. ముఖ్యంగా హైదరాబాద్‌లోని హైటెక్‌సిటీ, కూకట్‌పల్లి, అమీర్‌పేట, బంజారాహిల్స్ జూబ్లీహిల్స్, మల్కాజ్‌గిరి సహా రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లోని ఏపీ, తెలంగాణ ప్రజల్లో ఈ చర్చ మరింత ముదురుతోంది. ఎన్నికలకు మరో రెండు రోజులే సమయం ఉండడంతో ఎన్నికలపై ఉత్కంఠ నెలకొంది.

బటన్ కుట్రలు బద్దలు!

ఏపీలో జగన్నాటకం బయటపెట్టిన ఎన్నికల కమిషన్.. జనవరి-మార్చి మధ్య 6 పథకాలకు బటన్ నొక్కుడు

- ఖాతాల్లో జమ చేయకుండా జాప్యం
- పోలింగ్‌కు ముందు వేసి లబ్ధికి కుట్ర
- హైకోర్టు ఇచ్చిన వెసులుబాటుతో అర్ధరాత్రి హంగామా
- అనుమతి కోసం ఈసీకి సీఎస్ లేఖ
- వరుస ప్రశ్నలు సంధించిన ఈసీ
- జనవరి-మార్చి మధ్య ఆర్థిక పరిస్థితి ఏమిటి? ఇప్పుడే నిధులెలా వచ్చాయి?
- గతంలో ఎప్పుడు జమ చేశారు?
- ఇన్ని నెలలాపి ఇప్పుడు అర్జంట్ ఏమిటి
- బదులివ్వాలని సీఎస్‌కు ఈసీ ఆదేశాలు
- సీఎస్ జవాబుతో కుట్రపై ఇంకా స్పష్టత
- పోలింగ్ తర్వాతే జమ చేయాలి: ఈసీ

అమరావతి, మే 10 (ఆంధ్రజ్యోతి): నే.........రుగా పడాల్సిన డబ్బులు ఎక్కడాగిపోయాయి? బటన్ నొక్కిన నాలుగు నెలలకు కూడా లబ్ధిదారుల ఖాతాల్లోకి ఎందుకు జమ కాలేదు? కావాల్సిన కాంట్రాక్టర్లకు వేల కోట్లు చెల్లించేసి.. పేదలు, బడుగు, బలహీన వర్గాలకే 'ఈ బిడ్డ' ఎందుకు డబ్బులు ఆపేశారు? అప్పుడెప్పుడో బటన్ నొక్కి, తన సొంత, రోత పత్రికకు అప్పుడే కోట్ల విలువైన ప్రకటనలు ఇచ్చుకుని... అసలు లబ్ధిదారులకు మాత్రం ఇప్పుడు డబ్బులు వేస్తామనడమేమిటి? ఇదంతా... జగన్నాటకం! పోలింగ్‌కు ఒకటి, రెండు రోజుల ముందు ఖాతాల్లో డబ్బులు జమచేసి, జనం సొమ్ముతోనే జనం ఓట్లను కొనుగోలు చేయాలన్న వ్యూహం! ఈ జగన్నాటకాన్ని ఎన్నికల సంఘమే బయటపెట్టింది. ఇప్పుడో జనవరిలో నొక్కిన బటన్ సొమ్ములు ఇప్పుడు జమచేసి ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న కుయుక్తులను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కడిగిపారేసింది. 'జవాబు చెప్పండి' అంటూ శుక్రవారం ఈసీ సంధించిన ప్రశ్నలతో ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, ఆర్థిక శాఖ అధికారులు ఉక్కిరిబిక్కిరయ్యారు. "ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా, అదీ పోలింగ్‌కు రెండు రోజుల ముందు లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులేయడమంటే అధికార బలంతో ఓటర్లను ప్రభావితం చేయడమే! ఇది కోడ్‌ను ఉల్లంఘించడమే. పోలింగ్ ముగిసిన తర్వాత (మే 13) ఎప్పుడైనా ఖాతాల్లో డబ్బులు వేసుకోవచ్చు" అని సీఎస్‌ను ఈసీ ఆదేశించింది.

అర్ధరాత్రి హంగామా...

హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పుతో లభించిన వెసులుబాటుతో... అప్పటికప్పుడు డబ్బులు వేసేలా గురువారం అర్ధరాత్రి ఉరుకులు పరుగులు తీశారు. హైకోర్టు తీర్పు ఎలా ఉన్నప్పటికీ... ఎన్నికల ముందు జనం ఖాతాల్లో డబ్బులు వేయాలంటే ఈసీ అనుమతి కావాల్సిందే. దీంతో... కోర్టు తీర్పును ఉటంకిస్తూ, తమకు అనుమతి ఇవ్వాలని గురువారం అర్ధరాత్రి 1 గంటకు ఈసీకి సీఎస్ లేఖ రాశారు. శుక్రవారం ఉదయం దీనిపై ఈసీ స్పందించింది. వరుస ప్రశ్నలు సంధించింది. అవి...



- జనవరి, ఫిబ్రవరి, మార్చిలోనే బటన్లు నొక్కినప్పటికీ.. డబ్బుల్లేక డీబీటీ చేయలేదని చెప్పారు కదా! అప్పుడు లేని డబ్బులు సరిగ్గా పోలింగ్‌కు రెండు రోజుల ముందు ఎలా వచ్చాయి?
- జనవరి - మార్చి వరకు రాష్ట్ర ఆదాయం, ఖర్చుల వివరాలు పంపండి. అలాగే, 6 పథకాలకు ఒకే సారి డీబీటీ చేయడానికి ఇన్ని డబ్బులెలా వచ్చాయో చెప్పండి!
- ఐదేళ్లలో ఈ 6 పథకాలకు ఎప్పుడెప్పుడు బటన్లు నొక్కారు? ఎన్ని రోజులకు ఖాతాల్లో డబ్బులు పడ్డాయి? ఇన్ని పథకాలకు కలిపి గంపగుత్తగా ఖాతాల్లోకి గతంలో ఎప్పుడైనా విడుదల చేశారా?
- పోలింగ్ తర్వాతే డీబీటీ చేయాలన్న ఈసీఐ ఆదేశాలకు వ్యతిరేకంగా కోర్టులో పిటిషన్ వేసిన వారు ఈ పథకాల లబ్ధిదారుల జాబితాలో ఉన్నారా?
- 5 నెలల నుంచి నొక్కుతున్న బటన్ల డబ్బులను ఈ రోజే(పదో తేదీనే) ఖాతాల్లో వేయాల్సిన అత్యవసరం ఏంటి వేయకపోతే ఈ ఒక్క రోజులో ఏమైపోతుందో చెప్పండి.
- మార్చిలో కోడ్ వస్తుందని, మేలో పోలింగ్ ఉంటుందని తెలిసినా డబ్బులు ఖాతాల్లో ఎందుకు వేయలేదు?
- బటన్లు నొక్కిన పథకాలకు ఫలానా తేదీల్లో డబ్బు జమ చేయాలని ముందుగానే నిర్ణయించారా? సంబంధిత జీవోలు, ఆదేశాల కాపీలు, పత్రాలు ఉన్నాయా?

కుట్ర బట్టబయలు...

ఈసీ ప్రశ్నలకు సీఎస్ శుక్రవారం మధ్యాహ్నం సమాధానాలతో లేఖ రాశారు. దానిపై సాయంత్రానికే ఈసీ తన ఆదేశాలు వెలువరించింది. "మీరు ఇచ్చిన వివరాల ప్రకారం... జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఆర్థిక పరిస్థితి బాగానే ఉంది. ఇప్పుడు ఖాతాల్లో వేస్తామంటున్న డబ్బులను అప్పుడే వేసేందుకు నిధులు ఉన్నాయి. కానీ, జాప్యం జరగడానికి సీఎస్ చెప్పిన సమాధానం సంతృప్తికరంగా లేదు. పైగా... మే నెలలో ఎప్పుడూ డీబీటీ పథకాలకు నిధులు జమ చేయలేదు. ఇప్పుడు.. పోలింగ్ ముందురోజే, శుక్రవారమే వేయాల్సినంత అత్యవసరం ఏముంది? పోలింగ్ తర్వాత ఎప్పుడైనా జమ చేసుకోండి" అని ఆదేశాలిచ్చింది. ఎన్నికల్లో లబ్ధికే ఇప్పుడు డబ్బులు వేయాలనే వ్యూహం రచించినట్లు నిర్ధారణకు వచ్చింది.

అక్రమాలు చేయలేం!

తేల్చిచెప్పిన అధికారులు

జగన్ వీరవిధేయులైన సీఎస్, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు డబ్బులు విడుదల చేయడానికి అన్నీ సిద్ధం చేసుకున్నప్పటికీ... కిందిస్థాయి అధికారులు గీత దాటేందుకు ససేమిరా అన్నారు. బడ్జెట్, బీఆర్వోలు లేకపోవడంతో పాటు సాంకేతికంగానూ కుదరలేదు. ఈసీ ఆదేశాలకు వ్యతిరేకంగా, కోడ్‌కు విరుద్ధంగా పనిచేయడానికి ఇతర శాఖల అధికారులు, ఉద్యోగులు ముందుకురాలేదు. గురువారం రాత్రి హైకోర్టు ఉత్తర్వులు రాగానే... తెల్లారేసరికే లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేయాలంటూ అన్ని శాఖలపై ఆర్థిక శాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ తీవ్ర ఒత్తిడి చేశారు. నిజానికి... ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఆ 6 పథకాలకు బడ్జెట్ కేటాయించలేదు. కొత్త ఆర్థిక సంవత్సరంలోబడ్జెట్ రిలీజ్ ఆర్డర్లు ఇవ్వలేదు. తమ శాఖల నుంచి నిధుల విడుదల చేయబోమని అధికారులు స్పష్టంగా చెప్పారు. అదనపు బడ్జెట్, బీఆర్వోలు కావాలంటూ కొందరు ఆర్థిక శాఖకు ఫైళ్లు పెట్టారు. మరోవైపు.. అప్పటికప్పుడు డబ్బులు పంపేలా ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు కొన్ని సాఫ్ట్‌వేర్ మార్పులు చేయడానికి ప్రయత్నించారు. 6 పథకాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను ప్రాథమికంగా క్లియర్ చేసినప్పటికీ, ఆర్బీఐకి సంబంధించి ఈ-కుబేర్ ప్లాట్‌ఫామ్‌పై వాటిని చివరి నిమిషంలో ఆపాల్సి వచ్చింది.

ఇదీ జరిగింది..

4 నెలల కిందట నొక్కిన బటన్‌లకు ఎన్నికల ముందు డబ్బులేసి లబ్ధి పొందాలన్నది జగన్ వ్యూహం! గురువారం ఉదయం నుంచి శుక్రవారం రాత్రి దాకా ఈ హైడ్రామా సాగిందిలా...

గురువారం: ఎప్పుడో నొక్కిన బటన్‌లకు ఇప్పుడు, పోలింగ్ ముందు డబ్బులు ఇవ్వడం ప్రజాప్రాతినిధ్య చట్టం, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధమని ఈసీ స్పష్టం చేసింది.

రాత్రి 10 గంటలు: ఈసీ ఆదేశాలను శుక్రవారం వరకు నిలిపివేస్తూ హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. 11, 12, 13 తేదీల్లో మాత్రం నిధులు వేయొద్దని ఆదేశించింది.

అర్ధరాత్రి 1 గంట: హైకోర్టు ఉత్తర్వులతో వచ్చిన వెసులుబాటు నేపథ్యంలో... బటన్‌నొక్కుడు డబ్బులు వేసేందుకు అనుమతించాలని ఈసీకి సీఎస్ జవహర్ రెడ్డి లేఖ.

శుక్రవారం ఉదయం: ఇప్పుడే డబ్బులు ఎందుకు వేయాలనుకుంటున్నారు, జనవరి నుంచి మార్చి మధ్య మీ ఆర్థిక పరిస్థితి సహకరించలేదా.. వివరాలు చెప్పాలని ఈసీ ఆదేశం.

మధ్యాహ్నం 2 గంటలు: ఆర్థిక పరిస్థితి వివరిస్తూ ఈసీకి జవహర్ రెడ్డి జవాబు.

సాయంత్రం 4 గంటలు: హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పుపై అప్పీలును విచారించిన ధర్మాసనం... ఈ సమయంలో ఉత్తర్వులు ఇచ్చినా ప్రయోజనం ఉండదనే అభిప్రాయంతో విచారణ వాయిదా!

సాయంత్రం 7 గంటలు: సీఎస్ లేఖలో పొందుపరిచిన వివరాలను పరిశీలించిన ఈసీ. నిధుల విడుదలలో జగన్ సర్కారు కావాలనే జాప్యం చేసినట్లు నిర్ధారణ. "జనవరి నుంచి మార్చి వరకు బాగున్నా... అప్పుడు ఎందుకు ఇవ్వలేదు? గతంలో ఎప్పుడూ మే నెలలో డీబీటీ నిధులు ఇచ్చి దాఖలాలు లేవు కదా! ఇప్పుడు మాత్రం అత్యవసరం ఏముంది? పోలింగ్ ముగిశాకే డబ్బులు వేసుకోవచ్చు" అని ఈసీ స్పష్టీకరణ.

మరో 4,000 కోట్ల అప్పు

కొత్తగా మరో రూ.4,000 కోట్ల అప్పులు తెచ్చేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధమవుతోంది. మంగళవారం రిజర్వ్ బ్యాంకులో రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలు వేలం వేసి రూ.4,000 కోట్లు అప్పు తెస్తున్నారు. ఏప్రిల్, మే నెలలో ఇప్పటి వరకు కలిపి ప్రభుత్వం రూ.17,000 కోట్ల అప్పులు తెచ్చింది.



అబ్ కీ బార్?

రేవంత్ నా శిష్యుడే!



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నా శిష్యుడే. ఆయన ఎప్పుడూ ఓ చోట స్థిరంగా ఉండరు. వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నన్ను కాంగ్రెస్‌లోకి రావాలని ఆహ్వానించారు. రూ.100 కోట్లు, మంత్రి పదవి ఆఫర్ చేసినా నేను వెళ్లలేదు. ఇది మనసులో పెట్టుకొని వైఎస్సార్ తన వర్ధన్నపేట నియోజకవర్గాన్ని ఎస్సీలకు రిజర్వ్ చేశారు. కడియం శ్రీహరి విశ్వాస ఘాతకుడు. చంద్రబాబు, కేసీఆర్‌ను మోసం చేసిన ఘనుడు.

- ఎర్రబెల్లి దయాకర్‌రావు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు

» కేటీఆర్ రోడ్ షో ఘటనపై నాలుగు కేసుల నమోదు

» 23 మంది నిందితుల అరెస్టు: నిర్మల్ జిల్లా ఎస్పీ

భైంసా, మే 10 : ఉద్రిక్తతకు దారి తీసే విధంగా వ్యవహరిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల హెచ్చరించారు. నిర్మల్ జిల్లా భైంసా పట్టణ పోలీసుస్టేషన్‌లో ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రశాంత వాతావరణానికి భంగం వాటిల్లితే సహించేది లేదన్నారు. కారకులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గురువారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో సందర్భంగా జరిగిన వివిధ ఘటనలపై భైంసా పట్టణ పోలీసుస్టేషన్‌లో నాలుగు కేసులు నమోదు చేశామన్నారు. ఇందులో ఎన్నికల కోడ్ ఆఫ్ కండక్ట్ కేసు కూడా ఒకటి ఉందన్నారు. సంబంధిత కేసుల్లో శుక్రవారం 23 మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

తనిఖీల్లో రూ. 53.95 లక్షల నగదు స్వాధీనం

» రూ. 10.60 లక్షల విలువైన పీడీఎస్ బియ్యం సైతం

కరీంనగర్, హైదరాబాద్ సిటీ మే 10(ఆంధ్రజ్యోతి): సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.53,95,583 నగదుతోపాటు అక్రమంగా తరలిస్తున్న రూ.10.60 లక్షల విలువైన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సూరారం వద్ద సంగం సెక్యూరిటీ సొల్యూషన్స్ వాహనంలో తరలిస్తున్న రూ.32,54,400 నగదును మేడ్చల్ ఎస్‌వోటీ సిబ్బంది గుర్తించారు. నగదుకు సంబంధించి సరైన పత్రాలు, ఈసీ జారీ చేసిన క్యూఆర్ కోడ్ లేకపోవడంతో నగదును సీజ్ చేశారు. కూకట్‌పల్లి ప్రాంతంలో సీఎంఎస్ వాహనంలో తరలిస్తున్న రూ.1,77,532ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే కరీంనగర్ రెండోరాణా పరిధిలో నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.19,63,651 నగదును పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా షాద్‌నగర్‌లో ఓ లారీలో తరలిస్తున్న 35 టన్నుల రేషన్ బియ్యాన్ని, శంషాబాద్ పరిధిలోని పెద్దగోల్కొండ వద్ద ఆటోలో మరో టన్ను, కిస్మత్‌పూర్ వద్ద లారీలో తరలిస్తున్న 17టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

బీజేపీకి మజ్లిస్ బీటీం కాదు

» ప్రియాంకగాంధీ వ్యాఖ్యలపై అసదుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందడానికి మజ్లిస్ పార్టీ సహకరిస్తుందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ చేసిన వ్యాఖ్యలను ఆ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ఖండించారు. ఎన్నికల్లో మజ్లిస్ ఏ పార్టీకి సహకరించదని, బీజేపీకి బీటీంకాదని స్పష్టం చేశారు. మజ్లిస్.. మజ్లిస్‌గానే కొనసాగుతుందన్నారు. 2019లో కాంగ్రెస్ కంచుకోట అయిన అమేఠీలో బీజేపీ నాయకురాలు స్మృతి ఇరానీ చేతిలో రాహుల్‌గాంధీ ఓటమికి మజ్లిస్ కారణం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఒవైసీ అన్నారు. బాబ్రీ మసీదు కూల్చివేత ఘటనకు కారణమైన శివసేనతో పొత్తుపెట్టుకున్నారని.. ఆయన సెక్యులరిస్టా? అని ప్రశ్నించారు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీతో పొత్తుపెట్టుకున్నారని, అయితే ఆ పార్టీ ఆర్టికల్ 370ని తొలగించడంలో బీజేపీకి సహకరించిందని గుర్తుచేశారు. ఆప్‌ను సెక్యులర్ పార్టీ అని పిలుస్తారా? అని ప్రియాంకను నిలదీశారు.

ఎన్నికల సిబ్బందికి 14న సెలవు: ఈసీ

హైదరాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే సిబ్బందికి మరుసటి రోజు సెలవు ప్రకటిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సీఈవో వికాస్ రాజ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సిబ్బందికి ఈ నెల 14న స్పెషల్ క్యాజువల్ లీవ్ లేదా పెయిడ్ హాలీడేగా గుర్తించాలని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఈ నెల 9న ఇచ్చిన విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ఈసీ ఈ నిర్ణయం తీసుకుంది.

బీజేపీ, కాంగ్రెస్‌లతో విధ్వంసం

» బీజేపీ పంచిన దేవుడి ఫొటోలతో బతుకులు మారుతాయా?

» రేవంత్ అబద్ధాల కోరైతే.. రాహుల్ డబుల్ అబద్ధాల కోరు

» హుస్నాబాద్‌లో మాజీ మంత్రి హరీశ్



హుస్నాబాద్, మే 10: రాష్ట్ర వికాసం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని.. బీజేపీ, కాంగ్రెస్‌లను గెలిపిస్తే విధ్వంసమేనని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ చేసింది చెప్పుకోవడానికి ఏం లేక దేవుడి ఫొటోల్లో వారి ఫొటోలు పెట్టుకొని ఇంటింటికీ పంపిణీ చేశారని, ఈ ఫొటోలతో మన బతుకులు మారుతాయా..? అని ప్రశ్నించారు. బడా కార్పొరేట్ కంపెనీలకు రూ.14 లక్షల కోట్లు రుణ మాఫీ చేసిన బీజేపీ.. రైతులను అస్సలు పట్టించుకోలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాల కోరైతే, రాహుల్‌గాంధీ డబుల్ అబద్ధాల కోరని మండిపడ్డారు. కాగా, కాంగ్రెస్ వైఫల్యాలను వివరించే క్రమంలో హరీశ్ పొరపడ్డారు. ఒక సందర్భంలో కాంగ్రెస్‌కు ఓటేయాలని కోరారు. పక్కనే ఉన్న వినోద్‌కుమార్.. చెవిలో చెప్పడంతో వెంటనే సర్దుకొని కారు గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణలో ట్రిపుల్ ఆర్ ట్యాక్స్

(మొదటి పేజీ తరువాయి)

ఎల్బీస్టేడియంలో నిర్వహించిన జనసభల్లో పాల్గొని ప్రసంగించారు. పదేళ్ల కిందట ఎల్బీ స్టేడియం వేదికగా జరిగిన తమ పార్టీ బహిరంగసభను దేశ రాజకీయాల్లో ఓ మేలిమలుపుగా ఆయన అభివర్ణించారు. ఆ సభకు తాము టికెట్ పెడితే, జనం టికెట్ కొనుక్కొని మరీ వచ్చారని మోదీ గుర్తుచేశారు. "కాంగ్రెస్ వద్దు.. బీఆర్‌ఎస్ వద్దు.. ఎంఐఎం వద్దు.. బీజేపీకే ఓటేద్దాం.. గెలిపిద్దాం అని తెలంగాణ అంటోంది" అని వ్యాఖ్యానించారు. తాను తెలంగాణలో ఎక్కడికి వెళ్లినా అద్భుత స్పందన కనిపించిందని వివరించారు. "జూన్4న దేశం గెలువబోతోంది. 140 కోట్ల మంది భారతీయుల సంకల్పం గెలువబోతోంది. భారత్ వ్యతిరేకులు ఓడిపోబోతున్నారు. ఆత్మనిర్భర్ భారత్, సీఏఏ, యూనిఫాం సివిల్ కోడ్, ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దును వ్యతిరేకిస్తున్నవాళ్లు ఓడిపోబోతున్నారు" అని మోదీ జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ మధ్యతరగతి ప్రజలకు వ్యతిరేకం అని ఆయన ఆరోపించారు. మధ్య తరగతి వారు ఐస్‌క్రీంలపై ఖర్చుచేస్తూ ధరల పెరుగుదలను విమర్శిస్తారంటూ ఒక కాంగ్రెస్ నేత గతంలో వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. "కాంగ్రెస్ పార్టీ మధ్యతరగతివారికి సంబంధించి కనీస ప్రస్తావన కూడా తన మేనిఫెస్టోలో చేయలేదు.. కానీ, మధ్య తరగతి వారి ఆస్తులను ఎక్స్‌రే తీస్తుందట! దానిని తమ ఓటుబ్యాంకు కోసం వినియోగించాలని యోచిస్తోంది" అని మోదీ ఆరోపించారు. "మీ సంపదపై మీ వారసులకు అధికారం ఉంటుందా? ఉండదా? మీ సంపదకు కోతపెట్టే ప్రభుత్వం మీకు అంగీకారమా?"అని ప్రజలను ఉద్దేశించి ప్రశ్నించారు. దేశం ఇప్పుడు డిజిటల్ పవర్.. స్టార్టప్ పవర్.. ఆర్థిక శక్తి, అంతరిక్ష శక్తి అయిందని.. ఇదీ తన ట్రాక్ రికార్డ్ అని మోదీ వివరించారు. "లూటీ.. లూటీ.. సంతుష్టీకరణ.. వారసత్వం, ఉగ్రవాదాన్ని పెంచిపోషించడం.. కాంగ్రెస్ ట్రాక్ రికార్డు" అని దుయ్యబట్టారు. కాంగ్రెస్ హయాంలో దిల్‌సుఖ్‌నగర్‌లో సీరియల్ బాంబు పేలుళ్లు జరిగాయని.. హోటళ్లకు, సినిమాలకు వెళ్లిన వారు బాంబు పేలుళ్లకు బలయ్యేవారని ఆవేదన వెలిబుచ్చారు. "కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇలాంటివి చాలా జరిగాయి.. కానీ, ఇప్పుడు ఇలాంటివి జరుగుతున్నాయా?" అని ప్రశ్నించారు. కేంద్రంలో బలమైన ఎన్డీయే ప్రభుత్వం ఉండడం వల్లే, దేశవ్యాప్తంగా పేలుళ్లు ఆగాయని స్పష్టం చేశారు. ఇది ఇండియా కూటమికి నచ్చట్లేదని.. అందేకే మోదీని తొలగించేందుకు ఒక్కటై మళ్లీ పాత రోజులు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయని దుయ్యబట్టారు. దేశం ఉగ్రవాదుల కబంధ హస్తాల్లోకి వెళ్లకూడదని పిలుపునిచ్చారు. "ఐడియా ఆఫ్ ఇండియా అంటే.. వేల సంవత్సరాల సంస్కృతి, వారసత్వం.. సత్యమేవ జయతే.. వసుధైవ కుటుంబం.. జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసి, నరుడే నారాయణుడు, మానవసేవే మాధవ సేవ, దేవుడే సర్వోన్నతుడనే భావన.. ఐడియా ఆఫ్ ఇండియా అంటే అందరికీ న్యాయం చేయడం.. కొందరిని బుజ్జగించకపోవడం"అని వ్యాఖ్యానించారు. ఈ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ మాట్లాడుతోందని దుయ్యబట్టారు.



ఎల్బీ స్టేడియం సభలో మోదీకి నమస్కరిస్తున్న కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, బూరనర్సయ్య తదితరులు

లక్షల కోట్లు ఇచ్చినా..

గడిచిన పదేళ్లలో కేంద్రం రాష్ట్రానికి లక్షల కోట్ల నిధులు ఇచ్చినా.. అవి ప్రజలకు ఉపయోగపడకుండా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కరప్షన్ (అవినీతి) ఏటీఎంలా మార్చుకున్నాయని.. నారాయణపేట సభలో మోదీ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ బీఆర్‌ఎస్‌కు జిరాక్స్‌లా మారిందని.. మొన్నటివరకు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ జేబులు నింపుకుంటే, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అలాగే చేస్తోందని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ పదేళ్లుగా చేసిన లూటీని కాంగ్రెస్ కొన్ని నెలల్లోనే చేసిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ అవినీతిపై ఇప్పటికీ పెన్ను కదల్చడం లేదని ఎద్దేవా చేశారు. 2009లో ఇక్కడి నుంచి కేసీఆర్‌ను గెలిపిస్తే.. తెలంగాణ వచ్చాక ఆయన మహబూబ్‌నగర్ జిల్లాను, ఈ ప్రాంతాన్ని మరిచిపోయారని మండిపడ్డారు. కొత్త సీఎం కూడా ఇక్కడి నుంచే గెలిచారని, ఆయన కూడా ఢిల్లీ హైకమాండ్ ముందు తల వంచుకొని వారిని ఖుషీ చేయడానికి లెక్కాపత్రాలు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణలో ఈ పరిస్థితి మార్చాలంటే ఎక్కువ మంది బీజేపీ ఎంపీలను ఢిల్లీకి పంపాలని కోరారు. మహబూబ్‌నగర్ సీటును గెలుచుకునేందుకు ఒక మహిళను అవమానించేలా సీఎం మాట్లాడుతున్నారని, 13వ తేదీన జరిగే పోలింగ్‌లో దీనికి జవాబు చెప్పాలని పిలుపునిచ్చారు. ముస్లిం రిజర్వేషన్ల విషయంలో పూర్తి శక్తి పెట్టి పనిచేస్తున్న కాంగ్రెస్.. మాదిగల రిజర్వేషన్లను పట్టించుకోవడం లేదన్నారు.

నరనరానా జాతి వివక్ష..

కాంగ్రెస్ నరనరానా జాతి వివక్ష ఉందని మోదీ ఆరోపించారు. ఆ పార్టీ యువరాజు (రాహుల్) సిద్ధాంతకర్త (పిట్రోడా) దేశ ప్రజలను చైనీయులతో, ఆఫ్రికన్‌లతో పోల్చారని మండిపడ్డారు. "సదరు సిద్ధాంతకర్త యువరాజుకు ఖతర్నాక్ ఐడియాలను ట్యూషన్ చెప్పి మరీ నేర్పించారు. ఆ ట్యూషన్ చెప్పే వ్యక్తి మరో మాట చెప్పాడు.. రామ మందిరానికి వెళ్లి శ్రీరాముడిని దర్శించుకోవడం, శ్రీరామనవమి వేడుకలు నిర్వహించడం పొరపాటు అట. శ్రీరాముణ్ని పూజించడం తప్పా? అదేమైనా దేశద్రోహమా" అంటూ పిట్రోడాపై నిప్పులు చెరిగారు. దేశాన్ని ముక్కలు ముక్కలు చేసేందుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్, ఇండీ కూటమి పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఒక వర్గం ఓట్ల కోసం కాంగ్రెస్‌తోపాటు అలాంటి పార్టీలు ఎంతకైనా తెగిస్తాయని.. అందులో భాగంగానే హైదరాబాద్‌ను ఎంఐఎంకు ధారాదత్తం చేశాయని విమర్శించారు. "ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్ తగ్గించి మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ యోచిస్తోంది. బీసీల కోటాను తగ్గించి ముస్లింలకు కేటాయించడం వల్ల బీసీలు ఎంత నష్టపోయారో జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కనిపించింది. ఇదే మోడల్‌ను దేశవ్యాప్తంగా తీసుకువచ్చేందుకే కాంగ్రెస్ తలపోస్తోంది"అని మండిపడ్డారు. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రాన్ని మరింత వేగవంతంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే కాంగ్రెస్‌కు వేసినట్లేనని అన్నారు.

దేశం కోసం.. పేదల కోసమే పనిచేస్తున్నాం

» మోదీ లేని భారత్‌ని ఊహించలేం

» కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, మే 10 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం, దేశంలోని పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తోందని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. నరేంద్ర మోదీ లేని భారత్‌ని ఊహించలేమని, ఆయన మళ్లీ ప్రధానమంత్రి కావాలని దేశ ప్రజలందరూ కోరుకుంటున్నారని చెప్పారు. ఎల్బీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన భాగ్యనగర జనసభలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు బీజేపీని రాజకీయంగా ఎదుర్కోలేక, ప్రజల దృష్టి మళ్లించేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీల్లో ఏం అమలు చేశారో.. ఏ రకంగా అమలు చేయబోతున్నారో చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.9 లక్షల కోట్లకు పైగా నిధులు ఖర్చు చేస్తే.. దాన్ని సీఎం రేవంత్ రెడ్డి గాడిదగుడ్డుతో పోలుస్తున్నాడన్నారు. 13వ తేదీన ప్రతి ఒక్కరు ఓటుహక్కు వినియోగించుకుని కమలం పువ్వు గుర్తుపై ఓటేయాలని కోరారు. రాష్ట్రంలో పదేళ్లు బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నా తెలంగాణను నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏనాడు చిన్నచూపు చూడలేదని మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో తెలంగాణలో అభివృద్ధి జరగాలంటే బీజేపీ అభ్యర్థులు ఎంపీలుగా గెలిస్తేనే ఎక్కువ నిధులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు ఎత్తివేస్తారంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని, కాని బీజేపీ పాలనలో ఎన్నడూ రిజర్వేషన్లు ఎత్తివేసే ప్రయత్నం చేయలేదని పేర్కొన్నారు. అగ్ర వర్ణ పేదలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కల్పించి విద్య, ఉద్యోగాల్లో అవకాశం కల్పించింది మోదీ ప్రభుత్వమేనన్నారు. దివాలా తీసిన తెలంగాణను ఆదుకునేది మోదీ మాత్రమేనని చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. రజాకార్ల పరంపరలో వచ్చిన పార్టీ(ఎంఐఎం) ఆలోచన హిందువులెవ్వరూ కలిసి ఉండకూడదని, చిటికెలు వేసి మరీ ప్రజలను రెచ్చగొడుతున్నారని హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలత మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆమె 'బండెనక బండి కట్టి... పదహారు బండ్లు కట్టి' పాటను పాడారు. మోదీ మళ్లీ గెలిస్తే రిజర్వేషన్లు రద్దు కావని, రాహుల్ రాజకీయ భవిష్యత్తు మాత్రమే ఉనికి లేకుండా పోతుందని భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ చెప్పారు.

ఓడిపోతే రాజకీయాలు వదిలేస్తా

» వినోద్ కుమార్ గెలవకపోతే కేసీఆర్ తప్పుకొంటారా..?

» ముస్లింలు ఏకమై నన్ను ఓడించాలని కేసీఆర్ పిలుపు

» బీఆర్‌ఎస్‌ను ఓడించి హిందువులు సత్తా చాటాలి

» నేతన్నల దీనస్థితికి కారణం కేసీఆర్: బండి సంజయ్

సిరిసిల్ల, మే 10 (ఆంధ్రజ్యోతి): "హిందూ సమాజమంతా నా వెనక ఉంది. నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం చేస్తా. కరీంనగర్‌లో వినోద్ కుమార్ ఓడిపోతే బీఆర్‌ఎస్‌ను మూసివేసి రాజకీయాల నుంచి తప్పుకునేందుకు సిద్ధమా..?" అంటూ కేసీఆర్‌కు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ సవాల్ విసిరారు. ముస్లింలంతా ఒక్కటై బండి సంజయ్‌ను ఓడించాలంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై సంజయ్ స్పందించారు. 20 శాతం ఓట్ల కోసం 80 శాతం హిందువులను అవమానిస్తున్న కేసీఆర్‌ను ఓడించి హిందువులు సత్తా చాటాలని కోరారు. సిరిసిల్లలో శుక్రవారం సంజయ్ మీడియాతో మాట్లాడారు. "కొడుకేమో జై శ్రీరామ్ అనొద్దని అంటాడు. తండ్రేమో ముస్లింలు అంతా ఒక్కటి కావాలని అంటున్నాడు. కరీంనగర్ అభివృద్ధిపై నేను మాట్లాడుతుంటే.. కేసీఆర్ మత విద్వేషాలు రెచ్చగొడుతున్నాడు. అసెంబ్లీ ఎన్నికల్లో నన్ను ఓడించేందుకు ముస్లిం మత పెద్దలతో కేసీఆర్ కుమ్మక్కయ్యాడు. హిందువుల గురించి హేళన చేస్తున్న కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలి. హిందూ సమాజం సంఘటితం కావాలి" అని అన్నారు. తెలంగాణకు కేంద్రం ఒక్క పైసా ఇవ్వలేదంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను సంజయ్ ఖండించారు. తెలంగాణకు రూ.10 లక్షల కోట్లదాకా నిధులిచ్చిన ఘనత మోదీ ప్రభుత్వానిదని అన్నారు. కేసీఆర్ అరాచకాలను, ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రశ్నిస్తుంటే.. ఆ రెండు పార్టీలు కలిసి తనను ఓడించేందుకు డబ్బులు పంచుతున్నాయని ఆరోపించారు. సిరిసిల్లలో కార్మికుల దీనస్థితికి పదేళ్ల కేసీఆర్ పాలనే కారణమని అన్నారు. సిరిసిల్ల కలెక్టరేట్ చిన్న వాన తుంపర్లకే మునిగి పోతోందని, అవినీతికి అధిపతి కేసీఆర్ అన్నారు. కాళేశ్వరం డీపీఆర్ అడిగితే ఇవ్వలేదని, ఆ ప్రాజెక్టుకు జాతీయ హోదా రాకుండా చేసి కేంద్రాన్ని బద్నాం చేసిన వ్యక్తి కేసీఆర్ అని మండిపడ్డారు. 'ప్రసాద్' స్కీమ్ కింద వేములవాడ, కొండగట్టు అభివృద్ధి చేస్తామని కేంద్రం తరఫున లేఖ రాస్తే స్పందించని మూర్ఖుడని అన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ నిధులపై ప్రమాణానికి సిద్ధమా అని సవాల్ విసిరారు. హిందువులు తుమ్మితే బీఆర్‌ఎస్ గాల్లో కొట్టుకుపోతుందని అన్నారు. భైంసాలో హనుమాన్ భక్తులు కేటీఆర్‌కు వ్యతిరేకంగా నిరసన చేస్తే వాళ్లను జైల్లో వేసే ప్రయత్నం చేస్తున్నారని, పోలీసులు చనిపోయారని కేసీఆర్ హేళన చేయడం బాధాకరమని అన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న బండి సంజయ్

ఈవీఎంలు మన ఈసీఐఎల్‌వే!



కుషాయిగూడ, మే 10(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియలో వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లలో 90 శాతం హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐఎల్) రూపొందించినవే. ఈవీఎంలపై పూర్తి హక్కు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)దే. థర్డ్ పార్టీ ఇన్‌స్పెక్షన్‌ను ఎలక్ట్రానిక్స్ టెస్ట్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఈటీడీసీ) చేపడుతుంది. 543 ఎంపీ స్థానాలకు గాను 500 చోట్ల ఈసీఐఎల్ తయారీ ఈవీఎంలనే వాడుతున్నారు. 2 నెలల కిందటే 6.25 లక్షల పైగా కంట్రోల్ యూనిట్లు, 8.39 లక్షల బ్యాలెట్ యూనిట్లు, 5.45 లక్షల వీవీ ప్యాట్‌లను ఈసీఐకి సరఫరా చేశారు. అవసరానికి 12 శాతం అదనంగా ఈవీఎంలను అందించారు. ఇక మిగిలిన లోక్‌సభ 43 సీట్లు, ఏపీ, ఒడిశా, అరుణాచల్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికలకు కావాల్సిన మిషన్లను బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) తయారుచేసింది. ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల తయారీ, మరమ్మతులకు ఈసీఐఎల్‌లో ప్రత్యేక విభాగం ఉంది. ఎన్నిల తర్వాత తిరిగొచ్చిన ఈవీఎంల నుంచి డేటాకు సంబంధించిన హార్డ్ డిస్కుల స్థానంలో కొత్తవి అమర్చి మళ్లీ వినియోగించుకునేలా చేస్తారు.

మూర్ఖ ముఖ్యమంత్రి

» మోసపోతే గోసపడుతాం

» బీజేపీ పెట్టుబడిదారుల పార్టీ

» జిల్లాలను రద్దు చేస్తే ఊరుకుందామా?: కేసీఆర్

సిరిసిల్ల/సిద్దిపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): "తెలంగాణ రాష్ట్రం.. మూర్ఖ ముఖ్యమంత్రి, మూర్ఖ ప్రభుత్వం చేతుల్లో ఉంది. కాంగ్రెస్ అలవికాని హామీలిచ్చి అరచేతిలో వైకుంఠం చూపి నోటికొచ్చిన వాగ్దానాలు చేసి గద్దెనెక్కింది. గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసింది. మోసపోతే గోసపడుతాం.. జాగ్రత్తగా ఆలోచించి ఓటేయాలి. ఆగమాగం కావొద్దు" అని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. శుక్రవారం రాత్రి రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లా కేంద్రాల్లో కేసీఆర్ బస్సు యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్ షోలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్నర్ మీటింగుల్లో కేసీఆర్ మాట్లాడుతూ.. రైతు బంధు రాలేదని, నీళ్లు లేవని, కరెంట్ కోతలున్నాయని, మరమగ్గాలు మూతపడ్డాయని, ధాన్యం కొనడం లేదని, కల్లాల్లో తడిసిపోతున్నా అడిగే వారు, కొనేవారు దిక్కులేకుండాపోయారని మండిపడ్డారు. రాష్ట్రంలో అమలవుతున్న ఒకే ఒక్క గ్యారెంటీ మహిళలకు ఉచిత బస్సు అని, అది కూడా సర్కస్ స్కీం అంటూ దుయ్యబట్టారు. పదేళ్లపాటు కేంద్రంలో అధికారం చెలాయించిన బీజేపీ పేదల పార్టీ కాదని, పెట్టుబడిదారుల పార్టీ అని ఆరోపించారు. చేనేత కార్మికులు చనిపోయే పరిస్థితులు వచ్చాయని, అయినా పభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దేశంలో చేనేత రంగంపై జీఎస్టీ వేసిన ఏకైక ప్రధాని నరేంద్ర మోదీ అని మండిపడ్డారు. వేములవాడకు ప్రధాని మోదీ వచ్చారని, ఆయన పక్కనే బండి సంజయ్ కూడా ఉన్నారని, ఎప్పుడూ దేశం కోసం, ధర్మం కోసం మాట్లాడే వాళ్లు.. వేములవాడ ఆలయ అభివృద్ధికి నిధులు ఇస్తామని చెప్పారా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సర్కారు, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలను రద్దు చేస్తుందటా.. ఊరుకుందామా అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే ఈ జిల్లాలను కాపాడే బాధ్యత తనదని కేసీఆర్ పేర్కొన్నారు.



హోటల్‌లో టీ తాగి, మిర్చీ తిన్న కేసీఆర్

బోయినపల్లి: రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లిలోని రాజన్న హోటల్‌లో కేసీఆర్ మిర్చీలు తిని, టీ తాగారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్ నుంచి సిరిసిల్లకు వెళ్తున్న క్రమంలో మార్గమధ్యంలోని వెంట్రావుపల్లిలో కాసేపు ఆగారు. మరోవైపు.. తన అత్తగారు ఊరైన బోయినపల్లి మండలం కొదురుపాక మీదుగా వెళ్తుండగా.. కాన్వాయ్ ఎదుట మిడ్‌మానేరు నిర్వాసితులు నిరసన తెలిపారు.

రాజ్యాంగబద్ధమైన సంబంధాల కోసమే నాడు కేంద్రంతో సఖ్యత

తెలంగాణలో బీఆర్‌ఎస్ తొలిసారి అధికారంలోకి వచ్చాక రాజ్యాంగబద్ధమైన సంబంధాలను కొనసాగించడానికే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో సఖ్యతగా ఉన్నామని కేసీఆర్ తెలిపారు. శుక్రవారం ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ కోరడంతో.. తాము రాష్ట్రపతి ఎన్నికలు, పెద్ద నోట్ల రద్దు తదితర అంశాల్లో కేంద్రానికి మద్దతు తెలిపామని పేర్కొన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం ఒక డ్రామా అని, తన కూతురు కవిత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అన్యాయంగా ఇందులో ఇరికించారని ఆరోపించారు. ఇండియా కూటమితో ఒరిగేదేమీ ఉండదని, పలు ప్రాంతీయ పార్టీలు కలిసి బలమైన గ్రూపుగా ఏర్పడే అవకాశం ఉందని తాను భావిస్తున్నానని ఆయన చెప్పారు.



అబ్ కీ బార్?

భారత్‌లో ఎన్నికలుంటే.. పాక్ గురించి చర్చ ఎందుకు?

అమేఠీ (ఉత్తరప్రదేశ్), మే 10: భారత్‌లో ఎన్నికలు జరుగుతుంటే పాకిస్థాన్ గురించి ఎందుకు చర్చిస్తున్నామని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంకా గాంధీ ప్రశ్నించారు. వాస్తవ అంశాలపై ఎన్నికల్లో పోరాడాలని బీజేపీకి ఆమె సూచించారు. ఎన్నికల్లో గెలిచేందుకు హిందూ-ముస్లిం అంశాన్ని బీజేపీ లేవనెత్తుతోందని ఆరోపించారు. పాకిస్థాన్ వద్ద అణుబాంబులు ఉన్నాయని, భారత్ ఆ దేశాన్ని గౌరవించాలని కాంగ్రెస్ నేత మణి శంకర్ అయ్యర్ గతంలో చేసిన వ్యాఖ్యలు శుక్రవారం వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో దీని గురించి ప్రియాంక మాట్లాడుతూ.. "ఆ ప్రకటన పాతది. దానిపై ఇప్పుడెందుకు చర్చ" అని ప్రశ్నించారు.

మోదీ మళ్లీ ప్రధాని కాలేరు

» బీజేపీ సీట్లు 180 దాటవు.. యూపీలో 'ఇండియా' తుఫాన్

» మోదీతో చర్చకు నేను సిద్ధం.. ఆయన రారు: రాహుల్‌గాంధీ



లఖ్‌నవూలో నిర్వహించిన సంవిధాన్ సమ్మేళన్‌లో ఓ చిన్నారితో రాహుల్

కన్నౌజ్, కాన్పూర్, మే 10: నరేంద్రమోదీ మరోసారి దేశ ప్రధాని కాలేరని, బీజేపీకి ఈ ఎన్నికల్లో 180కి మించి సీట్లు రావని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లో ఇండియా కూటమి తుఫాన్ రానుందని, దేశంలో బీజేపీ అతిపెద్ద ఓటమిని ఇక్కడే ఎదుర్కోనుందని తెలిపారు. తమ కూటమికి రాష్ట్రంలోని మొత్తం 80 సీట్లలో కనీసం 50 స్థానాలను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం యూపీలో కాంగ్రెస్, ఎస్పీల తరఫున జరిపిన బహిరంగసభల్లో రాహుల్ ప్రసంగించారు. లక్నోలో సమృద్ధ భారత్ అనే సంస్థ 'రాజ్యాంగంపై చర్చ' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. 'నేను చెబుతున్న మాటను కావాలంటే రాసిపెట్టుకోండి. జూన్ 4న దేశ ప్రధానిగా మోదీ ఉండరు. ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారు' అని తెలిపారు. అంబానీ, అదానీలు కాంగ్రెస్‌కు టెంపోల్లో ఎంత నల్లధనం పంపిస్తున్నారంటూ మోదీ ఇటీవల చేసిన ఆరోపణపై స్పందిస్తూ.. గత పదేళ్లలో మోదీ ఎన్నడూ అంబానీ, అదానీల పేర్లు బయటకి చెప్పలేదని, కానీ, ఇప్పుడు విపత్కర పరిస్థితుల్లో సాయం చేస్తారేమోనని వాళ్ల పేర్లు చెబుతున్నారన్నారు. రాహుల్, మోదీ బహిరంగ చర్చలో పాల్గొనాలని జస్టిస్ లోకూర్ తదితరులు చేసిన ప్రతిపాదనపై స్పందిస్తూ.. తాను సిద్ధమని, అయితే, మోదీ మాత్రం చర్చకు రారని రాహుల్ చెప్పారు. కాగా, కాంగ్రెస్ పార్టీ కూడా (గతంలో) కొన్ని పొరపాట్లు చేసిందని, వాటిని రానున్న రోజుల్లో దిద్దుకుంటామన్నారు. మోదీ 21వ శతాబ్దంలో రాజు లాంటి వ్యక్తి అని, ప్రధానమంత్రి కాదని.. ఆయనకు రాజ్యాంగం, పార్లమెంటు, చివరికి కేంద్ర క్యాబినెట్ కూడా పట్టదన్నారు.

నన్ను సజీవ సమాధి చేయాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయి

» దేశ ప్రజలే నాకు రక్షణ కవచం : ప్రధాని నరేంద్ర మోదీ



నందుర్బార్, మే 10: ప్రతిపక్షాలకు చెందిన కొందరు తనని సజీవసమాధి చేయాలని అనుకుంటున్నారని ప్రధాని మోదీ అన్నారు. కానీ, దేశ ప్రజలు తనకు రక్షణ కవచంలా ఉన్నంత వరకు తనని ఎవరు ఏం చేయలేరని తెలిపారు. మహారాష్ట్రలోని నందుర్బార్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి హీనా గవిత్‌కు మద్దతుగా ప్రధాని మోదీ గురువారం ప్రచారం నిర్వహించారు. మహారాష్ట్రలో మోదీని సజీవ సమాధి చేస్తామంటూ శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ చేసిన వ్యాఖ్యలకు ఈ సందర్భంగా కౌంటరిచ్చిన మోదీ ప్రతిపక్షాలపై ధ్వజమెత్తారు. తమ ఓటు బ్యాంకును ఆకర్షించేందుకు శివసేన(యూబీటీ) నేతలు నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. అంతేకాక, బాంబు పేలుళ్లకు పాల్పడిన వారితో కలిసి ఎన్నికల ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ముంబై వాయవ్య ఎంపీ స్థానం శివసేన(యూబీటీ) అభ్యర్థి అమోల్ కీర్తికర్ ఎన్నికల ప్రచారంలో 1993 వరుస బాంబు పేలుళ్ల కేసులో నిందితుడు ఇక్బాల్ ముసా అలియాస్ బాబా చౌహాన్ పాల్గొన్నారని బీజేపీ బుధవారం ఆరోపించింది. కాగా, జూన్ 4 తర్వాత చాలా ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్‌లో విలీనం అవుతాయంటూ ఎన్సీపీ(ఎస్పీ)నేత శరద్ పవార్ చేసిన వ్యాఖ్యలపైనా ప్రధాని మోదీ స్పందించారు. ఎన్సీపీ(ఎస్పీ), శివసేన (యూబీటీ) పార్టీలు కాంగ్రెస్‌లో చేరి అంతమైపోవడం కంటే అజిత్ పవార్, ఏక్‌నాథ్ షిండే చేతులకలపాలని సూచించారు. అలాగే, శ్రీకృష్ణుని శరీర రంగులో ఉన్న వారిని ఆఫ్రికన్లు అంటూ అవమానించిన కాంగ్రెస్‌కు ద్రౌపది ముర్ము రాష్ట్రపతిగా ఉండడం ఇష్టం లేదని, ఇది ఆదివాసీలను అవమానించడం కాదా ? అని ప్రశ్నించారు. కాగా, మోదీ వ్యాఖ్యలపై శరద్ పవార్ స్పందిస్తూ.. ప్రజాస్వామ్యంపై విశ్వాసం లేని వ్యక్తులు, పార్టీలతో తాము ఎట్టి పరిస్థితుల్లో చేతులు కలపబోమని స్పష్టం చేశారు.

వడగాడ్పులు ముగిసినట్టే!

విశాఖపట్నం, అమరావతి, మే 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఈ ఏడాది వడగాడ్పులు దాదాపు ముగిసినట్టేనని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. పశ్చిమ రాజస్థాన్, కేరళ మినహా దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో శుక్రవారం నుంచి వేడిగాలులు వీచే అవకాశం లేదని పేర్కొంది. బంగాళాఖాతం నుంచి అత్యధిక తేమతో కూడిన గాలులు వీస్తుండటంతో దేశంలో ఉరుములు, మెరుపులు, పిడుగులు పెరిగే అవకాశం ఉందని వివరించింది. పశ్చిమ రాజస్థాన్, కేరళకు మాత్రమే వడగాడ్పుల హెచ్చరిక జారీ చేసినట్టు ఐఎండీ శాస్త్రవేత్త సోమా సేన్ తెలిపారు. రెండు నెలల నుంచి ఎండలు, నెల రోజుల ఎల్‌నినో బలహీనం కావడంతో పసిఫిక్ సముద్రంలో ఉపరితల జలాలు చల్లబడడం వల్ల అటు నుంచి వస్తున్న గాలుల ప్రభావంతో దేశంలో వడగాడ్పుల తీవ్రత తగ్గుతోందన్నారు.

దభోల్కర్ హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

పుణె, మే 10: ప్రముఖ హేతువాది నరేంద్ర దభోల్కర్ హత్య కేసులో ఇద్దరికి యావజ్జీవ కారాగారావాసం విధిస్తూ శుక్రవారం పుణెలోని ప్రత్యేక కోర్టు తీర్పు ఇచ్చింది. నిందితులైన సచిన్ అందూరే, శరద్ కలాస్కర్‌లకు ఈ శిక్ష పడింది. తగిన సాక్ష్యాలు లేకపోవడంతో మరో ముగ్గురు నిందితులు వీరేంద్ర తవాడే, న్యాయవాది సంజీవ్ పునలేకర్, విక్రం భావేలను విడుదల చేసింది. ఈ కేసులో న్యాయవాది సంజీవ్ పునలేకరే ప్రధాన సూత్రధారి అని సీబీఐ వాదించింది. మహారాష్ట్ర అంధ శ్రద్ధ నిర్మూలన్ సమితి వ్యవస్థాపకుడైన దభోల్కర్ 2013 ఆగస్టు 20న పుణేలో మార్నింగ్ వాక్ చేస్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు తుపాకీతో కాల్చి చంపారు.

రూ.10 లక్షలు ఇస్తే నీట్‌గా ఆన్సర్లు నింపేస్తా!

గోద్రా, మే 10: 'నీట్' పరీక్షల నిర్వాహకులే అక్రమాలకు పాల్పడడం గుజరాత్‌లోని గోద్రాలో వెలుగులోకి వచ్చింది. తెలిసిన ప్రశ్నలకు సమాధానాలు రాసి, మిగిలిన వాటిని ఖాళీగా ఉంచి జవాబు పత్రాలు ఇచ్చేస్తే పరీక్ష ముగిసిన తర్వాత వాటిని తాను నింపుతానంటూ డిప్యూటీ సూపరింటెండెంట్‌గా వ్యవహరించిన ఓ టీచరు కొందరు అభ్యర్థులకు ఆశ చూపాడు. ఇందుకు రూ.10 లక్షలు ఇవ్వాలని బేరం పెట్టాడు. ఆరుగురు అభ్యర్థులు సమ్మతించారు కూడా. ఒక అభ్యర్థి తండ్రి రూ.7 లక్షలు అడ్వాన్సుగా ఇచ్చాడు. పంచమహల్ జిల్లాలోని గోద్రాలో ఉన్న పాఠశాలలో ఆదివారం నీట్-యూజీ పరీక్ష జరిగింది. ఈ పరీక్ష కేంద్రానికి తుషార్ భట్ డిప్యూటీ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. జవాబు పత్రాలు నింపుతానంటూ ఆయన విద్యార్థులకు ఆశ చూపడంతో.. ఆరిఫ్ వోరా అనే వ్యక్తి రూ.7 లక్షలు అడ్వాన్సుగా ఇచ్చాడు. ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో.. అధికారులు పాఠశాలకు చేరుకొని రూ.7 లక్షల నగదుతో పాటు, ఆ టీచరు సెల్‌ఫోన్, కారును కూడా స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తు అనంతరం ఆ ముగ్గురిపై కేసు పెట్టినట్టు పోలీసులు తెలిపారు.

మాపై భారత్ గూఢచర్యం: కెనడా

న్యూఢిల్లీ, మే 10: భారత్‌పై కెనడా మరోసారి నోరు పారేసుకుంది. తమ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమే కాకుండా, చట్టవిరుద్ధంగా గూఢచర్యానికి పాల్పడిందంటూ భారత్‌పై కెనడా నిఘా విభాగమైన 'సీఎస్ఐఎస్' తీవ్ర ఆరోపణ చేసింది. భారత్‌తోపాటు, రష్యా, చైనా, ఇరాన్ సైతం తమ వ్యవహారాల్లో కలగజేసుకుంటాయని ఆరోపించింది. కెనడాలో 2019, 2021లో జరిగిన ఎన్నికలను ప్రభావితం చేయడానికి భారత్ ప్రయత్నించిందని సీఎస్ఐఎస్ తెలిపింది. 2023 సంవత్సరానికిగాను విడుదల చేసిన నివేదికలో ఇలాంటి అవాకులుచెవాకులు ఎన్నో పేర్కొంది.

కేజ్రీవాల్‌కు బెయిల్

జూన్ 1 వరకూ మంజూరు చేసిన సుప్రీంకోర్టు

» సీఎంవోకు, సెక్రటేరియట్‌కు వెళ్లొద్దని, జూన్ 2న లొంగిపోవాలని షరతులు

» ఆప్ శ్రేణుల సంబరాల నడుమ తిహాడ్ జైలు నుంచి బయటకొచ్చిన ఢిల్లీ సీఎం

» హనుమంతుడి ఆశీస్సులతోనే తాను జైలు నుంచి బయటకొచ్చినట్టు వెల్లడి



బెయిల్ షరతులు

- 50వేల పూచీకత్తు, అంతే మొత్తానికి ఒకరి ష్యూరిటీ సమర్పించాలి
- సీఎం కార్యాలయానికి, ఢిల్లీ సచివాలయానికి వెళ్లకూడదు.
- ఆమోదం తప్పనిసరి అయిన సందర్భాల్లో తప్ప అధికారిక ఫైళ్లపై సంతకం చేయరాదు.
- మద్యం విధానం కేసులో తన పాత్ర గురించి ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదు.
- ఈ కేసుకు సంబంధించిన సాక్షులను కలుసుకోకూడదు. కేసు ఫైళ్లను పరిశీలించకూడదు.

న్యూఢిల్లీ, మే 10 (ఆంధ్రజ్యోతి): మద్యం విధానం కేసులో యాభై రోజులుగా తిహాడ్ జైల్లో మగ్గుతున్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు ఎట్టకేలకు ఊరట లభించింది. సుప్రీంకోర్టు ఆయనకు ఐదు షరతులతో కూడిన 21 రోజుల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. సార్వత్రిక ఎన్నికల తుది దశ జూన్ 1న ముగియనున్న నేపథ్యంలో.. జూన్ 2వ తేదీన లొంగిపోవాలని స్పష్టం చేసింది. ఈ కేసులో కేజ్రీవాల్‌పై తీవ్రమైన ఆరోపణలు ఉన్నప్పటికీ.. ఆయన నేరం ఇంకా రుజువు కాలేదని, ఆయనకు ఎలాంటి నేర నేపథ్యం లేదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. కేజ్రీవాల్ వల్ల సమాజానికి ఎలాంటి ప్రమాదమూ వాటిల్లదని.. ఆయన ఢిల్లీ సీఎం, ఒక జాతీయ పార్టీ అధినేత అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం తమ తీర్పులో పేర్కొంది. ప్రజాస్వామ్యంలో సార్వత్రిక ఎన్నికలు అత్యంత ముఖ్యమైన ఘట్టమని.. ఈ ఎన్నికలకున్న ప్రాధాన్యం దృష్ట్యా ఒక రాజకీయ పార్టీ అధినేతగా ఆయనకున్న బాధ్యతలను దృష్టిలో పెట్టుకుని మధ్యంతర బెయిల్ ఇవ్వాలని నిర్ణయించామని స్పష్టం చేసింది. కేజ్రీకి బెయిల్ ఇవ్వొద్దని ఈడీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు చేసిన విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది. "ఈడీ ఈ కేసులో ఈసీఐఆర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్)ను నమోదు చేసింది 2022 ఆగస్టులో. కేజ్రీవాల్‌ను అరెస్టు చేసింది ఈ ఏడాది మార్చి 21న. ఆయన ఈ ఏడాదిన్నరకాలం బయటే ఉన్నారు. ఆయన్ను అంతకుముందు(మార్చి 21కి ముందు).. ఆ తర్వాతా అరెస్ట్ చేసి ఉండొచ్చు. ఇప్పుడీ 21 రోజుల బెయిల్‌తో ఏమంత తేడా రాదు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. "సామాన్యుడికైనా, సీఎంకైనా ఒకే న్యాయం వర్తించాలి. ఒక రైతు, కిరాణా వ్యాపారి అరెస్టయితే వ్యవసాయం చేసేందుకు, దుకాణం నడిపేందుకు బెయిల్ ఇస్తారా?" అని ఈడీ న్యాయవాదులు చేసిన వాదనను కోర్టు తోసిపుచ్చింది. అసలు కేజ్రీవాల్ ఉన్న పరిస్థితులకు ఈ పోలికలు వర్తింపజేయలేమని స్పష్టీకరించింది. కేజ్రీవాల్‌కున్న ప్రత్యేక పరిస్థితుల రీత్యా ఆయనకు సామాన్య పౌరుడితో పోలిస్తే ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించామని, ఈ పరిస్థితులను విస్మరించడం సరైంది కాదని న్యాయస్థానం పేర్కొంది. చంద్రబాబు కేసులో కూడా ఆయనను రాజకీయ కార్యక్రమాల్లోనూ, ఎన్నికల సభలు, సమావేశాలలో పాల్గొనేందుకు అనుమతించిన విషయాన్ని గుర్తుచేసింది. అలాగని తాము ఈ కేసులో ఇస్తున్న తీర్పు.. రాజకీయ నాయకులకు ఎలాంటి ప్రత్యేకాధికారాలనూ ఇవ్వదని స్పష్టం చేసింది.

కవిత పిటిషన్‌పై విచారణ వాయిదా

న్యూఢిల్లీ, మే 10(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్ విచారణను ఢిల్లీ హైకోర్టు ఈ నెల 24కు వాయిదా వేసింది. కవిత బెయిల్ పిటిషన్‌పై స్పందించాలని ఈడీకి నోటీసులు జారీ చేసింది. కవిత తరఫున సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి, నితేష్ రాణా వాదనలు వినిపించారు. ఈడీ తరఫున ప్రత్యేక న్యాయవాది జోహెబ్ హుస్సేన్ వాదనలు వినిపించారు.

సంబరాలతో స్వాగతం..

సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన కొన్ని గంటల తర్వాత.. కేజ్రీవాల్ తిహాడ్ జైలు నుంచి బయటకొచ్చారు. ఆ సమయానికే కేజ్రీ భార్య సునీత, కుమార్తె హర్షిత, ఆప్ నేత, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, ఢిల్లీ మంత్రులు ఆతిషీ, సౌరభ్ భరద్వాజ్ తదితరులు అక్కడికి చేరుకున్నారు. ఆప్ నేతలు, కార్యకర్తలు సైతం జైలు బయట పెద్దసంఖ్యలో గుమిగూడారు. నీలి, పసుపు రంగు జెండాలు పట్టుకుని.. 'జైల్ కే తాలే టూట్‌గయే.. కేజ్రీవాల్ జీ చూట్ గయే (జైలు తాళాలు బద్దలయ్యాయి-కేజ్రీవాల్ బయటికొచ్చారు) అంటూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ.. డోళ్లు వాయిస్తూ.. పూల వర్షం కురిపిస్తూ.. సంబరాలతో ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన కేజ్రీవాల్.. "మీకు ముందే చెప్పాను.. నేను త్వరలోనే బయటకు వస్తానని. నియంతృత్వానికి వ్యతిరేకంగా నేను శాయశక్తులా పోరాడుతున్నాను. కానీ, 140 కోట్ల మంది ప్రజలూ ఈ పోరాటంలో నాతో కలిసి రావాలి" అన్నారు. హనుమంతుడి ఆశీస్సులతోనే తాను బయటకు వచ్చానన్న కేజ్రీవాల్.. ఆ స్వామికి ప్రార్థనలు చేసేందుకు శనివారం ఉదయం కన్నాట్ ప్లేస్(ఢిల్లీ)లోని ఆంజనేయస్వామి గుడికి వెళ్లనున్నట్టు చెప్పారు.

ప్రజాస్వామ్య విజయం- సునీతా కేజ్రీవాల్

కేజ్రీవాల్ బెయిల్ పై విడుదల కావడం ప్రజాస్వామ్య విజయమని ఆయన భార్య సునీతా కేజ్రీవాల్ అన్నారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఎన్సీపీ, శివసేన తదితర పార్టీలు సుప్రీం తీర్పుపై హర్షం వ్యక్తం చేశాయి. ప్రధాని మోదీ ఇప్పటికైనా ఆత్మ పరిశీలన చేసుకోవాలని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌కు కూడా ఇదే విధంగా న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్టు పేర్కొంది. కేజ్రీవాల్‌కు బెయిల్ లభించడం ఈ ఎన్నికల్లో ఎంతో దోహదం చేస్తుందని మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యం నిలదొక్కుకుందని ఎన్సీపీ నేత శరద్ పవార్ అన్నారు.



పాక్‌ను గౌరవించకుంటే మనకే ముప్పు

» వారి దగ్గర అణుబాంబులున్నాయ్

» కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ గత ఏడాది చేసిన వ్యాఖ్యలు వైరల్

న్యూఢిల్లీ, మే 10: లోక్‌సభ ఎన్నికల వేళ సొంత పార్టీ సీనియర్ నేతల వివాదాస్పద వ్యాఖ్యలు కాంగ్రెస్‌ను ఇరకాటంలో పడేస్తున్నాయి. మొన్న భారతీయుల రూపురేఖలపై శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ గత ఏడాది చేసిన వ్యాఖ్యలనూ ప్రత్యర్థులు తాజాగా వైరల్ చేశారు. 'పాకిస్థాన్‌తో మనం చర్చలు జరపాలి. అంతేగానీ సైన్యంతో రెచ్చగొట్టొద్దు. అలా జరిగితే ఉద్రిక్తతలు పెరిగి మనమే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఆ దేశం వద్ద అణుబాంబులున్నాయి. వారిని గౌరవించకపోతే భారత్‌పై అణు బాంబులు ఉపయోగించాలని ఆలోచన చేస్తారు. మనవద్దా ఆ అస్త్రాలున్నాయి. కానీ, లాహోర్‌పై మనం ప్రయోగిస్తే.. దాని తాలూకు రేడియేషన్ అమృత్‌సర్‌ను చేరడానికి 8 సెకన్లు కూడా పట్టదు' అని అయ్యర్ ఆ వీడియోలో అన్నారు. భారత్‌ను విశ్వగురువు చేస్తానన్న మోదీ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ముందు పాక్‌తో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలని, కానీ, మోదీ సర్కారు ఆ దిశగా చేసిందేమీ లేదని వీడియోలో వ్యాఖ్యానించారు. అయితే, తాను ఎప్పుడో మాట్లాడిన వీడియోను బీజేపీ నేతలు కావాలనే ఇప్పుడు వైరల్ చేస్తున్నారని అయ్యర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో బీజేపీ పట్టు సడలిపోతోందని, ఆ భయంతోనే పాత వీడియోను బయటకు తెచ్చిందని శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ దీనిపై స్పందించింది. అయ్యర్ వ్యాఖ్యలతో పార్టీకి సంబంధం లేదని ప్రకటించింది.

కాంగ్రెస్ నిజ స్వరూపమిదే: బీజేపీ

అయ్యర్ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. ఈ వీడియోను కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ షేర్ చేస్తూ.. 'ఈ ఎన్నికల్లో రాహుల్ నేతృత్వంలోని కాంగ్రెస్ నిజ స్వరూపం బయటపడుతోంది' అని పేర్కొన్నారు. వాళ్లు పాకిస్థాన్‌కు భయపడాలని చెబుతున్నారని.. సరికొత్త భారతదేశం ఎవ్వరికీ భయపడదని స్పష్టం చేశారు.

మహువానా? మహారాణా?

ఇద్దరు మగువల రణ వేదిక కృష్ణానగర్



మహువా మొయిత్రా

రాజకీయ సంచలనం ఒకరు.. రాచరిక విలక్షణ వారసురాలు మరొకరు. ఒకరు అత్యాధునిక వేషభాషలు, నవీన భావాలకు ప్రతినిధి అయితే, మరొకరు జాతీయ సంప్రదాయాలకు, మూల విలువలకు పెట్టింది పేరు. ఇద్దరు మహిళలు ఎన్నికల బరిలో దిగడం మామూలే అయినా, ఈ ఇద్దరి నేపథ్యాల రీత్యా పశ్చిమబెంగాల్ సరిహద్దు జిల్లా నడియాలోని లోక్‌సభ స్థానం కృష్ణానగర్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. వీరిలో ఒకరు తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మహువా మొయిత్రా. మరొకరు రాజమాత అమృతరాయ్. మహువా బహిష్కరణకు గురైన సిటింగ్ ఎంపీ. బీజేపీ, మోదీకి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలతో కొంతకాలంగా పతాక శీర్షిక వార్తల్లో ఉంటున్నారు. టీఎంసీ ఆమెకు మళ్లీ కృష్ణానగర్‌ను స్థానాన్నే కేటాయించింది. అయితే, మహువాను చట్టసభలో అడుగుపెట్టనీయరాదని బీజేపీ అధిష్ఠానం అంతే గట్టిగా ప్రయత్నిస్తోంది. ఆమెకు దీటైన అభ్యర్థి కోసం గాలించింది. అనూహ్యంగా బెంగాల్ సమాజంలో గొప్ప గౌరవమర్యాదలు కలిగిన కృష్ణానగర్ రాజ వంశానికి చెందిన రాజమాత అమృతరాయ్‌ను తెరపైకి తెచ్చింది. రాజమాతగా పిలిచే అమృత రాయ్‌ను బీజేపీ బరిలోకి దించడంతో ఫోకస్ మహువా నుంచి కొంత అమృత వైపు మళ్లింది.



అమృత రాయ్

చరిత్రకు కొత్తగా సాన..

రాజకీయాలకు అమృత కొత్త. చెరగని రాచవంశ ప్రతిష్ఠే ప్రచారంలో మహువాకు దీటుగా ఆమెను నిలిపే అంశం. ఆమెను ఎదుర్కొనేందుకు తృణమూల్ ఇప్పుడు చరిత్రను తవ్వే పనిలో ఉంది. కృష్ణానగర్ రాజవంశ స్థాపకుడు కృష్ణ చంద్ర రాయ్ 1757 ప్లాసీ యుద్ధంలో బ్రిటిష్ పాలకులకు మద్దతుగా నిలిచారని ఆరోపిస్తోంది. జాతి వ్యతిరేక చర్యలతో బ్రిటిష్ వలస పాలనకు అనుకూలంగా ఆయన వ్యవహరించారంటూ విమర్శలకు దిగింది. మరోవైపు, ప్రశ్నకు నగదు వ్యవహారంలో మహువా జాతి ప్రయోజనాలకు ద్రోహం చేశారని బీజేపీ ప్రచారం చేస్తోంది. అదే సమయంలో బీజేపీ కక్ష సాధింపు చర్యలకు బలైన మహిళగా, గట్టి బీజేపీ వ్యతిరేకిగా మహువాకు విపక్ష శిబిరంలో మంచి గుర్తింపు ఉంది. దానికితోడు కృష్ణానగర్ నుంచి మహువా గెలుపును సీఎం మమత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడం కూడా ఆమెకు కలిసిరానుంది. అయితే, అమృతరాయ్‌ను ప్రత్యర్థిగా నిలపడటం, జనంలో ఆ రాజ వంశానికి ఉన్న గౌరవం వంటి అంశాలు మహువాకు సవాల్ విసురుతున్నాయి. (సెంట్రల్ డెస్క్)

ఉల్లి మహా ఘాటు!

4, 5 దశల్లో మహారాష్ట్రలోని 24 సీట్లకు పోలింగ్

» ఇందులో అత్యధికం ఉల్లి సాగు ప్రాంతాలే

» ఎగుమతి నిషేధం, సుంకాలపై రైతుల ఆగ్రహం

» నష్ట నివారణకు నిషేధాన్ని ఎత్తేసిన కేంద్రం

(సెంట్రల్ డెస్క్)



ఇప్పటివరకు వంటింటి బడ్జెట్‌పై ప్రభావం చూపిన ఉల్లిపాయ..ఈసారి మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక అంశంకానుంది. దేశంలో యూపీ తర్వాత అత్యధిక లోక్‌సభ సీట్లున్న మహారాష్ట్ర (48)లో సగం స్థానాలకు 4, 5 దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ దశలతో పోలింగ్ పూర్తవుతుంది. ఇప్పటికే ఎన్సీపీ, శివసేన వంటి ప్రాంతీయ పార్టీలను చీల్చి అధికారంలోకి వచ్చి విమర్శల పాలైన బీజేపీకి కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పెద్ద ఇబ్బందికరంగా మారింది. అలాగని విపక్షాలకు ఇదేమీ లాభం చేకూర్చే పరిణామమూకాదని రాజకీయ విశ్లేషకుల అంటున్నారు. పశ్చిమ, ఉత్తర మహారాష్ట్రలో తదుపరి దశల ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలోని 22 జిల్లాల పరిధి 13 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఉల్లి ఎక్కువగా సాగవుతుంది. వీటిలో సోలాపూర్, లాతూర్, బారామతి, ఉస్మానాబాద్‌లో ఈనెల 7నే పోలింగ్ ముగిసింది. ఎన్నికలు జరగాల్సిన మిగతా ప్రాంతాల్లోని అత్యధిక శాతం ఉల్లి రైతులు రాజకీయ పార్టీల పట్ల మండిపడుతున్నారు. దీన్ని ఓటు రూపంలో చూపుతారని అంటున్నారు. దేశంలో 40 శాతం ఉల్లి పంట మహారాష్ట్రలోనే పండుతుంది.

కొన్ని నెలల క్రితం ఉల్లి ధరలు పెరగడంతో కేంద్రం ఎగుమతులపై 14%సుంకం విధించింది. అంతకుముందు డిసెంబరులో విదేశాలకు ఎగుమతిని నిలిపివేసింది. కానీ, రైతుల్లో తీవ్ర ఆగ్రహానికి కారణంకావడంతో ఈనెల 4న సుంకం ఎత్తివేసింది. కనీస ఎగుమతి ధరను టన్నుకు 850డాలర్లుగా స్థిరీకరించింది. అయితే తమకు ప్రయోజనంలేదని రైతులు అంటున్నారు. మరోవైపు కనీస ఎగుమతి మద్దతు ధరను టన్నుకు 550డాలర్లకు తగ్గిస్తూనే 40% ఎగుమతి సుంకం విధించింది. దేశంలోనే అతిపెద్ద హోల్‌సేల్ ఉల్లి మార్కెట్ లాసల్‌గావ్‌కు దూలే, ధిండోరి, అహ్మద్‌నగర్, షిర్డీ, షిరూర్, బీడ్, మావల్‌తోపాటు మరికొన్ని నియోజకవర్గాల రైతులు పంటను తీసుకొస్తారు. వీటికే నాలుగు, ఐదో దశల్లో ఎన్నికలున్నాయి. గ్రామీణ ప్రాంతంలో బీజేపీ ప్రభుత్వంపై ఆగ్రహం ఎక్కువగా ఉంది. దీంతో పౌర సరఫరాల శాఖ మంత్రి చగన్ భుజబల్ రంగంలోకి దిగి ఎగుమతులపై నిషేధంతో ఉల్లి రైతులు ఆగ్రహంగా ఉన్నారని అంగీకరిస్తూనే.. ఈ నిర్ణయాన్ని వెనక్కుతీసుకున్నట్టు తమప్రచారంలో గుర్తుచేస్తున్నారు.

తమ సమస్యలపై సరిగా స్పందించలేదని ఉల్లి రైతులు విపక్షాలపైనా ఆగ్రహంతో ఉన్నారు. ఎన్నికల్లో తమకే లబ్ధి చేకూరుతుందనే ఉద్దేశంలో శివసేన (ఉద్ధవ్), కాంగ్రెస్ పార్టీలు ప్రభుత్వంపై ఒత్తిడి చేయలేదని మహారాష్ట్ర ఉల్లి ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు భరత్ దిఘోలే వ్యాఖ్యానించారు. కేంద్ర వ్యవసాయ మంత్రి, ఎన్సీపీ (ఎస్పీ)అధినేత శరద్‌పవార్ చంద్వాడ్‌లో ఆందోళనకు దిగి కేంద్రాన్ని విమర్శించారని.. ధిండోరిలో ఆ పార్టీనే పోటీకి దిగిందన్నారు. ఎన్నికల్లో లబ్ధి కోసమే పవార్ నిరసనలు చేశారని ఆరోపించారు. "క్వింటా రూ.2,410చొప్పున 2 లక్షలటన్నుల ఉల్లిని కొంటామని కేంద్రం హామీనిచ్చింది. 99,150 టన్నులను ఎగుమతి చేయాలన్న నిర్ణయం అమలుకాలేదు. అంతకుముందు 3 లక్షల టన్నులు ఎగుమతి చేస్తామని విస్మరించారు. వినియోగదారులకు తక్కువ ధరకు అందించేందుకు ఉల్లి రైతులను బలి చేశారు" అంటూ రైతులు మండిపడుతున్నారు.

ఖర్గేపై ఈసీ మండిపాటు

న్యూఢిల్లీ, మే 10: ఎన్నికల సంఘం(ఈసీ) విడుదల చేసిన పోలింగ్ వివరాలు అసంబద్ధంగా ఉన్నాయంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలకు రాసిన లేఖల్లో ఆరోపించడంపై ఈసీ తీవ్రంగా స్పందించింది. స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షికంగా నిర్వహించే ఎన్నికలపై ఓటర్లలోనూ, రాజకీయ పార్టీల్లోనూ సందేహాలు లేవనెత్తి.. తప్పుదారి పట్టించేందుకు, గందరగోళం, అడ్డంకులు సృష్టించేందుకు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడింది. ఖర్గే లేఖ నిష్పాక్షిక ఎన్నికల ప్రక్రియపై సందేహాలు లేవనెత్తడంతోపాటు అసమ్మతిని, అరాచక పరిస్థితిని సృష్టించగలదని పేర్కొంది. ఖర్గే ఆరోపణలను ఎన్నికల ప్రక్రియపై దాడిగా అభివర్ణించింది. మొదటి దశలో పోలింగ్ శాతాన్ని 5.5 శాతం, రెండో దశలో 5.74 శాతం పెంచేశారని, ఆ వివరాల విడుదలలోనూ జాప్యం చేశారని ఖర్గే చేసిన ఆరోపణలనూ ఈసీ ఖండించింది. కాగా, ఖర్గే లేవనెత్తిన అంశాలపై ఈసీ స్పందించిన తీరు తీవ్ర విచారకరమని కాంగ్రెస్ ఆక్షేపించింది.

మా ఫిర్యాదులు పట్టవా?

» మోదీ, షాలపై చర్యలేవీ?

» ఈసీకి 'ఇండియా' ప్రశ్న

న్యూఢిల్లీ, మే10: ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తున్నారంటూ బీజేపీ నాయకుల మీద తాము చేసిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని విపక్ష ఇండియా కూటమి నాయకులు ఎలక్షన్ కమిషన్‌ను కోరారు. మొదటి రెండు దశల పోలింగ్ వివరాల వెల్లడిలో జాప్యం జరగడంపైనా ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం కాంగ్రెస్‌కు చెందిన అభిషేక్ మను సింఘ్వి, సల్మాన్ ఖుర్షీద్, డెరెక్ ఓబ్రెయిన్ (తృణమూల్), టి.ఆర్.బాలు (డీఎంకే), మహువా మాఝి (జేఎంఎం), బినయ్ విశ్వం (సీపీఐ), జావేద్ అలీ (సమాజ్‌వాదీ)లు ఎన్నికల సంఘాన్ని కలిసి ఏడు పేజీల వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం సింఘ్వి విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సంఘంతో దాదాపు 45 నిమిషాల సేపు సమావేశమయ్యామని చెప్పారు. ఎన్నికల కమిషన్ వ్యవహారశైలిపై 'తీవ్రమైన విశ్వాస లోటు' ఏర్పడిందని, అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయని, ఆందోళన, ఆవేదన కలుగుతోందని చెప్పారు. అసత్య ఆరోపణలు చేసిన వారిపై ఫిర్యాదులు చేస్తే ఎన్నికల సంఘం వారికి కాకుండా పార్టీ అధ్యక్షులకు నోటీసులు పంపించిందని, గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదని తెలిపారు. పోనీ అధ్యక్షులపై ఎలాంటి చర్యలు తీసుకుందో కూడా తెలియదని చెప్పారు. రాజస్థాన్‌లోని బాన్స్‌వాడలో ముస్లింలకు వ్యతిరేకంగా మాట్లాడిన మోదీపై ఫిర్యాదు చేయగా ఎన్నికల సంఘం మాత్రం బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డాకు నోటీసులు ఇవ్వడాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ వ్యాఖ్యలు చేశారు. పోలింగ్ వివరాల వెల్లడిలో జాప్యం జరుగుతుండడంపైనా ఎన్నికల సంఘం వద్ద ప్రస్తావించినట్టు సింఘ్వి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇంతవరకు 11 ఫిర్యాదులు ఇచ్చినా ఒక్కదానిపైనా చర్యలు తీసుకోలేదని తెలిపారు. వీటిపై సుప్రీంకోర్టును ఆశ్రయించే ఆలోచన ఉన్నట్టు చెప్పారు. ఇదిలా ఉండగా, పోలింగ్ జరిగిన 48 గంటల్లోగా మొత్తం ఓట్లు, పోలైన ఓట్ల సంఖ్యను వెల్లడించేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఏడీఆర్ పిటిషన్ దాఖలు చేసింది.

లోకం తీరు





అబ్ కీ బార్?



రాజకీయాల వల్లే రామమందిరానికి వెళ్లలే..

» విద్వేషాలను రెచ్చగొట్టేది మోదీ, బీజేపీనే:శశిథరూర్



హైదరాబాద్, ముషీరాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామమందిర నిర్మాణాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం వల్లే తాము రామాలయ ప్రారంభోత్సవానికి వెళ్లలేదని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అన్నారు. రామమందిరాన్ని ఎన్నికల కోసం వాడుతున్న బీజేపీ విధానాన్ని తాము తప్పుపడుతున్నామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో మెజార్టీ నాయకులు హిందువులేనని, తాము హిందువులను ఎందుకు ద్వేషిస్తామని ప్రశ్నించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ద్వేషం అనే బజారులో ప్రేమ అనే దుకాణం తెరవడమే తమ నినాదమని తెలిపారు. జిహాద్ అంటే కత్తులు పట్టుకొని జనాన్ని చంపడం కాదన్నారు. పదేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం వల్లే మోదీ నోటి నుంచి విద్వేషం పెంచే మాటలు వస్తున్నాయని ఆరోపించారు. విద్వేషాలు రెచ్చగొట్టడం తప్ప మోదీ దేశానికి చేసేందేమీ లేదని చెప్పారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ తదితర హామీలేవీ అమలు చేయలేదని గుర్తు చేశారు. ఇక, దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ సాఫ్(ఖాళీ) అయిందని, ఉత్తరాది రాష్ట్రాల్లో హాఫ్(సగం) అయిందని శశిథరూర్ ఎద్దేవా చేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా హైదరాబాద్‌లోని భోలక్‌పూర్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ఎంపీ నవనీత్‌కౌర్‌పై కేసు నమోదు



షాద్‌నగర్ రూరల్/కడ్తాల్, ఏప్రిల్ 10: బీజేపీ ఎంపీ నవనీత్‌కౌర్‌పై రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రచారంలో భాగంగా అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఎన్నికల్లో విధుల్లో ఉన్న ఫ్లయింగ్ స్క్వాడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమెపై 171-సి, ఆర్/డబ్ల్యు 171-ఎఫ్, 171-జి, 188 ఐపీసీ సెక్షన్ల కింద గురువారం కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే... షాద్‌నగర్ పట్టణంలో ఈనెల 8న మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ తరఫున స్టార్ క్యాంపెయినర్ హోదాలో నవనీత్‌కౌర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్నర్ మీటింగ్‌లో భాగంగా ఆమె ప్రసంగిస్తూ... కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే పాకిస్తాన్‌కు ఓటు వేసినట్లేనని వ్యాఖ్యానించారు. విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసినందుకు గానూ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంలోని ఎండబెట్ల కృష్ణమోహన్ అనే కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమెపై కేసు నమోదు చేసినట్లు షాద్‌నగర్ పోలీసులు పేర్కొన్నారు. అదేవిధంగా ఎంపీ నవనీత్‌కౌర్‌పై చర్యలు తీసుకోవాలని కడ్తాల మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కందికంటి రాజేందర్‌గౌడ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దేశ ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలు దెబ్బతినేలా కౌర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆక్షేపణీయమని, ఆమెపై ఈసీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



బీజేపీ, బీఆర్‌ఎస్‌కు ప్రశ్నించే హక్కులేదు: పొన్నం

హుస్నాబాద్, మే 10: పదేళ్ల అధికారంలో ఉండి ఒక్క హామీని అమలుచేయని బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై ప్రశ్నించే హక్కు లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎన్నికల తర్వాత అన్నింటిని అమలు చేస్తామని చెప్పారు. విభజన హామీలను అమలుచేయని బీజేపీని ఈ ఎన్నికల్లో బొంద పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కరీంనగర్ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లను రద్దు చేయడానికి బీజేపీ 400సీట్లు అడుగుతోందని, బీజేపీ ఒక్క సీటు గెలవకుండా చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మాజీ మంత్రి హరీశ్‌రావు హుస్నాబాద్‌లో మెడికల్ కాలేజీ హామీ ఏమైందంటున్నారని, అయితే మీరిచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. హుస్నాబాద్ ప్రాంతాన్ని బలవంతంగా మీ ఆధిపత్యంలో ఉంచుకున్నారని, దీనిని బంధ విముక్తి చేస్తామన్నారు. కాగా ఈ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీకి గుణపాఠం చెప్పాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. నియంతృత్వ విధానాలతో పదేళ్లలో ఒక్క హామీని అమలు చేయని బీజేపీని ఓడించాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు మాట్లాడుతూ కరీంనగర్‌ను కోహినూర్ కరీంనగర్‌గా మారుస్తానని హామీ ఇచ్చారు.

48 గంటల్లో వివరణ ఇవ్వండి..!

» సీఎం రేవంత్‌రెడ్డికి ఈసీ నోటీసులు

హైదరాబాద్, మే10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిబంధనలను అతిక్రమించి.. ప్రచార సభల్లో వ్యాఖ్యలు చేశారని, ఇందుకు గాను 48 గంటల్లో తగిన వివరణ ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఎన్నికల సంఘం శుక్రవారం నోటీసు జారీ చేసింది. ఈ నెల 5న బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌పై వ్యక్తిగత దూషణలు, అసభ్య పదజాలం వాడినందుకుగాను సీఎంకు నోటీసులు జారీ చేస్తున్నట్లు ఈసీ పేర్కొంది. దీనిపై స్పందించి నిర్ణీత సమయంలో వివరణ ఇవ్వాలని కోరింది.

ఎన్నికల ఏర్పాట్లపై సీఈవో సమీక్ష

హైదరాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 17 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల ఏర్పాట్లు, సంసిద్ధతపై సీఈవో వికాస్ రాజ్ సమీక్షించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. పోలింగ్ ప్రక్రియకు ఇంకా రెండు రోజులే ఉండడంతో సంబంధిత విభాగాలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. నగదు పంపిణీ, మద్యం, డ్రగ్స్, చీరలు, ఇతర వస్తు సామాగ్రి అక్రమ తరలింపులను కట్టడి చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, సర్వేలెన్స్ బృందాలు దృష్టిపెట్టాలన్నారు. ఈవీఎం, వీవీప్యాట్‌లను ప్రత్యేక వాహనాల్లో తరలించే సమయంలో కేంద్ర బలగాలు కచ్చితంగా ఉండాలని, పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అన్ని స్థాయిల అధికారులు కృషి చేయాలని సీఈవో పేర్కొన్నారు.

78 నామినేషన్లకు ఆమోదం..

» ముగిసిన 'ఎమ్మెల్సీ' ఉపఎన్నిక నామినేషన్ల పరిశీలన

నల్లగొండ, మే 10: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక నామినేషన్ల పరిశీలన పూర్తయింది. శుక్రవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనతో పాటు అధికారులు నామినేషన్లను పరిశీలించారు. మొత్తం 84 మంది అభ్యర్థులు 117 సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించగా.. 78 నామినేషన్లను ఆమోదించగా, వివిధ కారణాలతో ఆరింటిని తిరస్కరించారు. 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు. అయితే శని, ఆదివారాలు (ఈనెల 11, 12) సెలవు కావడంతో నామినేషన్ ఉపసంహరణకు దరఖాస్తులు స్వీకరించరు. ఈనెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు.

బీజేపీ.. క్యాన్సర్!

(మొదటిపేజీ తరువాయి)

రావడం మంచిది కాదని, ఆ పార్టీ ఒక్క సీటు కూడా గెలవకూడదని ఆకాంక్షించారు. కేంద్రంలో బీజేపీకి మళ్లీ అధికారమిస్తే మధ్య యుగాల పాలనే సాగుతుందని, అప్పటి చక్రవర్తులు 'రాజ్యమంటే నేను... నేనంటే రాజ్యమ'న్నట్లుగా ఉంటుందని ధ్వజమెత్తారు. దేశం భిన్న ప్రాంతాలు, చిన్న చిన్న సంస్థానాలుగా విడిపోతుందని హెచ్చరించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ కార్యవర్గం తాజ్ కృష్ణా హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సవివరంగా సమాధానమిచ్చారు. ఆ వివరాలు..

బీఆర్‌ఎస్ ఎన్నికలను వదిలేసింది

బీఆర్‌ఎస్ ఎన్నికలను వదిలేసిందని రేవంత్ వ్యాఖ్యానించారు. ఆ పార్టీ ఆరు సీట్లలో డిపాజిట్లు కోల్పోతోందని అభిప్రాయపడ్డారు. తద్వారా, తెలిసో తెలియకో బీజేపీకి లాభం చేస్తోందని వివరించారు. అధికారం పోవడం, కుమార్తె జైలుకు వెళ్లడంతో కేసీఆర్ తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉన్నారని, దాంతో, రోజుకో రకంగా.. రకరకాలుగా మాట్లాడుతున్నారని తప్పుబడుతూనే ఆయనపై సానుభూతి వ్యక్తం చేశారు. కేసీఆర్ పదేళ్ల తన పాలనలో వందేళ్లకు సంబంధించిన ఆర్థిక విధ్వంసం చేశారని మండిపడ్డారు. కేసీఆర్ వాడే భాషనే తానూ వాడుతున్నానని, ఆటలో ఇద్దరికీ ఒకే నిబంధన లుండాలని, ఆయన కాలుతో ఆడితే నేను చేత్తో ఆడలేను కదా.? అని ప్రశ్నించారు. మర్యాదగా మాట్లాడతానని ఆయన కాగితంపై సంతకం పెడితే.. తాను కూడా సిద్ధమని స్పష్టం చేశారు.

బీజేపీకి అధికారమిచ్చే కుట్ర

త్యాగాల పునాదులపై పార్టీని విస్తరించుకోవడమే కాకుండా పదేళ్లపాటు అధికారాన్ని అనుభవించి.. రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిన కేసీఆర్ కుటుంబం నిస్సహాయంగా, వ్యూహాత్మకంగా, తమ రాజకీయ అవసరాల కోసం రాజకీయ బేరసారాల్లో భాగంగా తెలంగాణ సమాజాన్ని నిట్టనిలువునా చీల్చాలనుకుంటున్న బీజేపీకి అధికారాన్ని అప్పగించే కుట్ర చేస్తోందని రేవంత్ రెడ్డి దుయ్యబట్టారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రాన్ని బీజేపీకి అప్పగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఈ కుట్రల నేపథ్యంలోనే రాష్ట్రంలో బీజేపీని నిలువరించాలన్న ఆలోచనతోనే కాంగ్రెస్ బరిలో నిలిచిందని చెప్పారు. అధికారాన్ని నిలబెట్టుకోవడానికి బీజేపీ ఎంతకైనా తెగిస్తుందని అన్నారు.

హైదరాబాద్‌కు పెట్టుబడులు అందుకే..

ఎన్నికల్లో గెలవడానికి మతాలు, భాషల మధ్య విద్వేషాలను సృష్టించడం, వ్యక్తుల మధ్య విషాన్ని చిమ్మడం బీజేపీ విధానమని, ఇది తెలంగాణ సమాజానికి మంచిది కాదని సీఎం రేవంత్ అన్నారు. ఉత్తరప్రదేశ్ సహా బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అభివృద్ధి జరగడం లేదని, అక్కడికి పెట్టుబడులు రావడం లేదని, జాతీయ, అంతర్జాతీయ సంస్థలు అటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని, ఇందుకు బీజేపీ పాలన విధానమే కారణమని చెప్పారు. "అదే హైదరాబాద్‌లో 1994 నుంచి 2004 వరకు టీడీపీ హయాంను తీసుకున్నా, 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్.. 2014 నుంచి 2023 వరకు బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నాయి. సిద్ధాంతాలపరంగా వైరుధ్యం ఉండొచ్చు. పరిపాలనలో భిన్న అభిప్రాయాలుండొచ్చు. కానీ, ప్రాంతంలో చిచ్చు పెట్టే ఆలోచన చేయకుండా.. మతాలను విభజించకుండా.. వ్యక్తుల మధ్య ద్వేషాన్ని రెచ్చగొట్టకుండా పాలన సాగించాం. అందుకే ప్రపంచ పెట్టుబడులకు హైదరాబాద్ కేంద్రంగా మారింది" అని వివరించారు.

మోదీ.. విద్వేష ప్రధాని



పదేళ్ల ప్రధానిగా చేసి.. మూడోసారి పీఠం ఎక్కాలని అనుకుంటున్న మోదీ ప్రజల్లో శాశ్వతంగా విద్వేషాన్ని నింపి, దేశ మనుగడకే ప్రమాదం తెస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. దేశం భిన్న ప్రాంతాలుగా, చిన్న చిన్న సంస్థానాలుగా విడిపోవడానికి ఇది దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పాకిస్థాన్‌కు సుపారీ ఇచ్చి, తనను హత్య చేయడానికి కుట్ర పన్నారని 2019 ఎన్నికల ప్రచారం సందర్భంగా మోదీ ఆరోపించారని, ఎన్నికైన తర్వాత ఎందుకు విచారణ చేయించలేదని నిలదీశారు. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే.. ఆస్తులతోపాటు పుస్తెలను కూడా లాక్కుని ముస్లిములకు పంచి పెడతారని మోదీ ఆరోపిస్తున్నారని, భావోద్రేకాలను రెచ్చగొట్టడం.. ఇతరుల మీద బురద జల్లడం ద్వారా రాజకీయ ప్రయోజనం పొందడమే ఎన్నికల్లో మోదీ వ్యూహమని వివరించారు. అందుకు దేశం ఏమైనా పర్వా లేదన్నది ఆయన విధానమన్నారు. వ్యక్తుల చేతుల్లో వ్యవస్థలన్నీ బందీలై బానిసల్లా పని చేయాలని భావిస్తున్నారని, అందుకే, రిజర్వేషన్ల రద్దు వంటి అంశాలను తెరపైకి తెచ్చారని ఆరోపించారు.

తెలుగు రాష్ట్రాలపై వివక్ష

రాజకీయంగా, ఆర్థికంగా, అభివృద్ధిపరంగా దక్షిణ, ఉత్తర భారతాల మధ్య ఇప్పటికే అంతరం పెరుగుతోందని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. గుజరాత్‌లో 26 మంది ఎంపీలుంటే ప్రధాని పదవితోపాటు ఏడు కేంద్ర మంత్రి పదవులు తీసుకున్నారని, ఉత్తరప్రదేశ్‌కు 12 మంత్రి పదవులు తీసుకున్నారని, కానీ, తెలుగు రాష్ట్రాల్లో 42 లోక్‌సభ, 18 మంది రాజ్యసభ సభ్యులున్నా.. ఒకే ఒక మంత్రి పదవి ఇచ్చారని తప్పుబట్టారు. తెలంగాణ నుంచి ఒక రూపాయి పన్నును చెల్లిస్తే... తిరిగి వచ్చేది 43 పైసలేనని, అదే బీహార్ నుంచి రూపాయి చెల్లిస్తే... ఏడు రూపాయల ఆరు పైసలు వెళుతున్నాయని వివరించారు.

నియోజకవర్గాల పునర్విభజన ప్రమాదకరం

రాబోయే రోజుల్లో నియోజకవర్గాల పునర్విభజన తెలుగు రాష్ట్రాలకు మెడ మీద కత్తిలా వేలాడుతోందని సీఎం రేవంత్ చెప్పారు. జనాభా ప్రాతిపదికన నియోజక వర్గాలను విభజిస్తే అన్యాయం జరుగుతుందన్నారు. "ఆనాడు ప్రధానమంత్రులు, పాలకులు ఇచ్చిన పిలుపు మేరకు దక్షిణాదిలో కుటుంబ నియంత్రణ పాటించారు. జనాభా తగ్గింది. కానీ... ఉత్తరంలో జనాభా పెరిగింది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే... మన మనుగడ, ఉనికి ప్రమాదమే. మన ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహించే పరిస్థితి ఉండదు" అని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా అధికారంలోకి వస్తేనే సమ న్యాయం జరుగుతుందని అన్నారు.

మోదీ పక్కనే అవినీతిపరులు

అవినీతి గురించి మాట్లాడుతున్న ప్రధాని మోదీ ఎలక్టోరల్ బాండ్స్‌పై చర్చకు సిద్ధమా అని సీఎం రేవంత్ సవాలు చేశారు. శుక్రవారం మహబూబ్‌నగర్ సమావేశంలో నాటుసారా అమ్మేవారిని, మద్యం దుకాణాల నుంచి వసూళ్లు చేసే వారిని, ఎవరి పేరు చెబితే దొంగలు కూడా భయపడతారో అలాంటి వారిని పక్కన కూర్చోబెట్టుకుని అవినీతి గురించి ప్రధాని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కుమారస్వామి, ఏకనాథ్ షిండే, అజిత్ పవార్, నవీన్ జిందాల్, అశోక్ చవాన్ వంటి వారిని పక్కన కూర్చోబెట్టుకుని మోదీ అవినీతి గురించి మాట్లాడటం సరికాదన్నారు. తాను నిజాయితీపరుడినని మోదీ అంటున్నారని, కానీ, రూ.60 లక్షల కోట్ల ప్రభుత్వ ఆస్తులను రూ.6 లక్షల కోట్లకు బినామీలు, మిత్రులు, పార్టీ సహచరులకు అమ్మేశారని, ఆయన తరఫున సమూహాలు దోచుకుంటున్నాయని ఆరోపించారు. అవినీతికి పాల్పడుతున్నవారు మళ్లీ ఆయన పక్కనే వచ్చిచేరుతున్నారని, బీజేపీలో చేరగానే అవినీతిపరులు పునీతులైపోతున్నారని చెప్పారు. రాజు నీతిగా ఉంటే సరిపోదు రాజ్యం నిజాయితీగా నడపాలని సూచించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ ఎంత భారీగా ఖర్చు పెడుతోందో చూస్తున్నామని, రైలు టికెట్లు కూడా కొనుగోలు చేయలేని స్థితిలో కాంగ్రెస్ ఎన్నికలను ఎదుర్కొంటోందని తెలిపారు. దేశవ్యాప్తంగా బీజేపీ, కాంగ్రెస్ పెట్టిన సమావేశాల మీద కమిటీ వేసి ఏ పార్టీ ఎంత ఖర్చు పెట్టిందనే దానిమీద మోదీ చర్చకు సిద్ధమా అని సవాలు చేశారు. ఆర్భాటంగా ఎన్నికల ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులకు ఆ నిధులు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలన్నారు. అవినీతి డబ్బుతో ఎన్నికల ప్రచారం చేయడం లేదని మోదీ, అమిత్ షాతో పాటు బీజేపీ ముఖ్యులు భద్రాచలంలోని రామాలయంకు వచ్చి ప్రమాణం చేయగలరా అని సవాలు విసిరారు. అలా చేస్తే ఎన్నికల ప్రచారం నుంచి తాను తప్పుకుంటానన్నారు. మోదీ దిగజారుడు ఆరోపణలు ఆయన కుర్చీకి గౌరవాన్ని తీసుకురావన్నారు.

అవి ఆరెస్సెస్ సిద్ధాంతాలు..

ఆధారాల ప్రాతిపదికనే బీజేపీపై విమర్శలు చేస్తున్నానని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. రాజ్యాంగంలో సంస్కరణలు, మార్పుల గురించి వెంకటాచలం కమిషన్ ఇచ్చిన నివేదిక ఇప్పుడు కనిపించడం లేదన్నారు. 1925లో ఆర్‌ఎస్‌ఎస్‌ను మొదలు పెట్టినప్పుడు హెగ్డేవార్ వందేళ్లలోపు ఈ దేశాన్ని హిందూ దేశంగా ప్రకటించేలా కార్యాచరణ మొదలు పెట్టారన్నారు. 2025లో ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్లు పూర్తి చేసుకుంటుందని, దాని కార్యాచరణను అమలు చేయడానికి ఏర్పడిన పార్టీ బీజేపీ అని చెప్పారు. ప్రస్తుతం ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాలో మిగిలినవి రెండే అంశాలని, ఒకటి రాజ్యాంగాన్ని మార్చడం, రెండోది రిజర్వేషన్లు రద్దు చేయడమని అన్నారు. 400 సీట్లు వస్తే వీటిని చేయవచ్చని భావించి.. ఈ దఫా 400 సీట్లు అనే నినాదాన్ని బీజేపీ తెర మీదకు తెచ్చిందన్నారు. ఏ విధానాలను తీసుకు రావాలని రహస్యంగా ముందుకు వస్తున్నారో వాటిని తాను కదిలించానన్నారు. తన స్థాయి చాలా చిన్నదైనా మోదీని ఎదుర్కొనే ప్రయత్నం చేశానన్నారు. ఈ నేపథ్యంలోనే హోం శాఖ ఆధ్వర్యంలో తనపై అమిత్ షా క్రిమినల్ కేసు నమోదు చేయించారన్నారు.

అసద్‌ను గెలిపించేందుకే మోదీ సహకారం..

హైదరాబాదులో అసదుద్దీన్ ఒవైసీని గెలిపించేందుకే మోదీ ఇక్కడ హార్డ్‌కోర్ హిందుత్వవాదికి టికెట్ ఇచ్చారని సీఎం రేవంత్ ఆరోపించారు. 60 శాతం ముస్లింలున్న హైదరాబాదులో ముస్లింకు కాకుండా విద్వేషాలు రెచ్చగొట్టే మాధవీలతకు టికెట్ ఇవ్వడం వెనక ఆంతర్యం ఇదేనన్నారు. నిజానికి, అసదుద్దీన్‌పై తీవ్ర వ్యతిరేకత ఉందని, ఓడిపోయే పరిస్థితి ఉందని, కానీ, ఆయనను గెలిపించేందుకు.. ముస్లిముల ఓట్లను పోలరైజ్ చేయడానికే మాధవీలతకు మోదీ టికెట్ ఇచ్చారని అన్నారు. మాధవీలత హిందూ ముస్లిముల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారని, దీంతో తీవ్ర అభద్రతా భావంలో ముస్లింలు తప్పని పరిస్థితుల్లో తమ ఓట్లు ఒవైసీకే వేయాల్సి వస్తోందని చెప్పారు. మళ్లీ ఒవైసీని గెలపించే ప్రణాళిక ఇదని, దీనిని మోదీ రూపొందించారని ఆరోపించారు. కార్యక్రమానికి 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ మోడరేటర్‌గా వ్యవహరించగా... మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలనాయుడు పాల్గొన్నారు.

'పుల్వామా' కేంద్ర వైఫల్యమే..

దేశ అంతర్గత భద్రత కేంద్రం బాధ్యతని, దానిని నెరవేర్చడంలో మోదీ సర్కారు విఫలమైందని పుల్వామా ఘటనతో తేలిపోయిందని సీఎం రేవంత్ ఆరోపించారు. అసలు పుల్వామా ఘటన ఎందుకు జరిగిందో కేంద్రం ఇంతవరకు వెల్లడించలేదని, తమ తప్పిదాన్ని కప్పిపుచ్చుకునేందుకు తర్వాత సర్జికల్ స్ట్రైక్ అన్నారని వివరించారు. "సర్జికల్ స్ట్రైక్ జరిగిందో లేదో ఎవ్వరికీ తెలియదు. కేంద్రాన్ని ఏమైనా ప్రశ్నిస్తే జై శ్రీరాం అంటున్నారు. మాకు జైశ్రీరాం తాతల నాటినుంచే తెలుసు. బీజేపీ వారు అన్ని వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, చేసిన పనులు చెప్పుకునేందుకు ఏమీలేక.. దేవుడి పేరు వాడుకుంటోంది" అని విమర్శించారు.

మోదీ రిటైర్ అవుతారా!?

రాజకీయాల నుంచి 75 ఏళ్లకు రిటైర్ కావాలని స్వయంగా మోదీ చెప్పారని, ఆ కారణంతోనే ఆడ్వాణీ, మురళీ మనోహర్ జోషీలను పక్కనబెట్టారని, ఇప్పుడు మోదీ వయసు 74 ఏళ్లని, వచ్చే ఏడాది ఆయన రాజకీయాల నుంచి రిటైర్ అవుతారా..? అని సీఎం రేవంత్ ప్రశ్నించారు. ముస్లిం రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని ప్రధాన మోదీ కనీస అవగాహన లేకుండా అసత్యాలు మాట్లాడుతున్నారని చెప్పారు. ముస్లిములలోని దూదేకులకు ఎప్పటి నుంచో రిజర్వేషన్లు ఉన్నాయన్నారు. వైఎస్ఆర్ ఆర్థిక ప్రాతిపదికనే ముస్లిములకు రిజర్వేషన్లు కల్పించారన్నారు. ఇప్పుడు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని మేనిఫెస్టోలో చెప్పామని, దాంతో కంగారుపడి.. రాజకీయ లబ్ధి కోసం మోదీ ముస్లింలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు.



జగన్.. ముందు ఇల్లు సరిదిద్దుకో

ఏపీలో టీడీపీ గెలిస్తే రాష్ట్రం తెలంగాణ చేతుల్లో ఉంటుందన్న జగన్ విమర్శలపై సీఎం రేవంత్ స్పందించారు. ఆయన మాటలను సొంత చెల్లి, కన్నతల్లే విశ్వసించడం లేదని, అటువంటప్పుడు ఆయన మాటలకు విలువ లేదని కొట్టిపారేశారు. ముందుగా చెల్లి, కన్నతల్లి మాటలకు బదులివ్వాలని జగన్‌కు సూచించారు. ముందు కుటుంబ సమస్యలు పరిష్కరించుకోవాలని జగన్‌ను కోరుతున్నానన్నారు. చంద్రబాబుపై గౌరవం ఉందని, కానీ, రాజకీయ సంబంధాలు లేవని చెప్పారు. ఏపీలో షర్మిల ముఖ్యమంత్రి అవుతారని, అక్కడ పార్టీ బలోపేతంపై దృష్టి సారిస్తామన్నారు.

బీజేపీపై పోరాటం సామాజిక బాధ్యత..

అన్ని మతాలు సోదరభావంతో ఉంటున్న దేశంలో బీజేపీ చిచ్చు పెడుతోందని, అందుకే కాషాయ పార్టీపై తన పోరాటమని సీఎం రేవంత్ అన్నారు. తనతోపాటు కాంగ్రెస్ నేతలను లక్ష్యంగా చేసుకుని ఇప్పటికే కేంద్ర హోం శాఖ ఢిల్లీ పోలీసులను రంగంలోకి దించిందని, ఇప్పుడు హైదరాబాదులో అనేకమంది ఢిల్లీ పోలీసులు ఉన్నారని, ఫేక్ వీడియో పేరుతో బెదిరిస్తున్నారని ఆరోపించారు.

బీజేపీకి ఓటేస్తే రాష్ట్రం నాశనం

వారి పాలనలో ఉన్న యూపీనే ఉదాహరణ.. అక్కడికి పెట్టుబడులు, కంపెనీలు వెళ్లటం లేదు


» ఢిల్లీ సుల్తాన్‌లతో డీకే అరుణ కుమ్మక్కు

» రైతుభరోసా ఇచ్చాం..

కేసీఆర్ ముక్కు నేలకు రాస్తారా? : రేవంత్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ప్రస్తుతం మన రాష్ట్రం ప్రశాంతంగా ఉన్నదని, జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు వస్తున్నాయని, అభివృద్ధి జరుగుతోందని.. ఎవరైనా పొరపాటున బీజేపీకి ఓటేస్తే మతాల మధ్య చిచ్చుపెడతారని, పొద్దున లేస్తే మనుషుల మధ్య పంచాయితీలుంటాయని, దీంతో ఎక్కడి అభివృద్ధి అక్కడ ఆగిపోతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. రాష్ట్రం విధ్వంసం అవుతుందని, వందేళ్లు వెనక్కి పోతుందన్నారు. దీనికి బీజేపీ పాలనలో ఉన్న ఉత్తర్‌ప్రదేశే అతి పెద్ద ఉదాహరణ అని చెప్పారు. ఆ రాష్ట్రం నుంచి స్వయంగా ప్రధాని మోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తున్నా.. సీఎం పదవిలో యోగి ఆదిత్యనాథ్ ఉన్నా.. అక్కడికి పెట్టుబడులు, కార్పొరేట్ కంపెనీలు వెళ్లటం లేదని తెలిపారు. బీజేపోళ్ళు నిత్యం పెట్టే మతచిచ్చు పంచాయితీలతో, వాళ్ళు చిమ్మే విషంతో యూపీ సర్వనాశనమైపోయిందన్నారు. ఢిల్లీ సమీపంలోని నోయిడాలో మౌలిక సదుపాయాలున్నా కూడా ఆ ప్రాంతం యూపీలో భాగంగా ఉన్నందున.. ఒక్క రూపాయి పెట్టుబడి కూడా అక్కడికి వెళ్లటం లేదని తెలిపారు. దీని గురించి తెలంగాణలో ప్రతి ఓటరు తీవ్రంగా ఆలోచించి ఓటు వేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నారాయణపేట జిల్లా మక్తల్‌లో కాంగ్రెస్ నిర్వహించిన జనజాతర సభలో, రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో భారీ రోడ్ షో అనంతరం జరిపిన కార్నర్ మీటింగ్‌లో, హైదరాబాద్‌లో జరిపిన రోడ్‌షోలలో సీఎం ప్రసంగించారు. ఎన్నికల్లో గెలవడం కోసం బీజేపీ విద్వేషాలు రగిలిస్తోందని, గొడవలు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించి హైదరాబాద్ పెట్టుబడులను గుజరాత్‌కు తరలించడానికి కుట్ర పన్నిందన్నారు. కర్ఫ్యూలు వస్తే జీవితాలు అతలాకుతలం అవుతాయని, హైదరాబాద్ నగరంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగితే రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో 20 ఏళ్లుగా హిందూ, ముస్లింల మధ్య ఎలాంటి గొడవలు లేవని, ఈ మత సామరస్యం నేపథ్యంలోనే నగరానికి ఐటీ సంస్థలు, భారీ కంపెనీలు వచ్చాయని తెలిపారు. పాతబస్తీ ప్రజలు కర్ఫ్యూలు మరిచిపోయారని, వినాయక చవితి, రంజాన్ కలిసి మెలిసి జరుపుకొంటున్నామని సీఎం గుర్తు చేశారు. విద్వేష ప్రసంగాలు వినొద్దని, ఈ ప్రాంతం మనదని.. దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదేనని చెప్పారు. 'బీజేపీకి వేసే ప్రతీ ఓటు రిజర్వేషన్ల రద్దుకు ఒక తీర్పులాంటిది. బీజేపీ కుట్ర, ఆలోచన ఒకటే 400 సీట్లు రావాలి.. రాజ్యాంగాన్ని మార్చాలి.. రిజర్వేషన్లు రద్దు చేయాలి' అని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రిజర్వేషన్లు రద్దు చేయడానికే బీజేపీ 400 సీట్లు కావాలంటోందని, రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు.



గోషామహల్ రోడ్‌షోలో సీఎం రేవంత్‌కు తలపాగా చుడుతున్న అంజన్‌కుమార్‌యాదవ్

తెలంగాణ ప్రజలకు నిరాశ

ఎన్నికల్లో భాగంగా రాష్ట్రంలో పర్యటించిన ప్రధాని మోదీ ఏ వరాలు ఇవ్వకుండా, కేవలం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించి వెళ్లిపోయారని సీఎం విమర్శించారు. ప్రధానిమంత్రి వస్తున్నారంటే రాష్ట్రంలో అసంపూర్తిగా విగిలిపోయిన ప్రాజెక్టులు పూర్తి చేస్తారని, గతంలో ప్రకటించిన ఐటీఐఆర్, వరంగల్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఖమ్మం ఉక్కు కర్మాగారం, కొత్త రైల్వే లైన్లు, తదితర అభివృద్ధి పనులు ప్రకటిస్తారని ఆశిస్తే, తెలంగాణ ప్రజలకు నిరాశే మిగిల్చి పోయారన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న డీకే అరుణ రాజకీయంగా ఉన్నత పదవులు పొంది ఈ రోజు కాంగ్రెస్ పార్టీని ఓడించాలంటూ ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. 'మోదీ నేడు పాలమూరుపై దండయాత్ర చేసి ఉండొచ్చు. కానీ, మన ఇంటిదొంగలే బొడ్లో కత్తిపెట్టుకొని తిరుగుతున్నారు. 70 ఏళ్ళ తర్వాత పాలమూరు బిడ్డకు సీఎంగా అవకాశం వచ్చినప్పుడు.. జెండాలకు అజెండాలకు రాజకీయాలకు అతీతంగా జిల్లా అభివృద్ధికి ఏకం కావాల్సిన సమయంలో, కాంగ్రెస్‌ను ఓడగొట్టాలని కత్తి పట్టుకొని డీకే అరుణ ఢిల్లీ సుల్తాన్‌ల పంచన చేరారు. ఆమెను గెలిపిస్తే మళ్ళీ మాజీ ఎమ్మెల్యే ఇసుక దందా చేస్తాడు. అక్రమ కేసులు పెట్టిస్తాడు' అని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కేసీఆర్ తన కూతురు బెయిల్ కోసం బీఆర్‌ఎస్ పార్టీని బీజేపీకి తాకట్టు పెట్టారన్నారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ రాష్ట్రాన్ని, ఆర్థిక వ్యవస్థను నాశనం చేసి దొరికినంత దోచుకుతిన్నారని దుయ్యబట్టారు. రైతుభరోసాపై కేసీఆర్ దుష్ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారని.. కానీ, ఈ నెల 9వ తేదీ లోపు రైతులందరికీ రైతుభరోసా అందజేసి, తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నానని, ఇందుకు కేసీఆర్ ముక్కు నేలకు రాస్తారా అని సీఎం సవాల్ విసిరారు. ఆగస్టు 15లోపు రైతుల రూ.2లక్షల రుణమాఫీ కూడా చేస్తానని, అప్పుడు సిద్దిపేట శనేశ్వర్‌రావు శని కూడా తొలగించుకుంటానని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు.


మెజారిటీ తెచ్చినోళ్ళకే స్థానికసంస్థల్లో అవకాశాలు

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలలో పోలింగ్ బూత్‌లలో మెజారిటీ తెచ్చిన వాళ్ళకే స్థానిక సంస్థలలో అవకాశాలు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని గుర్తు చేశారు. పార్టీ తరఫున కష్టపడ్డోళ్ళకే అవకాశం ఉంటది తప్ప తెల్లచొక్కాలు వేసుకొని తన చుట్టూ తిరిగి ఓట్లు తేని వారికి అవకాశం ఉండదని స్పష్టం చేశారు. హైదరాబాద్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్న సమీర్ వలీవుల్లాతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి గోషామహల్‌లో, బేగంబజార్‌లో జరిగిన రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లలో పాల్గొన్నారు.



అబ్ కీ బార్?

ఓటుకు చలో!




యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో హైవేపై వాహనాల రద్దీ

హైదరాబాద్ నుంచి ఏపీకి లక్షలమంది ఓటర్లు

ఈ నెల 13న ఎన్నికల్లో ఓటేసేందుకు పయనం.. వరుసగా 3 రోజులు సెలవులతో స్వగ్రామాలకు

విజయవాడ హైవేపై పెరిగిన వాహనాల రద్దీ.. బస్టాండ్లతో పాటు రైల్వే స్టేషన్లలోనూ సందడి

చార్జీలు అమాంతం పెంచేసిన ఆర్టీసీ, ట్రావెల్స్.. విమానం టికెట్ స్థాయికి బస్సు టికెట్ల ధరలు

సొంత వాహనాలు, రైళ్లలోనూ వేలాది మంది..! రవాణా కోసం ఏర్పాట్లు చేసిన ప్రధాన పార్టీలు


కేబీహెచ్‌బీ దగ్గర రద్దీ..

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, చౌటుప్పల్, మే 10(ఆంధ్రజ్యోతి): సహజంగా.. పెద్ద పండుగైన సంక్రాంతికి హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై రద్దీ నెల కొంటుంది. ఏపీ ప్రజలు సొంత రాష్ట్రానికి వెళ్లే క్రమంలో వాహనాలతో ఈ మార్గం కిటకిటలాడుతుంటుంది. కానీ, ఏ పండుగా లేకున్నా.. ఇప్పుడు అలాంటి సందడే కనిపిస్తోంది. ఓట్ల పండుగకు లక్షల మంది ఏపీ వాసులు సొంత ప్రాంతానికి పయనం కావడమే దీనికి కారణం. లోక్‌సభతో పాటు పొరుగు రాష్ట్రంలో ఈ నెల 13న అత్యంత కీలకమైన అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 11వ తేదీ రెండో శని వారం, 12న ఆదివారం కావడంతో ఏపీలో ఓటు ఉన్నవారు శుక్రవారమే ప్రయాణమయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని హైదరాబాద్-విజయవాడ 65వ నెంబరు జాతీయ రహదారిపై వాహనాలు బారులు తీరాయి. విజయవాడ వైపు పంతంగి టోల్ గేట్ నుంచి రోజూ 30వేల నుంచి 35 వేల వాహనాలు వెళ్తుంటాయి. శుక్రవారం ఐదు వేల వాహనాలు అధికంగా వెళ్లాయి. రద్దీ 13వ తేదీ సాయంత్రం వరకు కొనసాగనుండడంతో టోల్ గేట్ వద్ద జీఎంఆర్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా మీదుగా అదనంగా 2 వేల వాహనాలు రాకపోకలు సాగించాయి. వాహనాల రద్దీ గంటగంటకూ పెరుగుతుండడంతో ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకున్నారు. కాగా, హైదరాబాద్‌లోని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలోనూ ఏపీకి వెళ్తున్నవారితో రద్దీ ఏర్పడింది. ఉద్యోగుల్లో వీలు కుదిరిన వారు శుక్రవారం కూడా సెలవుపెట్టి గురువారం రాత్రే బయల్దేరారు. గురు, శుక్రవారాల్లో సొంత వాహనాల ద్వారా దాదాపు 12వేల మంది వెళ్లినట్లు సమాచారం. ఏపీలో ఓటు ఉండి తెలంగాణలో నివసిస్తున్నవారు 30 లక్షల వరకు ఉన్నారు. ఒక్క హైదరాబాద్ పరిధిలోనే 18 లక్షల మంది ఉన్నట్లు అంచనా.

రద్దీని సొమ్ము చేసుకునేందుకు..

ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ఆర్టీసీ 2 వేల అదనపు సర్వీసులను నడుపుతోంది. ఇక హైదరాబాద్ నుంచి వెళ్తున్న ఓటర్ల నుంచి సొమ్ము చేసుకునేందుకు ప్రైవేటు ఆపరేటర్లు రవాణా చార్జీలను భారీగా పెంచారు. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి గుంటూరుకు టికెట్ రూ.700 ఉంటుంది. ఇప్పుడు మూడు రెట్లు పెంచారు. ప్రముఖ ట్రావెల్స్ సంస్థల టికెట్ రేట్లు విమాన చార్జీలతో పోటీ పడుతున్నాయి. గుంటూరుకు శని వారం రూ.2,271 నుంచి రూ.2,426 చార్జి చేశారు. తిరుపతికి రూ.2,899 వరకు వసూలు చేస్తున్నారు. విశాఖపట్నంకు అయితే రూ.3 వేల నుంచి రూ.3,600 పైమాటే.

40-45 మందికి ప్రత్యేక బస్సు

గ్రేటర్ హైదరాబాద్‌లో ఉంటున్న ఏపీ వారి ప్రతి ఓటునూ ఆ రాష్ట్ర నాయకులు కీలకంగా భావిస్తున్నారు. దీంతో మూడు, నాలుగు రోజులుగా శేరిలింగంపల్లి, విజయాపూర్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, మూసాపేట్, రాజేంద్రనగర్, ఎల్‌బీనగర్ ప్రాంతాల్లోని కార్యాలయాలు, అపార్ట్‌మెంట్లు, కాలనీలు, బస్తీల వద్ద సందడి నెలకొంది. 40-45 మంది ఓటర్లకు బస్సు ఏర్పాటు చేస్తున్నారు. పరిమితి వించితే మరో బస్సును పెడుతున్నారు. హైదరాబాద్‌లోనే కాక తెలంగాణలోని వివిధచోట్ల ఉంటూ ఏపీలో ఓటున్నవారిని తరలించేందుకు సిద్ధమవుతున్నారు. కాగా, టీడీపీ, వైసీపీ ముఖ్య నాయకులంతా నెల రోజులుగా ఏపీ ఓటర్లతో హైదరాబాద్‌లో ప్రత్యేక సమావేశాలు పెట్టి పోలింగ్ నాడు వచ్చి ఓటు వేయాలని అభ్యర్థించారు.

కాకినాడకు 40 బస్సులు

జనసేన అధినేత పవన్ కల్యాణ్ పోటీ చేస్తున్న పిఠాపురం అసెంబ్లీ స్థానం కాకినాడ లోక్‌సభ పరిధిలోకి వస్తుంది. ఈ నియోజకవర్గానికి శని, ఆదివారాల్లో హైదరాబాద్ నుంచి 40 బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఓ పార్టీ నాయకులు 2,800 మందిని తీసుకెళ్లే ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. బస్సులను ఇష్టపడని కుటుంబాలకు కార్లు సమకూర్చుతున్నారు. మూడు రోజుల్లో 15 వేల మందిని బస్సుల్లోనే తరలించారు. మరో 40-60వేల మందిని తీసుకెళ్లే అవకాశం ఉందని ప్రైవేట్ బస్సు ట్రావెల్స్ నిర్వాహకులు చెబుతున్నారు.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఏ సెగ్మెంట్ ఎవరికి!?

బీఆర్ఎస్: సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, సంగారెడ్డి, పటాన్‌చెరు, నర్సాపూర్

కాంగ్రెస్: మెదక్

2019 లోక్‌సభ ఎన్నికల్లో..

పార్టీ	అభ్యర్థి	ఓట్లు
బీఆర్ఎస్	కొత్త ప్రభాకర్‌రెడ్డి	5,96,048
కాంగ్రెస్	గాలి అనిల్‌కుమార్	2,79,621
బీజేపీ	ఎం. రఘు నందన్‌రావు	2,01,567

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరికెన్ని ఓట్లు!?

బీఆర్ఎస్ (కారు)	6,68,955
కాంగ్రెస్ (హస్తం)	4,20,881
బీజేపీ (కమలం)	2,11,626




ఇందిరాగాంధీ వంటి నాయకురాలిని గెలిపించిన ప్రాంతం. తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన నేల. పన్నెండు మునిసిపాలిటీలు, మూడు గ్రేటర్ హైదరాబాద్ డివిజన్లు, 920 గ్రామాలు కలగలసిన పార్లమెంటు నియోజకవర్గం. ఇరవై ఏళ్లుగా బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న మెదక్ లోక్‌సభ స్థానం. ఆధిపత్యాన్ని కొనసాగించాలని బీఆర్ఎస్, తిరిగి పాగా వేయాలని కాంగ్రెస్, బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తుండడంతో మెతుకుసీమలో పోరు ప్రతిష్ఠాత్మకంగా సాగుతోంది.

పురుషులు	9,02,110
మహిళలు	9,25,891
ఇతరులు	209
మొత్తం ఓటర్లు	18,28,210

మెతుకు సీమ
మద్దతెవరికో!



ఇరవై ఏళ్లుగా గులాబీ కంచుకోటగా మెదక్



సిటింగ్‌ను నిలబెట్టుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నం

పాగా వేయడానికి కాంగ్రెస్, బీజేపీ పోరాటం

ప్రధాన పార్టీల అభ్యర్థుల హోరాహోరీ ప్రచారం

(ఆంధ్రజ్యోతి, సిద్దిపేట)

మెదక్ పార్లమెంటు నియోజకవర్గం సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఆ పార్టీ ఎమ్మెల్సీ, మాజీ కలెక్టర్ వెంకట్రామారెడ్డి బరిలోకి దిగారు. కాంగ్రెస్.. తాజా మాజీ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్‌ను తెరపైకి తెచ్చింది. దుబ్బాక ఎమ్మెల్యేగా ఓటమి చవిచూసిన రఘునందన్‌రావును ఈసారి ఎంపీ అభ్యర్థిగా బీజేపీ బరిలోకి దించింది. ఇప్పటికే ఈ ముగ్గురు అభ్యర్థుల తరఫున అగ్రనేతలు ప్రచారంలో పాల్గొన్నారు.

కంచుకోటను కాపాడుకోవాలని..

తాజా పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలిచే స్థానాల ప్రస్తావన వస్తే.. ముందుగా మెదక్ గురించే చర్చ జరుగుతోంది. ఈ స్థానాన్ని తాము తప్పక గెలుస్తామని గులాబీ శ్రేణులు బలంగా నమ్ముతున్నాయి. మెదక్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరింట బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉండడమే ఇందుకు కారణం. వీరిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోపాటు మరో కీలక నేత హరీశ్‌రావు కూడా ఉన్నారు. 2004 నుంచి బీఆర్ఎస్ తరఫున వరుసగా ఆలె నరేంద్ర, విజయశాంతి, కేసీఆర్, కొత్త ప్రభాకర్ రెడ్డి గెలుపొందారు. ప్రస్తుత అభ్యర్థి వెంకట్రామారెడ్డి ఈ ప్రాంతంలో డ్వామా పీడీగా, అడిషనల్ కలెక్టర్‌గా, జాయింట్ కలెక్టర్‌గా, కలెక్టర్‌గా సుదీర్ఘకాలం పనిచేసిన అనుభవం తమకు లాభిస్తుందని భావిస్తున్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నీతానై విస్తృతస్థాయిలో ప్రచారం చేస్తున్నారు. సిటింగ్ స్థానాన్ని కాపాడుకోవాలని బీఆర్ఎస్ శిబిరం సర్వశక్తులూ ఒడ్డుతోంది.



విజయంపై కాంగ్రెస్ ఫోకస్..

మెదక్ పార్లమెంటు స్థానానికి 18 సార్లు ఎన్నికలు జరిగితే.. 9సార్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధించారు. దేశ ప్రధాని ఇందిరాగాంధీ మెదక్ ఎంపీగా ఉన్నప్పుడే 1984 సంవత్సరంలో కన్నుమూశారు. ఆమె ప్రాతినిధ్యం వహించిన సందర్భంలో ఈ ప్రాంతానికి దేశవ్యాప్తంగా గుర్తింపు దక్కింది. ఇందిర నియోజకవర్గంగా పేరొందిన ఈ స్థానంలో 1998 తర్వాత కాంగ్రెస్ పార్టీకి విజయం దక్కలేదు. పాతికేళ్లుగా విజయం కోసం ఆ పార్టీ ఆరాటపడుతోంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న నేపథ్యంలో మెదక్‌పై ప్రత్యేక దృష్టిపెట్టారు. కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు నామినేషన్ కార్యక్రమానికి స్వయంగా సీఎం రేవంత్ హాజరయ్యారు. కాగా, మోదీ కరిష్మాయే తనను గెలిపిస్తుందని బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు అంటున్నారు. 1999లో బీజేపీ తరఫున ఆలె నరేంద్ర ఎంపీగా విజయం సాధించిన నేపథ్యంలో మరోసారి గెలుపు కోసం కమలదళం శ్రమిస్తోంది. పదేళ్ల బీజేపీ పాలనలో చేపట్టిన పథకాలు, పరిష్కరించిన సమస్యలు, తమ హిందూత్వ సిద్ధాంతాలపై ప్రజల్లో చర్చ పెడుతున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ పోటీచేసి ఓటమిపాలైన తర్వాత రఘునందన్‌రావు దుబ్బాక ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించి సంచలనం సృష్టించారు. అయితే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. అయినా.. బీజేపీ ఆయన్నే ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దింపింది. ఇటీవలే పార్టీ అగ్రనేత అమిత్‌షా సిద్దిపేటలో బహిరంగ సభకు హాజరై కాషాయ శిబిరంలో జోష్ నింపే ప్రయత్నం చేశారు.

హామీలతో హోరాహోరీ..

ఎన్నికల ప్రచారంలో సమస్యల పరిష్కారం కంటే హామీల ప్రచారమే ఎక్కువగా వినిపిస్తోంది. తనను గెలిపిస్తే కేంద్ర నిధులతో మెదక్ పార్లమెంటు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు చెబుతున్నారు. ఇక తనను పార్లమెంటుకు పంపిస్తే ప్రశ్నించే గొంతుకగా మారుతానని, ఐఏఎస్ అధికారిగా పనిచేసిన అనుభవంతో శ్రమిస్తానని అంటున్నారు. అంతేగాకుండా విద్యానిధి కింద తన సొంత నిధులు రూ.100 కోట్లతో పీవీఆర్(పరిపాటి వెంకట్రామారెడ్డి) ట్రస్టు, ప్రతీ నియోజకవర్గంలో పేదవాళ్లకు ఒక ఫంక్షన్‌హాల్, నిరుద్యోగులకు ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తానని హామీ ఇస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు కూడా తమ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రస్తావిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో సుమారు లక్షన్నర మంది బీడీ కార్మికులు ఉన్నారు. దుబ్బాక, సిద్దిపేట, మెదక్, గజ్వేల్ నియోజకవర్గాల్లో వీరి ప్రభావం ఉంటుంది.

మాకు ఓటు లేదు!



విలక్షణ వేషాల మాజీ మంత్రి మల్లా రెడ్డి శుక్రవారం ప్రచారంలో భాగంగా గేదెలతో మాటామంతీ జరిపారు. నాగారం మునిసిపాలిటీలోని పలు వార్డుల్లో ప్రచారం చేస్తూ ఓ పశువుల పాక వద్దకు చేరుకున్నారు. వాటికి గడ్డి తినిపించి.. "నేను మల్లన్ననే.. చిన్నప్పుడు మీకు సేవ చేశానే.." అంటూ సంభాషించారు.

- కీసర రూరల్

అధికారాంతమున...


ఎన్నికల ప్రచారంలో భాగంగా.. హుస్నాబాద్ పట్టణంలోని ఓ హోటల్ వద్ద కింద కూర్చొని హోటల్ యజమానితో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

మానేరులో కమలం



కరీంనగర్ సమీపంలోని లోయర్ మానేరు డ్యాంలో శుక్రవారం బీజేపీ నాయకులు తెప్పలపై మోదీ, కాషాయ జెండాలను ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహించారు.

2019 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 స్థానాల్లో నోటా పరిస్థితి

నియోజకవర్గం	విజేత, పార్టీ	మెజార్టీ	నోటా ఓట్లు
ఆదిలాబాద్	సోయం బాపురావు (బీజేపీ)	58,560	13,036
పెద్దపల్లి	నేత వెంకటేష్ (టీఆర్ఎస్)	95,180	8,971
కరీంనగర్	బండి సంజయ్ (బీజేపీ)	89,508	7,979
నిజామాబాద్	ధర్మపురి అర్వింద్ (బీజేపీ)	70,875	2,031
జహీరాబాద్	బిబి.పాటిల్ (టీఆర్ఎస్)	6,229	11,640
మెదక్	కొత్త ప్రభాకర్ రెడ్డి (టీఆర్ఎస్)	3,16,427	15,390
మల్కాజిగిరి	ఎనుముల రేవంత్‌రెడ్డి (కాంగ్రెస్)	10,919	17,895
సికింద్రాబాద్	జి.కిషన్‌రెడ్డి (బీజేపీ)	62,114	9,038
హైదరాబాద్	అసదుద్దీన్ ఒవైసీ (ఎంఐఎం)	2,82,186	5,663
చేవెళ్ల	రంజిత్‌రెడ్డి (టీఆర్ఎస్)	14,317	9,244
మహబూబ్‌నగర్	మన్నె శ్రీనివాస్‌రెడ్డి (టీఆర్ఎస్)	77,829	10,600
నాగర్ కర్నూలు	పోతుగంటి రాములు (టీఆర్ఎస్)	1,89,748	13,525
నల్లగొండ	ఉత్తమ్‌కుమార్ రెడ్డి (కాంగ్రెస్)	25,682	5,560
భువనగిరి	కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి (కాంగ్రెస్)	5,119	12,021
వరంగల్	పసునూరి దయాకర్ (టీఆర్ఎస్)	3,50,298	18,801
మహబూబాబాద్	మాలోతు కవిత (టీఆర్ఎస్)	1,46,663	14,082
ఖమ్మం	నామా నాగేశ్వరరావు (టీఆర్ఎస్)	1,68,062	15,832

అభ్యర్థికి కనిపించని ప్రత్యర్థి

2019లో 3చోట్ల మెజారిటీని మించి నోటాకు ఓట్లు

- వీటిలోనే రేవంత్‌రెడ్డి గెలిచిన మల్కాజిగిరి కూడా
- భువనగిరిలో కోమటిరెడ్డి ఆధిక్యం కంటే రెట్టింపు
- జహీరాబాద్‌లో పాటిల్ మెజార్టీకి దాదాపు డబుల్
- మొత్తమ్మీద వరంగల్‌లో అత్యధికంగా 18,801 ఓట్లు



హైదరాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): "కంటికి కనిపించని శత్రువుతో.. బయటకు కనిపించని యుద్ధం చేస్తున్నా.." ఓ సూపర్ హిట్ సినిమాలోని డైలాగ్ ఇది. క్లైమాక్స్‌లో వచ్చే ఈ డైలాగ్ అద్భుతంగా పేలింది. సరిగ్గా ఈ సినిమా తర్వాత రాజకీయాల్లోనూ "అభ్యర్థికి కనిపించని ప్రత్యర్థి" వచ్చాడు. ఇప్పటికైతే ఒంటరిగా ఓడించే శక్తి లేకున్నా.. నేనున్నానంటూ బలంగానే పోరాడుతున్నాడు. ఏమో.. ఓటర్లలో చైతన్యం పెరిగితే భవిష్యత్‌లో అతడే విజేతగా నిలవొచ్చేమో..? ఈ కోణంలోనే దేశ సర్వోన్నత న్యాయస్థానంలో ప్రజాహిత వ్యాజ్యం కూడా దాఖలైంది. అసలు విషయానికి వస్తే.. ఎన్నికల్లో పార్టీలకు గెలుపు గుర్రాలు కావాలి.. ఓట్ల కోసం భారీగా ఖర్చు పెట్టేవారు కావాలి.. ఎంతోకొంత నిజాయతీ, సేవ చేయాలన్న పట్టుదల ఉన్నవారిని డబ్బు లేకుంటే పట్టించుకోలేని పరిస్థితి. మరి.. బరిలో నిలిచినవారిలో ఎవరూ ఓటరుకు నచ్చకుంటే..? ఎన్నికలపై నమ్మకం కోల్పోయిన ప్రజలు పోలింగ్‌కు దూరమయ్యే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితి తప్పించేందుకు, ప్రజల అసంతృప్తి, ఆగ్రహాన్ని వ్యక్తం చేసేందుకు తీసుకొచ్చిందే నోటా (నన్ ఆఫ్ ది ఎబౌవ్). 2013లో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పుతో 2014 ఎన్నికల నుంచి 'నోటా' అందుబాటులోకి వచ్చింది. ఎన్నికల్లో క్రమంగా నోటా ఓట్ల సంఖ్యలో పెరుగుదల నమోదవుతోంది. కాగా, అందరికంటే నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే.. బరిలో ఉన్న అభ్యర్థులెవరూ పదేళ్ల వరకు పోటీ చేయకూడదన్న అంశంపై ఇటీవల సుప్రీంకోర్టులో దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం విచారణలో ఉంది. మరోవైపు రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో 2019 నాటి సాధారణ ఎన్నికల్లో నోటాకు వచ్చిన ఓట్లను పరిశీలిస్తే ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి.

ఆ 3 నియోజకవర్గాల్లో 1 శాతంపైనే!

గత లోక్‌సభ ఎన్నికల్లో మూడు నియోజకవర్గాల్లో అభ్యర్థుల మెజార్టీ కంటే నోటాకే ఎక్కువ ఓట్లు పోలవడం విశేషం. ఇందులో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి పోటీ చేసిన మల్కాజిగిరి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గెలిచిన భువనగిరితో పాటు జహీరాబాద్ ఉన్నాయి. రేవంత్ అప్పట్లో 10,919 ఓట్ల స్వల్ప ఆధిక్యంతో బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డిపై నెగ్గారు. నోటాకు 17,895 ఓట్లు పోలయ్యాయి. దేశంలోనే అతి పెద్దదైన ఈ నియోజకవర్గంలో మొత్తం 15,63,646 ఓట్లు పోలయ్యాయి. అంటే.. నోటా వాటా 1.14 శాతం. భువనగిరిలో కోమటిరెడ్డి 5,119 ఓట్ల మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌పై గెలిచారు. ఈ ఆధిక్యానికి రెట్టింపుగా ఇక్కడ నోటాకు 12,021 ఓట్లు పడ్డాయి. మొత్తం 12,12,631 ఓట్లు పోలవగా.. నోటాకు సరిగ్గా ఒక శాతం వచ్చాయి. ఇక జహీరాబాద్‌లో మొత్తం 10,44,504 ఓట్లకు గాను బీఆర్ఎస్ అభ్యర్థి బీబీ పాటిల్ 6,229 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. నోటా 11,640 ఓట్లు సాధించింది. గెలుపోటములను 0.60 శాతం ఓట్లు నిర్ణయించగా.. నోటాకు 1.07 శాతం ఓట్లు పడడం గమనార్హం. రాష్ట్రంలోని మిగిలిన 14 స్థానాల్లోనూ నోటాకు చెప్పుకోదగ్గ ఓట్లే వచ్చాయి. అత్యధికంగా వరంగల్‌లో 18,801 పోలయ్యాయి.

ప్రచారం నేటితో ఆఖరు

సాయంత్రం 5 గంటలతో ముగియనున్న ఎన్నికల ప్రచారం



హైదరాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో ఠారెత్తించిన ఎండలు కాస్త తగ్గి వాతావరణం కొంతమేర చల్లబడినా ఎన్నికల ప్రచారంలో మాత్రం అదే 'వేడి'! ఆ హీట్ ఇప్పుడు 'చివరి' అంకానికి చేరుకుంది. ఓటరు మహాశయులను ప్రసన్నం చేసుకునేందుకు హామీల కుమ్మరింతలు.. పరస్పర విమర్శలతో వివిధ పార్టీల నేతలు ఇప్పటికే చెప్పాల్సిందంతా చెప్పేసినా ఇంకా ఇంకా చెప్పాలనే తహతహతో ఉన్న వారికి మరో 24 గంటలు మాత్రమే మిగిలాయి! శనివారం సాయంత్రం 5 గంటలతో ఎన్నికల ప్రచారం ముగియనుంది. పోలింగ్‌కు మరో 48 గంటల సమయమే ఉండటంతో శనివారం వివిధ పార్టీల అగ్రనేతలు ప్రచారాన్ని హోరెత్తించనున్నారు. ఈసారి తెలంగాణ నుంచి బీజేపీకి పక్కాగా డబుల్ డిజిట్‌లో సీట్లు తెచ్చిపెట్టాలన్న లక్ష్యంతో ప్రధాని మోదీ.. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో నాలుగు దఫాలుగా రాష్ట్రంలో పర్యటించారు. చివరగా శనివారం నారాయణపేట, హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలోని బహిరంగ సభలో పాల్గొన్నారు. మొత్తంగా మోదీ రాష్ట్రంలో పది బహిరంగ సభలు, పలు రోడ్‌షోల్లో పాల్గొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇప్పటికే మూడు దఫాలు రాష్ట్రంలో పర్యటించి, బీజేపీ ప్రచార పర్వంలో ఊపు తెచ్చారు. నేడు మరోమారు ఆయన వనపర్తి, వికారాబాద్ బహిరంగ సభల్లో పాల్గొంటారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ తెలంగాణ నుంచి మెజారిటీ సీట్లను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ఉధృతంగా ప్రచారం నిర్వహించింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇప్పటికే రాష్ట్రంలో మూడుసార్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తొలుత తుక్కుగూడలో కాంగ్రెస్ గ్యారెంటీ హామీలను ప్రకటించి వెళ్లారు. మే 5న ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోని నిర్మల్, మహబూబ్‌నగర్ ఎంపీ పరిధిలోని గద్వాల్‌లోని బహిరంగ సభల్లో పాల్గొన్నారు. మే 9న మరోమారు తెలంగాణకొచ్చి మెదక్ లోక్‌సభ పరిధిలోని నర్సాపూర్‌తో పాటు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొని జోష్ తెచ్చారు. ఎన్నికల ప్రచారంలో చివరిరోజు రాష్ట్రానికి ప్రియాంక గాంధీ రానున్నారు. శనివారం మధ్యాహ్నం తాండూరులో జరిగే జనజాతర సభలో, కామారెడ్డిలో జరిగే రోడ్‌షోలో పాల్గొంటారు. అధికార కాంగ్రెస్ పార్టీ ప్రచార బాధ్యతలను ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తన భుజాలపై వేసుకొని ఎలక్షన్ క్యాంపెయిన్ నిర్వహించారు. మొత్తం 27 రోజుల్లో 56 సభలు, కార్నర్ మీటింగ్‌లు, రోడ్‌షోలు నిర్వహించారు. ప్రచారం చివరి రోజు రేవంత్, ప్రియాంక పాల్గొనే రెండు సభలతో పాటు రోడ్‌షోల్లో పాల్గొంటారు. అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలైన బీఆర్ఎస్, లోక్‌సభ ఎన్నికల్లో గౌరవప్రదమైన సీట్లు గెలవాలనే లక్ష్యంతో బీజేపీ, కాంగ్రెస్‌కు దీటుగానే ప్రచారం నిర్వహించింది. బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతు ప్రచారం చేసేందుకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఏప్రిల్ 24న బస్సుయాత్ర చేపట్టారు. శనివారం ఆయన బీఆర్ఎస్ ఆఫీసులో మీడియా సమావేశంతో తన ప్రచారాన్ని ముగించనున్నారు.

ఎన్నికల విధుల్లో 2,79,519 మంది సిబ్బంది

లోక్‌సభ నాలుగోదశ ఎన్నికల నేపథ్యంలో. తెలంగాణలో ఎన్నికల ప్రక్రియ తుది ఘట్టానికి చేరుకుంది. 17 లోక్‌సభ స్థానాల పరిధిలో 13న ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించేలా ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తిచేసింది. షెడ్యూల్ ప్రకారం ఎన్నికల ప్రచార ప్రక్రియ శనివారం సాయంత్రం 5 గంటలతో ముగియనుంది. అన్ని లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని 35,809 పోలింగ్ స్టేషన్లలో 2,79,519 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. కాగా, 13న పోలింగ్‌ను దృష్టిలో ఉంచుకొని నేటి సాయంత్రం 5 గంటల నుంచి సోమవారం పోలింగ్ పూర్తయ్యే వరకు రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాలను మూసి ఉంచాలని ఎన్నికల సంఘం సంబంధిత విభాగాలను ఆదేశించింది.

ఐదేళ్లూ అధికారంలో ఉంటాం

రేవంత్ నాయకత్వంలో ఐక్యంగా ఉన్నాం.. అర్వింద్‌వి సిల్లీ ఆరోపణలు

- బీజేపీ ఆటలు తెలంగాణలో సాగవు
- మోదీకి దేశాన్ని నడపడం రాదు
- ఈ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఖతం
- మీట్ ది ప్రెస్‌లో ఉత్తమ్‌కుమార్ రెడ్డి



హైదరాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామిక ప్రభుత్వాలను కూల్చే అలవాటు బీజేపీకి ఉందని, ఆ పార్టీ ఆటలు తెలంగాణలో సాగవని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. సీఎం రేవంత్ నాయకత్వంలో ఐదేళ్ల పాటు ప్రభుత్వం ఉంటుందని ప్రకటించారు. మంచి క్రికెట్ టీమ్‌లాగా ప్రభుత్వం పటిష్ఠంగా ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు కలిసి ప్రభుత్వాన్ని కూలగొట్టి.. ఉత్తమ్ సీఎం అవుతారని బీజేపీ ఎంపీ అర్వింద్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ.. 'అర్వింద్ మాట్లాడే పిచ్చి పిచ్చి.. సిల్లీ మాటలకు నేను స్పందించాలా' అంటూ బదులిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(టీయూడబ్ల్యూజే) ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ ఆధ్వర్యంలో జరిగిన 'మీట్ ది ప్రెస్'లో పాల్గొన్న ఉత్తమ్ మాట్లాడారు. "నరేంద్ర మోదీకి దేశాన్ని నడపడం రాదు. దేశంలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. స్వతంత్ర భారతంలో ఎప్పుడూ లేనంత నిరుద్యోగిత ఈ పదేళ్లకాలంలో పెరిగింది. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఆందోళన చేసా. 700 మంది చనిపోయినా పట్టించుకోలేదు" అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి మండిపడ్డారు. ప్రజాస్వామ్యానికి దేవాలయం లాంటి పార్లమెంట్‌లో చర్చల్లేకుండా, విపక్షాలకు మాట్లాడే అవకాశం లేకుండా బిల్లులు ఆమోదించుకున్నారని ఆరోపించారు. ఎటువంటి ఆధారాలు/అభియోగాలు లేకుండా ఇద్దరు ముఖ్యమంత్రులను జైల్లో పెట్టారని, బనానా రిపబ్లిక్‌గా మారిందని, దీన్ని అడ్డుకోకపోతే ఉత్తర కొరియా, పాకిస్థాన్, రష్యాలాగా భారతదేశం మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పదేళ్లకాలంలో సీబీఐ, ఈడీ, ఐటీ పెట్టిన కేసుల్లో 97 శాతం ప్రతిపక్షాల నేతలే ఉన్నారని ఆరోపించారు. పాలనలో విఫలమైన మోదీ.. పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

బీఆర్ఎస్‌ను ప్రజలు బొందపెట్టారు

లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఉండదని, ఆ పార్టీని ప్రజలు బొందపెట్టారని ఉత్తమ్ అన్నారు. ఆగస్టు 15 లోగా రైతు రుణమాఫీ చేస్తామని, ఎన్నికలు అయిపోగానే కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తామని ప్రకటించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలపై విజిలెన్స్ విచారణ జరుగుతోందని, తుది నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరతో కొంటామని ఉత్తమ్ చెప్పారు.

అబద్ధాలకు అధ్యక్షుడు.. మోదీ

ప్రధాని హోదాను పాతాళానికి తీసుకెళ్లారు.. పదేళ్లలో చేసిందేమీ లేకనే.. చిల్లర రాజకీయాలు

- మంగళసూత్రాలు లాక్కోవడం మోదీకే సాధ్యం
- హైదరాబాద్ రెండో రాజధాని అయితే నేనూ సంతోషిస్తా
- కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే



నకిరేకల్ సభలో మాట్లాడుతున్న ఖర్గే, చిత్రంలో ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, మంత్రులు భట్టి , కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్/నల్లగొండ, మే 10(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర.. బుల్లెట్ ట్రైన్.. ప్రతీ పేదోడికి ఇల్లు.. యువతకు 5 కోట్ల ఉద్యోగాలు.. నల్లధనం వెనక్కి తెస్తాం.. ఇవీ బీజేపీ ఇచ్చిన అబద్ధపు హామీలు. నరేంద్ర మోదీ.. అబద్ధాలకు అధ్యక్షుడు" అని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హిందువుల ఆస్తులు, మంగళసూత్రాలు తీసుకుని ముస్లింలకు పంచుతుందంటూ.. మోదీ చేస్తున్న ప్రచారం మతాల మధ్య విద్వేషాలు పెంచేలా ఉందని దుయ్యబట్టారు. ఒక వర్గంలో భయాందోళనలు సృష్టించేందుకు ప్రధాని కుట్ర పన్నుతున్నారని ధ్వజమెత్తారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో శుక్రవారం నిర్వహించిన సభతోపాటు హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఖర్గే మాట్లాడారు. దేశానికి చేసిందేమీ లేనందునే హిందు-ముస్లింల అంశాన్ని ప్రతి సారి మోదీ లేవనెత్తుతున్నారని, ప్రధాని పదవి హోదాను పాతాళానికి దిగజారుస్తూ చిల్లర ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రెండేళ్ల క్రితం వరకు తమకు కాంగ్రెస్ పోటీయే కాదని చెప్పిన ప్రధాని నేడు ప్రతీ చోట కాంగ్రెస్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. "అంబానీ, అదానీ ఇళ్ల నుంచి టెంపోల్లో డబ్బులు కాంగ్రెస్‌కు వెళ్తున్నాయని మాట్లాడుతున్నారు. అదే నిజమైతే ఐటీ, సీబీఐ, ఈడీ ఏం చేస్తున్నాయి? మీరేం చేస్తున్నారు.. నిద్ర పోతున్నారా?" అని మోదీని ఉద్దేశించి ప్రశ్నించారు. అంబానీ, అదానీ డబ్బులు ఎక్కడికి వెళ్తున్నాయో.. ఈడీ, సీబీఐతో విచారణ జరిపించే ధైర్యం ఉందా? అని నిలదీశారు. ఇప్పటికీ అంబానీ, అదానీ నిర్ణయించిన వస్త్రాలనే మోదీ వేసుకుంటున్నారని ఆరోపించారు. బీజేపీ పాలనలో దేశాన్ని భ్రష్టు పట్టించారని, వారి కుబేర మిత్రులకు దేశ సంపదను కట్టబెట్టారని ఆరోపించారు. హైదరాబాద్ దేశ రెండో రాజధానిగా ప్రకటిస్తే మద్దతు పలుకుతారా?అని మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. తనకూ సంతోషమేనని ఖర్గే వ్యాఖ్యానించారు. తనకు ఢిల్లీ కంటే హైదరాబాద్ దగ్గరని, రెండో రాజధానైతే తనకే ఎక్కువ లబ్ధి అని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు భారీగా పెట్టుబడులు రావాలని, ఆ దిశగా తాము కృషి చేస్తామన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడడమే లక్ష్యం

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హిందువుల మంగళ సూత్రాలు లాక్కొని ముస్లింలకు ఇస్తుందని ప్రతీచోట ప్రధాని మోదీ చెప్పటాన్ని ఖర్గే ఖండించారు. మహిళల మెడల్లో నుంచి మంగళసూత్రాలు లాక్కోవడం మోదీకే సాధ్యమని అన్నారు. "భారత రాజ్యాంగాన్ని రక్షించేందుకు పోరాడుతున్న కాంగ్రెస్‌కు రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్న బీజేపీకి మధ్యే ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. దేశంలోని దళితులు, ఆదివాసీలు, బీసీలు, ఈబీసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ చివరి రక్తపు బొట్టు వరకూ పోరాడుతుంది" అని హామీ ఇచ్చారు. కమలం సాయంత్రానికి వాడిపోతుందని, ప్రాణం ఉన్నంత వరకూ మనతో ఉండేది హస్తమేనని వ్యాఖ్యానించారు.

ఐదు గ్యారెంటీల అమలు

అసెంబ్లీ ఎన్నికలకు ముందు తెలంగాణలో ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో ఐదింటిని ఇప్పటికే అమలు చేశామని ఖర్గే గుర్తు చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా ఒకటి పెండింగ్‌లో ఉందని, త్వరలోనే దాన్నీ పూర్తి చేస్తామన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లు ఉండదన్న బీజేపీ నేతల మాటలపై స్పందిస్తూ.. ప్రజా తీర్పుతో ఏర్పడిన ప్రభుత్వం ఐదేళ్లు కచ్చితంగా కొనసాగుతుందన్నారు. ఈ ప్రభుత్వాన్ని దించడం ఎవరి తరం కాదన్నారు. తెలంగాణకు మోదీ ఏం చేశారో చెప్పే ధైర్యముందా? అని నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ పరోక్షంగా సహకరించుకుంటున్నాయని ధ్వజమెత్తారు. ఈ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ దుకాణం మూత పడుతుందని వ్యాఖ్యానించారు. కాగా, కర్ణాటకలో ప్రజ్వల్ రేవణ్ణ అంశంపై ఖర్గే మాట్లాడుతూ.. సిట్ విచారణ జరుపుతోందని, త్వరలోనే అన్ని విషయాలు బయటికి వస్తాయన్నారు. తన కుమారుడి మెడికల్ కాలేజీలో రూ.600 కోట్ల కుంభకోణం ఆరోపణలపై స్పందిస్తూ.. నిజమే అయితే విచారణ జరిపించి జైల్లో వేసుకోవచ్చన్నారు.

వైద్య, ఆరోగ్య ఉద్యోగులకు ఓటు లేనట్టేనా?

- క్షేత్ర స్థాయిలో ఉద్యోగులకు ఎన్నికల విధులు కేటాయించినా పోస్టల్ బ్యాలెట్లు ఇవ్వని వైనం

నిర్మల్, మే 10 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులకు ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి నెలకొంది. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల కమిషన్ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తుండగా.. పోలింగ్ రోజు విధుల్లో ఉండే వైద్య, ఆరోగ్య సిబ్బందికి మాత్రం అధికారులు పోస్టల్ బ్యాలెట్లు ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఎంఎల్‌హెచ్‌పీలు పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసే ఆరోగ్య శిబిరాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6గంటల దాకా విధులు నిర్వర్తించాల్సి ఉంది. మరోవైపు.. ఆయా పోలింగ్ బూత్‌లను సందర్శించి అక్కడి ఆరోగ్య శిబిరాల నిర్వహణను సమీక్షించేందుకు కొందరిని రూట్ అధికారులుగా నియమించారు.ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్లు ఇచ్చిన ఎన్నికల అధికారులు ఆరోగ్య శాఖ ఉద్యోగులకు మాత్రం ఇవ్వలేదు. గ్రామస్థాయిలో పని చేసే ఆశా కార్యకర్తలకు ఇబ్బంది లేకపోయినా.. పెద్ద గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణాల్లో ఉన్న వారికి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయమై సంబంధిత అధికారులను అడిగితే.. రిటర్నింగ్ అధికారుల ఆదేశాల మేరకే తాము సిబ్బందికి విధులు కేటాయించామని చెబుతున్నారు. కాగా, తమకు టీఏ, డీఏ చెల్లింపుల్లోనూ అన్యాయం జరుగుతోందని వైద్య, ఆరోగ్య ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. కొన్ని చోట్ల ఉత్తర్వులు లేవని, మరి కొన్ని చోట్ల బడ్జెట్ లేదని చెబుతూ టీఏ, డీఏలు ఇవ్వడం లేదని చెబుతున్నారు. ఉదాహరణకు నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో పని చేసిన ఉద్యోగులకు అధికారులు టీఏ, డీఏలు చెల్లించారు. ఇదే జిల్లాలోని ఖానాపూర్‌లో బడ్జెట్ లేదన్న కారణంతో ఇప్పటిదాకా చెల్లించలేదు. దీనిపై అధికారులను అడిగితే.. లోక్‌సభ ఎన్నికలతో కలిపి అసెంబ్లీ ఎన్నికల నాటి టీఏ, డీఏలు ఇస్తామని చెబుతున్నట్లు సమాచారం. కాగా, ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న తమకు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలని ఆరోగ్య శాఖ ఉద్యోగుల గుర్తింపు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి సీఈవోకు వినతి పత్రం అందించారు. టీఏ, డీఏలు చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య స్మార్ట్
శనివారం • 11 మే 2024



ఐఫోన్‌తో బెస్ట్ ఫొటోస్



ఈ మధ్య కాలంలో విదేశీ పర్యటనలు విజయవంతమయ్యేందుకు కూడా సెల్ ఫోన్ పనికొస్తోంది. ఐఫోన్ అదీ ఐఓఎస్ 17 ఉంటే చాలు. దాంతో కలిగే ప్రయోజనాలను ఒకసారి తరచి చూద్దాం. దీంతో మొదట పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో కావాలంటే....

- వీసా దరఖాస్తుపై అతికించేందుకు లేదంటే స్టూడియోలో ప్రింట్ కోసం పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో కావాలంటే ఐఓఎస్ 17 ఉన్న ఐఫోన్‌తో తీసుకోవాలి. అదీ ఇంటిదగ్గరే వైట్ బ్యాక్‌గ్రౌండ్‌తో తీసుకోవాలి. ఫొటో తీస్తున్న స్నేహితుడు లేదంటే బంధువుకు ఒక విషయం చెప్పండి. ఫోన్‌ని లైట్ మోడ్‌లో సెట్ చేయమనండి. అలాగే ఫేస్‌ని మరేది కవర్ కాకుండా చూసుకోవాలి. లైటింగ్ బాగా ఉండాలి.
- ఇమేజ్‌లోని సబ్జెక్టుని టాప్ ఆపై హోల్డ్ చేయాలి. అలా ఇమేజ్ నుంచి బ్యాక్‌గ్రౌండ్ తీసేవచ్చు. అప్పుడు కాపీని టాప్ చేయాలి. అలా వచ్చిన ఇమేజ్‌ని నోట్స్ యాప్‌లో పేస్ట్ చేసుకోవాలి. వైట్ బ్యాక్‌గ్రౌండ్‌తో డార్క్ మోడ్ టర్న్‌డ్ ఆఫ్ అయ్యిందీ లేనిదీ చూసుకోవాలి. డార్క్‌మోడ్ ఉపయోగిస్తే అప్పుడు బ్యాక్‌గ్రౌండ్‌లో నల్లగా కనిపిస్తుంది.
- నోట్స్‌యాప్‌లో నోట్ స్క్రీన్ షాట్ తీసుకోవాలి. ఫొటోస్‌ని ఓపెన్ చేయాలి. ఎడిట్, క్రాప్‌ని టాప్ చేయాలి.
- రెక్టాంగ్యులర్ ఐకాన్‌ని ఎంచుకుని, యాస్పెక్ట్ రేషియోని సెలెక్ట్ చేసుకోవాలి. అక్కడ చుట్టూ ఉన్నది తొలగి, ఫ్రేమ్‌లో మీరు మాత్రమే ఉండేలా చూసుకోవాలి.
- డన్‌ని టాప్ చేయాలి. అప్పటికి ఐడీ ఫొటో రెడీ అవుతుంది.

3 సెకన్ల సెల్ఫీ జీఐఎఫ్



గూగుల్ మెసేజెస్ ప్రస్తుతం సెల్ఫీ ఇమేజ్‌లను విడుదల చేస్తోంది. మెసేజ్ బీటా చానల్‌లో లాంగ్ ప్రెస్ చేస్తే గేలరీ ఐకాన్, సర్క్యులర్ ప్రివ్యూ అదీ స్క్రీన్ సెంటర్‌లో కనిపిస్తుంది. 'సెండ్ ఎ స్మైల్', 'డ్రా ఎ హార్ట్' సజెషన్ క్లిప్స్ కూడా ఉంటాయి. ఫ్రంట్ - రేర్ ఫేసింగ్ కెమెరా మధ్య స్విచ్ కావచ్చు. సర్క్యులర్ ఇండికేటర్‌తో రికార్డ్ బటన్‌ను టాప్ చేయాలి. ఆ ఇండికేటర్ ఎంత సమయం ఉందో చెబుతుంది. మొత్తమ్మీద ఫన్ టచ్‌తో మూడు సెకెండ్ల నిడివి గల వీడియోని రూపొందించి షేర్ చేసుకోవచ్చు. సెండ్ ఎ స్మైల్, డ్రా ఎ హార్ట్ వంటివి ఇంకా బేటాలోనే ఉన్నాయి. అందువల్లే అవి పనిచేయడం లేదు. కాన్వర్సేషన్ ప్రాంప్ట్‌తోనూ సెల్ఫీ జీఐఎఫ్‌ని రికార్డ్ చేసుకోవచ్చు. రిఫరెన్స్ కోసం దీనికి సంబంధించిన సపోర్ట్ ఆర్టికల్ ఒకటి లైవ్‌లో ఉంది.

'గూగుల్ పే' ని మించిన వాలెట్

ఇండియాలోకి గూగుల్ వాలెట్ వచ్చేసింది. భారతీయ యూజర్ల రోజువారి వ్యవహారాలను ఈ వాలెట్‌తో ఇకపై చక్కబెట్టుకోవచ్చు. గూగుల్ పేకి మించిన సౌకర్యాలు ఇందులో ఉంటాయి. పలు డిజిటల్ డాక్యుమెంట్స్ అంటే బోర్డింగ్ పాస్‌లు, లాయల్టీ కార్డులు, మూవీ టికెట్స్ సహా పలు పనులకు ఇది తోడ్పడుతుంది. దీని ప్రభావం గూగుల్ పే పై ఉండదు కూడా. ఇదో భద్రతతో కూడిన వాలెట్. ఇరవైకి పైగా బ్రాండ్స్‌తో ఈ వాలెట్‌కు భాగస్వామ్యం ఉంది. ఎయిర్ ఇండియా, ఇండిగో, ఫ్లిప్‌కార్ట్, పైన్ ల్యాబ్స్ వాటిలో కొన్ని మాత్రమే. రాబోయే నెలల్లో మరికొన్నింటితో భాగస్వామ్యం పొందనుంది. యాపిల్ వాలెట్ మాదిరిగానే ఉంటుంది. దీన్ని నాన్ పేమెంట్ యూజర్ల కోసం ఉద్దేశించారు. చాలా దేశాలు గూగుల్ పే, గూగుల్ వాలెట్ రెంటినీ కలిపేస్తున్నాయి. ఇండియాలో మాత్రం రెంటినీ వేర్వేరు అవసరాల కోసం ఉపయోగిస్తున్నారు.

తేడాలు ఇవే

గూగుల్ పే
- గూగుల్ పే కేవలం నగదు లావాదేవీలకు పరిమితం. కేవలం డిజిటల్ పేమెంట్స్‌కు ఉపయోగపడుతుంది.
- గూగుల్ పే ఎన్ఎఫ్‌సీ టెక్నాలజీని సపోర్ట్ చేస్తుంది. తద్వారా క్రెడిట్ కార్డ్ సమాచారాన్ని దాచిపెడుతుంది.



గూగుల్ వాలెట్
- యూపీఐ పేమెంట్స్ లేదా నగదు బదిలీ గూగుల్ వాలెట్‌తో కుదరదు. బోర్డింగ్ పాస్‌లు, మూవీ టికెట్లసహా పలు డాక్యుమెంట్లను వాలెట్ భద్రపరుస్తుంది.
- గూగుల్ వాలెట్ క్రెడెన్షియల్స్, పాస్‌లు, క్యూఆర్ కోడ్స్‌తో టాగ్ అయిన పాస్‌లను భద్రంగా దాచి పెడుతుంది.





డిజైన్‌లో భారీ మార్పులు

వాట్సాప్ డిజైన్ సహా భారీగా మార్పులు చేసినట్టు మెటా ప్రకటించింది. కొత్త ఐకాన్స్, కలర్స్, టూల్స్ తదితరాల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఆండ్రాయిడ్, ఐఓఎస్ డివైజులు రెంటిలోనూ వాట్సాప్ ఇంటర్‌ఫేస్‌లో మార్పులు కనిపిస్తాయి. యూజర్లకు మరింత మంచి అనుభవాన్ని అందించేందుకు ఫ్రెష్, సింపుల్, అప్రోచబుల్‌గా డిజైన్‌ను మారుస్తున్నట్టు వాట్సాప్ పేర్కొంది. మార్పుల విషయానికి వస్తే...

- డిజైన్ టీమ్ మొత్తం 35 రంగులను పరిశీలించింది. గ్రీన్ కలర్ ఎక్కడికీ పోదు. అలాగే యాప్‌లో చాలా భాగాల్లో గ్రీన్ కలర్ ఉంది. ఇంతకు మునుపుతో పోలిస్తే ఇది ఎక్కువే అని చెప్పవచ్చు.
- రౌండ్, ఔట్‌లైన్డ్ స్టయిల్స్‌లో కొత్త ఐకాన్లను పరిచయం చేసింది యానిమేషన్స్‌ను పెంచింది. డిఫాల్ట్‌గా ఉండే ఒరిజినల్ బ్యాక్‌గ్రౌండ్‌లో కూడా మార్పులు ఉన్నాయి.
- ఆండ్రాయిడ్ డివైజుల్లో అడుగున ఆధునిక నేవిగేషన్ బార్ ఉంది. ఐఓఎస్ డివైజుల్లో కొత్త అటాచ్‌మెంట్ లేఔట్ ఉంది. ఫొటోలు, వీడియోలు పంపుకొనేందుకు ఇది వీలుకల్పిస్తుంది.
- చాట్ మేనేజ్‌మెంట్ మరో విషయం. ఆర్గనైజేషనల్ టూల్స్ అంటే ఫిల్టర్స్ వంటివి ఉన్నాయి. చదవనివి, గ్రూప్ చాట్స్ గుర్తించేందుకుగాను యూజర్లకు టాబ్ ఉంది.
- యూజర్లకు వాట్సాప్‌లో ఈ మార్పులు కనిపించకుంటే, లెటెస్ట్ వెర్షన్‌ను అప్డేట్ చేసుకోవాల్సి ఉంటుంది.



మే 16న ఇండియాలోకి మోటోరోల ఎడ్జ్ 50 ఫ్యూజన్

మోటోరోల ఎడ్జ్ 50 ఫ్యూజన్ మే 16న ఇండియాలో విడుదల అవుతోంది. గత నెలలోనే ఇది ఎంపిక చేసిన యూరప్ మార్కెట్లలోకి వచ్చింది. తాజాగా భారతదేశంలోకి ప్రవేశిస్తోంది. 144హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటు డిస్‌ప్లే, ఐపీ68 రేటు, 50 మెగా పిక్సెల్ డ్యూయల్ రేర్ కెమెరా, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ 68 వాట్స్ ఫాస్ట్ చార్జింగ్ సపోర్ట్ ఉన్నాయి.

ఆన్‌బోర్డ్ ర్యామ్ 12 జీబీ. 1600 నిట్స్ మేర పీక్ బ్రైట్‌నెస్, కార్నింగ్ గొరెల్లా గ్లాస్ 5 ప్రొటెక్షన్ ఉన్నాయి. ఇన్-డిస్‌ప్లే ఫింగర్‌ప్రింట్ సెన్సర్ ఉంది. ఫారెస్ట్ బ్లూ, హాట్ పింక్, మార్ష్‌మల్లో బ్లూ రంగుల్లో ఇది లభ్యమవుతుంది. యూరప్‌లో దీని ధర మన ఇండియన్ కరెన్సీలో రూ.35,900.

పవర్ ఆఫ్ అయినా 'పిక్సెల్ 8' ఫోన్ కనిపెట్టవచ్చు



ఫైండ్ మై డివైజ్ నెట్‌వర్క్ పరిధిలో పిక్సెల్8, పిక్సెల్ 8 ప్రొ ఫోన్లను పవర్ ఆఫ్ లేదంటే బ్యాటరీ డెడ్ అయినా పట్టుకోవచ్చు. కొన్ని గంటల తరవాత కూడా పట్టుకోవడానికి వీలు ఉంటుంది. అనుకోని పరిస్థితుల్లో ఈ రెండు ఫోన్లలో దేన్నైనా ఎవరైనా దొంగిలించినా ఈ మార్గంలో పట్టుకోవచ్చు. ఎఫ్ఎండీ సెట్టింగ్స్‌లోని 'విత్ నెట్‌వర్క్ ఇన్ హై ట్రాఫిక్' 'విత్ నెట్‌వర్క్ ఇన్ ఆల్ ఏరియాస్'ని యాక్టివ్ చేసుకోవాలి. అందులో మొదటిది డిఫాల్ట్‌గా ఉంటుంది. రెండోది లోయర్ ట్రాఫిక్ ఏరియాలో పనిచేసేందుకు ఉంచారు. అయితే వెర్షన్‌ని మాత్రం కంపెనీ పేర్కొనలేదు. స్పెషలైజ్డ్ పిక్సెల్ హార్డ్‌వేర్‌తోనే ఇది సాధ్యమైందని సమాచారం.

ఆండ్రాయిడ్ సెక్యూరిటీ ప్యాచ్



ఆండ్రాయిడ్ 14 మే సెక్యూరిటీ ప్యాచ్ విడుదలైంది. పిక్సెల్ 5ఎ, 6, 6ప్రొ, 6ఎ, 7, 7ప్రొ, 7ఎ, ట్యాబ్లెట్, ఫోల్డ్, 8, 8 ప్రొ కోసం ఉద్దేశించిన సెక్యూరిటీ ప్యాచ్ ఇది. దీంతో మొత్తం 11 వరకు సెక్యూరిటీ సమస్యలను పరిష్కరించింది. గూగుల్ డివైజెస్‌కు చెందిన బులెటిన్‌లో మరో ఏడు సెక్యూరిటీ ప్యాచ్‌లను ఫిక్స్ చేసినట్టు పేర్కొంది. కిడ్డి(జపాన్), వెరిజాన్, టి-మొబైల్, సి స్పయిర్, యూఎస్ సెల్యులర్ అండ్ సెల్‌కామ్ బిల్డ్స్ ఉన్నాయి. ఈ నాలుగింటి పరిధిలో ఉన్న వివిధ పిక్సెల్ డివైజ్‌లు, మిగిలిన వాటి జాబితా కూడా బులెటిన్ ద్వారా తెలుసుకోవచ్చు.

క్రోమ్ ఓఎస్ 124 అప్డేట్



క్రోమ్ ఓఎస్ 124 అప్డేట్‌తో క్రోమ్‌బుక్‌కు ఫాస్టర్ స్ప్లిట్ స్క్రీన్ సెటప్‌కు తోడు పలు ఫీచర్లను తీసుకొచ్చింది. క్రోమ్‌బుక్ యూజర్ల కోసం గూగుల్ విడుదల చేసింది. ముందే పేర్కొన్నట్టు ఇందులో మొదటిది ఫాస్టర్ స్ప్లిట్ స్క్రీన్ సెటప్ ఫీచర్. విండో లేఔట్‌ని చాలా వేగంగా చేయవచ్చు. ఓపెన్ అయిన విండోలను ఒక సైడ్ నుంచి చూడవచ్చు. వైఫైకి ప్రాధాన్యం ఇచ్చింది. వీడియో కాన్ఫరెన్సింగ్, గేమింగ్ అప్లికేషన్స్‌కు అనువుగా మార్చింది. దాంతో వీడియో ప్లేయింగ్ చాలా సాఫీగా ఉంటుంది. మైస్ కోసం ఫాస్ట్ పెయిర్ ఫీచర్ మరొకటి. క్రోమ్ ఓఎస్ డివైజ్‌కు సానుకూలమైన మౌస్‌గా ఉంటుంది. కర్సర్ సైజ్‌ను అడ్జస్ట్ చేసుకోవచ్చు.

అమెజాన్ అలెక్సా అమేజింగ్ ఫీచర్స్



అలెక్సా గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. అయితే దీంట్లో ఉన్న కొన్ని ఫీచర్లు అందరికీ అవగాహన లేకపోవచ్చు. ఇవి మరింత ప్రయోజనకరంగా ఉన్నాయి.

- యాంబియెంట్ ధ్వనులు లేదా ఇంటరాక్టివ్ గేమ్స్‌తో పెంపుడు జంతువులను ఉల్లాసంగా ఉంచుతుంది. యజమానులు ఇంట్లో లేనప్పుడు ఇది బాగా ఉపయోగపడుతుంది.
- ప్రత్యేక పరిస్థితులు, ప్రశ్నలు తలెత్తినప్పుడు అలెక్సా రెస్పాన్స్ బాగా ఉంటుంది. అందుకు అనుగుణంగా స్కిల్ బ్లూప్రింట్స్‌ను ఉపయోగించుకోవాలి. వాటిని పర్సనలైజ్ చేసుకోవాలి.
- అలెక్సాకు చెందిన టాస్క్ మేనేజ్‌మెంట్ సహకారంతో ఈమెయిల్, క్యాలెండర్‌ను ఇంటిగ్రేట్ చేసుకోవచ్చు.
- గార్డ్ మోడ్‌ని యాక్టివేట్ చేసుకోవాలి. అప్పుడు అలార్మింగ్ సౌండ్స్, అలెర్టులు అవసరాలకు అనుగుణంగా అలెక్సా వింటుంది.
- పలు అలెక్సా డివైజ్‌లు ఉన్నప్పుడు వేర్వేరు రూముల్లో ఉన్నప్పటికీ మ్యూజిక్‌ను స్ట్రీమ్‌లైన్ చేసుకోవచ్చు.
- ఎంపిక చేసిన సంస్థలకు అలెక్సాతో విరాళాలను అందించవచ్చు. అందుకు స్మార్ట్ అసిస్టెంట్‌ను వాడుకోవాలి.
- ఇంట్లో వేర్వేరుగా ఉండే గొంతులను అలెక్సా గుర్తిస్తుంది. పర్సనలైజ్డ్ అనుభవాలను అందిస్తుంది.

ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్‌లో డార్క్ మోడ్



ఆండ్రాయిడ్ ఫోన్లలో బ్రైట్ యాప్స్‌తో ఇబ్బంది పడుతున్న యూజర్లకు వెసులుబాటు ఈ డార్క్‌మోడ్. సపోర్ట్ చేయని యాప్స్‌లో డార్క్‌మోడ్‌ని అమలు చేసేందుకు రెండు విధానాలు ఉన్నాయి. చాలా వరకు యాప్స్‌లో డార్క్ మోడ్‌కి స్విచ్ అయ్యే అవకాశం ఉంది. అదే సమయంలో ఇప్పటికీ చాలా వాటిల్లో ఈ సదుపాయం లేదు. అయిదేళ్ళ క్రితం నాటి ఆండ్రాయిడ్ ఫోన్ అయితే మాత్రం ఫోర్స్‌తోనే డార్క్‌మోడ్‌ని ఎనేబుల్ చేయాల్సి ఉంటుంది. అదీ ఆండ్రాయిడ్ 10 ఆపై వెర్షన్లతో పనిచేస్తూ ఉండాలి. డార్క్‌మోడ్ ఎనేబిలింగ్‌లో మొదటి విధానం పూర్తిగా సింపుల్. రెండో విధానంలో డెవలపర్ ఆప్షన్స్‌ని అన్‌లాక్ చేయాలి. డెవలపర్ ఆప్షన్స్‌ని పొందడం అంటే కొన్ని బ్యాంకింగ్ యాప్స్ పని చేయవని కూడా యూజర్లు అర్థం చేసుకోవాలి. సెట్టింగ్స్ - యాక్సెసబిలిటీ - విజన్ ఎన్‌హ్యాన్స్‌మెంట్ - హైకాంట్రాస్ట్ థీమ్ ఎంపిక, అప్లయ్ ఉంటుంది. అబౌట్ ఫోన్ ఆప్షన్‌పై అయిదు సార్లు టాప్ చేస్తే డెవలపర్ ఆప్షన్స్ అందుబాటులోకి వస్తాయి. ఒకసారి అవి ఎనేబుల్ అయితే చాలు, హార్డ్‌వేర్ యాక్సిలిరేటెడ్ రెండరింగ్ వద్దకు వెళ్ళవచ్చు. తద్వారా ఓవర్‌రైడ్ ఫోర్స్ డార్క్‌ను పొందవచ్చు. అది ఫోర్స్ డార్క్ ఫీచర్‌ను ఓవర్‌రైడ్ చేస్తుంది. ఆప్షన్స్ అన్నీ వచ్చిన తరవాత కొన్ని యాప్స్ కొత్తగా కనిపిస్తాయి. డార్క్‌మోడ్‌తో ఆప్టిమైజేషన్ కావడమే అందుకు కారణం.

17న భారత్‌లోకి శాంసంగ్ గెలాక్సీ



శాంసంగ్ గెలాక్సీ ఎఫ్55 5జీ ఈ నెల 17న ఇండియన్ మార్కెట్లోకి వస్తోంది. 6.7 ఇంచీల సూపర్ అమోల్డ్ డిస్‌ప్లే, 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటు, వెయ్యి నిట్స్ మేరకు పీక్ బ్రైట్‌నెస్ ఈ గెలాక్సీ సొంతం. 256జీబీ స్టోరేజీ సదుపాయం ఉంది. ట్రిపుల్ కెమెరా సెటప్ ఉంది. 50ఎంపీ ఓఐఎస్ కెమెరా, 8ఎంపీ అల్ట్రావైడ్ కెమెరా, 3ఎంపీ మైక్రో కెమెరా ఉన్నాయి. సెల్ఫీల కోసం 50ఎంపీ ఫ్రంట్ ఫేసింగ్ కెమెరా ఉపయోగపడుతుంది. 5000 ఎంఏహెచ్ బ్యాటరీకి తోడు 25వాట్స్ చార్జింగ్ సపోర్ట్ ఉంటుందని భావిస్తున్నారు. లీక్స్, ఊహాగానాల ఆధారంగా ఈ వివరాలన్నీ సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి.



రీయూజబుల్ ప్యాకింగ్

పర్యటనలు, సెలవులకు సంబంధించి రీయూజబుల్ ప్యాకింగ్ లిస్ట్ టెంప్లేట్స్‌ని ఐఫోన్‌లో ఉంచుకోవాలి. అప్పుడు ప్రతి పర్యటన సమయంలో దానిని ఉపయోగించుకోవచ్చు.

- రిమైండర్స్ యాప్‌లో ఎగ్జిస్టింగ్ లిస్ట్‌ను క్రియేట్ లేదంటే సెలెక్ట్ చేసుకోవాలి.
- త్రీ డాట్స్ వద్దకు వెళ్లి 'సేవ్ యాజ్ టెంప్లేట్'ని సెలెక్ట్ చేసుకోవాలి.
- టెంప్లేట్ 'రీ నేమ్'తో 'సేవ్'ని హిట్ చేస్తే సరిపోతుంది.
- సేవ్ చేసి ఓవర్‌లాపింగ్ స్క్వేర్స్ ఐకాన్‌ని టాప్ చేయాలి. తద్వారా టెంప్లేట్స్‌ని యాక్సెస్ చేసుకోవాలి. అక్కడ ఉపయోగించుకోవాలని భావించిన టెంప్లేట్‌ని సెలెక్ట్ చేసుకుని, పేరు మార్చుకుని, క్రియేట్‌ని హిట్ చేయాలి. ఇప్పుడు కొత్త జాబితాను ఓపెన్ చేయాలి. కావాలనుకున్న రీతిలో మోడిఫై చేసుకోవాలి.
- రిమైండర్‌కు లొకేషన్‌ను జతచేసుకోవచ్చు. అందుకోసం లొకేషన్ బటన్‌ని టాప్ చేయాల్సి ఉంటుంది. లొకేషన్ పరిధిని సెట్ చేసుకోవచ్చు. గడువు తేదీ అలాగే ఫొటోను కూడా జోడించుకోవచ్చు.
- చివరగా పర్యటనలో ముఖ్యంగా ఆఫ్‌లైన్‌లో మ్యాప్స్‌ను ఇదే ఐఫోన్‌లో ఉపయోగించుకోవచ్చు. అందుకోసం డౌన్‌లోడ్‌ని టాప్ చేయాలి. అక్కడ మ్యాప్‌ని కోరుకున్న ఏరియాకు పరిమితం చేస్తూ అడ్జస్ట్ చేసుకోవాలి. తద్వారా స్టోరేజీని ఆప్టిమైజ్ చేసుకోవాలి. తదుపరి మళ్ళీ డౌన్‌లోడ్‌ని టాప్ చేస్తే చాలు, కావాల్సింది డౌన్‌లోడ్ అవుతుంది.

ఇండియన్ మార్కెట్లో వివో నంబర్ 1



స్మార్ట్ ఫోన్లకు సంబంధించి ఇండియన్ మార్కెట్లో 'వివో' మొదటి స్థానంలో ఉంది. ఈ ఏడాది మొదటి మూడు నెలల అంటే జనవరి నుంచి మార్చి వరకు జరిగిన అమ్మకాలను తీసుకుంటే వివో వాటాలో ఎనిమిది శాతం వార్షిక పురోభివృద్ధి కనిపించింది. కరెన్సీపరంగా అది 18 శాతం నమోదైంది. దేశీ మార్కెట్లో స్మార్ట్‌ఫోన్ల అమ్మకాల్లో రోజువారి ప్రగతి కనిపిస్తోంది. మొదటి స్థానంలో చైనీస్ బ్రాండ్ వివో ఉంది. షావోమీ, శాంసంగ్ రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయని 'కౌంటర్‌పాయింట్' నివేదికలో వెల్లడైంది. దేశీ మార్కెట్లో వివో వాటా 19.5 శాతం. 5జీ విషయంలో తిరుగులేని ఆధిపత్యం అలాగే కలర్, మెటీరియల్, ఫినిషింగ్‌పరంగా ఉన్నతస్థానం - పటిష్టమైన ఇమేజింగ్ కేపబిలిటీస్‌తో వివో స్మార్ట్ ఫోన్ల రంగంలో రారాజుగా వెలుగుతోందని రీసెర్చ్ అనలిస్ట్ ఒకరు ఈ సందర్భంలో పేర్కొన్నారు.

మూడో స్థానంలో ఉన్న శాంసంగ్ ప్రీమియమ్ మార్కెట్ సెగ్మెంట్‌లో తన ఆధిపత్యాన్ని కనబరుస్తోంది. అమ్మకాల మొత్తమే 425 డాలర్లు కాగా అత్యున్నత సగటు ధరను సాధించగలిగింది. ఇండియన్ మార్కెట్లో శాంసంగ్ అమ్మకాలకు సంబంధించి ఇదో మైలురాయి.

మరోవైపు ఐఫోన్ 15 సిరీస్ సైతం గణనీయంగానే ఉన్నాయి. అలా మన దేశంలో ఐఫోన్ తన అమ్మకాలను పెంచుకుంటోందని కూడా చెప్పవచ్చు. సైబర్ మార్కెట్ రీసెర్చ్ నివేదిక ప్రకారం మొదటి క్వార్టర్‌లో ఆరుశాతం వాటాను పొందింది. మొత్తం ఎగుమతుల్లో 60 శాతం సాధించింది. మధ్యశ్రేణి, ప్రీమియం ఫోన్లు ఈ ఏడాది మొదటి క్వార్టర్లో రిలీజ్ అయ్యాయి. ఈ ఏడాది రెండో అర్ధభాగంలో స్మార్ట్‌ఫోన్ల మార్కెట్ మరింత పుంజుకుంటుందని అనలిస్టులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శనివారం 11 మే 2024



ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ)- ఎంఎస్ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. కోర్సుకు నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. సంస్థ నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఐఐపీ సెట్)2024, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఆన్‌లైన్ మోడ్‌లో సర్టిఫయిడ్ ప్యాకేజింగ్ ఇంజనీర్ కోర్సును కూడా అందిస్తున్నారు. దీని వ్యవధి ఏడాది. ఈ కోర్సులో ప్రవేశానికి ఎంట్రెన్స్ రాయనవసరం లేదు. కోర్సులు పూర్తయ్యే నాటికి క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తారు.

ఐఐపీలో ప్యాకేజింగ్ ప్రోగ్రామ్‌లు

సీట్ల వివరాలు

- **పీజీ డిప్లొమా:** ముంబై క్యాంపస్‌లో 280 సీట్లు, కోల్‌కతా క్యాంపస్‌లో 80 సీట్లు, అహ్మదాబాద్ క్యాంపస్‌లో 60 సీట్లు ఉన్నాయి.
- **ఎంఎస్:** హైదరాబాద్ క్యాంపస్‌లో 40 సీట్లు ఉన్నాయి.
- **సీపీఈ:** చెన్నై క్యాంపస్‌లో 60 సీట్లు ఉన్నాయి.

పీజీ డిప్లొమా ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎలక్ట్రికల్ టెక్నాలజీ, అప్లయిడ్ మెకానిక్స్, మెకానికల్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ మెకానిజం, ప్రిన్సిపల్స్ ఆఫ్ ప్యాకేజింగ్, పేపర్ అండ్ పేపర్ బోర్డ్, గ్లాస్ టెక్నాలజీ, ప్లాస్టిక్స్, పాలిమర్స్, ఇంజనీరింగ్ డ్రాయింగ్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్, ఫ్లూయిడ్ మెకానిక్స్ అండ్ మెషినరీ, ప్లాస్టిక్ ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ మెటీరియల్, ప్రింటింగ్ టెక్నాలజీ, ప్రొడక్షన్/ఫైనాన్షియల్/మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ప్యాకేజింగ్ మెషినరీ, ప్యాకేజింగ్ లాస్, టూలింగ్ అండ్ డిజైన్, ప్యాకేజింగ్ డిజైన్స్ అప్లికేషన్ ఆఫ్ కంప్యూటర్స్, ఆటోక్యాడ్ తదితర సబ్జెక్టుల్లో తరగతులు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రాక్టికల్ సెషన్స్, రీసెర్చ్ యాక్టివిటీస్, ఇండస్ట్రియల్ ట్రెయినింగ్, ప్రాజెక్ట్ వర్క్‌లు, కమ్యూనికేషన్ స్కిల్స్ సంబంధిత శిక్షణ ఉంటాయి.

ఎంఎస్ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ ప్రోగ్రామ్ వివరాలు: ఈ ప్రోగ్రామ్‌నకు హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ) గుర్తింపు ఉంది. ఇందులో ప్యాకేజింగ్ మెటీరియల్స్, ప్యాకేజ్ డెవలప్‌మెంట్, ప్యాకేజ్ ప్రింటింగ్ టెక్నాలజీ, మెటీరియల్ టెస్టింగ్, ప్యాకేజ్ ఫినిషింగ్ ఆపరేషన్స్, ప్యాకేజింగ్ ఎకనామిక్స్, ఫార్మాస్యూటికల్ అండ్ మెడికల్ డివైజ్ ప్యాకేజింగ్, ఇండస్ట్రియల్ ప్రొడక్ట్ ప్యాకేజింగ్, ప్యాకేజింగ్ లాస్ అండ్ రెగ్యులేషన్స్, ప్యాకేజింగ్ మెషినరీ, ఆంత్రప్రెన్యూర్‌షిప్-మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్యాకేజింగ్ టెక్నాలజీ, ప్యాకేజింగ్ డిజైన్ తదితర అంశాలు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ల్యాబొరేటరీ సెషన్స్, ఇండివిడ్యువల్ ప్రాజెక్ట్ వర్క్‌లు, కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ రిపోర్ట్ రైటింగ్ ట్రెయినింగ్, అయిదు నెలల ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఉంటాయి.

సీపీఈ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ: ఈ ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లో మూడు సెమిస్టర్లు ఉంటాయి. వీటిలో ప్యాకేజింగ్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ స్టడీస్ సంబంధిత సెషన్స్ నిర్వహిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ అండ్ రిపోర్ట్, డిజర్టేషన్, ప్రజంటేషన్ తదితరాలు ఉంటాయి.

అర్హత: పీజీడీపీ ప్రోగ్రామ్‌నకు గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/మైక్రో బయాలజీ/బయో కెమిస్ట్రీ ఒక సబ్జెక్టుగా డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. అగ్రికల్చర్/ఫుడ్ సైన్స్/పాలిమర్ సైన్స్/ఇంజనీరింగ్/టెక్నాలజీ డిగ్రీ అభ్యర్థులు కూడా అర్హులే. ఎంఎస్ ప్రోగ్రామ్‌నకు బీఈ/బీటెక్/నాలుగేళ్ల డిగ్రీ ఇన్ ఇంటిగ్రేటెడ్ సైన్సెస్ ఉత్తీర్ణులై ఉండాలి. సీపీఈ ప్రోగ్రామ్‌నకు బీఈ/బీటెక్ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమవుతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కరస్పాండెన్స్, పార్ట్ టైం డిగ్రీలు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు. పీజీడీపీ, ఎంఎస్ ప్రోగ్రామ్‌లకు అభ్యర్థుల వయసు 2024 మే 31 నాటికి 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది. సీపీఈ ప్రోగ్రామ్‌నకు వయోపరిమితి నిబంధనలు లేవు.

ఐఐపీ సెట్ వివరాలు: ఇది ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, ఇంజనీరింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ డిగ్రీ స్థాయిలోనే ఉంటాయి. అభ్యర్థులు నిర్దేశిత సంఖ్య మేరకు ప్రశ్నలు ఎంచుకొని సమాధానాలు గుర్తించాలి.

ఎంపిక: సంస్థ నిర్ణయించిన ప్రకారం కటాఫ్ మార్కులు సాధించిన వారిని షార్ట్‌లిస్ట్ చేసి పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. పదోతరగతి మార్కులకు 10 శాతం, ఇంటర్/పన్నెండో తరగతి మార్కులకు 10 శాతం, డిగ్రీ మార్కులకు 30 శాతం, రాత పరీక్ష స్కోరుకు 30 శాతం, ఇంటర్వ్యూలో సాధించిన మార్కులకు 20 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 8
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, ముంబై, కోల్‌కతా, ఢిల్లీ, చెన్నై, అహ్మదాబాద్
- **ఐఐపీ సెట్ 2024 తేదీ:** జూన్ 16
- **వెబ్‌సైట్:** www.iip-in.com

సిరిసిల్ల ఫైన్ ఆర్ట్స్ అకాడమీలో

బీఏ ఆనర్స్

సిరిసిల్లలో తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ నిర్వహిస్తున్న టీటీడబ్ల్యూఆర్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ(మహిళ కళాశాల)- బీఏ ఆనర్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. అకడమిక్ మెరిట్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. రాష్ట్రానికి చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. బోధన రుసుం చెల్లించనవసరం లేదు.



స్పెషలైజేషన్‌లు-సీట్లు: బీఏ ఆనర్స్ ప్రోగ్రామ్‌లో మొత్తం 120 సీట్లు ఉన్నాయి. ఫ్యాషన్ డిజైన్‌కి 60 సీట్లు, ఇంటీరియర్ డిజైన్‌కి 40 సీట్లు, ఫొటోగ్రఫీ అండ్ డిజిటల్ ఇమేజింగ్‌కి 20 సీట్లు నిర్దేశించారు.

- వీటిలో 85 శాతం సీట్లను ఎస్టీ అభ్యర్థులకు కేటాయించారు. ఎస్సీ, బీసీ, ఓసీ/ఈబీసీ, స్పోర్ట్స్/ఎన్‌సీసీ, అనాథలు, దివ్యాంగులకు సంబంధించి ఒక్కో కేటగిరీకి 2.5 శాతం సీట్లు ప్రత్యేకించారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. 2023లో ఇంటర్ పాసైనవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. విద్యార్థిని వయసు 2024 జూలై 1 నాటికి 16 ఏళ్లు నిండి ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం పట్టణాల్లో రెండు లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో లక్షా యాభై వేలకు మించకూడదు. తెలుగు మీడియంలో చదివినవారు కూడా అర్హులే.

- ★ **దరఖాస్తు ఫీజు:** రూ.300
- ★ **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 30
- ★ **కౌన్సెలింగ్:** జూన్ 5 నుంచి
- ★ **చిరునామా:** ప్రిన్సిపాల్, టీటీడబ్ల్యూఆర్‌డీసీ(డబ్ల్యూ)-సిరిసిల్ల, లక్ష్మీపూర్ రోడ్, తంగెళ్లపల్లి-505405, సిరిసిల్ల.
- ★ **వెబ్‌సైట్:** ttwrdcs.ac.in

ఎన్‌ఎల్‌ఐయూలో అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్

భోపాల్‌లోని నేషనల్ లా ఇన్‌స్టిట్యూట్ యూనివర్సిటీ(ఎన్‌ఎల్‌ఐయూ)- అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఒక్కో ప్రోగ్రామ్‌లో 100 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి మూడు నెలలు. గరిష్ఠంగా ఆర్నెల్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రతి ప్రోగ్రామ్‌లో మూడు మాడ్యూల్స్/పేపర్లు ఉంటాయి. మాడ్యూల్‌కు పది టీచింగ్ సెషన్స్ నిర్వహిస్తారు. అభ్యర్థులకు కనీసం 70 శాతం అటెండెన్స్ ఉండాలి. ప్రతి సబ్జెక్టుకూ ఒక అసైన్‌మెంట్ తప్పనిసరి. అసైన్‌మెంట్‌కు 30 మార్కులు, ఎండ్ టర్మ్ ఎగ్జామ్‌నకు 70 మార్కులు నిర్దేశించారు.

ప్రోగ్రామ్‌లు

- అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ సైబర్ లాస్ అండ్ సైబర్ ఫోరెన్సిక్స్
- అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్
- అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ సెక్యూరిటీస్ లా అండ్ క్యాపిటల్ మార్కెట్స్
- అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ లేబర్ లాస్

అర్హత: ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు; డిగ్రీ చదువుతున్నవారు; డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. అకడమీషియన్స్, రీసెర్చ్ మెంబర్లు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల మెంబర్లు, అడ్వకేట్స్, ప్రొఫెషనల్స్ కూడా అర్హులే.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 25
- **వెబ్‌సైట్:** www.nliu.ac.in



జాబ్ కార్నర్



డీఎంఆర్‌ఎల్‌లో ఐటీఐ అప్రెంటిస్‌లు

కాంచన్‌బాగ్(హైదరాబాద్)లోని డీఆర్‌డీఓకి చెందిన డిఫెన్స్ మెటలర్జికల్ రీసెర్చ్ ల్యాబొరేటరీ(డీఎంఆర్‌ఎల్)...కింద పేర్కొన్న ఐటీఐ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 127
పోస్టు: ఐటీఐ అప్రెంటిస్
ట్రేడులు: సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణత
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో
చివరి తేదీ: మే 31
వెబ్‌సైట్: https://www.drdo.gov.in/drdo/

కేంద్ర శాఖల్లో వివిధ ఖాళీలు

దేశ వ్యాప్తంగా కేంద్ర విభాగాలు/శాఖల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 17

పోస్టుల వివరాలు

1. అసిస్టెంట్ డైరెక్టర్: **1 పోస్టు**
2. డిప్యూటీ కమిషనర్: **2 పోస్టులు**
3. డిప్యూటీ డైరెక్టర్: **1 పోస్టు**
4. అసిస్టెంట్ కంట్రోలర్: **2 పోస్టులు**
5. ట్రెయినింగ్ ఆఫీసర్: **4 పోస్టులు**
6. అసిస్టెంట్ ప్రొఫెసర్: **5 పోస్టులు**
7. సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్: **2 పోస్టులు**

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం ఉండాలి.
ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
దరఖాస్తు రుసుము: రూ.25. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/మహిళా అభ్యర్థులకు ఫీజు లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 16
వెబ్‌సైట్: https://upsc.gov.in/recruitment/-recruitmentadvertisement

ఏటీఏఆర్‌ఐలో రీసెర్చ్ ఫెలో

సంతోష్‌నగర్(హైదరాబాద్)లోని ఐకార్ - అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

పోస్టు: సీనియర్ రీసెర్చ్ ఫెలో
అర్హత: సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
గరిష్ఠ వయోపరిమితి: పురుషులు 35 ఏళ్లు; మహిళలు 40 ఏళ్లు మించకూడదు
వేతనం: నెలకు రూ.31,000
ఇంటర్వ్యూ తేదీ: మే 16
ప్రదేశం: ఐకార్-అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్.
వెబ్‌సైట్: https://atarihyderabad.icar.gov.-in/atarihyderabad/events?lang=en

ప్రాజెక్ట్ స్టాఫ్

'రాజేంద్ర' ఇన్‌స్టిట్యూట్‌లో ప్రాజెక్ట్ స్టాఫ్‌పట్నాలోని ఐసీఎంఆర్- రాజేంద్ర మెమోరియల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్... కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 21

1. ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్- 1
2. ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-3
3. ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-2
4. ఫీల్డ్ అటెండెంట్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 12వ తరగతి, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మే 13
ఇంటర్వ్యూ తేదీ: మే 16
వేదిక: రాజేంద్ర మెమోరియల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఆగం-కువాన్, పట్నా, బిహార్.
వెబ్‌సైట్: www.rmrims.org.in

ఐపీపీబీలో ఎగ్జిక్యూటివ్‌లు

న్యూఢిల్లీలోని ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్... కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 54

పోస్టుల వివరాలు

1. ఎగ్జిక్యూటివ్(అసోసియేట్ కన్సల్టెంట్): **28 పోస్టులు**
2. ఎగ్జిక్యూటివ్(సీనియర్ కన్సల్టెంట్): **5 పోస్టులు**

అర్హత: బీఈ/బీటెక్ లేదా బీసీఏ/బీఎస్సీ(కంప్యూటర్ సైన్స్/ఐటీ/ఎలక్ట్రానిక్స్) లేదా ఎంసీఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
జీతం: ఏడాదికి ఎగ్జిక్యూటివ్(అసోసియేట్ కన్సల్టెంట్) పోస్టుకు రూ.10,00,000; ఎగ్జిక్యూటివ్(కన్సల్టెంట్) పోస్టుకు రూ.15,00,000; ఎగ్జిక్యూటివ్(సీనియర్ కన్సల్టెంట్) పోస్టుకు రూ.25,00,000.
దరఖాస్తు రుసుము: ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు రూ.150. మిగతా వారందరికీ రూ.750.
ఎంపిక ప్రక్రియ: అసెస్‌మెంట్, ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్ తదితరాల ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మే 24
పోస్టింగ్ స్థలం: ఢిల్లీ/ముంబయి/చెన్నై
వెబ్‌సైట్: www.ippbonline.com/

సెంట్రల్ మెడికల్ సర్వీసెస్‌లో మేనేజర్లు

న్యూఢిల్లీలోని సెంట్రల్ మెడికల్ సర్వీసెస్ సొసైటీ... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 15

1. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(లాజిస్టిక్స్ అండ్ సప్లై చైన్): **1 పోస్టు**
2. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(ఫైనాన్స్): **1 పోస్టు**
3. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(ప్రొక్యూర్‌మెంట్): **2 పోస్టులు**
4. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(క్వాలిటీ అస్యూరెన్స్): **1 పోస్టు**
5. మేనేజర్(ప్రొక్యూర్‌మెంట్): **2 పోస్టులు**
6. మేనేజర్(లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చైన్): **2 పోస్టులు**
7. మేనేజర్(ఫైనాన్స్): **2 పోస్టులు**
8. మేనేజర్(క్వాలిటీ అస్యూరెన్స్): **2 పోస్టులు**
9. ఆఫీస్ అసిస్టెంట్: **1 పోస్టు**
10. వేర్ హౌస్ మేనేజర్(ఫార్మాసిస్ట్): **1 పోస్టు**

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, ఐసీడబ్ల్యూఏఐ, సీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: మేనేజర్, ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు 40 ఏళ్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్, వేర్‌హౌస్ మేనేజర్ పోస్టులకు 45 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పోస్టులకు రూ.1,00,000; మేనేజర్, వేర్‌హౌస్ మేనేజర్ పోస్టులకు రూ.50,000; ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు రూ.30,000.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 20
వెబ్‌సైట్: https://cmss.gov.in

లిటిల్స్



గందరగోళం కుందేలు

ఒక అడవిలో ఓ కుందేలు ఉండేది. అది గందరగోళంకు గురి అవ్వటంలో ముందుండేది. చిన్న చప్పుడయినా భయపడేది. చినుకు పడినా ఉరికేది. గాలి శబ్దానికి భీతిల్లేది. ఆఖరికి దూరంగా సాధారణ పక్షి అరుపు విన్నా భయపడేది. దీంతో ఆ కుందేలును అంతా 'గందరగోళం కుందేలు' అని పిలిచేవాళ్లు.




బాగా ఎండాకాలం. మామిడిచెట్టు కింద పడుకుంది కుందేలు. ఒక మామిడిపండు చెట్టుమీద నుంచి కుందేలు తల మీద పడింది. అంతే కుందేలు పరిగెత్తింది. ఎక్కడా నిలబడలేదు. 'ఆకాశం విరిగి పడుతోంది' అంటూ పరిగెత్తింది. కొన్ని జింకలు కనపడ్డాయి. 'ఎందుకింత పరుగు?' అని అడిగాయి. 'ఆకాశం విరిగిపడుతోంది. నేనుచూశా. మీరు ఇక్కడే ఉంటే చస్తారు' అంటూ గట్టిగా అరిచింది. జింకలు వెంటనే పరిగెత్తాయి. కుందేలుతో పాటు జింకలు పరిగెత్తటం ఎలుగుబంట్లు చూశాయి. విషయం ఏంటని? అడిగాయి. 'చెడు జరుగుతంది. ఈ ఆకాశం ఊడి పడుతోంది. ఇక్కడే ఉంటే ప్రాణాలు నిలబడవు' అన్నది ఓ జింక. పాపం పరిగెత్తలేక ఆ ఎలుగుబంట్లు ముందుకు ఉరికాయి.

అడవిలో గందరగోళం, చప్పుళ్లు. గాలి వీస్తోంది గట్టిగా. కుందేలు, జింకలు, ఎలుగుబంట్లకు తోడుగా నక్కలు జతకలిశాయి. పక్షులూ ఈ గుంపు మాట నమ్మాయి. అవి కూడా తుర్రుమన్నాయి. ఎదురుగా అడవికి రాజైన సింహం వచ్చింది. 'ఎందుకిలా పరిగెత్తుతున్నారు?' అని అడిగింది. 'ఆకాశం పడుతోంది' అంటూ విషయం చెప్పాయి. ఎవరు చెప్పారు? అని అడిగింది సింహం. ఒకరి మీద ఒకరు చెప్పుకున్నారు. సింహం గట్టిగా నవ్వింది. విషయం తెలుసుకుందాం? అని అడిగింది. అంతలోనే 'అసలు ఈ విషయాన్ని ఎవరు ముందు చూశారు?' అని అడిగింది. అందరూ కుందేలు అని చెప్పింది. 'విషయం ఏంటీ?' అని కుందేలును అడిగింది సింహం. 'మామిడిచెట్టుమీద నుంచి ఆకాశం విరిగి పడింది' అని చెప్పింది. 'ఇదేదో తేడాగా ఉంది. అక్కడికి వెళ్లి చూద్దాం' అన్నది నక్క. అన్ని జంతువులూ బయలుదేరాయి ఆ ప్రాంతానికి. మామిడిచెట్టు కింద మామిడి పండు పడింది. అది చూసి ఇదేనా ఆకాశం నుంచి విరిగిపడిన ముక్క అన్నది సింహం. జంతువులన్నీ ఒకటే నవ్వులు. గందరగోళం కుందేలు మాట వినటమే తప్పు అనుకున్నాయి.

15 తేడాలు గుర్తించండి



సరైన నీడ ఏది?



రోబోట్‌లు ఎన్ని?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 304

	1				9			
3				8	1	4		9
7					4		5	
1		6		9		5		
		5		1		8		3
	2		4					7
5		9	1	3				4
			9				1	

సుడోకు - 303 సమాధానం

6	8	2	3	1	4	9	7	5
4	7	1	9	5	2	8	6	3
5	9	3	7	8	6	2	4	1
2	1	7	6	3	5	4	9	8
3	5	9	4	2	8	7	1	6
8	6	4	1	7	9	5	3	2
7	4	5	2	6	1	3	8	9
1	3	8	5	9	7	6	2	4
9	2	6	8	4	3	1	5	7

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.